


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 41

గురువారం 26-10-2023



మ్యాక్స్‌వెల్ విధ్వంసం
309 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై ఆస్ట్రేలియా భారీ విజయం - 12లో



5 రోజులు.. 15 లక్షల కోట్లు
మార్కెట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద ఆవిరి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాక్ట్ చెక్
బొగ్గుకు బకాయిలేం లేవు.!

- గడువుకు మించకుండా కోల్ కంపెనీలకు సకాలంలోనే చెల్లింపులు
- సెప్టెంబర్‌లోనే ఎంసీఎల్‌కు జెన్‌కో రూ. 554.57 కోట్లు చెల్లింపు
- సింగరేణి కాలరీస్‌కు పెండింగ్ బకాయిలు ఏవీ లేవు
- అయినా వాస్తవాలు దాచి 'ఈనాడు' తప్పుడు కథనం

10లో

ఇద్దరు భారత అమెరికన్లకు అత్యున్నత పురస్కారాలు

బైడెన్ చేతుల మీదుగా అందుకున్న అశోక్ గాడ్గిల్, సుబ్రా సురేశ్

6లో

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో 'భారత్'

- ప్రాచీన చరిత్ర బదులు క్లాసికల్ హిస్టరీ.. యుద్ధాల్లో హిందూ విజయాలకు చోటు
- కమిటీ సిఫార్సు, విపక్షాల విమర్శలు.. ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న కౌన్సిల్

6లో



గాజాలో కన్నీటి చుక్కలు

- ఇజ్రాయెల్ ఆంక్షలతో నిలిచిపోయిన పెట్రోల్, డీజిల్ సరఫరా
- విద్యుత్ లేక ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సలు నిలిపివేత
- 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' ఆందోళన
- వెంటనే ఇంధన సరఫరాను పునరుద్ధరించాలని ఇజ్రాయెల్‌కు వినతి

6లో

2014 టు 2024... నారా - పవన్ ఉమ్మడి సమర్పణలో...

మోసానికి మళ్లీ రెడీ

మరోసారి మోసపూరిత హామీలతో ఉమ్మడి మేనిఫెస్టోకు బాబు-పవన్ సిద్ధం

- 2014 ఎన్నికల్లో కూడా పవన్ ఫొటోతో మేనిఫెస్టోను విడుదల చేసిన టీడీపీ
- టీడీపీ తరఫున ప్రచారం చేసి... ఆ హామీలకు తాను పూచీ అని ప్రకటించిన పవన్
- హామీలంటూ కరపత్రాలపై చంద్రబాబు.. పవన్‌కళ్యాణ్ ఉమ్మడి సంతకాలు
- ఎన్నికల్లో గెలిచాక హామీలు గాలికి... టీడీపీ వెబ్‌సైట్లోంచి మేనిఫెస్టో కూడా మాయం
- డ్వాక్రా రుణ మాఫీ, రైతు రుణ మాఫీ, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి... అన్నీ గాలికి
- ఒక్క హామీపై కూడా తెలుగుదేశాన్ని ప్రశ్నించని పవన్‌కళ్యాణ్... ఐదేళ్లూ 'ష్! గప్‌చుప్'..
- 2019లో వినూత్న మేనిఫెస్టోతో ప్రజల మనసులు గెలుచుకున్న వైఎస్ జగన్
- మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ... తొలి ఏడాదిలోనే 80 శాతం హామీలకు గ్రీన్‌సిగ్నల్
- కోవిడ్ కష్టాలు సైతం లెక్కచేయకుండా.. నాలుగేళ్లలో ఏకంగా 99% హామీల అమలు
- వాటిని రకరకాలుగా అడ్డుకోవటానికి ప్రయత్నించి విఫలమైన బాబు-పవన్ ద్వయం
- మళ్లీ ప్రజలను మోసపుచ్చేందుకు పవన్ ప్రయత్నాలు

3లో



2014 ఎన్నికలకు ముందు నారా చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్ ఫొటోలతో పత్రికలకు విడుదల చేసిన టీడీపీ మేనిఫెస్టో

సైబరాబాద్ మా ఆయన కష్టార్జితం

- ఫలాలను వేరేవాళ్లు అనుభవిస్తున్నారు
- మహిళల కోసం చంద్రబాబు 22 పథకాలు తెచ్చారు: నారా భువనేశ్వరి

3లో

నిజం గెలిస్తే.. చంద్రబాబు ఇక ఎప్పటికీ జైల్లోనే

- అబద్ధం గెలవాలంటూ భువనేశ్వరి యాత్ర చేయాలి
- జలవనరుల శాఖ మంత్రి అంబటి

3లో

సామాజిక సాధికార యాత్ర బస్సును ప్రారంభిస్తున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు



నేటి నుంచి 'సామాజిక సాధికార యాత్ర'

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తాం

పేదలందరినీ ఏకం చేసి పెత్తందార్లపై రణభేరీ మోగిస్తాం..

మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ

సామాజిక సాధికార యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ, బస్సుకు పూజలు

రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో 3 విడతలుగా యాత్ర

వచ్చే నెల 9న ముగియనున్న తొలి విడత యాత్ర

తొలి విడతలో 39 నియోజకవర్గాల్లో యాత్ర

2లో

ముగిసిన ఖరీఫ్ ఈ-క్రాప్ నమోదు

సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్ ముగిసింది. సామాజిక తనిఖీ కోసం ఈ-క్రాప్ అర్హుల జాబితాలను గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నారు. రైతుల పేర్లు, సర్వే నంబర్లు, విస్తీర్ణం, పంట సాగు తదితర వివరాల నమోదులో ఎక్కడైనా పొరపాట్లు చోటుచేసుకుంటే.. వాటిని సరిచేసుకునేందుకు ఈ నెల 29 వరకు గడువిచ్చారు. అభ్యంతరాలను పరిష్కరించిన అనంతరం.. నవంబర్ 1న తుది జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తారు.

- 100 శాతం ఈ-క్రాప్, 97 శాతం మంది రైతుల ఈ-కేవైసీ నమోదు.. నేటి నుంచి ఆర్బీకేల్లో అర్హుల జాబితాల ప్రదర్శన
- 29వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ
- నవంబర్ 1న ఆర్బీకేల్లో తుది జాబితా ప్రకటన
- దీని ఆధారంగానే సంక్షేమ ఫలాలు



పకడ్బందీగా పంటల వివరాలు..

పంట కొనుగోలు వేళ ఏ ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ-క్రాప్ నమోదులో అన్ని జాగ్రత్తలు తీసుకుంది. నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ సౌజన్యంతో రూపొందించిన యాప్‌లో ఆధార్, వన్‌బీ, జాతీయ చెల్లింపుల సహకార సంస్థ, ఆధార్‌తో లింక్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఫోన్ నంబర్, పంటసాగు హక్కు పత్రం(సీసీఆర్సీ) తదితర వివరాలను నమోదు చేశారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత జియో ఫెన్సింగ్ ద్వారా సరిహద్దులను నిర్ధారించి, రైతు ఫొటోను ఆర్బీకే సిబ్బంది అప్‌లోడ్ చేశారు. గిరి భూమి వెబ్‌సైట్‌లో నమోదైన వివరాల ఆధారంగా అటవీ భూముల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాదారులు సాగు చేస్తున్న పంటల వివరాలు, సీసీఆర్సీ కలిగిన రైతులతో పాటు సీసీఆర్సీ కార్డుల్లేని రైతుల వివరాలను కూడా నమోదు చేశారు. జిరాయితీ, పట్టాదార్, అసైన్డ్, ఆర్‌ఓఎఫ్‌ఆర్, ఎండోమెంట్, వక్ఫ్, ఈనాం, లంక, సీజేఎఫ్‌ఎస్, మిగులు, ఆక్రమిత తదితర కేటగిరిల కింద గుర్తించిన ప్రభుత్వ భూముల్లో సాగవుతున్న పంటలను నమోదు చేశారు.

అధికారుల ద్వారా తనిఖీ..

ఆర్బీకేల్లో ఈ-క్రాప్ నమోదు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారుల ధ్రువీకరణ కూడా 100 శాతం పూర్తయ్యింది. అలాగే రైతుల ఈ-కేవైసీ నమోదు 96.93 శాతం పూర్తయ్యిందని అధికారులు చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 1.30 కోట్ల ఎకరాలు కాగా.. ఇప్పటి వరకు 93,29,128 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఆ మేరకు 100 శాతం ఈ-క్రాప్ వివరాలను ఆర్బీకేల్లో నమోదు చేశారు. ఖరీఫ్ సీజన్‌లో 48 లక్షల మంది రైతులు పంటలు సాగుచేయగా.. ఇప్పటివరకు 90,24,900 ఎకరాల్లో సాగు చేసిన 42 లక్షల మంది రైతులు ఆర్బీకేల్లో తమ పంట వివరాలను సరి చూసుకొని వేలిముద్రలు(ఈ-కేవైసీ) నమోదు చేసుకున్నారు.

రాతపూర్వకంగా అభ్యంతరాలివ్వాలి



ఆర్బీకేల్లో నేటి నుంచి నిర్వహించే గ్రామసభల్లో అర్హుల జాబితాలను చదివి వినిపిస్తారు. అభ్యంతరాలుంటే ఆర్బీకేలోని వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌లకు రాతపూర్వకంగా తెలియజేయాలి. నవంబర్ 1న తుది జాబితాలను ప్రదర్శిస్తారు. ఆ తర్వాత ఎలాంటి మార్పులకు అవకాశం ఉండదు.

– చేవూరు హరికిరణ్, వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్

కలెక్టర్లు, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులు ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదును ర్యాండమ్‌గా తనిఖీ చేశారు. వేలిముద్రలు వేసిన రైతుల ఫోన్లకు మెసేజ్ ద్వారా డిజిటల్ ఎక్నాలెడ్జ్‌మెంట్‌ను పంపడంతో పాటు రశీదులు కూడా ఇచ్చారు. మార్పులు, చేర్పుల అనంతరం నవంబర్ 1న ప్రదర్శించే తుది జాబితా ఆధారంగానే పంట కొనుగోళ్లతో పాటు పంటల బీమా, పంట నష్టపరిహారం వంటి సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందించనుంది.



'దేవరగట్టు' రక్తసిక్తం

బన్ని ఉత్సవంలో అపశృతి

చెట్టు కొమ్మ విరిగి పడి ముగ్గురు మృతి

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

వైభవంగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం

ఎప్పటిలా కొనసాగిన ఆచారం

5లో

ఇదండీ సంగతి



ఇండియా కూటమి నిండా ప్రధాని అభ్యర్థులున్నట్లే మన పార్టీనిండా సీఎం అభ్యర్థులున్నార్సార్!!

పారిశ్రామిక ప్రగతికి సత్వర చర్యలు

అమల్లోకి రూ.1.35 లక్షల కోట్ల విలువైన 111 యూనిట్లు

ఈ యూనిట్ల ద్వారా 1.48 లక్షల మందికి లభించనున్న ప్రత్యక్ష ఉపాధి

విశాఖ జీఐఎస్‌లో కుదుర్చుకున్న ఒప్పందాలను వేగంగా అమల్లోకి తెస్తున్న ప్రభుత్వం

భూకేటాయింపు దశలో మరో రూ.3.06 లక్షల కోట్ల విలువైన 81 యూనిట్లు

డీపీఆర్‌లు సమర్పించే దశలో రూ.8.69 లక్షల కోట్ల విలువైన 194 యూనిట్లు

మొత్తం రూ.13 లక్షల కోట్ల విలువైన 386 ప్రాజెక్టుల ఒప్పందాలు

వీటి ద్వారా 6 లక్షల మందికి పైగా లభించనున్న ఉపాధి

విశాఖ జీఐఎస్‌లో విభాగాలవారీగా ఒప్పందాల వివరాలు..

	ఒప్పందాల సంఖ్య	పెట్టుబడి విలువ (రూ.కోట్లలో)	లభించనున్న ఉద్యోగాలు
వ్యవసాయరంగం	37	3,435	12,935
పశుసంవర్ధక శాఖ	8	1,020	3,750
ఇంధన శాఖ	39	9,05,115	1,69,850
పరిశ్రములు-వాణిజ్యం	99	3,38,054	2,29,259
ఐటీ-ఐటీఈఎస్	86	41,748	1,60,802
పర్యాటక శాఖ	117	22,096	30,787



సాక్షి, అమరావతి: రాష్ట్రాన్ని పారిశ్రామికంగా పరుగులు తీయించడం, యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ దిశగా ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రారంభించేలా సత్వర చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధ్యక్షతన 17 మంది అధికారులతో ప్రత్యేక కమిటీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రతి 15 రోజులకొకసారి సమీక్షలు నిర్వహించి సాధ్యమైనంత త్వరగా ఈ ప్రాజెక్టులన్నీ అమల్లోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చిలో విశాఖపట్నం వేదికగా గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో కుదిరిన ఒప్పందాలు రికార్డు స్థాయిలో వేగంగా అమల్లోకి వస్తున్నాయి. ఒప్పందాలు కుదిరిన ఆరు నెలల్లోనే రూ.1,35,362 కోట్ల విలువైన పెట్టుబడికి సంబంధించి 111 యూనిట్లను అమల్లోకి తీసుకొచ్చారు. జీఐఎస్‌లో కుదుర్చుకున్న 386 ఎంవోయూలతో దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 6 లక్షల మందికి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి.

ఇప్పటికే ఉత్పత్తి ప్రారంభించిన 24 యూనిట్లు..

ఈ ఆరు నెలల కాలంలో అమల్లోకి వచ్చిన 111 యూనిట్లలో 24 యూనిట్లు ఇప్పటికే ఉత్పత్తిని ప్రారంభించడం విశేషం. ఈ 24 యూనిట్ల ద్వారా రూ.5,530 కోట్ల విలువైన పెట్టుబడులతో పాటు 16,908 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించింది. గ్రీన్‌ల్యామ్, డీపీ చాక్లెట్స్, ఆర్‌ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్స్, గోద్రేజ్ ఆగ్రోవెట్, సీసీఎల్ ఫుడ్ అండ్ బేవరేజ్, సూక్ష్మ గామా ఎల్‌ఎల్‌పీ వంటి ప్రముఖ సంస్థలు ఉత్పత్తిని ప్రారంభించాయి. ఇవేకాకుండా రూ.1,29,832 కోట్ల విలువైన మరో 87 యూనిట్లు భూ కేటాయింపులు పూర్తి చేసుకొని నిర్మాణ పనులు కొనసాగిస్తున్నాయి. ఈ కంపెనీల ద్వారా 1,31,816 మందికి ఉపాధి లభించనుంది. నిర్మాణ పనులు ప్రారంభించిన వాటిలో మాండలీజ్, ఎకో స్టీల్స్, ఎవరెస్ట్ స్టీల్స్, విశ్వసముద్ర, క్రిభ్‌కో, శర్వాణి బయో ఫ్యూయల్, రవళి స్పిన్నింగ్స్, ఒబెరాయ్ హోటల్స్ వంటివి ఉన్నాయి. కేవలం ఆరు నెలల్లో ఒప్పందాల సంఖ్యలో 29 శాతం, పెట్టుబడి విలువలో 11 శాతం అమల్లోకి వచ్చేశాయని అధికారులు చెబుతున్నారు. దేశంలోనే ఇది రికార్డని పేర్కొంటున్నారు.

భూ కేటాయింపు దశలో మరో 81 యూనిట్లు

భూమి కేటాయింపు దశలో మరో 81 యూనిట్లు ఉన్నాయి. ఇవి ఉత్పత్తి ప్రారంభిస్తే రూ.3,06,213 కోట్ల విలువైన పెట్టుబడులు అమల్లోకి రావడం ద్వారా 1,58,385 మందికి ఉపాధి లభిస్తుంది. అలాగే మరో 194 యూనిట్లు ఇంకా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సమర్పించే దశలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. వీటి ద్వారా రూ.8,69,893 కోట్ల పెట్టుబడులు, 3,00,274 మందికి ఉపాధి సాకారమవుతుందని తెలిపారు. వీటితో కుదుర్చుకున్న ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా అమల్లోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. మరో 3 నెలల్లో అత్యధిక యూనిట్లు నిర్మాణ పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తెస్తున్నాం..



గత ప్రభుత్వం వలే కాకుండా చేసుకున్న అన్ని ఒప్పందాలను సాధ్యమైనంత త్వరగా వాస్తవ రూపంలోకి తెస్తున్నాం. జీఐఎస్ ఒప్పందాల్లో భారీ పెట్టుబడి పెట్టడానికి ఎన్‌టీపీసీ ముందుకొచ్చింది. ఈ సంస్థకు సంబంధించి త్వరలో నిర్మాణ పనులు కూడా వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటికే విశాఖ కేంద్రంగా పలు యూనిట్ల నిర్మాణ పనులకు భూమిపూజ, కొన్ని యూనిట్లకు ప్రారంభోత్సవాలు చేశాం.

- గుడివాడ అమర్‌నాథ్, పరిశ్రమల శాఖ మంత్రి

24 యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి..

జీఐఎస్ ఒప్పందాలను వేగంగా అమల్లోకి తెచ్చే క్రమంలో పారిశ్రామికవేత్తలను చేయి పట్టి ముందుకు నడిపిస్తున్నాం. కేవలం ఆరు నెలల్లోనే 24 యూనిట్లు ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి. మరో 194 యూనిట్లు కూడా డీపీఆర్‌లు సమర్పించి పనులు ప్రారంభించేలా ఆయా కంపెనీల ప్రతినిధులతో నిరంతరం చర్చిస్తున్నాం. యూనిట్లు ప్రారంభించడానికి అన్ని రకాల అనుమతులను వేగంగా ఇస్తున్నాం.

- ప్రవీణ్‌కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్, ఏపీఐఐసీ వీసీ-ఎండీ

క్లుప్తంగా...

త్వరలో పశుసంవర్ధక సహాయక పోస్టుల భర్తీ

- డిసెంబర్ రెండో వారంలో నియామక పరీక్షలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పశుపోషకులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ఇంటి వద్దనే పశువైద్యం అందించాలనే లక్ష్యంతో ఆర్బీకేల్లో ఖాళీగా ఉన్న 1,896 పశుసంవర్ధక సహాయక పోస్టుల నియామకాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు తొలి విడతలో 3,033, రెండో విడతలో 1,619 పశుసంవర్ధక సహాయకులను నియమించామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించామని, త్వరలో చేపట్టనున్న ఉద్యోగాల భర్తీని కూడా పూర్తి పారదర్శకంగా చేపడతామని స్పష్టం చేశారు. నవంబర్ మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేయనున్నామని, డిసెంబర్ రెండో వారంలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏపీ రెరా ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ గంగారావు

- పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా) అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.గంగారావును ప్రభుత్వం నియమించింది. ఈమేరకు బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన జస్టిస్ గంగారావు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు. ఈయన ఈ ఏడాది మార్చిలో హైకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. కాగా, రెరా చట్టాలు, నిబంధనలపై అభ్యంతరాలను అప్పిలేట్ ట్రిబ్యునల్ పరిష్కరిస్తుంది.

మంగళగిరికి పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్

- ఉత్తర్వులు జారీచేసిన ముఖ్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: విజయవాడ ఇబ్రహీంపట్నంలోని ఆంజనేయ టవర్స్‌లో కొనసాగుతోన్న పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌ను గుంటూరు జిల్లా మంగళగిరికి తరలించేందుకు అనుమతినిస్తూ పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనరేట్‌తో పాటు ఇదే భవనంలో కొనసాగుతోన్న ఏపీ మోడల్ స్కూల్ సొసైటీ, వయోజన విద్య, కృష్ణలంకలోని జవహర్ బాలభవన్, గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టరేట్ ఇందులో ఉన్నాయి. వీటిని మంగళగిరిలోని వెంకటాద్రి టవర్స్‌లోకి మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీటీడీలో మరో ఆరు నెలలపాటు సమ్మె నిషేధం

- ఉత్తర్వులు జారీ చేసిన దేవదాయ శాఖ స్పెషల్ సీఎస్



సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరిధిలోని వివిధ అత్యవసర విభాగాల్లో మరో ఆరు నెల పాటు సమ్మె చేయడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్మా చట్టం నిబంధనల మేరకు టీటీడీలోని మంచినీటి, విద్యుత్ సరఫరా విభాగాలతో పాటు ఆరోగ్య, శానిటేషన్ విభాగం, అన్నప్రసాద కాంప్లెక్స్, క్యూలైన్ల నిర్వహణ, ఆలయ, ప్రసాదం పోటులో పనిచేసే విభాగాలు, కళ్యాణ కట్ట కాంప్లెక్స్, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ తదితర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు 2024 మే 23 వరకు సమ్మెలలో పాల్గొనకూడదని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఆయా విభాగాల్లో సమ్మె నిషేధిస్తూ ప్రభుత్వం ప్రతి ఆరు నెలల కొకసారి ఆ తరహా ఉత్తర్వులు జారీ చేస్తూ ఉంటుంది.

లండన్ మేయర్ బరిలో తరుణ్ గులాటీ



హైదరాబాద్: లండన్ మేయర్ పదవికి 2024లో జరగనున్న ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నట్లు భారతీయ సంతతికి చెందిన తరుణ్ గులాటీ ప్రకటించారు. ఆయన బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. లండన్ నగరాన్ని ప్రముఖ గ్లోబల్ సిటీగా మార్చడమే తన లక్ష్యమన్నారు. లండన్ వాసులందరూ సురక్షితంగా ఉండేలా కృషి చేస్తానని, నిరుద్యోగులు, తక్కువ ఆదాయం ఉన్న వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని నమ్మే వ్యక్తిగా తనకు లండన్ మేయర్‌గా అవకాశం ఇస్తే చక్కని పాలనందిస్తానని తెలిపారు. ఒక పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తే విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేమని, అందుకే ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలబడనున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ జాతీయ మహిళా విధానాలు, పరిశోధనల ఇన్‌చార్జి కరుణా గోపాల్ మాట్లాడుతూ.. యూకేలోని 18 లక్షల మంది భారతీయుల మద్దతు గులాటీకి లభిస్తుందని తెలిపారు.

భాషా పాఠాలకూ డిజిటల్ రూపం

- ప్రభుత్వ బడుల్లో ఐఎఫ్‌పీల ద్వారా తెలుగు, ఇంగ్లిష్, హిందీ బోధన
- దానికోసం డిజిటల్‌లో పాఠ్యాంశాలను సిద్ధం చేసిన ఎస్సీఈఆర్టీ
- ఇప్పటికే సబ్జెక్టు పాఠాలు డిజిటల్ విధానంలో బోధన
- యూట్యూబ్, డీటీహెచ్ చానెళ్లలోనూ ఈ-పాఠాలు..



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధించే భాషా పాఠాలు డిజిటల్ రూపం సంతరించుకున్నాయి. 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అనువుగా ఈ-పాఠాలను ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్సీఈఆర్టీ) రూపొందించింది. ఇప్పటికే సబ్జెక్టు పాఠ్యాంశాలను ఈ కంటెంట్‌లో బోధిస్తుండగా, ఇప్పుడు తెలుగు, ఇంగ్లిష్, హిందీ డిజిటల్ పాఠ్యాంశాలను సైతం సిద్ధం చేసింది. ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన ప్రభుత్వ ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారి ద్వారా 3 నుంచి 10వ తరగతి వరకు ఆయా భాషల పాఠ్యాంశాలను తయారు చేసింది. పదో తరగతి మినహా మిగిలిన తరగతుల కంటెంట్‌ను ప్రభుత్వ పాఠశాలలకు అందించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది నుంచి ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్ల (ఐఎఫ్‌పీ) ద్వారా డిజిటల్ బోధనను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం.. సబ్జెక్టు పాఠాలను డిజిటల్ రూపంలోకి మార్చి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించింది. ఇప్పటివరకు ఒకటి నుంచి 9వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియం పాఠాలను ఎస్సీఈఆర్టీ రూపొందించింది. వచ్చే ఏడాది పదో తరగతి ఇంగ్లిష్ మీడియం పూర్తిస్థాయిలో అమల్లోకి రానున్న నేపథ్యంలో ఆ తరగతి పాఠాలను సైతం డిజిటల్ రూపంలో సిద్ధం చేశారు.

యూట్యూబ్‌లోనూ..

విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి కలిగించేందుకు డిజిటల్ పాఠాలను డైరెక్ట్ టు హోమ్ (డీటీహెచ్) విధానంలో 'ఈ-విద్య' చానెళ్ల ద్వారా టీవీల్లో కూడా ప్రసారం చేస్తోంది. ఒకటి నుంచి ఐదు తరగతులకు ఒక చానెల్ ద్వారాను, ఆరు నుంచి 9వ తరగతి వరకు మరో చానెల్ ద్వారాను పాఠ్యాంశాలను టెలీకాస్ట్ చేస్తున్నారు. అలాగే యూట్యూబ్‌లోని 'ఈ-పాఠశాల' చానెల్ ద్వారా ఎప్పుడు కావాలన్నా పాఠాలు వినేందుకు అవకాశం కల్పిస్తూ అన్ని పాఠాలను అప్‌లోడ్ చేశారు. ఆన్‌లైన్‌లో కూడా విద్యార్థులు పాఠాలు చదువుకునేందుకు, ఉపాధ్యాయులు చెప్పినవి వినేందుకు అనువుగా 'ఈ-పాఠశాల' మొబైల్ యాప్‌ను సైతం అందుబాటులోకి తెచ్చారు. ఐఎఫ్‌పీ, ట్యాబ్, డీటీహెచ్, యూట్యూబ్, మొబైల్ యాప్.. అన్ని మాధ్యమాల్లోను ఒకే తరహా కంటెంట్, బోధన ఉండేలా వీడియోలను ఉంచారు.

అందుబాటులోకి వీడియో కంటెంట్

పాఠశాల విద్యార్థులకు అవసరమైన సబ్జెక్టుల్లోని పాఠాల కంటెంట్‌ను ఇప్పటికే బైజూస్ రూపొందించి విద్యాశాఖకు అందించింది. వీటిని విద్యార్థులకు ఐఎఫ్‌పీల్లో బోధించడంతో పాటు, ట్యాబ్స్‌లోను అప్‌లోడ్ చేశారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు లాంగ్వేజెస్, కొన్ని సబ్జెక్టుల వీడియో పాఠాలను ఎస్సీఈఆర్టీ రూపొందించింది. ఇందులో ప్రధానంగా మూడో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్-ఈవీఎస్, నాలుగు, ఐదు తరగతులకు తెలుగు, ఇంగ్లిష్, ఆరు నుంచి తొమ్మిదో తరగతి వారికి తెలుగు, ఇంగ్లిష్, హిందీ సబ్జెక్టుల్లో వీడియో పాఠాల కంటెంట్‌ను అందుబాటులోకి తెచ్చారు.

డిసెంబర్ నాటికి రాష్ట్ర విజన్ ప్రణాళిక-2047

- నీతి ఆయోగ్ సహకారంతో రూపకల్పనకు ఉన్నతాధికారుల చర్యలు.. వివిధ రంగాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించేందుకు కసరత్తు
- ప్రారంభమైన 3 రోజుల వర్క్‌షాప్
- తొలి రోజు ప్రాథమిక, సామాజిక రంగాలపై చర్చలు
- హాజరైన నీతి ఆయోగ్, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, నిపుణులు



సాక్షి, అమరావతి: వికసిత్ భారత్-2047లో భాగంగా నీతి ఆయోగ్ సహకారంతో రాష్ట్ర విజన్ ప్రణాళిక-2047ను డిసెంబర్ నెలాఖరుకల్లా సిద్ధం చేసేందుకు ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. ప్రాథమిక, ద్వితీయ, సామాజిక రంగాల వృద్ధికి ఆయా శాఖలవారీగా దృక్కోణ ప్రణాళికలను రూపొందించేందుకు మార్గదర్శకాలు, సూచనలు, సలహాలను నీతి ఆయోగ్ అధికారులు రాష్ట్ర అధికారులకు అందించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో వెలగపూడిలోని సచివాలయంలో బుధవారం వర్క్‌షాప్ ప్రారంభమైంది. మూడు రోజులపాటు దీన్ని నిర్వహిస్తారు. తొలి రోజు వర్క్‌షాప్ నీతి ఆయోగ్ అదనపు కార్యదర్శి వి.రాధ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్-2047 కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. దీని ద్వారా ప్రజలకు సాధికారత కల్పించడంతో పాటు ఆధునిక భారతదేశ నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులను కేంద్రం కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం అమల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ పురోగతిపైనే కాకుండా ప్రాంతీయ ఆకాంక్షలపైన కూడా దృష్టి సారించిందన్నారు. అందుకనుగుణంగా రాష్ట్ర విజన్ ప్రణాళిక - 2047ను రూపొందించేందుకు రాష్ట్ర అధికారులకు అవసరమైన శిక్షణను నీతి ఆయోగ్ అందిస్తోందని చెప్పారు. దీన్ని రాష్ట్ర అధికారులు సద్వినియోగం చేసుకుని రాష్ట్ర విజన్ ప్రణాళికను సమగ్రంగా సాధ్యమైనంత త్వరగా రూపొందించాలని కోరారు.

వివిధ రంగాలపై సుదీర్ఘ చర్చలు

కాగా తొలి రోజు వర్క్‌షాప్‌లో ఉదయం సామాజిక రంగం, మధ్యాహ్నం ప్రాథమిక రంగానికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘ చర్చలు జరిగాయి. రాష్ట్రంలో ఆయా రంగాల వారీగా బలాలు, బలహీనతలు, అవకాశాలు, సవాళ్లను ఆయా శాఖల అధికారులు నీతి ఆయోగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్, రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, ఆరోగ్యశ్రీ ట్రస్టు సీఈవో హరీందిర ప్రసాద్, రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డా.నరసింహం తదితరులతోపాటు నీతి ఆయోగ్ సలహాదారు సీహెచ్ పార్థసారథి రెడ్డి, పబ్లిక్ పాలసీ నిపుణులు అమ్రిత్ పాల్ కౌర్, సీనియర్ కన్సల్టెంట్ శైలీ మణికర్, పర్యవేక్షణ - మూల్యాంకన నిపుణులు బిప్లప్ నంది, బోస్టన్ కన్సల్టెంట్ గ్రూప్ డైరెక్టర్ అంకుష్ వధేరా తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలను రూపొందిస్తున్నాం..

రాష్ట్ర ప్రణాళికా శాఖ కార్యదర్శి ఎం.గిరిజాశంకర్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్-2047 కార్యక్రమం అమల్లో భాగంగా రాష్ట్రంలో ప్రాథమిక, ద్వితీయ, సామాజిక రంగాల్లో వ్యూహాత్మక వృద్ధిని సాధించేందుకు అవసరమైన దృక్కోణ ప్రణాళికలను రూపొందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ముఖ్యంగా ప్రాథమిక రంగంలో.. వ్యవసాయం, పశుసంవర్ధకం, డెయిరీ, ఫిషరీస్, ఉద్యానవనం, సెరికల్చర్, మార్కెటింగ్, సహకారం, అటవీ, జలవనరులు, భూగర్భ జలాలు, చిన్ననీటి పారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి వంటి అంశాల్లో దృక్కోణ ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ రంగంలో.. ఇంధనం, రవాణా, ఐటీ, పర్యాటకం, పరిశ్రమలు, మౌలిక వసతుల కల్పన, పెట్టుబడులు, ఆహార శుద్ధి, గనుల తవ్వకం, చేనేత-జౌళి, గృహ నిర్మాణం, టిడ్కో తదితర అంశాలపైన సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. సామాజిక రంగం అభివృద్ధిలో భాగంగా విద్య, వైద్య, ఆరోగ్యం, మహిళ, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమం, పౌర సరఫరాలకు సంబంధించిన అంశాలపై ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామన్నారు.

రైతును ఆదుకున్న భూగర్భ జలాలు

- చంద్రబాబు హయాంలో అంతా కరువు కాటకాలే
- ఏపీ అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం తక్కువైనా.. గతేడాది విస్తారంగా కురిసిన వర్షాల ఫలితంగా పెరిగిన భూగర్భ జలాలు రైతులను ఆదుకున్నాయని రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి తెలిపారు. రైతుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, సీఎం వైఎస్ జగన్ ఆ దిశగా ఉక్కు సంకల్పంతో ముందుకెళ్తున్నారని చెప్పారు. నిత్యం రైతులను గందరగోళ పరిచేలా పచ్చ మీడియా రాస్తున్న పిచ్చి రాతల్ని రైతులెవరూ నమ్మడం లేదన్నారు. పట్టిసీమ, పులిచింతల నీళ్లు తాగు, సాగు అవసరాలకు సద్వినియోగం చేసుకోవడంలో ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తోందన్నారు. తాడేపల్లిలో బుధవారం ఆయన మీడియాతో మాటాడుతూ ఏమన్నారంటే..

బాబు హయామంతా కరువు కాటకాలే...

2014 నుంచి 2019 వరకు.. రాష్ట్రంలో నిరంతరం కరువు కాటకాలే. సగటున ఏటా 273 కరువు మండలాల్ని ప్రభుత్వమే ప్రకటించింది. అందుకే కరువు, చంద్రబాబు కవలలు అంటారు. నాడు రాయలసీమ, ప్రకాశం జిల్లా ప్రాంతాల నుంచి లక్షలాది రైతుల కుటుంబాలు పొరుగు రాష్ట్రాలకు వలస పోయారు. కానీ బాబు ప్రభుత్వం ఏరోజు రైతులను ఆదుకునే దిశగా చర్యలు తీసుకోలేదు. ఈ ఏడాది ఆగస్టులో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. సరిగ్గా ఇదే లోటు వర్షపాతం గతంలో 1899, 1913లలో నమోదైనట్లు రికార్డులున్నాయి. ఇలాంటి విపత్కర సమయాల్లోనూ ప్రభుత్వపరంగా రైతులకు నీటి సౌకర్యం కల్పించే విషయంలో మనం ముందున్నాం. భూగర్భ జలమట్టాలున్న ప్రతి చోటా రాష్ట్ర వ్యాప్తంగా 19.7 లక్షల పంపుసెట్లకు 9 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తున్నాం. జూలైలో అధిక వర్షపాతానికి కృష్ణా డెల్టాలో దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీని సీజన్ ముగియక ముందే అందించాం. వ్యవసాయ వృద్ధిరేటులో తెలంగాణ కంటే ఏపీ ముందుంది. వ్యవసాయ వృద్ధిరేటు బాబు హయాంలో 2018-19లో (మైనస్) -11.7%ఉంటే, 2022-23లో (ప్లస్) 22.7%గా నమోదైంది. ఈ నాలుగేళ్ల కాలంలో ప్రతి సాగునీటి ప్రాజెక్టు జలకళతో తొణికిసలాడుతోంది. రాయలసీమకు ప్రధానమైన నీటి వనరుగా ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌ను ఓ సారి పరిశీలిస్తే.. బాబు ఐదేళ్ల పాలనలో 310 టీఎంసీల నీరు పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు వెళ్తే.. ఈ నాలుగేళ్లలోనే 553 టీఎంసీల నీరు పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమకు అందాయి.

నేటి నుంచి 'సామాజిక సాధికార యాత్ర'

- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీఎం జగన్ చేసిన మేలును వివరిస్తాం..
- మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ.. తొలి విడతలో 39 నియోజకవర్గాల్లో యాత్ర



సామాజిక సాధికార యాత్ర బస్సుపై మంత్రులు జోగి, ఆదిమూలపు, మేరుగు, తదితరులు

సాక్షి, అమరావతి: దేశ చరిత్రలో సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని రాష్ట్ర మంత్రులు జోగి రమేష్, ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, ప్రభుత్వ సలహాదారు(మైనార్టీ వ్యవహారాలు) జియావుద్దీన్, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతునాయక్‌లు ప్రశంసించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ చేసిన మంచిని వివరించి.. ఆయా వర్గాలను ఏకం చేయాలన్న లక్ష్యంతో సామాజిక సాధికార యాత్ర పేరుతో బస్సు యాత్రను వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర పోస్టర్లను వారు ఆవిష్కరించారు. అనంతరం సామాజిక సాధికార యాత్ర బస్సుకు పూజలు చేసి, ప్రారంభించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మూడు ప్రాంతాల్లో మూడు విడతలుగా సామాజిక సాధికార యాత్ర జరుగుతుందన్నారు. తొలి విడత యాత్ర గురువారం ప్రారంభమవుతుందని.. నవంబర్ 9న ముగుస్తుందని చెప్పారు. రోజూ మూడు ప్రాంతాల్లో ఒక్కో నియోజకవర్గంలో ఈ యాత్ర జరుగుతుందని.. సాయంత్రం బహిరంగ సభలు నిర్వహిస్తామన్నారు. తొలి విడతలో మూడు ప్రాంతాల్లోని 39 నియోజకవర్గాల్లో ఈ యాత్ర సాగుతుందని వివరించారు. యాత్రలో పేదలందరినీ ఏకం చేసి పెత్తందార్లపై రణభేరి మోగిస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల సంగ్రామంలో.. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దన్నుగా నిలిచి, పెత్తందార్లను మట్టికరిపించాలని పిలుపునిచ్చారు. మీడియాతో ఎవరేమన్నారంటే..

పేదలు వృద్ధిలోకొస్తే.. సామాజిక సమతుల్యత దెబ్బతింటుందంటా!

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం వైఎస్ జగన్ చేసిన మేలును వివరించడానికే సామాజిక సాధికార యాత్ర చేపట్టాం. ప్రభుత్వ పాఠశాల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ, ఐబీ సిలబస్‌ను ప్రవేశపెడితే.. పేద పిల్లలు వృద్ధిలోకి వస్తే.. సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని పెత్తందార్లు గగ్గోలు పెట్టారు. చివరకు సీఆర్‌డీఏ పరిధిలో పేదలకు ఇళ్ల పట్టాలిస్తే.. అక్కడికి వారొస్తే.. సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని పెత్తందార్లు ఏకంగా కోర్టుల్లో వాదించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఆలయాల్లోకి కూడా పెత్తందార్లు రానివ్వలేదు. జగనన్న సీఎం అయ్యాక పేదలకు అవే ఆలయ కమిటీల్లో పదవులిచ్చారు. ఎన్నికల సమయంలో మాయ మాటలు చెప్పి, తర్వాత తప్పించుకునే వ్యక్తి చంద్రబాబు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి జగనన్న. తమ పక్షాన నిలిచిన జగనన్నకు పేదలు దన్నుగా నిలుస్తారు. రాష్ట్ర ప్రభుత్వ స్కూళ్లలో చదువుతున్న దళిత విద్యార్థులతో పవన్ ఇంగ్లిష్‌లో మాట్లాడగలరా?

– ఆదిమూలపు సురేష్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

చంద్రబాబు అవమానిస్తే.. సీఎం జగన్ అక్కున చేర్చుకున్నారు...

ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు దళితులను అవహేళన చేస్తే.. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులిచ్చి అక్కున చేర్చుకుని ఆత్మగౌరవం నిలిపిన నేత సీఎం వైఎస్ జగన్. దళితుల మీద చంద్రబాబు హయాంలో జరిగినన్ని దాడులు మరెప్పుడూ జరగలేదు. జగనన్న పాలనలో పేదల బతుకులు మారాయి. సామాజిక సాధికార యాత్ర పేరుతో మేం పేదల కోసం బస్సు యాత్ర చేస్తుంటే.. నిజం గెలవాలనే పేరుతో జైల్లో ఉన్న వ్యక్తి కోసం భువనేశ్వరి యాత్ర చేస్తున్నారు. గత ప్రభుత్వం వెనుకబడిన వర్గాలను ఓటు బ్యాంకుగానే చూసింది. సీఎం వైఎస్ జగన్ ఆ వర్గాలను పేదరికం నుంచి గట్టెక్కించేందుకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. దీని వల్లే రాష్ట్రంలో పేదరికం 12 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ. ఈ ప్రభుత్వం పేదలది.

– మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

అర్హతే ప్రామాణికం

రాష్ట్ర వనరులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించాలనే తపనతో సీఎం జగన్ పనిచేస్తున్నారు. అర్హతే ప్రామాణికంగా వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాల ద్వారా పేదలకు లబ్ధి చేకూర్చుతున్నారు. కరోనా సమయంలో తిండిలేక అనేక రాష్ట్రాల్లో ప్రజలు చనిపోయారు. కానీ సీఎం వైఎస్ జగన్ పుణ్యమాని ఏపీలో అలాంటి పరిస్థితి రాలేదు.

– కొలుసు పార్థసారథి, మాజీ మంత్రి

సామాజిక న్యాయం నినాదం కాదు.. అది ఓ విధానం..

సామాజిక న్యాయం కేవలం నినాదం కాదు.. అమలు చేయాల్సిన విధానం అని స్పష్టం చేసి.. దాన్ని తూచా తప్పకుండా పాటిస్తున్నారు సీఎం వైఎస్ జగన్. పేదల పక్షాన సీఎం జగన్ నిలబడితే, చంద్రబాబు పెత్తందార్ల వైపు నిలబడ్డారు. పేదలు బాగుపడాలంటే జగనే మళ్లీ సీఎం కావాలి. పేదలంతా కలిసి పెత్తందార్లను ఎదుర్కోవడానికే ఈ యాత్ర చేపట్టాం.

– జియావుద్దీన్, మాజీ ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార యాత్ర షెడ్యూల్..

తేదీ	మూడు ప్రాంతాల్లో యాత్ర జరిగే నియోజకవర్గాలు		
	ఉత్తరాంధ్ర	మధ్యాంధ్ర	దక్షిణాంధ్ర
26.10.2023	ఇచ్ఛాపురం	తెనాలి	శింగనమల
27.10.2023	గజపతినగరం	నరసాపురం	తిరుపతి
28.10.2023	భీమిలి	చీరాల	ప్రొద్దుటూరు
30.10.2023	పాడేరు	దెందులూరు	ఉదయగిరి
31.10.2023	ఆమదాలవలస	నందిగామ	ఆదోని
01.11.2023	పార్వతీపురం	కొత్తపేట	కనిగిరి
02.11.2023	మాడుగుల	అవనిగడ్డ	చిత్తూరు
03.11.2023	నరసన్నపేట	కాకినాడ రూరల్	శ్రీకాళహస్తి
04.11.2023	శృంగవరపుకోట	గుంటూరు తూర్పు	ధర్మవరం
06.11.2023	గాజువాక	రాజమండ్రి రూరల్	మార్కాపురం
07.11.2023	రాజాం	వినుకొండ	ఆళ్లగడ్డ
08.11.2023	సాలూరు	పాలకొల్లు	నెల్లూరు రూరల్
09.11.2023	అనకాపల్లి	పామర్రు	తంబళ్లపల్లె

175 నియోజకవర్గాల్లో సామాజిక భేరి

జగనన్న పాలన జనం మెచ్చిన పాలన. 77 ఏళ్ల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో సీఎం జగన్ సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటిస్తున్నారు. మంత్రివర్గంలో 70 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చారు. టీడీపీ హయాంలో బీసీ అంటే బిజినెస్ క్లాస్.. జగనన్న పాలనలో బీసీలను సమాజానికి బ్యాక్‌బోన్ క్లాస్‌గా మార్చారు. అలాంటి జగనన్నకు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉంది. గురువారం నుంచి 175 నియోజకవర్గాల్లో సామాజిక భేరి మోగించబోతున్నాం. పెత్తందార్ల కోటలను బద్దలు కొట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలమంతా సంఘటితంగా ముందుకెళుతున్నాం. సీఎం జగన్ నాయకత్వాన్ని పటిష్ఠపరుస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఒక్కతాటిపైకి వచ్చి పేదలకు-పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధంలో చేయి చేయి కలిపి.. జగనన్నకు అండగా నిలుద్దాం. నిజం గెలవాలని యాత్ర చేపట్టిన భువనేశ్వరి నిజాలు చెప్పాలి. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని దక్కించుకున్నప్పటి నుంచి 2019 వరకూ సీఎంగా ఉన్నప్పుడు చంద్రబాబు అనేక కుంభకోణాలకు పాల్పడ్డారు. పాపం పండింది, అవినీతి బయటపడింది కాబట్టే రాజమండ్రి జైల్లో ఉన్నారు. అందుకే భువనేశ్వరి నిజం గెలవాలని కాకుండా చంద్రబాబు పాప పరిహార యాత్ర చేయాలి.

– జోగి రమేష్, గృహనిర్మాణ శాఖ మంత్రి


ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను బాబు ఓటు బ్యాంకుగానే చూశారు

రాష్ట్ర జనాభాలో సుమారు 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలున్నారు. వారి అవసరాలను గుర్తించడం పాలకుల ప్రాథమిక కర్తవ్యం. ఆయా వర్గాలను చంద్రబాబు కేవలం ఓటు బ్యాంకుగానే చూశారు. వారి సంక్షేమం, అభివృద్ధి కోసం చంద్రబాబు ఎన్నడూ ఆలోచించలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల్లో వెలుగులొచ్చాయి. సంక్షేమాభివృద్ధి పథకాలతో వారి జీవన ప్రమాణాలు మెరుగవుతున్నాయి. సామాజిక ఆవశ్యకతను నొక్కిచెప్పేందుకే ఈ యాత్రను చేపట్టాం.

– హనుమంతు నాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు.

పెత్తందారులను ఎదుర్కొనే యాత్ర ఇది..

వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ చేసేది సామాజిక సాధికార యాత్ర అని ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పేదలందరూ కలిసి పెత్తందారులను ఎదుర్కొనే యాత్ర ఇది.. జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని, సాధికార న్యాయాన్ని తెలియజేసేందుకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుంచి మూడు ప్రాంతాల్లో సామాజిక సాధికార బస్సు యాత్ర చేస్తున్నట్లు వివరించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సామాజిక సాధికార యాత్ర ద్వారా వెనుకబడిన(వెన్నెముక) వర్గాల సాధికారత కోసం జగనన్న ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలు, చేయబోతున్న మేలు గురించి తెలియజేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి మూడు దశల్లో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. మొదటి దశ ఈ నెల 26 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో 39 నియోజకవర్గాలను కవర్ చేయటమే లక్ష్యంగా యాత్ర సాగుతుందని తెలిపారు. బస్సు యాత్ర రాష్ట్రంలోని ఇచ్ఛాపురం(శ్రీకాకుళం జిల్లా), సింగనమల (అనంతపురం జిల్లా), తెనాలి(గుంటూరు జిల్లా)లో ప్రారంభమవుతుందని వివరించారు. ఆయా నియోజకవర్గానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారితో మమేకమవుతూ యాత్ర సాగుతుందని చెప్పారు. సామాజిక న్యాయాన్ని, ధర్మాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని స్పష్టం చేశారు. జగనన్న పాలనలో కేబినెట్ కూర్పు దగ్గర నుంచి 68 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అధిక ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. స్పీకర్ స్థానం నుంచి మండలి చైర్మన్ దాకా ఇలా ఒకటి రెండు కాదు.. జనరల్ స్థానాలను సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చి గౌరవించిన జగనన్నకు జేజేలు పలుకుతూ సామాజిక సాధికార యాత్రను కొనసాగించనున్నామని చెప్పారు.

నిజం గెలవబట్టే చంద్రబాబు జైల్లో..

నిజం గెలిచింది కాబట్టే చంద్రబాబు జైల్లో ఉన్నాడని, నారా భువనేశ్వరి కూడా నిజం గెలవాలని కోరుకుంటే బాబు జీవితంలో జైలు నుంచి బయటకురాలేరని వైవీ అన్నారు. భువనేశ్వరి చేపడుతున్న నిజం గెలవాలి యాత్రను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అవినీతికి పాల్పడి చంద్రబాబు జైలుకెళ్లారు.. ఆ చెడ్డ పేరు కప్పిపుచ్చుకునేందుకు తెలివిగా నిజం గెలవాలని చంద్రబాబు సతీమణి యాత్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు కూడా తెలివైన వారేనన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మటం లేదన్నారు. బాబు అవినీతి చేశారు.. అందుకే జైలు కెళ్లారు అని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు.

క్లుప్తంగా...

న్యాయస్థానంపై పోరాటమా?

టీడీపీ నేతలపై మంత్రి బొత్స ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'చంద్రబాబు అవినీతిపై ప్రాథమిక ఆధారాలుండటం వల్లే కోర్టు కస్టడీకి ఇచ్చింది. బాబు అవినీతిపై సాక్ష్యాధారాలున్నాయి. వాటి మీద ఇంకా కూలంకషంగా దర్యాప్తు జరగాలని కోర్టులు చెప్పాయి. భారత రాజ్యాంగం మేరకు న్యాయస్థానాలు చెప్పినవి నమ్మాలి. అంతేగాని న్యాయస్థానాలను నిలదీసి పోరాటాలు చేస్తారా? న్యాయస్థానాలకు తప్పు ఆపాదిస్తున్నారా?' అని రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ టీడీపీ తీరును తప్పుబట్టారు. విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంపై ఆయన స్పందిస్తూ..చంద్రబాబు అవినీతి చేయడం నిజమని, ఆయనను అరెస్ట్ చేయడం చట్టబద్ధమని అన్నారు. దీనిపై కోర్టులో తీర్పు వచ్చేవరకు ఓపిక పట్టాలని హితవు పలికారు.

'సంక్షేమం' నిజం..

ఉత్తరాంధ్ర ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ప్రజా సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద వైఎస్సార్‌సీపీ నేతలు

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న 'సంక్షేమం' అనే నిజాన్ని ప్రజలకు నిర్భయంగా చెప్పేందుకే సామాజిక సాధికారత బస్సు యాత్ర చేపడుతున్నట్లు ఉత్తరాంధ్ర ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం లొద్దపుట్టిలోని ప్రజా సంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద విలేకరులతో మాట్లాడారు. 'నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనార్టీ' అంటూ పేదవారందరినీ ఏకం చేసేందుకు, పేదలకు జరిగిన మంచిని వివరించేందుకు గురువారం ఇచ్ఛాపురం నుంచి బస్సుయాత్ర చేపడుతున్నామని చెప్పారు. డిసెంబర్ 31 వరకు 60 రోజుల పాటు సభలు జరుగనున్నాయని తెలిపారు. సామాజిక న్యాయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను దేశం మొత్తం ప్రశంసిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు నర్తు రామారావు, దువ్వాడ శ్రీనివాస్, నియోజకవర్గ సమన్వయకర్త సాయిరాజ్, మాజీ ఎమ్మెల్యే నరేష్‌కుమార్ అగర్వాలా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

మద్యనియంత్రణకు ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుంది?

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో దశల వారీగా మద్య నియంత్రణ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ జగన్ హామీ ఇచ్చారని, ఈ నాలుగున్నరేళ్లా అందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటో వెల్లడించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం సరఫరాకు ఏపీఎస్‌బీసీఎల్ వద్ద 100కు పైగా మద్యం కంపెనీలు రిజిస్టరైతే అందులో 16 కంపెనీలకు 74% ఆర్డర్లు ప్రభుత్వం ఇచ్చిందన్నారు. మద్యం అమ్మకాల నుంచి వచ్చే సంపాదనను దారి మళ్లిస్తూ భారీ అవినీతికి ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు, రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాస్తవ అప్పులపై విచారణ జరిపించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు చెప్పారు.

'విశ్వశాంతి'లో విదేశీ నత్తల పెంపకం

కాల్చి భూస్థాపితం చేసిన అధికారులు



నిషేధిత నత్తలను పెంచుతున్న తొట్టెలు

ఉయ్యూరు: కృష్ణా జిల్లా ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి విద్యా సంస్థల్లో నిషేధిత విదేశీ నత్తల పెంపకం సాగుతున్న వైనం బుధవారం వెలుగు చూసింది. విద్యా సంస్థల ప్రాంగణంలో గోల్డెన్ ఆపిల్ స్నైల్(విదేశీ నత్తలు) పెంపకాన్ని క్వారంటైన్ న్యూఢిల్లీ శాఖ అధికారులు బుధవారం గుర్తించారు. అధికారుల బృందం విద్యా సంస్థల ప్రాంగణాన్ని పరిశీలించి.. విదేశీ నత్తల పెంపకం జరుగుతున్నట్టు తేల్చింది. నత్తల పెంపకం కోసం తీసుకున్న అనుమతులపై విద్యా సంస్థల యాజమాన్యాన్ని వివరణ కోరగా.. థాయ్‌లాండ్ నుంచి నత్తల సీడ్ తీసుకొచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సిమెంట్ తొట్టెల్లో పెంచామని, అనుమతులేవీ తీసుకోలేదని వివరించారు. వరి పంటను పూర్తిగా నాశనం చేసే సామర్థ్యం గల నత్తల పెంపకం పట్ల క్వారంటైన్ బృందం ఆగ్రహం వ్యక్తం చేసి వాటిని కాల్చి భూస్థాపితం చేసింది.

2014 టు 2024... నారా – పవన్ ఉమ్మడి సమర్పణలో..

మోసానికి మళ్లీ రెడీ

సాక్షి, అమరావతి



పదేళ్ల కిందట కలసికట్టుగా మేనిఫెస్టో విడుదల చేసి, ఎన్నికల్లో గెలిచాక దాన్ని చెత్తబుట్టలో పడేసిన చంద్రబాబు– పవన్ కల్యాణ్‌ల ద్వయం... మళ్లీ అదే మోసానికి ఒడిగడుతోంది. పైపెచ్చు ఇదేదో ఇప్పుడే తొలిసారి చేస్తున్నట్లుగా... తెలుగుదేశం–జనసేన తొలి ఉమ్మడి మేనిఫెస్టో అనే కలరింగుతో పవన్ కళ్యాణ్ ఊదరగొట్టేస్తున్నారు. మరి 2014 ఎన్నికల మేనిఫెస్టో సంగతేంటి పవన్ కళ్యాణ్? ఆ మేనిఫెస్టోపై చంద్రబాబుతో పాటు మీ ఫోటో కూడా ఉందిగా? 'టీడీపీకి ఓట్లేయండి.. హామీలు అమలు చేసే బాధ్యత నాది' అని 2014 ఎన్నికల్లో బహిరంగంగా టీడీపీ తరపున ప్రజలకు పూచీకత్తుగా నిలిచారుగా? టీడీపీ గెలిచిన తరవాత హామీలను అమలు చేయకపోయినా ఒక్కసారైనా ప్రశ్నించారా? అసలు మేనిఫెస్టోనే కనిపించకుండా వెబ్‌సైట్ నుంచి మాయం చేసేసిన చంద్రబాబు నాయుడిని ఎన్నడైనా నిలదీశారా? మళ్లీ ఇపుడు ఏ మొహం పెట్టుకుని ఉమ్మడి మేనిఫెస్టో కథ అల్లుతున్నారు? మీరు తెలుగుదేశాన్ని నిలదీస్తారంటే నమ్మేదెవరు? మీరు హీరోలా ఒక్క సీన్లోనూ కనిపించని సినిమాను అదే స్క్రీన్‌ప్లే, డైలాగులతో మళ్లీ మళ్లీ జనం ముందుకు తెస్తే మాత్రం చూసేదెవరు?

ఎప్పుడో పదేళ్ల క్రితం జరిగింది కాబట్టి ఇప్పుడు జనం ఆ మోసాన్ని మర్చిపోయి ఉంటారులే అనుకుంటూ చంద్రబాబు నాయుడు– పవన్ కళ్యాణ్ మళ్లీ అదే స్కీముతో జనం ముందుకు రావటం ఆంధ్రప్రదేశ్‌లో ఇపుడు చర్చనీయమవుతోంది. ఐదేళ్లగా అనేక రాజకీయ డ్రామాలు ఆడిన తరవాత... సరిగ్గా ఎన్నికల ముందు జనసేన–టీడీపీ ఉమ్మడిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోతున్నట్టు ప్రకటన చేసి.. నవంబరు ఒకటిన రెండు పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోనూ ప్రకటించి... ఆ మేనిఫెస్టోతో ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభిస్తామని పవన్‌కళ్యాణ్‌తో పాటు చంద్రబాబు తనయుడు లోకేశ్ దసరా పండుగ రోజున ఉమ్మడిగా ప్రకటించడంపై రాజకీయ వర్గాల్లో భిన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పదేళ్ల కిందట 2014 ఎన్నికల్లో... టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయించే బాధ్యతను నెత్తికెత్తుకున్నానని, అమలు చేయకుంటే నిలదీసే బాధ్యత కూడా తనదేనంటూ పవన్‌కళ్యాణ్ ప్రజలకు వాగ్దానమిచ్చారు. 2014–19 మధ్య ఒక్క హామీ విషయంలో కూడా దాన్ని నిలబెట్టుకోకుండా... మళ్లీ ఇపుడు పదేళ్ల కిందటి మాటలే చెబుతుండటం జనాన్ని వంచించటం తప్ప మరొకటి కాదనేది రాజకీయ విశ్లేషకుల మాట. వాస్తవానికి 2014 ఎన్నికల్లో బీజేపీతో కలిసి టీడీపీ– జనసేన ఉమ్మడిగా పోటీ చేశాయి. అప్పట్లో తాము అధికారంలోకి వస్తే రైతు రుణాల మాఫీ చేస్తామని, ద్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తామని, ఇంటింటికీ ఓ ఉద్యోగమిస్తామని, లేనిపక్షంలో నిరుద్యోగ భృతి ఇస్తామని బోలెడన్ని ఆకర్షణీయమైన హామీలు గుప్పించారు. ఈ మోసపూరిత హామీలకు పవన్ కళ్యాణ్ గ్యారెంటీ ఇచ్చారు. ఒక్క సీట్లోనూ పోటీ చేయనప్పటికీ జనసేన తరఫున భారీగా ప్రచార సభలు నిర్వహించి... ప్రతి సభలోనూ టీడీపీ హామీలకు తాను పూచీగా ఉంటానని పవన్ కళ్యాణ్ ఊదరగొట్టారు. బీజేపీ కూడా వీరితో కలిసి పోటీ చేయటంతో ఈ కూటమి ఎన్నికల్లో గెలిచింది. ఆ వెంటనే చంద్రబాబు హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేశారు. ఏకంగా మేనిఫెస్టోనే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేశారు. పవన్ సైతం ఈ విషయాన్ని గమనించనట్టే ఉండిపోయారు. అసలు ఏ హామీ గురించి కూడా ఒక్కనాడూ ప్రశ్నించలేదు. 2014 ఎన్నికల ముందు... ప్రజలకిచ్చిన హామీలపై బాబు, పవన్ ఇద్దరూ సంతకాలు చేసిన కరపత్రాలను ఇంటింటికీ పంచారు. పత్రికలకు టీడీపీ ఇచ్చిన మేనిఫెస్టో ప్రకటనల్లో చంద్రబాబుతో పాటు పవన్‌కళ్యాణ్ ఫోటోలూ ప్రముఖంగా ప్రచురించారు. గెలిచిన వెంటనే పవన్ ప్యాకేజీ అందుకుని తన వేషాన్ని చాలించారన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి.

పైసా డ్వాక్రా రుణ మాఫీ జరగకపోయినా పవన్ గప్‌చుప్...

అధికారంలోకి వచ్చాక... బేషరతుగా డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేస్తామని చెప్పి, ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో 70 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో ఎవ్వరికీ పైసా రుణం కూడా చంద్రబాబు ప్రభుత్వం మాఫీ చేయలేదు. అప్పట్లో సంబంధిత మంత్రిగా ఉన్న పరిటాల సునీత... తమ ప్రభుత్వం డ్వాక్రా రుణ హామీని అమలు చేయలేదని అసెంబ్లీ సాక్షిగా సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. టీడీపీ మోసపూరిత హామీ వల్ల అప్పటి దాకా దేశంలో మొదటి స్థానంలో ఉండే రాష్ట్ర డ్వాక్రా పొదుపు సంఘాల వ్యవస్థ ఒక్కసారిగా కుదేలైంది. బాబు హామీని నమ్మి రుణాలు చెల్లించని మహిళలు తమ సంఘాల అప్పుపై వడ్డీలు, చక్రవడ్డీలు పెరిగి, వాటిని చెల్లించలేక బ్యాంకుల దగ్గర ఎన్‌పీఏలుగా (నిర్ధరక ఆస్తులుగా) ముద్రపడ్డారు. లక్షల పొదుపు సంఘాలు 'ఏ' గ్రేడ్ నుంచి ఏకంగా 'డీ' గ్రేడ్‌కు పడిపోయాయి.

రుణ మాఫీ మోసం, కరువుతో రైతూ కుదేలయినా...

రైతు రుణ మాఫీ విషయంలోనూ అంతే. 2014 అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో రైతుల పేరిట రూ.87,612 కోట్ల వ్యవసాయ రుణాలుండగా, కోటయ్య కమిటీ పేరుతో కాలయాపన చేసి, ఆ ఐదేళ్లలో కేవలం రూ.15 వేల కోట్ల రుణాలను మాత్రమే నాటి చంద్రబాబు ప్రభుత్వం చెల్లించింది. ఎన్నికల ముందు రైతులకిచ్చిన రుణ బాండ్లు చెల్లని కాగితాలయ్యాయి. బాబు రుణ మాఫీ మోసానికి కరువు కూడా తోడవటంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి రాష్ట్రమంతటా వేలాది ఎకరాలు పంటలు కూడా వేయక బీడుగా మారాయి. అయినా పవన్‌కళ్యాణ్ ఏనాడు నాటి చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

కాపు రిజర్వేషన్ల హామీ అమలులోనూ అంతే..

ఇంటింటికీ ఉద్యోగమిస్తామన్న చంద్రబాబు ప్రభుత్వం దాన్ని గాలికొదిలేసింది. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయలేదు. ఇలా లక్షల మంది యువతను మోసం చేసినా పవన్‌కళ్యాణ్ కనీసం దాని గురించి ప్రశ్నించలేదు. చివరకు.. గత 2019 ఎన్నికల్లో తాను పోటీ చేయడానికి రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో కాపుల ఓట్లు ఎక్కువ ఉన్నాయో వెతుక్కొని మరీ గాజువాక, భీమవరంలో పోటీ చేసిన పవన్‌కళ్యాణ్.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల హామీ అమలు చేయకపోయినా ప్రశ్నించకపోవడాన్ని పలువురు కాపు నేతలు గుర్తు చేస్తున్నారు. కాపు ఉద్యమ కారులపై తుని రైలు ఘటన పేరుతో అక్రమ కేసులు బనాయించినా, ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులను బూతులు తిడుతూ వేధించినా పవన్‌కళ్యాణ్ కనీసం తప్పుపట్టలేదని, అందుకే ఆయన పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయారని వారు వ్యాఖ్యానించారు.

ఎవరు ప్రశ్నించినా పవన్‌ది మౌనమే...

ఇటీవల పవన్‌కళ్యాణ్ తన రాజకీయ యాత్రలో ప్రతి చోటా వచ్చే ఎన్నికల్లో జనసేన – టీడీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ 2014 –19 మధ్య చంద్రబాబు ప్రభుత్వ పాలనపై గురించి ఎవరు ప్రస్తావించినా ఆయన ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. 2014–18 మధ్య టీడీపీ –జనసేన రెండూ పొత్తు కొనసాగించాయి. అప్పటి ప్రభుత్వ పనితీరు ఆధారంగా ఈ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడగబోతున్నారా? అంటూ ఇటీవల మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఓ మీడియా ప్రతినిధి ప్రశ్నించగా.. దానికి పవన్‌కళ్యాణ్ జవాబు ఇవ్వకుండా దాటవేశారు.

జగన్ తీరే వేరు.. తొలిఏడాదే 80 శాతం, నాలుగేళ్లకు 99 శాతం!

ఎన్నికల్లో గెలిచాక మేనిఫెస్టోను మాయం చేసిన చంద్రబాబు– పవన్ కళ్యాణ్ ఒకపక్క ఉంటే.... 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గెలిచాక తు.చ. తప్పకుండా అమలు చేసి చూపించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోవైపు నిలిచిన విషయాన్ని పరిశీలకులు గుర్తు చేస్తున్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది కాలంలోనే 80 శాతం హామీలను అమలు చేసి చూపించారు. నాలుగేళ్లు పూర్తయ్యే సరికి 99 శాతం హామీలను అమలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా తలెత్తిన కోవిడ్ సంక్షోభంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు దెబ్బతిన్నా కూడా హామీల అమల్లో ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఇంతటి చిత్తశుద్ధికి మోకాలడ్డుతూ చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు వారికి అనుకూలంగా పనిచేసే కొన్ని పత్రికలు తరచూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అవాస్తవ కథనాలు ప్రచురించడం, వాటి ఆధారంగా కొందరు నేతలు వాటిపై కేంద్రానికి ఫిర్యాదులు చేస్తూ రాష్ట్రానికి నిబంధనల ప్రకారం రావాల్సిన నిధులను కేంద్రం నుంచి రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేయటం దేశ రాజకీయాల్లో ఏపీలో తప్ప ఎక్కడా లేదని పలువురు గుర్తు చేస్తున్నారు.

నిజం గెలిస్తే.. చంద్రబాబు ఇక ఎప్పటికీ జైల్లోనే..

- అబద్ధం గెలవాలంటూ భువనేశ్వరి యాత్ర చేయాలి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



తాళ్లపూడి/పోలవరం రూరల్: నిజం గెలవాలని కాకుండా.. అబద్ధం గెలవాలంటూ చంద్రబాబు భార్య భువనేశ్వరి యాత్ర చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఎద్దేవా చేశారు. నిజం గెలిస్తే బాబు ఎప్పటికీ జైలు నుంచి బయటకు రారన్నారు. చంద్రబాబుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి కక్షా లేదని మంత్రి పునరుద్ఘాటించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం తాడిపూడిలో ప్రభుత్వ శాశ్వత భవనాలను హోం మంత్రి తానేటి వనితతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంబటి మాట్లాడుతూ చంద్రబాబు చేసిన తప్పులే ఆయనను జైలుకు పంపాయన్నారు. నేరాలున్నందునే బెయిల్ కూడా రాలేదని తెలిపారు. అంతేగానీ ప్రభుత్వం కుట్ర పూరితంగా ఎక్కడా వ్యవహరించడం లేదని చెప్పారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబుకు పవన్ కళ్యాణ్ మద్దతు ఇచ్చారని గత ప్రభుత్వం చేసిన తప్పులు, దోపిడీకి ఆయన కూడా బాధ్యత వహించాలన్నారు. నాడు పవన్ మద్దతు ఇవ్వకుంటే ఇన్ని తప్పులు జరిగేవి కాదని చెప్పారు. 'కాపు ఉద్యమ సమయంలో ముద్రగడను, ఆయన కుటుంబాన్ని చంద్రబాబు ఇబ్బందులు పెట్టినప్పుడు ఎక్కడ ఉన్నావు పవన్.., అసలు నీకు కాపులు ఎందుకు మద్దతివ్వాలి'? అని ప్రశ్నించారు. న్యాయస్థానం తీసుకున్న నిర్ణయాలను కూడా తప్పుబడుతున్నారని అలాంటి సొంత పుత్రుడు, దత్త పుత్రులను ఎలా నమ్మాలన్నారు. చంద్రబాబుకి స్కాంలో పాత్ర ఉందని తెలిసే సీబీఐ కోర్టులో, హైకోర్టులో, చివరకు సుప్రీం కోర్టులో కూడా రిలీఫ్ దొరకలేదని అంబటి చెప్పారు.

జలశక్తి నిర్ణయాల మేరకు ప్రాజెక్టు నిర్మాణం

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన డయాఫ్రమ్ వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణాలు కేంద్ర జలశక్తి సంఘం నిర్ణయాల మేరకు ఆధారపడి ఉంటాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. బుధవారం మంత్రి అంబటి.. ప్రాజెక్టు ఇంజనీర్‌లతో కలిసి పనులను పరిశీలించారు. పనుల వివరాలను ప్రాజెక్టు సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహామూర్తి ఆయనకు వివరించారు. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య ఉన్న సీపేజ్ నీటిని మళ్లించేందుకు నిర్మాణం చేస్తున్న కాలువ పనులను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

మేనిఫెస్టో అంటే టీడీపీకి టిష్యూ పేపరే!



సాక్షి, అమరావతి: ఎడాపెడా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు మహా నేర్పరి. 2014 ఎన్నికల్లో వ్యవసాయ రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి ఆ తర్వాత ప్రజలను నిలువునా ముంచారు. రైతు రుణాలు రూ.87వేల కోట్లకు పైబడి ఉంటే... దాన్ని ఐదు విడతల్లో ఇస్తానని చెప్పి మూడు విడతలు... అది కూడా తూతూ మంత్రంగానే ఇచ్చారు. నాటి ప్రభుత్వ తీరుతో రైతులపై వడ్డీల భారం పెరిగి వాటిని తీర్చలేక వందల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

- ➢ డ్వాక్రా, చేనేత రుణాల మాఫీని పూర్తిగా తుంగలో తొక్కారు. కోటయ్య కమిటీ తన నివేదికలో డ్వాక్రా రుణాలు మాఫీ చేయాలని సిఫారసు చేసినా పట్టించుకోలేదు. రుణాలు మాఫీ చేయకపోవడంతో వాటిపై వడ్డీలు పెరిగిపోయి మహిళలు బ్యాంకుల నుంచి నోటీసులు అందుకుని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సంఘాలు ఎన్‌పీఏలుగా (నిరర్థక ఆస్తులు) మారాయి. క్రెడిట్ రేటింగ్‌ను కోల్పోయి రుణాలకు అనర్హులయ్యారు.
- ➢ మద్యం బెల్టు షాపుల రద్దు చేస్తానని ప్రకటించి ఆ పని చేయకపోగా ప్రతి గల్లీకి వాటిని విస్తరించారు.
- ➢ రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తానని చెప్పి అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ ఊసే ఎత్తలేదు.
- ➢ పుట్టిన ప్రతి బిడ్డకు మహాలక్ష్మి పథకం కింద రూ.30 వేలు బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తానని ఇచ్చిన హామీలు బుట్టదాఖలు చేశారు.
- ➢ ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియామకాలు చేస్తానని ప్రకటించినా దాన్ని అమలు చేయకుండా యువత, విద్యార్థులను మోసం చేశారు. పైగా ప్రభుత్వ ఉద్యోగులను 2 లక్షలకు పైగా కుదించి అన్యాయం చేశారు.
- ➢ ఇంటికో ఉద్యోగం ఇస్తామని లేకపోతే ప్రతి నెలా రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని నీరుగార్చారు. ఎన్నికలకు మూడు నెలలు ఉండగా కొద్దిమందికి భృతి పేరుతో చేతులు విదిల్చి వారిని మభ్యపెట్టారు.
- ➢ పేద మహిళలకు ఉచితంగా స్మార్ట్ ఫోన్లు ఇస్తానని ఇవ్వలేదు. పేదలకు 3 సెంట్ల స్థలంలో ఇల్లు ఇస్తానని చెప్పి ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు.
- ➢ బీసీలకు వంద అసెంబ్లీ స్థానాలిస్తానని చెప్పి ఇవ్వలేదు. బీసీలకు రూ.10 వేల కోట్ల బడ్జెట్ పెడతానని చెప్పి మోసం చేశారు. కాపులకు ఏటా వెయ్యి కోట్ల చొప్పున రూ.5 వేల కోట్లు ఇస్తానని చివరికి రూ.1500 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.
- ➢ ఇంటర్ వరకు విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ ఇస్తానని ఇవ్వలేదు. నిరుద్యోగులకు రూ.50 లక్షల వరకు రుణం ఇస్తానని పట్టించుకోలేదు.
- ➢ కాలేజీ విద్యార్థులకు ఉచితంగా టాబ్లెట్ కంప్యూటర్లు ఇస్తామని ఇవ్వలేదు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 33.5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తానని చెప్పి పట్టించుకోలేదు.
- ➢ రూ.500 కోట్లతో బ్రాహ్మణుల కోసం నిధి ఏర్పాటు చేస్తానని చెప్పి మోసం చేశారు.
- ➢ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా వాటి గురించి ప్రజలు అడుగుతారని భయంతో ఏకంగా మేనిఫెస్టోను తెలుగుదేశం వెబ్‌సైట్ నుంచే తొలగించిన చరిత్ర చంద్రబాబుది.

అరెకరంతో బాబు 2 లక్షల కోట్లు సంపాదించాడా?

భువనేశ్వరి బస్సు యాత్రపై గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



గుడివాడ టౌన్: అర ఎకరం బీడు భూమి సాగు చేసి రెండు లక్షల కోట్లు సంపాదించడం ఎవరికైనా సాధ్యపడుతుందా? అని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం ఆయన కృష్ణాజిల్లా గుడివాడలో భువనేశ్వరి బస్సు యాత్రపై మాట్లాడారు. చంద్రబాబును జైల్లో పెట్టారని తెలిసి, తట్టుకోలేక 154 మంది మృతి చెందారనడం హాస్యాస్పదం అన్నారు. గతంలో చుట్టుపక్కల మృతి చెందిన ముసలీ, ముతకలను అమరావతి పోరాటంలో చనిపోయారని చెప్పడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందన్నారు. నిజం గెలవాలని వారు ఆరాటపడటాన్ని తాము సైతం స్వాగతిస్తున్నామని, నిజమే గెలుస్తుంది అని కొడాలి అన్నారు. రాష్ట్ర ప్రజలను అనేక రకాలుగా దోచుకుతిన్న గజదొంగ ఈ 420 చంద్రబాబు అని విమర్శించారు. చంద్రబాబు తండ్రి ఖర్జూర నాయుడుకు ఉన్నది రెండు ఎకరాల పొలం. ఆయనకు నలుగురు పిల్లలు. అంటే చంద్రబాబుకు అర ఎకరం వచ్చి ఉంటుంది. ఈ అర ఎకరం సాగు చేసి రెండు లక్షల కోట్లు సంపాదించి ఉంటారా అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలో ఉండగా ప్రజల సొమ్ము దోచుకుని హెరిటేజ్ కంపెనీ ఏర్పాటు చేసి భువనేశ్వరికి కట్టబెట్టారన్నారు. ఆయన కుటుంబం అవినీతి సొమ్ముతో కూరుకుపోయిందని, ఢిల్లీ లాయర్లకు ఈ 45 రోజుల్లో సుమారు రూ.30 కోట్లు ఖర్చు చేశారని, ఇంత పెద్ద మొత్తం అర ఎకరం సాగు చేసి సంపాదించడం సాధ్యమేనా అని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పుడు చనిపోయిన వారిని పరామర్శిస్తామంటూ తయారు చేయించిన బస్సు ఖరీదు రూ.7 కోట్లు. ఈ డబ్బు ఎక్కడ నుంచి వచ్చిందని నిలదీశారు. నిజం గెలవబట్టే బాబు రాజమండ్రి జైల్లో ఊచలు లెక్కబెడుతున్నారన్నారు. జనసేన, తెలుగుదేశం కలిసి పోటీచేస్తే తమకేమీ నష్టం ఉండదని, 2014లో వాళ్లిద్దరూ కలిసి ఆడిన నాటకంలో తాము 151 సీట్లు గెలవలేదా అని అన్నారు. అప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీల్చేందుకు సీపీఎం, సీపీఐ, ఇతర పార్టీలను కలుపుకుని పవన్ కళ్యాణ్ నటించాడని, ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని ఇప్పుడు కలిసి పోటీ చేస్తే మాత్రం ఒరిగేదేమీ లేదన్నారు. చంద్రబాబు కొడుకు సమర్థుడైతే ఇంట్లో మహిళలు రోడ్లపై తిరగాల్సిన అవసరం ఉంటుందా అనేది ప్రజలు గ్రహిస్తారన్నారు. లోకేశ్‌కు పార్టీ నడిపే సత్తా లేదు కాబట్టే, ఇలాంటి బస్సు యాత్రలు చేసినా, నిజం గెలవాలని యాత్ర చేసినా చంద్రబాబు జైలు పాలవడం, టీడీపీ కనుమరుగవడం ఖాయమని స్పష్టం చేశారు.

సైబరాబాద్ మా ఆయన కష్టార్జితం

- ఫలాలను వేరేవాళ్లు అనుభవిస్తున్నారు
- మహిళల కోసం చంద్రబాబు 22 పథకాలు తెచ్చారు
- రాష్ట్రంలో హింసా రాజకీయాలు, గంజాయి, అత్యాచారాలు తప్ప ఏమీ లేవు
- 'నిజం గెలవాలి' కార్యక్రమంలో నారా భువనేశ్వరి



తిరుపతి రూరల్: రాళ్లు, రప్పలు ఉన్న ప్రాంతాన్ని సైబరాబాద్‌గా మార్చేందుకు చంద్రబాబు ఎంతో కష్టపడ్డారని, ఆయన కష్టార్జితమే నేడు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోందని నారా భువనేశ్వరి తెలిపారు. చంద్రబాబు కష్టపడి సైబరాబాద్‌ను నిర్మిస్తే ఆ ఫలాలను వేరేవాళ్లు అనుభవిస్తున్నారన్నారు. 'న్యాయం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా బుధవారం తిరుపతి జిల్లా అగరాల వద్ద మహిళలతో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భువనేశ్వరి మాట్లాడుతూ ముందు చూపుతో 25 ఏళ్ల క్రితమే చంద్రబాబు హైటెక్ సిటీని నిర్మించారన్నారు. ఏమీలేని చోట హైటెక్ సిటీ ఎందుకు అని తాను చంద్రబాబుతో అంటే హైటెక్ సిటీ ఎలా అభివృద్ధి చెందుతుందో చూడు అని ఆయన తనతో అన్నారన్నారు. ఇప్పుడు ఆ సిటీ ఎలా ఉందో మీ అందరికీ తెలుసని చెప్పారు.

మీకేమన్నా పిచ్చి పట్టిందా అని ప్రశ్నించేదాన్ని..

2014లో రాష్ట్రం విడిపోయాక కూడా రోజుకు మూడున్నర గంటలు మాత్రమే చంద్రబాబు నిద్రపోయేవారని భువనేశ్వరి తెలిపారు. మీకేమన్నా పిచ్చిపట్టిందా.. నిద్రపోకుండా కష్టపడుతున్నారు? ప్రజలకు సేవ అంటూ ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోవడం లేదని తాను ప్రశ్నించేదాన్నని గుర్తు చేసుకున్నారు. అలాంటి వ్యక్తిపై ఆధారాలు లేకుండా స్కిల్ డెవలప్‌మెంట్, ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్ అంటూ తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో అక్రమంగా 47 రోజులుగా నిర్బంధించారని ధ్వజమెత్తారు. టీడీపీ నేతలపై కేసులు, జైలు తప్ప ప్రభుత్వానికి మరే ధ్యాస ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం గెలవాలనేది ఒక పోరాటమని.. ఇది తన ఒక్కదానిదే కాదని.. అందరిదని తెలిపారు. ఈ పోరాటం రాష్ట్రం కోసం, మన కోసం, మన బిడ్డల భవిష్యత్ కోసమని వెల్లడించారు. 45 ఏళ్లలో ఇలాంటివి ఎన్నో చంద్రబాబు ఎదుర్కొన్నారని, ఆయనకు ఇదొక సమస్య కాదని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే చంద్రబాబు బయటకు వచ్చి మీ కోసం ఇంకా కష్టపడతారన్నారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలు, అత్యాచారాలు, గంజాయి తప్ప మరేమీ లేవన్నారు. మహిళలకు భద్రత లేదని బయటకు రావాలంటేనే భయపడుతున్నారన్నారు. మన రాష్ట్రంలో అరాచక పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనిగానీ, ఉద్యోగాలు ఇవ్వాలన్న ఆలోచనగానీ ప్రస్తుత ప్రభుత్వానికి లేదన్నారు.

చంద్రబాబును కాదు.. రాష్ట్రాన్ని నిర్బంధించారు..

చంద్రబాబును నిర్బంధించడం అంటే రాష్ట్రాన్ని, న్యాయాన్ని నిర్బంధించినట్టు అని భువనేశ్వరి అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ వాళ్లపై పోరాడినట్లు వైఎస్సార్‌సీపీ నేతలపై పోరాడాలని, అందుకోసం చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఏ మహిళకు తనలాంటి ఇబ్బందులు రాకూడదన్నారు. చంద్రబాబు మహానాయకుడు అని, మహిళల కోసం 22 పథకాలు తీసుకొచ్చారని తెలిపారు. కాగా కార్యక్రమానికి టీడీపీ నేతలు బలవంతంగా జన సమీకరణ చేసినా భువనేశ్వరి మాట్లాడే సమయానికి చాలామంది మహిళలు లేచి వెళ్లిపోయారు. వారిని తెలుగు మహిళా నేతలు 'వెళ్లిపోవద్దు.. మీకు దండం పెడతాం' అంటూ వేడుకోవడం కనిపించింది. అలాగే తెలుగు మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు అనిత తన ప్రసంగంలో కాబోయే ముఖ్యమంత్రి నారా లోకేశ్ అంటూ పేర్కొనడంతో భువనేశ్వరితో పాటు వేదికపై ఉన్న నేతలు అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆమె ప్రసంగం పూర్తయ్యాక కొందరు ఆమెతో వేదికపైనే కోపంగా మాట్లాడడం కనిపించింది.

'సాక్షి'పై టీడీపీ నేతల చిందులు..

కాగా భువనేశ్వరి కార్యక్రమానికి కవరేజ్ కోసం వెళ్లిన 'సాక్షి' మీడియాను టీడీపీ నాయకులు వెళ్లిపోవాలంటూ రుబాబు చేశారు. సాక్షికి ఇది సంబంధం లేని కార్యక్రమమని.. ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని హెచ్చరించారు. పలువురు పాత్రికేయులు టీడీపీ నేతల వ్యవహార శైలిపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

నిజం గెలిచేదెలా భువనేశ్వరీ?

అనారోగ్యంతో మరణిస్తే చంద్రబాబు అరెస్టు తట్టుకోలేకే అని ప్రచారమా?

చంద్రగిరి (తిరుపతి జిల్లా)/సాక్షి, తిరుపతి: అబద్ధాలను పదేపదే చెప్పి వాటినే నిజమని ప్రజలను నమ్మించడంలో చంద్రబాబుకు మించిన వారు లేరనేది అందరికీ తెలిసిందే. ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో జైలు జీవితం గడుపుతున్నారు. ఇప్పుడు ఆయన సతీమణి భువనేశ్వరి సైతం చంద్రబాబు అబద్ధాల బాటలోనే పయనిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక ఒక్కరు కూడా మృతి చెందకపోయినా రాష్ట్రవ్యాప్తంగా 150 మందికి పైగా మరణించారని.. వారి కుటుంబాలను తాను పరామర్శిస్తానని భువనేశ్వరి బుధవారం నుంచి పరామర్శ యాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా చంద్రగిరిలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ఆవులపల్లి ప్రవీణ్ రెడ్డి(33) కుటుంబాన్ని ఆమె పరామర్శించారు.

ఇంత నిస్సిగ్గుగా అబద్ధపు ప్రచారమా..

చంద్రగిరి పాతపేటకు చెందిన ప్రవీణ్ రెడ్డి రెండు నెలల క్రితం టీడీపీలో చేరాడు. అంతకముందు నాలుగేళ్లుగా వైఎస్సార్‌సీపీకి పనిచేశాడు. ఈ క్రమంలో పది రోజుల క్రితం ఉదయం ఇంట్లో గుండెపోటు రావడంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ప్రవీణ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అయితే టీడీపీ నేతలు అతడి మృతిని బాబు ఖాతాలో వేసేశారు. వాస్తవానికి ప్రవీణ్ రెడ్డికి గతంలోనూ గుండెపోటు వచ్చిందని.. అప్పటి నుంచి అతడు తరచూ చికిత్స తీసుకుంటున్నాడని స్థానికులు చెబుతున్నారు. ఇలాగే పాకాల మండలం నేంద్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బ నాయుడు(70) కుటుంబాన్ని కూడా భువనేశ్వరి పరామర్శించారు. గత నెల 25న చిన్నబ్బ నాయుడు వృద్ధాప్య సమస్యలతో మృతి చెందాడు. అయితే చంద్రబాబుని అరెస్టు చేసినందుకు మనస్తాపంతో మృతి చెందినట్లు టీడీపీ నేతలు ప్రచారానికి దిగారు. దీనిపైనా స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.



ప్రవీణ్‌రెడ్డి కుటుంబీకుల పేరుతో నారా భువనేశ్వరి పంపిణీ చేసిన చెక్కుపై సెప్టెంబర్ 4 అని ఉన్న దృశ్యం

మరణిస్తారని ముందే తెలుసా?

భువనేశ్వరి బుధవారం మృతుల కుటుంబాలకు పంపిణీ చేసిన చెక్కులు గందరగోళానికి గురిచేస్తున్నాయి. చంద్రబాబు జైలుకు వెళ్లక ముందు సంతకం చేసిన చెక్కులను మృతుని కుటుంబాలకు పంపిణీ చేశారు. భువనేశ్వరి తన పరామర్శ యాత్రలో ప్రవీణ్ రెడ్డి, చిన్నబ్బ నాయుడు కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందించారు. అక్టోబర్‌లో మరణిస్తే.. సెప్టెంబర్‌లోనే సంతకం చేసినట్లు ఉంది. చంద్రబాబు సెప్టెంబర్ 9న అరెస్ట్ కాగా, ఆ చెక్‌లు చంద్రబాబు జైలుకు వెళ్లక ముందు సెప్టెంబర్ 4న సంతకం చేసినవి.



గుంపులో నిలబడటం సులభం.
ఒంటరిగా నిలబడటానికి ధైర్యం అవసరం.
– మహాత్మా గాంధీ

సాక్షి
గురువారం, 26 అక్టోబర్ 2023

గణాంకాలు చెప్పే నిజాలు!

సరైన ప్రాతిపదికలు ఎంచుకుని, శాస్త్రీయ విధానంలో నమూనాలు రూపొందించుకుని వాటి ఆధారంగా సర్వే చేయాలేగానీ గణాంకాలెప్పుడూ అబద్ధం చెప్పవు. అలాగే అవి అన్నిసార్లూ పాలకులను రంజింపజేయలేవు. అప్పుడప్పుడు మిశ్రమ ఫలితాలు కూడా తప్పకపోవచ్చు. వెల్లడైన అంశాల్లోని వాస్తవాలను గుర్తించి వాటిని సరిచేసేందుకు అవసరమైన విధానాలను రూపొందించగలిగితే స్థితిగతులు మెరుగుపడతాయి. మనను చిన్నబుచ్చటానికే, ప్రతిష్ఠ దెబ్బతీసేందుకే ఇలాంటి గణాంకాలు అందిస్తున్నారని కొట్టిపారేస్తే అందువల్ల ప్రయోజనం ఉండదు. తాజాగా 2023కి సంబంధించిన అంచనాలతో ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) విడుదల చేసిన నివేదిక వెలువరించిన గణాంకాలు మనకు ఏక కాలంలో అటు సంతోషాన్నీ, ఇటు నిరాశనూ కూడా కలిగిస్తుండగా... ప్రపంచ బ్యాంకు నివేదిక ఓ విధంగా భయపెడుతోంది. ఓఈసీడీ నివేదిక ప్రకారం సంపన్న రాజ్యాలకు అంతక్రితం కన్నా 2021, 2022 సంవత్సరాల్లో వలసలు బాగా పెరిగాయి. ఇందుకు ఉక్రెయిన్ యుద్ధం చాలావరకూ దోహదపడి వుండొచ్చు. ఆ దేశం నుంచి పెద్ద సంఖ్యలో శరణార్థులు యూరోప్ దేశాలకు వలసపోయారు. అలాగే 2020లో ప్రతి దేశమూ సరిహద్దులు మూసి వేయటంతో వలసలు దాదాపుగా నిలిచిపోయాయి గనుక దాంతో పోలిస్తే వలసలు పెరిగి వుండొచ్చు. అయితే స్థూలంగా చూస్తే వలసలు పెరిగాయి. అదే సమయంలో ఆ వలసల్లో మహిళల శాతం కూడా పెరిగింది. నిరుడు మన దేశంనుంచే వలసలు అధికంగా వున్నాయని నివేదిక సారాంశం. ఉన్నత విద్యకోసం వెళ్లేవారిని మినహాయించి కేవలం ఉపాధి కోసం వెళ్తున్నవారినే లెక్కేస్తే భారత్ నుంచి ఈసారి ఎక్కువమంది ఉద్యోగార్థులు వెళ్లారని ఆ నివేదిక వివరిస్తోంది.

ఓఈసీడీలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు సహా 38 సంపన్న దేశాలకు సభ్యత్వం వుంది. ఈ దేశాలకు 2021–22 మధ్య పదిలక్షల మంది వివిధ దేశాల నుంచి వలస రాగా అందులో 4.07 లక్షల మంది మన పౌరులు. ఉన్నత విద్య కోసం వెళ్లేవారిలో భారత్ రెండో స్థానంలో వుంది. మన దేశం నుంచి ఈ కేటగిరీలో 4.24 లక్షలమంది వుండగా, చైనా 8.85 లక్షలతో అగ్రభాగాన వుంది. అటు ఉపాధి కోసమైనా, ఇటు విద్యార్జన కోసమైనా అత్యధికులు ఎంచుకుంటున్నది అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా దేశాలేనని నివేదిక వెల్లడిస్తోంది. ఈ వలసల గణాంకాలు గమనిస్తే అంతర్జాతీయంగా వుండే తీవ్ర పోటీని తట్టుకుని మన దేశం నుంచి ఎక్కువమంది ఉపాధి అవకాశాలను గెల్చుకుంటున్నారని తెలుస్తుంది. విదేశాలకు వెళ్లినవారు తమ కుటుంబాలకు పంపే నగదు నిరుడు బాగా పెరిగింది. ఆ ఏడాది 11,100 కోట్ల డాలర్లు భారత్‌కు విదేశాల నుంచి వచ్చిందని అంచనా. ఇది దేశ జీడీపీలో 3.3 శాతం. అంతేకాదు... ప్రపంచ దేశాలన్నిటిలో చాలా అధికం. ఈ నగదులో 36 శాతం అమెరికా, బ్రిటన్, సింగపూర్‌ల నుంచి వచ్చిందేనని గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టే భారత్‌కూ, అభివృద్ధి చెందిన దేశాలకూ సంబంధ బాంధవ్యాలు ఎంత పెరిగాయో తెలుస్తున్నది. అటు విద్యారంగాన్ని గమనిస్తే ఉన్నత చదువుల కోసం పిల్లలను విదేశాలకు పంపే తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతున్నదని అర్థమవుతుంది. ఈ విషయంలో లింగ వివక్ష కూడా తగ్గిందని ఓఈసీడీ నివేదిక వివరిస్తోంది. విదేశాల్లో చదువుకొనేందుకు వెళ్లేవారు అంతక్రితంతో పోలిస్తే రెట్టింపు పెరిగారని గణాంకాలు చెబుతున్నాయి. అంతర్జాతీయంగా ఉపాధి కోసమైనా, విద్య కోసమైనా వెళ్లేవారు పెరగటం మనవాళ్ల సత్తాను చాటుతోంది. ఎందుకంటే ప్రత్యేక నైపుణ్యాలుంటే తప్ప ఇదంతా సాధ్యం కాదు. అయితే ఇదే సమయంలో మన దేశంలో అటువంటి నిపుణులకు తగిన అవకాశాలు లేవన్న చేదు వాస్తవం వెల్లడవుతోంది. తగిన ఉపాధి, మంచి వేతనాలు లభించినప్పుడు వాటిని వదులుకుని ఎవరూ అయినవారికి దూరంగా పరాయి దేశాలకు వలస వెళ్లాలనుకోరు. వెళ్తున్నారంటే అలాంటివారికి తగిన ఉపాధి అవకాశాలు చూపలేకపోతున్నామని, మెరుగైన వేతనాలు ఇవ్వలేకపోతున్నామని అర్థం. ఆ నైపుణ్యాలను మన దేశాభివృద్ధికి వినియోగించలేకపోతున్నామని, తగిన శ్రద్ధ పెట్టడంలేదని గుర్తించాలి. ఈ సందర్భంలో ఈమధ్యే అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) ఇచ్చిన గణాంకాల ఆధారంగా రూపొందిన ప్రపంచ బ్యాంకు నివేదికను కూడా ప్రస్తావించుకోవాలి. నిరుడు మన ఇరుగుపొరుగు దేశాలతో పోలిస్తే భారత్‌లో నిరుద్యోగిత అధికంగా వున్నదని ఆ నివేదిక తెలిపింది. మన దేశ యువతలో నిరుద్యోగిత 23.22 శాతం వుంటే, పాకిస్తాన్ (11.3 శాతం), బంగ్లాదేశ్ (12.9 శాతం), ఆఖరికి భూటాన్ (14.4 శాతం)లతో మనకంటే దూరంగా వున్నాయి. ఇది ఆందోళన కలిగించే అంశం.

విదేశాలకెళ్లేవారు పెరగటం గర్వపడాల్సిన విషయమేననటంలో సందేహం లేదు. ఉన్నత విద్యారంగంలో చూస్తే మన దేశంలో చాలా స్వల్ప సంఖ్యలో ఉన్నత శ్రేణి విద్యాసంస్థలున్నాయి. అవి కూడా వివిధ అంశాల్లో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా నిలబడలేకపోతున్నాయి. బోధనారంగ నిపుణులు కూడా అంతే. వారికి ఉన్నత విద్యాసంస్థల్లో అవకాశాలు లభించి తగిన వేతనాలు లభిస్తే ఇక్కడే ఉంటారు. అందువల్ల మన పిల్లల స్థితిగతులు మరింత మెరుగుపడతాయి. విదేశాల్లో విశ్వవిద్యాలయాలు ఇక్కడివారిని ఆకర్షించి భారీ మొత్తంలో వేతనాలిస్తుంటే మన సంస్థలు ఆ స్థాయిని అందుకోలేకపోతున్నాయి. ఉపాధి విషయంలోనూ అంతే. తయారీ రంగ పరిశ్రమలను పెంచగలిగితే, చిన్నతరహా పరిశ్రమల స్థాపనకు మరింత మెరుగ్గా చేయూతనందించగలిగితే వలసపోయేవారి మేధస్సు పూర్తిగా ఇక్కడే వినియోగపడుతుంది. ఇక్కడ ఉపాధి అవకాశాలు మరింత విస్తృతమై జీవనప్రమాణాలు పెరగటానికి దోహదపడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.8.32 వరకు, తదుపరి త్రయోదశి తె.5.47 వరకు (తెల్లవారితే శుక్రవారం), **నక్షత్రం:** పూర్వాభాద్ర ఉ.10.47 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర.**వర్జ్యం:** రా.7.47 నుండి 9.16 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.50 నుండి 10.35 వరకు, తదుపరి ప.2.25 నుండి 3.11 వరకు, **అమృత ఘడియలు:** తె.4.46 నుండి 6.16 వరకు.

సూర్యోదయం : 6.00
సూర్యాస్తమయం: 5.30
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సమితి సంస్కరణకు వేళయింది!

సందర్భం



అశోక్ ముఖర్జీ

అక్టోబర్ 24 ఐక్యరాజ్యసమితి దినోత్సవంగా గుర్తింపు పొందింది. 'యుఎస్ చార్టర్'గా ప్రసిద్ధి చెందిన ఒడంబడిక 1945లో అమల్లోకి రావడాన్ని ఇది సూచిస్తోంది. ఐరాస చార్టర్ పీఠికలో ఉన్న ప్రాథమిక లక్ష్యాలు ఏమిటంటే, 'తరువాతి తరాలను యుద్ధ శాపం నుండి రక్షించడం', 'మానవుల ప్రాథమిక హక్కులపై విశ్వాసాన్ని పునరుద్ఘాటించడం', 'సామాజిక పురోగతినీ, విస్తృతమైన స్వేచ్ఛలో మెరుగైన జీవన ప్రమాణాలనూ ప్రోత్సహించడం'. అయితే నేడు ఈ లక్ష్యాలు.. పెరుగుతున్న ఐక్యరాజ్యసమితి అసమర్థత కారణంగా ప్రమాదంలో పడినట్లు కనిపిస్తోంది. కనుక ఐక్యరాజ్యసమితిని సంస్కరించడం కోసం ఐరాస చార్టర్ నిబంధనలను సమీక్షించడానికి సమయం వచ్చేసినట్లే అనుకోవాలి.

ఐక్యరాజ్యసమితి ప్రధానంగా శాంతి భద్రతలు; సామాజిక, ఆర్థిక అభివృద్ధి, మానవ హక్కులు అనే మూడు విస్తృత మూలాలపై ఆధారపడి ఉంటోంది. ప్రారంభం నుండి శాంతి భద్రతల విషయంలో ఐరాస తన నిరాశాజనకమైన పాత్ర కారణంగానే తనపై ప్రజల అవగాహనను బలంగా ప్రభావితం చేస్తూ వస్తోంది. ఇది ఐరాస సభ్య దేశాలను సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధనలో దాని తోడ్పాటు నుండి, ప్రాథమిక మానవ హక్కులు, స్వేచ్ఛల పరిరక్షణ విషయంలో అది సాధించిన ముఖ్యమైన విజయాల నుండి దృష్టిని మరల్చింది.

అంతర్జాతీయ శాంతిభద్రతలను నిర్వహించడం అనే 'ప్రాథమిక బాధ్యత'ను ఐరాస భద్రతా మండలికి చార్టర్‌లోని ఆర్టికల్ 24 అప్పగించింది. ఆర్టికల్ 25 ప్రకారం యూఎన్ఎస్‌సీ నిర్ణయాలకు ఐరాసలోని అన్ని సభ్య దేశాలూ కట్టుబడి ఉంటాయి. ఆర్టికల్ 27.3 ప్రకారం ఈ నిర్ణయాలకు ఆర్టికల్ 23 ప్రకారం ఐదుగురు శాశ్వత సభ్యులు... చైనా, ఫ్రాన్స్, రష్యా, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ 'సమ్మతి ఓట్లు' అవసరం. లేకుంటే వీటో అవుతోంది.

నిజానికి ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో భాగంగా వీటో అనేది లేదు. చర్చలు జరపడానికి, చార్టర్‌ను స్వీకరించడానికి శాన్‌ఫ్రాన్సిస్కో సదస్సులో పాల్గొనడానికి దేశాలను ఆహ్వానిస్తున్నప్పుడు పి5 దేశాల తరపున అమెరికా ముందస్తు షరతుగా దీనిని ఒప్పందంలో చేర్చడం జరిగింది. భారతదేశం తరపున చార్టర్‌పై సంతకం చేసిన భారత ప్రతినిధి బృందం నాయకుడు సర్ ఎ. రామస్వామి ముదలియార్ వీటోను తాత్కాలిక 'రక్షణ' యంత్రాంగంగా చేర్చడానికి 'అనిష్ట పూర్వకంగానే' అంగీకరించినట్లు రికార్డుల్లో ఉంది, దానికి ప్రతిఫలంగా చార్టర్ అమలులోకి వచ్చిన 10 సంవత్సరాల తర్వాత, అంటే 1955 నాటికి అన్ని నిబంధనల సమీక్ష జరగాల్సి ఉంటుంది (ఆర్టికల్ 109).

ప్రచ్ఛన్నయుద్ధం తర్వాత ఐరాస శాంతి భద్రతల స్తంభం కిందికి కుంగిపోయినట్లు 2005 సెప్టెంబరులో ఐరాస 60వ వార్షికోత్సవ శిఖరాగ్ర సమావేశంలో ప్రపంచ నాయకులు స్పష్టంగా గుర్తించారు. 'భద్రతాసమితిని మరింత విస్తృత స్థాయి ప్రతినిధిగా, సమర్థవంతంగా, పారదర్శకంగా మలచడానికి, దాని ప్రభావాన్ని, దాని నిర్ణయాల చట్టబద్ధతను, అమలును మరింతగా మెరుగుపరచడం కోసం భద్రతా సమితిలో ముందస్తు సంస్కరణలకు పిలుపునిస్తూ ఆ నాయకులు చేసిన ప్రకటనను జనరల్ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది, అయితే పద్దెనిమిది సంవత్సరాల తరువాత కూడా, ఈ ఆమోదం నెరవేరలేదు, ప్రధానంగా భద్రతా సమితిలో సంస్కరణకు అయిదు శాశ్వత సభ్య దేశాల వ్యతిరేకతే దీనికి కారణం (ఏకగ్రీవ ప్రకటనలో పి5 భాగమే అయినప్పటికీ).

భద్రతామండలి సంస్కరణలను వ్యతిరేకించడం ద్వారా 5 శాశ్వత సభ్యదేశాలు మండలి అసమర్థతను మరింత తీవ్రతరం



చరిత్రాత్మక సందర్భం : భారత్ తరఫున యు.ఎన్.చార్టర్‌పై సంతకం చేస్తున్న సర్ ఎ. రామస్వామి ముదలియార్ (1945)

చేస్తూనే ఉన్నాయి. ఉదాహరణకు ఉక్రెయిన్‌లో రాజకీయ పరిష్కారం కోసం (భద్రతాసమితి 2202వ తీర్మానం, 2015 ఫిబ్రవరి 17), అఫ్గానిస్తాన్‌లో రాజకీయ పరిష్కారం కోసం (భద్రతా సమితి 2513వ తీర్మానం, 2020 మార్చి 10) ఏకగ్రీవ తీర్మానాలను ఆమోదించినప్పటికీ, వాటిని అమలు చేయకపోవడం పట్ల భద్రతా మండలి ఇప్పటివరకు బాధ్యత వహించలేదు. దీనివల్ల లక్షలాది మంది ప్రజలు ప్రతికూల ప్రభావాలకు గురవుతున్నారు.

ప్రస్తుతం భద్రతా మండలి అజెండాలో ఉన్న ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా, ఐరోపాలలో 50కి పైగా సంఘర్షణలను పరిష్కరించడంలో 5 శాశ్వత సభ్యదేశాలు నిస్సహాయంగా ఉంటున్నాయి. దౌత్యపరమైన చర్చల కోసం వాతావరణాన్ని సృష్టించేందుకు 6.3 బిలియన్ డాలర్ల వార్షిక వ్యయంతో 85,500 మంది ఐరాస శాంతి పరిరక్షకులను భద్రతామండలి మోహరించిన 12 సంఘర్షణలు కూడా వీటిలో ఉన్నాయి. ఈ సంఘర్షణల ద్వారా ప్రత్యక్షంగా ప్రభావితమైన వ్యక్తుల సంఖ్య 2015లో 60 మిలియన్ల నుండి 2022 నాటికి 314 మిలియన్లకు పెరిగింది.

ఒకవైపు తన అసమర్థత పెరుగుతున్నప్పటికీ... తీవ్రవాదం, డిజిటల్ సమస్యలు, వాతావరణ మార్పుల వంటి ప్రపంచ సవాళ్లను కూడా తన పరిధిలోకి తీసుకురావడానికి భద్రతామండలి ప్రయత్నించింది. భద్రతామండలి నైపుణ్యం, వనరుల కొరత అనేది నాటో వంటి ఐరాసయేతర కూటములు ఐరాస సర్వసభ్య సమావేశం ఆమోదం లేకుండా ఏకపక్షంగా వ్యవహరించడానికి తలుపులు తెరిచింది. ఈ ధోరణి ఐరాస చార్టర్‌కి చెందిన సమర్థవంతమైన పనితీరును విచ్ఛిన్నం చేస్తోంది.

1945 జూన్ 26న శాన్ ఫ్రాన్సిస్కోలో ఐక్యరాజ్యసమితి ఒప్పందంపై సంతకం చేసిన 50 మంది సభ్యులలో ఒకరిగా భారతదేశ లక్ష్యం ఏమిటంటే ఐరాసను సంస్కరించడమే కానీ దాని స్థానాన్ని భర్తీ చేయడం కాదు. భారతదేశ సమగ్ర విధానం శాంతి భద్రతలు, అభివృద్ధి మధ్య అంగీకృత పరస్పర సంబంధంపై నిర్మితమైంది, ఇది బహు పాక్షికతలోకి 'మానవ–కేంద్రీకృత' దృక్పథాన్ని తీసుకువస్తుంది. భద్ర తాసమితి కోసం, యూఎన్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ (ఈసీఏఎస్ఓసీ) కోసం మొదటి చార్టర్ సంస్కరణలను సర్వసభ్య సమావేశం విజయవంతంగా ఆమోదించిన 1963 నాటి నుండి, ఐక్యరాజ్యసమితిలో భారతదేశ ట్రాక్ రికార్డ్ అటువంటి సంస్కరణవాద పాత్రను పోషించడానికి తన విశ్వసనీయతను కలిగి ఉంది.

ఈ రోజు ఐరాస ప్రధాన ఎజెండా ఏమిటంటే దాని 17 నిలకడైన అభివృద్ధి లక్ష్యాలతో కూడిన సస్టెయినబుల్ డెవలప్‌మెంట్‌పై 2030 ఎజెండా. 2015 సెప్టెంబరులో యూఎన్ జనరల్ అసెంబ్లీ ద్వారా ఏకగ్రీవంగా ఆమోదం పొందిన ఈ విశ్వవ్యాప్త ఫ్రేమ్‌వర్క్.. అభివృద్ధితో పాటు శాంతి భద్రతలను పెంపొందిస్తుంది. అభివృద్ధి చెందుతున్న దేశాలు (ఎస్‌డీజీ గోల్ నెం. 16.8) బహుపాక్షిక నిర్ణయాధికారంలో, ముఖ్యంగా భద్రతా మండలిలో మెరుగైన, సమాన భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తాయి. ఎజెండా 2030 అనేది ఎస్‌డీజీలను అమలు చేయడానికీ, భాగస్వామ్యాల (ఎస్‌డీజీ 17) ద్వారా బహుపాక్షిక ఆర్థిక ప్రవాహాలనూ, తగిన సాంకేతిక పరిజ్ఞానాన్నీ బదిలీ చేయడానికి కట్టుబడి ఉంది. అసమానతలను తగ్గించడానికి (ఎస్‌డీజీ 10) నిబద్ధత వహిస్తూనే, ఇది పేదరికాన్ని నిర్మూలించడం (ఎస్‌డీజీ 1), ఆహార భద్రత (ఎస్‌డీజీ 2), ఆరోగ్యం (ఎస్‌డీజీ 3), విద్య (ఎస్‌డీజీ 4), లింగ సమానత్వం (ఎస్‌డీజీ 5) వంటి ప్రధాన మానవ హక్కులను సమర్థిస్తుంది. సంస్కరించబడిన ఐక్యరాజ్యసమితి ఈ కట్టుబాట్లను దాని చార్టర్ నిబంధనలలో ఏకీకృతం చేయాలి.

ఐరాస చార్టర్‌కు ఈ సవరణలు ఎలా చేయవచ్చు? చార్టర్ ఆర్టికల్ 109 జనరల్ కాన్ఫరెన్స్ ద్వారా చేయొచ్చు. అటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి ఐరాస జనరల్ అసెంబ్లీలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఓట్లు, భద్రతామండలిలో 9 నిశ్చయాత్మక ఓట్లు (పీ5కి ఎటువంటి వీటో అధికారం లేకుండా) అవసరం.

2024 సెప్టెంబరులో జరిగే ఐరాస 'సమ్మిట్ ఆఫ్ ది ఫ్యూచర్'లో పాల్గొనడానికి భారతదేశం సిద్ధమవుతున్నందున, ఈ ఫ్రేమ్‌వర్క్‌ను దృష్టిలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో ఐరాస సెక్రటరీ జనరల్‌కి చెందిన ఉన్నత స్థాయి సలహా మండలి సిఫార్సు చేసిన విధంగా, 21వ శతాబ్దానికి సంస్థను 'ప్రయోజనం కోసం సరిపోయేలా' చేయడానికి ఐరాస సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సదస్సు సిఫార్సు చేయాలి. 2025లో జరిగే ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవం ఈ సదస్సును నిర్వహించడానికి తగిన సందర్భం.

వ్యాసకర్త ఐరాసలో భారత్ మాజీ శాశ్వత సభ్యులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఆ గుణాలేవీ?!



రాముణ్ణి మీరు మీ రాజకీయ లబ్ధి కోసం ఎన్నిసార్లు ఉపయోగించుకుంటారు? రాముడిలోని శౌర్యం, ధీరత్వం, విధేయత, కరుణ, ప్రేమ, సచ్ఛీలత.. వీటిల్లో ఏ ఒక్క గుణం కూడా మీ పాలనలో ఎందుకు లేకపోయింది? (బీజేపీని ఉద్దేశించి)

– కపిల్ సిబల్, ఎంపీ

సంకెళ్లు లేని చట్టం



ఆర్థిక నేరస్థులు అనేవారు హంతకులు గానీ, రేపిస్టులు గానీ కాదు కనుక వారిని అరెస్టు చేసినప్పుడు చేతికి సంకెళ్లు వేయకూడదని ఇప్పటికే చెబుతూ వస్తున్న పార్లమెంటరీ కమిటీ... భారతీయ శిక్షాస్మృతి స్థానంలో ప్రవేశపెట్టనున్న ప్రతిపాదిత 'భారతీయ నాగరిక సురక్ష సంహిత బిల్లు'లో 15 రోజుల పోలీసు కస్టడీ అధికారాలను స్పష్టంగా నిర్వచించమని కూడా కోరింది. – నీరజ్ చౌహాన్, సీనియర్ జర్నలిస్ట్

అందరూ బిలియనీర్‌లే!



'దివాళా' తీసిన కంపెనీలను అమ్మేస్తున్న వాళ్లంతా బిలియనీర్‌లు. వాళ్లు అడిగినంతా ఇచ్చేస్తూ ఆ కంపెనీలను కొంటున్న వాళ్లంతా మళ్లీ బిలియనీర్‌లు. వాళ్లకు, వీళ్లకు సహాయపడుతున్న రాజకీయ నాయకులు, అధికారులు ఆధారపడుతున్నది ఎవరి మీదో తెలుసా? బిలియన్‌ల సంఖ్యలో ఉన్న పేద భారతీయుల మీద! – రాజేంద్ర కుంభట్, పొలిటికల్ ఎనలిస్ట్

'ఇండియా' మారుతోంది



పాఠ్యాంశాల సవరణ కోసం ఎన్.సి.ఇ.ఆర్.టి. కమిటీ పాఠ్య పుస్తకాలలో ఇండియా అనే పేరును 'భారత్' గా మార్చాలని, పురాతన చరిత్రకు బదులుగా ఆధునిక చరిత్రను సిలబస్‌లో ప్రవేశపెట్టాలని సిఫారసు చేసింది. అలాగే పాఠ్య పుస్తకాలలో హిందూ విజయాలకు ప్రాముఖ్యం ఇవ్వాలని సూచించింది. – ఫరీహా ఇఫ్తికార్, విద్యారంగ విశ్లేషకురాలు

చేయి దాటుతోంది!



మధ్యప్రాచ్యంలో పరిస్థితి గంట గంటకూ భయానకంగా మారుతోంది. ఇలాంటి కీలక సమయంలో పౌర హక్కుల్ని గౌరవించడం, పౌరులను రక్షించడం అనే ప్రాథమిక బాధ్యతపై స్పష్టంగా ఉండాలి. అలాగే పాలస్తీనా ప్రజల మనోవేదనలు హమాస్ దాడులకు సమర్థనీయతను కల్పించలేవనీ గుర్తించాలి.

– ఆంటోనియో గుటెర్రస్, ఐరాస ప్రధాన కార్యదర్శి

సైనిక నిబద్ధత



యుద్ధం అక్టోబర్ 7న ప్రారంభం కాలేదు. ఇది 76 సంవత్సరాల క్రితమే మొదలైంది. పౌరులను చంపడం ఇస్లాం సూత్రాలకు విరుద్ధం. ముస్లిం సైనికులు గత వెయ్యేళ్లలోనూ మహిళలకు, పిల్లలకు, ఆఖరికి చెట్లకు కూడా హాని చేయలేదు. మరొక సంగతి కూడా! పాలస్తీనా తల్లులు తమ పిల్లలను ఇతర దేశాల్లోని తల్లుల్లాగే ప్రేమిస్తారని నేను ప్రపంచానికి గుర్తు చేయాలనుకుంటున్నాను.

– జోర్డాన్ రాణి రానియా ('సీఎన్ఎన్' ఇంటర్వ్యూ)

వీడియో కలకలం



మోదీ స్వయంగా ఎంపిక చేసిన జమ్మూకశ్మీర్ మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ సత్య పాల్ మాలిక్ ఇటీవల రాహుల్ గాంధీని ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. 'మీకు పదవి అధికారాలపై దురాశలు లేవు' అని రాహుల్‌ను కీర్తించారు. రాహుల్ తాజాగా విడుదల చేసిన ఆ వీడియోలో మోదీకి కలవరం కలిగించే రహస్యోద్ఘాటనలు కూడా ఉన్నాయి!

– శంతను, గాంధేయవాది

ఇన్ బాక్స్

అరుణాచల్‌కు తలమానికం

గత 13 ఏళ్లుగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'టాటా లిటరేచర్ లైవ్' ఈనెల 25 నుంచి తన 14వ సంచికను నిర్వహిస్తున్నది. అందులో ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన గొప్ప కవి, రచయిత్రి మమాంగ్ దయిాని ఈ యేటి ఆస్థాన కవిగా ఎంపిక చేసి గౌరవిస్తున్నారు.



మమాంగ్ దయిాని

అరుణాచల్ ప్రదేశ్‌లో లిపి లేని భాషలే అధికంగా ఉండడంతో మొదటి నుంచీ అస్సామీ భాషను విద్యాలయాల్లో నేర్పారు. ఆ తరువాత ఇంగ్లీష్, హిందీలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా ఇంగ్లీష్ అభ్యసనం ప్రపంచ సాహిత్యంతో అక్కడివారికి పరిచయం ఏర్పరచింది. ఆ ప్రభావంతో అనేకమంది ఇంగ్లీష్‌లో రచనలు చేయడం ప్రారంభించారు. అలా రాసిన మొదటి తరానికి చెందినవారు మమాంగ్ దయి. ఆమె కవిత్వం, కథలూ, నవలలూ రాశారు. ప్రస్తుతం అరుణాచల్ ప్రదేశ్‌లోని ఇటానగర్‌లో నివసిస్తున్నారు. ఇప్పటికే ఆమె పలు కవితా సంకలనాలు వెలువరించారు. ఆమె 'నది కవితలు' చాలా ప్రసిద్ధి. ఆమె తర్వాతి రచన 'మిడ్ సమ్మర్–సర్వైవల్ లిరిక్స్'. 'ద లెజెండ్స్ ఆఫ్ పెన్సం' నవలతో పాటు పలు నాన్ ఫిక్షన్ రచనలూ చేశారు. ఆమె 'ఆది' భాషలోనూ, ఆంగ్లంలోనూ రాస్తున్నారు.

1957లో 'ఆది' తెగలో జన్మించారు. మొదట ఐఏఎస్‌కు ఎంపికయ్యారు కానీ జర్నలిస్టుగానూ, రచయిత్రిగానూ ఉండడానికి ఇష్టపడి ఐఏఎస్‌ను వదిలేశారు. దయి 'ది టెలిగ్రాఫ్', 'ది హిందుస్థాన్ టైమ్స్', 'ది సెంటినెల్'తో సహా వివిధ వార్తాపత్రికలకు కరస్పాండెంట్‌గా ఉన్నారు. టెలివిజన్, రేడియోలకు కూడా విరివిగా రాశారు. రెండు నవలలతో పాటు, యువ పాఠకుల కోసం ఆమె వచన కవితలు, కథలు రాశారు. ఆమె నాన్–ఫిక్షన్ రచన 'అరుణాచల్ ప్రదేశ్: ది హిడెన్ ల్యాండ్'కు గాను 2003లో 'స్టేట్ వెరీర్ ఎల్విన్' అవార్డును అందుకున్నారు. ఆమె ప్రస్తుతం 'అరుణాచల్ ప్రదేశ్ లిటరరీ సొసైటీ' జనరల్ సెక్రటరీగా, 'నార్త్ ఈస్ట్ రైటర్స్ ఫోరమ్' సభ్యురాలుగానూ ఉన్నారు.

మమాంగ్ దయి తన మూలాల్నీ, తాను నివసించిన ప్రాంతాన్నీ తన రచనల్లో ప్రతిబింబింపజేశారు. ఆమె సాహిత్యంలోని ప్రకృతి రహస్యమైనది, పురాణాలతో పచ్చగా ఉంటుంది, పవిత్రమైన జ్ఞాపకశక్తితో దట్టంగా ఉంటుంది. 'నదికి ఆత్మ ఉంది'అంటారామె.

ఆమె కవిత్వం చాలా సరళంగా ఉంటుంది. కవిత్వం ఒక క్షణపు సత్యానికి సంబంధించిందనీ, అది ఒక 'అనుభూతి' అనీ అంటారామె. దీని అర్థం మొత్తం జీవితానికి ప్రతిస్పందించడమే. అంతేకాదు మనిషి స్థితిని పదాలలోకి మార్చడం కవిత్వం. అది మానవ హృదయ భాష అంటారు మమాంగ్ దయి.

– వారాల ఆనంద్, రచయిత – విమర్శకులు

భూతల స్వర్గం... అలా విలీనమైంది!

సందర్భం



జిల్లా గోవర్ధన్

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ భారత్‌లో ఆరని మంటల్ని రగుల్చుతోంది 'కశ్మీర్' సమస్య. కశ్మీర్‌ను తనలో కలిపివేసుకోవాలన్న పాక్ కలలు కల్లలు చేస్తూ భారత్ స్పందించిన తీరుతో ధర్మబద్ధంగా కశ్మీర్ మన దేశంలో విలీనమైంది.

అది 1947 జులై 25. ఢిల్లీలో 'ఛాంబర్ ఆఫ్ ప్రిన్సెస్' మీటింగ్‌లో బ్రిటిష్ రాయల్ నేవీ అడ్మిరల్, వైస్రాయ్ లార్డ్ లూయిస్ (డిక్కీ) మౌంట్ బాటెన్ స్వదేశీ సంస్థానాలను భారత దేశ సమైక్యత దృష్ట్యా 'విలీన ఒప్పంద పత్రం'పై సంతకం చేయవలసిందిగా కోరారు. కొత్తగా ఏర్పాటైన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్స్'కు అధిపతిగా ఉన్న వల్లభాయ్ పటేల్ కూడా పరిస్థితిని వివరించారు. చాలా మంది రాజులు తమ తమ సంస్థానాలను భారత్‌లో విలీనం చేయటానికి ఒప్పుకుని ఆ రోజే పత్రాలపై సంతకాలు చేశారు. అయితే ఉత్తరాదిన హిమాలయాలను ఆనుకుని ఉన్న కశ్మీర్ పాలకుడు మహారాజా హరిసింగ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. పటేల్‌తో సింగ్, 'బ్రిటిష్ నిష్క్రమణ తర్వాత, నా కశ్మీర్‌ను 'స్విట్జర్లాండ్ ఆఫ్ ఈస్ట్'గా మార్చాలి. నా దేశం అలిప్తంగానే ఉంటుంది' అంటూ నవ్వారు. అప్పటికి సమావేశం ముగిసింది.

1947 అక్టోబరు 25 అర్ధరాత్రి దాటాక 300 వాహనాలతో ప్యాలెస్‌లోని విలువైన వస్తువులు, నగలు నట్రా తీసుకుని, పర్సనల్ పోలీసు, సైన్యంతో, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని అనూహ్య పరిస్థితిలో మహారాజు తన కుటుంబ సభ్యులతో సహా శ్రీనగర్ విడిచి జమ్మూకు తరలిపోవలసి వచ్చింది.

అసలేం జరిగిందంటే... 1947 ఆగస్టు 15న నాటి భారత ఉపఖండం రెండు దేశాలుగా విడిపోయి స్వాతంత్ర్యం పొందాయి. సంస్థానాలు ఇటు భారత్‌లోనూ, అటు పాకిస్తాన్‌లోనూ విలీనమవుతున్నాయి. స్వతంత్రంగా ఉండాలని అనుకుంటున్న కశ్మీర్ నేపథ్యం గురించి ఇక్కడ కొంత చెప్పుకోవాలి. దీన్ని పాలించే రాజు హిందూ డోగ్రా వంశానికి చెందిన మహారాజా హరిసింగ్. అయితే పాలితుల్లో 90 శాతం మంది ముస్లింలే. కానీ పరిపాలన యంత్రాంగం,



పోలీస్ వ్యవస్థల్లో ఎక్కువ శాతం డోగ్రాలు, బ్రాహ్మణ పండితులే ఉన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ పాకిస్తాన్ ఏర్పడటంతో, కశ్మీర్‌లోని ముస్లిం మతతత్వ శక్తులు హరిసింగ్ అధికారాన్ని కూల్చివేయటానికి పన్నాగం పన్నుతున్నాయి. పశ్చిమ సరిహద్దు ప్రాంతం ముర్రీ, ముజఫరాబాద్ నగరాల్లో ర్యాడికల్ ముఠాలకు పాకిస్తాన్ ప్రభుత్వం అండ లభించింది. ముర్రీ తెహసిల్‌లో భూస్వామి సాహెబ్ ఖూదా ఖయ్యూం స్థానిక గిరిజనులను ఏకం చేసి సెప్టెంబరు నుండే శ్రీనగర్‌ను ముట్టడించటానికి పూనుకున్నాడు. అతనికి పాకిస్తాన్ శస్త్రబలం, సరిపడా కాల్బలం (ఆర్మీ) కూడా లభించింది. దీంతో డోగ్రా పాలనకు విరుద్ధంగా 'జిహాద్' మొదలైంది.

కశ్మీర్ సరిహద్దుల్లో రోజు రోజుకూ మారుతున్న పరిస్థితులు ఎప్పటికప్పుడు ఢిల్లీలోని ఉప ప్రధాని, హోంమంత్రి పటేల్‌కు సమాచారం అందటంతో ముందు జాగ్రత్తగా ఒక ఆర్మీ బెటాలియన్‌ను జమ్ము సరిహద్దులో, మరో దాన్ని లాహోర్ సరిహద్దు వైపు మోహరింపచేశారు. అక్టోబర్ 22న ఒక గిరిజన గ్రూపు పాక్ సైన్యంతో కలిసి కశ్మీర్ భూభాగంలోకి చొరబడింది. శ్రీనగర్ సిటీకి మరో 50 మైళ్ళ దూరంలో జిహాద్ గ్రూప్ డేరా వేసినట్లు, ఇక మహారాజు ప్యాలెస్‌లో ఉంటే ఆయనకు, ఆయన కుటుంబానికి కూడా ప్రాణహాని జరగొచ్చని కశ్మీర్ పోలీస్ వర్గాలు తేల్చేశాయి. దీంతో గత్యంతరం లేక పోవటంతో ఇక భారత ప్రభుత్వాన్ని సైనిక సహాయం కోరారు మహారాజు. ప్రభుత్వం సాయం చేయడానికి ఒప్పుకొంది.

1947 అక్టోబర్ 26న తన పొలిటికల్ సెక్రటరీ వీ.పీ. మీనన్ ద్వారా హరిసింగ్‌తో విలీన ఒప్పంద పత్రంపై సంతకం సేకరించారు పటేల్. కల్నల్ మానెక్ షా, ఢిల్లీ నుండి అదే రాత్రి నాలుగు యుద్ధ విమానాల్లో ఆర్మీ స్టాఫ్‌తో శ్రీనగర్ ఎయిర్ పోర్టు చేరుకున్నారు. భారత్ లష్కర్ ధాటికి ఆక్రమణకు వచ్చిన కొందరు గిరిజన దుండగులు చనిపోగా, మిగిలిన పాక్ సైనికులు, రెబెల్ జిహాదీలు బ్రతుకు జీవుడా అనుకుంటూ పాక్ సరిహద్దు వైపు పారిపోయారు. అక్టోబర్ 27న శ్రీనగర్‌లోని కశ్మీర్ ప్రజాసభ (అసెంబ్లీ) భవనం, మహారాజా ప్యాలెస్‌పై మువ్వన్నెల జెండా ఎగిరింది. కశ్మీర్ లోయ భారత్‌లో విలీనమైంది!

వ్యాసకర్త పీఎఫ్ మాజీ కమిషనర్ । 98190 96949

(రేపు భారత్‌లో కశ్మీర్ సంస్థానం విలీనమైన రోజు)

ధీరుని లక్షణం

అత్యున్నత ఐశ్వర్యం అనుభవించి కాల వశాత్తూ అదంతా కోల్పోయినా ఏ మాత్రం మనసులో శోకించని మనోధీరుడు 'నముచి' అనే దానవుడు. అతని దగ్గరకు ఇంద్రుడు వచ్చి 'సమస్త సంపదలూ కోల్పోయినందుకు కలత పడుతున్నావా?' అని అడిగాడు. దానికి నముచి



సంతాపాద్ భ్రశ్యతే రూపం సంతాపాద్ భ్రశ్యతే శ్రియ
సంతా పాద్ భ్రశ్యతే చాయుః ధర్మశ్చైవ సురేశ్వర

అంటాడు.

'శోకం వల్ల రూపం నశిస్తుంది. సంపదలు నశిస్తాయి. ఆయువు, ధర్మం కూడా నశిస్తాయి. శోక సమయంలో మనతో ఉండి సాయం చేయ గలిగే వాళ్ళు ఉండరు. శోకం వలన శరీరానికి తాపం తప్ప వేరే ప్రయోజనం లేదు. అందు చేత నేను నాకు సంభవించిన ఏ విపత్తుకూ శోకించను' అని దీని భావం. మహాభారత కాలం నాటి ఈ మాటలు ఇప్పటి సమాజానికీ వర్తిస్తాయి. సంక్షుభిత జీవన వలయంలో చిక్కుకున్న వారు నముచి మాటలు స్మరిస్తూ జీవితాన్ని ధైర్యంగా గడపాలి. సమస్యలు కష్టాలు తట్టుకొని నిలబడడం ధీరుని లక్షణం.

– శివలెంక ప్రసాదరావు

లక్ష్మీనృసింహుని సేవలో మానవహక్కుల కమిషన్ చైర్మన్



జస్టిస్ సీతారామమూర్తికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

సఖినేటిపల్లి: డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో బుధవారం ఏపీ మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎం.సీతారామమూర్తి కుటుంబ సమేతంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుడు చింతా వేంకట శాస్త్రి స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ప్రసాదం, స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ అందజేశారు.

'దేవరగట్టు' రక్తసిక్తం



దేవరగట్టు బన్ని ఉత్సవంలో కర్రల సమరం

బన్ని ఉత్సవంలో అపశృతి

- చెట్టు కొమ్మ విరిగి పడి ముగ్గురు మృతి
- కర్రల సమరంలో 84 మందికి గాయాలు
- వైభవంగా మాళ మల్లేశ్వరుని కల్యాణోత్సవం
- ఎప్పటిలా కొనసాగిన ఆచారం

హొళగుంద/ఆలూరు రూరల్ (కర్నూలు): దేవరగట్టు రక్తసిక్తమయ్యింది. ఎప్పటిలానే సంప్రదాయం పైచేయి సాధించింది. కర్రలు కరాళనృత్యం చేయగా, 84 మందికి పైగా గాయపడ్డారు. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు ఓ చెట్టుపైకి ఎక్కిన భక్తుల్లో కొమ్మ విరిగిపడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత డోలు, మేళతాళాలతో ఇనుప తొడుగులు తొడిగిన కర్రలు, అగ్గి కాగడాలు, దివిటీలతో కొండ పైకి చేరిన నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు మాత మాళమ్మ, మల్లేశ్వరునికి నెరణికి పురోహితులు, ఆలయ పూజారులు అత్యంత వైభవంగా కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల విగ్రహాలతో పాటు పల్లకీని మల్లప్ప గుడిలోని సింహాసన కట్ట మీద అధిష్ఠించారు. అక్కడి నుంచి మొదలైన జైత్రయాత్ర ఆద్యంతం ఒళ్లు జలదరించేలా ఉత్కంఠంగా సాగింది.

చెట్టు కొమ్మ విరిగిపడి ముగ్గురు మృతి..

ఉత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు సత్యనారాయణ కట్టపై ఉన్న రావి చెట్టుపై కూర్చున్న కొమ్మ విరిగి పడడంతో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఆస్పరికి చెందిన మాల గణేష్ (18), బళ్లారి పట్టణం మిల్లార్‌పేటకు చెంది టీపీడీలో పనిచేస్తున్న ప్రకాష్(30), ఆలూరు మండలం మొలగవల్లి కొట్టాలకు చెందిన రామాంజనేయులు (45) ఈ ప్రమాదంలో మరణించారు.



దేవరగట్టు బన్ని ఉత్సవంలో మృతి చెందిన మాల గణేష్(ఫైల్), రామాంజనేయులు(ఫైల్), ప్రకాష్(ఫైల్)

కర్రల సమరంలో 84 మందికి గాయాలు

విజయదశమిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి దేవరగట్టులో జరిగిన బన్ని మహోత్సవంలో ఆదినుంచి వస్తున్న సంప్రదాయమే గెలిచింది. విజయోత్సవంలో భాగంగా జరిగిన జైత్రయాత్రలో గట్టుపై రక్తం చిందింది. ఉత్సవంలో 84 మందికి గాయాలు కాగా అందులో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన మాళ మల్లేశ్వరస్వామి జైత్రయాత్ర బుధవారం తెల్లవారుజాము వరకు జరిగింది. బన్ని ఉత్సవాన్ని తిలకించేందుకు కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణ నుంచి దాదాపు 2 లక్షల మంది భక్తులు తరలి వచ్చారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ నేతృత్వంలో అడిషనల్ ఎస్పీతో పాటు వెయ్యి మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. దేవరగట్టులో గురువారం సాయంత్రం మాళ మల్లేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు. 27న గొరవయ్యల ఆటలు, గొలుసు తెంపుట, దేవదాసీల క్రీడోత్సవం, సాయంత్రం వసంతోత్సవం, కంకణ విసర్జన, 28న మాళ మల్లేశ్వర స్వామి విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

28న పాక్షిక చంద్రగ్రహణం

అదే రోజు సాయంత్రం నుంచి ఇంద్రకీలాద్రి, శ్రీశైలం ఆలయాల మూసివేత



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/శ్రీశైలం టెంపుల్: ఈ నెల 28న పాక్షిక చంద్రగ్రహాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6:30 గంటలకు ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు ఇతర ఉపాలయాలను మూసివేస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ తెలిపింది. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం కవాట బంధనం (తలుపులు మూసివేయడం) చేయనున్నట్లు పేర్కొంది. 29న తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి అమ్మవారికి స్నపనాభిషేకం, నిత్య అలంకరణ, పూజలు చేపట్టి 9 గంటల నుంచి దర్శనానికి అనుమతిస్తారు. 29న సుప్రభాత సేవ, వస్త్ర సేవ, ఖడ్గమాలార్చనను రద్దు చేశారు. శ్రీచక్రనవార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణాలు యథావిధిగా జరగనున్నాయి.

28న శ్రీశైలం ఆలయ ద్వారాలు మూసివేత



చంద్రగ్రహణం కారణంగా శ్రీశైలాలయ ద్వారాలు 28న సాయంత్రం 5 గంటల నుంచి 29న ఉదయం 5 గంటల వరకు మూసివేయనున్నారు. 29న ఉదయం 7 గంటలకు దర్శనాలు ప్రారంభిస్తారు. 28న మధ్యాహ్నం 3.30 గంటల వరకే సర్వదర్శనం, మధ్యాహ్నం 12.30 గంటల వరకే గర్భాలయ ఆర్జిత అభిషేకాలు నిర్వహిస్తారు. సర్వదర్శనానికి ఉదయం మాత్రమే అవకాశం ఉంటుంది. 28న అన్నప్రసాద వితరణ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకే నిర్వహిస్తామని..ఆ రోజు సాయంత్రం అల్పాహార వితరణ నిలుపుదల చేసినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు.

ప్రతి గురువారం సత్యదేవుని నిజరూప దర్శనం



అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శంకరుల నిజరూప దర్శనం అంటే మూలవిరాట్‌లను గురువారం నుంచి భక్తులు దర్శించే వీలు కలగనుంది. నిత్యం స్వర్ణ, వజ్రాభరణాలు, పట్టువస్త్రాలతో భక్తులకు దర్శనమిచ్చే రత్నగిరి సత్యదేవుడు, ప్రతీ గురువారం అలంకరణ లేకుండా నిజరూపుతో దర్శనమివ్వనున్నారు. ఈ విషయాన్ని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అనగా నివేదన సమయం వరకు నిజరూపు దర్శనం కల్పిస్తారు. గతంలో సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' నాడు మాత్రమే తెల్లవారుజామున అభిషేక సమయంలో నిజరూపదర్శనం ఉండేది. అభిషేకం తర్వాత తిరిగి స్వామివారు అలంకరణలో దర్శనమిచ్చేవారు.

దుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్ శ్యాంసుందర్



హైకోర్టు న్యాయమూర్తికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.శ్యాంసుందర్ బుధవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు. దర్శనానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయాధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాన్ని, ఆలయ ఈవో రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

శ్రీపద్మావతి అమ్మవారి సేవలో జస్టిస్ శేషసాయి



ఆలయం వెలుపల కుటుంబ సభ్యులతో జస్టిస్ శేషసాయి

చంద్రగిరి(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి కుటుంబ సభ్యులతో కలసి బుధవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

అరకు అందాలు అద్భుతం

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి

అరకులోయ టౌన్ (అల్లూరి సీతారామరాజు జిల్లా): అరకు అందాలు అద్భుతమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో కుటుంబ సమేతంగా పర్యటించి గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనాన్ని సందర్శించారు. పర్యాటక శాఖ అతిథి గృహంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. భోజన అనంతరం సందర్శిత ప్రాంతాలను తిలకించి పాడేరుకు పయనమయ్యారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జస్టిస్ సుబ్బారెడ్డి

వేధిస్తున్న భర్త హత్య

- పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఘటన



సాక్షి, భీమవరం: నిత్యం మద్యం సేవించి, అనుమానంతో వేధిస్తున్న భర్తను గొంతు నులిమి హత్య చేసిన మహిళ ఉదంతమిది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామానికి చెందిన ఏలూరు వెంకటేశ్వరరావు (60) భీమవరం రెస్ట్‌హౌస్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో రెండేళ్లుగా వాచ్‌మేన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారికి పెళ్లి చేయగా, భార్యభర్తలిద్దరూ అపార్ట్‌మెంట్‌లోని గదిలో నివాసముంటున్నారు. వెంకటేశ్వరరావు నిత్యం మద్యం తాగి అనుమానంతో భార్య వెంకటలక్ష్మిని శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. భర్త వేధింపులు తట్టుకోలేని వెంకలక్ష్మి మంగళవారం రాత్రి వెంకటేశ్వరరావును గొంతు నులిమి హతమార్చింది. భీమవరం 22వ వార్డు వీఆర్వో యలమంచిలి రాజమణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని బుధవారం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపినట్టు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను తెలిపారు. నిందితురాలు వెంకటలక్ష్మిని అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

ఎంపీ ఆదాలకు రాష్ట్రపతి శుభాకాంక్షలు

నెల్లూరు రూరల్: నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆమె కాంక్షించారు. ఈ మేరకు ఓ లేఖను నెల్లూరు నగరంలోని ఎంపీ ఆదాల నివాసానికి పంపారు.

రూ.38 లక్షల విరాళంతో ఒకరోజు అన్నప్రసాద వితరణకు అవకాశం

దాతలు స్వయంగా వడ్డించవచ్చు • దాతల పేరు ప్రదర్శన

తిరుమల: కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ కోసం రూ.38 లక్షలు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విరాళం మొత్తం ఇప్పటివరకు రూ.33 లక్షలు ఉండగా, పెరిగిన ధరల నేపథ్యంలో టీటీడీ రూ.38 లక్షలకు పెంచింది.

➤ ఉదయం అల్పాహారం కోసం రూ. 8 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.15 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.15 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు.

➤ విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రదర్శిస్తారు. అదేవిధంగా దాతలు తమ కోరిక మేరకు ఒకరోజు ఇక్కడ అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని పొందొచ్చు.

తిరుమలలో ప్రస్తుతం అన్నప్రసాదాలు అందుతున్న ప్రాంతాలు:

ప్రస్తుతం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1, 2లోని కంపార్ట్‌మెంట్లు, బయటి క్యూలైన్‌లు, పీఏసీ-4(పాత అన్నప్రసాదం), పీఏసీ-2, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, రుయా ఆసుపత్రి, స్విమ్స్, మెటర్నిటీ ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

➤ తిరుమలలోని ఫుడ్ కౌంటర్లలో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1, 2లోని కంపార్ట్‌మెంట్లు, వృద్ధులు, దివ్యాంగులు వేచి ఉండే కాంప్లెక్స్, రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శన కాంప్లెక్స్, ప్రధాన కల్యాణకట్టలో టీ, కాఫీ, చంటిపిల్లలకు పాలు అందిస్తున్నారు.

ప్రముఖ దినాల్లో 3 లక్షల మందికి పైగా..

తిరుమలలో జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి పర్వదినాలు, బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున 3లక్షల మందికి పైగా భక్తులకు టీటీడీ అన్నప్రసాదాలు పంపిణీ చేస్తోంది.

వెంగమాంబ అన్నప్రసాద భవనం..

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8:30 నుంచి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగళి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10.30 గంటల వరకు చక్కెర పొంగలి, చట్నీ, అన్నం, కూర, సాంబారు, రసం, మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. తిరుమలలో అన్నప్రసాదాల తయారీకి రోజుకు 14 నుంచి 16.5 టన్నుల బియ్యం, 6.5 నుంచి 7.5 టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.

దేనికోసం భువనేశ్వరి బస్సుయాత్ర?

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అమ్మాజీ



ఎస్.రాయవరం (అనకాపల్లి జిల్లా): టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి సతీమణి భువనేశ్వరి దేని కోసం బస్సు యాత్ర చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ ప్రశ్నించారు. ఎస్.రాయవరం అడ్డురోడ్డులోని తన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. అన్ని ఆధారాలతో దొరికిన చంద్రబాబును శుద్ధ పూసగా చెప్పడం విడ్డూరంగా ఉందని ఆమె అన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఏ రాజమండ్రి జైల్లో ఉన్నారో, అదే రాజమండ్రి పుష్కరాల్లో ప్రచారార్భాటం కోసం 29 మందిని పైగా పొట్టనపెట్టుకుంటే ఒక్కరినీ పరామర్శించాలని అనిపించలేదా? అని నిలదీశారు. ఎన్నో ఘోరాలు చేసిన చంద్రబాబు ఎట్టకేలకు ఆధారాలతో చిక్కి, జైల్లో ఉంటే, ఆయన సతీమణి బస్సు యాత్ర చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇటీవల సినీ హీరో తారకరత్న చనిపోయినప్పుడు కూడా భువనేశ్వరి బయటకు రాలేదన్నారు. 14 ఏళ్లపాటు సీఎంగా చంద్రబాబు చేసిన తప్పులు కనిపించలేదా? అని మండిపడ్డారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలనే ఆమె ప్రజల్లోకి వస్తున్నారని ఆరోపించారు. ఆమె తండ్రి, మాజీ సీఎం ఎన్టీఆర్‌ను గద్దె దించినప్పుడు, ఆయనపై చెప్పులు వేయించినపుడు తన భర్త అఘాయిత్యాలు గుర్తించలేదా? అప్పుడు ప్రజలు గుర్తుకు రాలేదా? అని ధ్వజమెత్తారు. ఎన్ని యాత్రలు చేసినా చంద్రబాబును, ఆయనకు వత్తాసుగా ఉన్నవాళ్లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అమ్మాజీ అన్నారు.

8న రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్

కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణకు ఏఐఎస్‌ఎఫ్ పిలుపు

గుంటూరు ఎడ్యుకేషన్ : కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం నవంబర్ 8న చేపడుతున్న రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన విద్యార్థి, యువజన సంఘ నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుభానితో కలిసి శివారెడ్డి మాట్లాడుతూ 32 మంది విద్యార్థి, యువజన నాయకుల ప్రాణ త్యాగాలతో పాటు, వామపక్ష ఎమ్మెల్యేలు, ఎంపీల పదవీ త్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణకు మోదీ ప్రభుత్వం పూనుకోవడాన్ని నిరసిస్తూ జరుగుతున్న పోరాటం వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా అన్ని విద్యార్థి, యువజన సంఘాలు ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొనడంతో పాటు, నవంబర్ 8న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిస్తున్నట్టు తెలిపారు. లాభాలు వస్తున్న ఉక్కు ఫ్యాక్టరీని ప్రయివేటీకరించాలన్న ఆలోచనను కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫ్యాక్టరీ అనుబంధంగా గనులు కేటాయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కిరణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేస్తామని తెలిపారు. రాయలసీమ ప్రాంతం కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని విభజన చట్టంలో పేర్కొన్న హామీ ఇంతవరకు అమలు చేయలేదని చెప్పారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలొస్తాయని తెలిపారు. ఎన్ఎస్‌యూఐ టీఎన్ఎస్‌ఎఫ్ నాయకులు కరీం, ధర్మతేజలు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, వలీ, ఏఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, టీఎన్ఎస్‌ఎఫ్ నేతలు శశి, అమరనాథ్, బన్నీ, గణేష్, అజయ్, సమీర్, రాజు, మదన్ తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరీ.. మోదీని ప్రశ్నించు..

1,123వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు




తాడికొండ: ఏపీ అభివృద్ధికి నిధులివ్వాలని ప్రధాని మోదీని కోరాల్సిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి.. అవినీతికి పాల్పడి జైల్లో మగ్గిపోతున్న మరిది చంద్రబాబుకు మద్దతుగా నిలవడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. 2014 ఎన్నికల ముందు తిరుపతి సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పిన మోదీ.. ఆ హామీని 'అమరావతి' మట్టిలో కలిపేశారన్నారు. ఆ విషయమై మోదీని పురందేశ్వరి నిలదీయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,123వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎదుట రాష్ట్ర ప్రయోజనాల కోసం పల్లెత్తు మాట మాట్లాడని పురందేశ్వరి బీజేపీ ప్రయోజనాల కంటే బాబు ప్రయోజనాలకే పెద్దపీట వేశారనడంలో సందేహం లేదన్నారు. సంక్షేమం అంటే ప్రతి పేదవాడి హక్కు అని నమ్మిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసి.. దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. మూడు పంటలు పండే భూములను తీసుకున్న చంద్రబాబు ఆ మేరకు రైతులకు ప్రయోజనాలు చేకూర్చడంలో పూర్తిగా విఫలమయ్యాడని, ఫలితంగా నేడు రైతులు, రైతు కూలీలు దయనీయ స్థితిలో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

భళా.. సూక్ష్మకళ!



శిల్పి సాయి



పెద్దాపురం: వరల్డ్ ఆర్టిస్ట్ డే సందర్భంగా కాకినాడ జిల్లా పెద్దాపురం పట్టణ బంగారు శిల్పి, గిన్నిస్ బుక్ రికార్డ్ అవార్డు గ్రహీత తాళాబత్తుల సాయి సూక్ష్మ రాకింగ్ చైర్ రూపొందించారు. కేవలం మూడు గంటల సమయంలో, 900 మిల్లీగ్రాముల బంగారంతో ఐదు మిల్లీమీటర్ల ఎత్తు, 10 మిల్లీమీటర్ల పొడవుతో దీన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందిస్తున్నారు. వరల్డ్ ఆరిస్ట్ డే సందర్భంగా ప్రతి కళాశిల్పికి అభినందనలు చెబుతున్నానని సాయి పేర్కొన్నారు.

ఏఎంసీ @ 100 ఏళ్లు

- ఈ నెల 27నుంచి మూడు రోజులపాటు ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు
- హాజరుకానున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, గవర్నర్ నజీర్, మంత్రులు



మహారాణిపేట: వందేళ్ల చరిత్ర ఉన్న ఆంధ్ర వైద్య కళాశాల ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు ముందే తెలుగు వారి కోసం విశాఖలో ప్రత్యేకంగా ఏర్పాటైంది. 1923 జూలై 19న మెడికల్ కళాశాల అప్పటి మద్రాస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఆవిర్భవించింది. ఈ వైద్య కళాశాలకు ముందుగా వైజాగ్‌పటం వైద్య కళాశాల అని పేరు పెట్టారు.1926లో ఆంధ్ర యూనివర్సిటీ ప్రారంభమైన తర్వాత వైజాగపటం వైద్య కళాశాల ఏయూకి అనుబంధ కళాశాలగా మారింది. ఆ సమయంలో వైస్ చాన్సలర్‌గా ఉన్న సీఆర్ రెడ్డి దీని పేరును ఆంధ్రా మెడికల్ కాలేజ్‌గా మార్చాలని మద్రాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ తర్వాత పేరు మారుస్తూ గెజిట్ విడుదల చేశారు. ఆ తర్వాత నుంచి ఈ కళాశాల ఆంధ్ర మెడికల్ కాలేజీగానే ప్రసిద్ధి చెందింది. దేశంలో ఉన్న పురాతన వైద్య కళాశాలల్లో ఏఎంసీ ఒకటి. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి మెడికల్ కాలేజీ ఏఎంసీ కావడం విశేషం. ప్రస్తుత మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఇక్కడే ఎంబీబీఎస్ చదివారు. ఇంకా ఎంతో మంది దేశ,విదేశాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. రూ.50 కోట్లను పూర్వ విద్యార్థులంతా విరాళాలు వేసుకుని 1.6 ఎకరాల్లో కళాశాల సమీపంలోనే ఒక నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. వైద్య కళాశాలకు క్రమంగా అనుబంధ బోధనా ఆస్పత్రులు వచ్చాయి. తొలి కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆరోగ్య కేంద్రం కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్)గా మారింది. 132 పడకలతో ఏర్పాటైన కేజీహెచ్ నేడు 1,100 పడకల స్థాయికి ఎదిగింది. ఇంకా అనుబంధంగా అనేక ఆస్పత్రులు ఉన్నాయి.

27 నుంచి శతాబ్ది ఉత్సవాలు

ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలు ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. 27న భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, 28న కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఎం.ఎల్.మాండవీయ,రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొంటారు. 29న తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంలో భాగంగా రాత్రి మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు.

ఇక్కడ విద్యార్థినే



ఆంధ్రా మెడికల్ కాలేజీలో 1978లో ఎంబీబీఎస్ చదివాను. ఇప్పుడు ఇదే కాలేజీలో ఇప్పుడు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. చదువుకున్న కాలేజీలో ప్రిన్సిపాల్‌గా పనిచేయడం ఎంతో ఆనందంగా ఉంది. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత వైద్యులను సమన్వయం చేసుకుంటూ శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ బుచ్చిరాజు, ప్రిన్సిపాల్, ఏఎంసీ

చాలా ఆనందంగా ఉంది



నేను ఇదే కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశా. ఇక్కడ వైద్య విద్య పూర్తిచేసిన అనేక మంది దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వైద్య విద్యను ఎంతో ఇష్టంగా చదివాను. ఇప్పటికీ వైద్యునిగా పనిచేయడం తన తల్లిదండ్రుల చేసిన పుణ్యఫలంగా భావిస్తాను.

-డాక్టర్ ఎస్.ఉమా సుందరి, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ

తెలుగు రాష్ట్రాల్లో ఏఎంసీ నంబర్ వన్



నేను చదువుకున్న రోజుల్లో కాలేజీ, ఆస్పత్రి చాలా చిన్నవిగా ఉండేవి, అప్పటికీ ఇప్పటికీ ఎంతో తేడా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో ఆంధ్ర వైద్య కాలేజీ నంబర్ వన్‌గా ఉంది. అయిదు సంవత్సరాల పాటు ఏఎంసీ ప్రిన్సిపాల్‌గా పనిచేశా.

– డాక్టర్ పి.వి.సుధాకర్, పూర్వ విద్యార్థి, మాజీ ప్రిన్సిపాల్

వైఎస్సార్‌సీపీతోనే రాజకీయాల్లో సామాజిక విప్లవం

మంత్రి చెల్లుబోయిన వేణు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాజకీయాల్లో సామాజిక విప్లవమనేది వైఎస్సార్‌సీపీతోనే చూస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. సామాజిక మార్పు కోసం నాలుగున్నరేళ్లుగా తీసుకువచ్చిన విప్లవం ఏంటి అనేది సామాజికవిప్లవ యాత్ర ద్వారా ప్రతి ఒక్కరికీ తెలియజేస్తామన్నారు. కాకినాడలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత చంద్రబాబు పాలనలో అన్ని వర్గాలు ఎలా నష్టపోయాయో, ఈ నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ ఆయా వర్గాలకు ఏమేం చేశారో యాత్రలో చెబుతామన్నారు. రాజకీయాలను చంద్రబాబు నాశనం చేశారని విమర్శించారు. జగన్ అంటేనే నిజం అనే విషయాన్ని జనం గుర్తించారన్నారు. తరతరాలుగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బీసీలను పైకి తీసుకువస్తోన్న సీఎం జగన్‌కు వ్యతిరేకంగా టీడీపీ, జనసేన పార్టీలు కలిసి వస్తున్నాయన్నారు. టీడీపీకి బీసీలపై ఉన్న చులకనభావం ఏ స్థాయిలో ఉందో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు వేదికలపై ఇచ్చే గౌరవంతోనే అర్థమవుతోందన్నారు.

క్లుప్తంగా...

ఉత్తరాఖండ్ మాజీ సీఎం రావత్‌కు స్వల్ప గాయాలు

హల్ద్వానీ: కాంగ్రెస్ సీనియర్ నేత, ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి హరీశ్ రావత్ ప్రయాణిస్తున్న కారుకు స్వల్ప ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రావత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం రాత్రి ఉధమ్ సింగ్ నగర్ జిల్లాలో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. హల్ద్వానీ నుంచి కాశీపూర్‌కు రావత్ కారులో బయల్దేరారు. మార్గమధ్యంలో బజ్‌పూర్ రైల్వే క్రాసింగ్ సమీపంలో ఒక వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో రావత్ కారు డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో కారు ముందు సీటులో కూర్చుని ప్రయాణిస్తున్న రావత్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

నేషనల్ ఐకాన్‌గా నటుడు రాజ్‌కుమార్ రావు

న్యూఢిల్లీ: హిందీ చిత్రం 'న్యూటన్'లో ఎన్నికల అధికారి పాత్రలో మెప్పించిన నటుడు రాజ్‌కుమార్ రావును నేడు కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ ఐకాన్‌గా ప్రకటించనుంది. ఎన్నికల ప్రక్రియలో ప్రజలను మరింత భాగస్వాములను చేయడంతోపాటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు నేషనల్ ఐకాన్‌గా ఎంపికైన వారు కృషిచేయనున్నారు. గురువారం ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాజ్‌కుమార్‌ను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ నేషనల్ ఐకాన్‌గా ప్రకటించనున్నారు. న్యూటన్ చలనచిత్రంలో ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత జిల్లాల్లో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించిన పాత్రను అద్భుతంగా పోషించి అందరికీ ఎన్నికల అధికారిగా గుర్తుండిపోయిన రాజ్‌కుమార్.. 'నేషనల్ ఐకాన్' పాత్ర సైతం చక్కగా పోషించగలరని ఎన్నికల సంఘం ఆశిస్తోంది.

రాజ్‌భవన్‌పై పెట్రో బాంబు దాడి యత్నం

సాక్షి, చెన్నై: చెన్నై నగరంలోని సర్దార్ పటేల్ రహదారిలోని గవర్నర్ అధికార నివాసం రాజ్‌భవన్ వద్ద కలకలం రేగింది. బుధవారం సాయంత్రం ఒక ఆగంతకుడు రాజ్‌భవన్ మెయిన్ గేట్ వద్ద పెట్రో బాంబు విసిరాడు. బాంబు పేలడంతో అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పేలుడుతో చెలరేగిన మంటలను ఆర్పేశారు. బాంబ్ దూసుకొచ్చిన వైపు పరుగులు తీశారు. అక్కడే పెట్రోల్ ఉన్న మరో సీసాను విసిరేందుకు సిద్ధంగా ఉన్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని 14 కేసులో నిందితుడిగా ఉన్న కరుక్కా వినోద్‌గా గుర్తించారు. నీట్ ప్రవేశ పరీక్షకు వ్యతిరేకంగా ఈ దాడి చేసినట్లు పోలీసులతో అతను చెప్పినట్లు వార్తలొచ్చాయి.

అయోధ్య రామాలయం ప్రారంభానికి మోదీకి ఆహ్వానం

న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవానికి తేదీ ఖరారు చేశారు. దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి వచ్చే ఏడాది జనవరి 22న ఆలయాన్ని ప్రారంభించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా ప్రధాని మోదీని ఆలయ ట్రస్టు కోరింది. ఈ మేరకు శ్రీరామ జన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఆహ్వానించారు. ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అందుకు ప్రధాని అంగీకరించారు.

ఆ 14 మంది తలసేమియా చిన్నారులకు ఎయిడ్స్

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో వైద్య సేవల్లో నిర్లక్ష్యం పరాకాష్ఠకు చేరిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. కాన్పూర్ ప్రభుత్వాస్పత్రిలో 14 మంది థలసేమియా బాధిత చిన్నారులకు కలుషిత రక్తం ఎక్కించి వారికి ఎయిడ్స్, హెపటైటిస్ సోకేందుకు కారణమయ్యారని తీవ్రంగా విమర్శించారు. 'ఇది నిజంగా సిగ్గుచేటు. క్షమించరాని నేరం. ప్రధాని గొప్పగా చెప్పుకునే డబుల్ ఇంజన్ సర్కారు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్య వ్యవస్థను రెట్టింపు కష్టాల్లోకి నెట్టేసింది' అని ఎద్దేవా చేశారు. ఈ ఆరోపణలను వైద్య కళాశాల తోసిపుచ్చింది.

అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా మైక్ జాన్సన్

వాషింగ్టన్: అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్‌గా మైక్ జాన్సన్ బుధవారం ఎన్నికయ్యారు. లూసియానా నుంచి చట్టసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనకు విపక్ష రిపబ్లికన్లంతా మద్దతు పలికారు. దీంతో మొదటి బ్యాలెట్ పోరులోనే జాన్సన్ స్పీకర్‌గా విజయం సాధించారు. స్పీకర్ పదవి నుంచి మెక్‌కార్తీ తప్పుకున్న తర్వాత ప్రతినిధుల సభలో చాలారోజులుగా కొనసాగుతున్న ప్రతిష్టంభనకు ఇక తెరపడింది. మైక్ ఎన్నిక పట్ల రిపబ్లికన్ పార్టీ నేత, మాజీ అధ్యక్షుడు ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు.

బంగ్లాదేశ్ వద్ద తీరాన్ని దాటిన తుపాను

సాక్షి, విశాఖపట్నం: ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగిన తీవ్ర తుపాను బుధవారం వేకువజామున బంగ్లాదేశ్‌లోని దక్షిణ చిట్టగాంగ్ వద్ద తుపానుగా మారి తీరాన్ని దాటింది. ఆ సమయంలో గాలుల వేగం 75–85, గరిష్ఠంగా 95 కిలోమీటర్ల మధ్య ఉంది. అనంతరం ఇది సాయంత్రానికి అల్పపీడనంగా బలహీనపడింది. తుపాను తీరం దాటి బలహీనపడడంతో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని పోర్టుల్లో జారీ చేసిన హెచ్చరికలను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఉపసంహరించుకుంది. మరోవైపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం మరో అల్పపీడనం ఏర్పడింది. అయితే ఇది సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. అందువల్ల దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పై ఉండే అవకాశం లేదు.

ఇజ్రాయెల్ బాంబుల ఆట..



సరిహద్దు నుంచి గాజా స్ట్రిప్ వైపునకు బాంబు ప్రయోగిస్తున్న ఇజ్రాయెల్ శతఘ్ని దళం

గాజాలో కన్నీటి చుక్కలు

ఇజ్రాయెల్ ఆంక్షలతో నిలిచిపోయిన పెట్రోల్, డీజిల్ సరఫరా

మూలనపడ్డ వాహనాలు.. ఆగిపోతున్న సహాయక చర్యలు

విద్యుత్ లేక ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు నిలిపివేత

రఫా/టెల్ అవీవ్: ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడులతో దద్దరిల్లుతున్న గాజా స్ట్రిప్‌లో పరిస్థితులు మరింత దయనీయంగా మారుతున్నాయి. ప్రధానంగా ఇంధన కొరత వల్ల సహాయక చర్యలు ఎక్కడివక్కడే నిలిచిపోతున్నాయి. పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో వాహనాలు మూలనపడ్డాయి. క్షిపణుల దాడుల్లో ధ్వంసమైన భవనాల శిథిలాలను తొలగించే అవకాశం లేకుండాపోయింది. వాటికింద చిక్కుకుపోయిన మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. మరోవైపు ఇంధనం కొరతవల్ల ఆసుపత్రుల్లో జనరేటర్లు పనిచేయడం లేదు. డాక్టర్లు శస్త్ర చికిత్సలు ఆపేస్తున్నారు. క్షతగాత్రులకు కనీస వైద్య సేవలు కూడా అందడం లేదు. ఫలితంగా మృతుల సంఖ్య పెరిగిపోతోంది. నిత్యం పదుల సంఖ్యలో మృతదేహాలు ఆసుపత్రుల నుంచి శ్మశానాలకు చేరుతున్నాయి. ఈ పరిణామాలపై ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. గాజాకు ఇంధన సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలని బుధవారం ఇజ్రాయెల్‌కు విజ్ఞప్తి చేసింది. ఇంధనం సరఫరా చేయకపోతే గాజాలో సహాయక చర్యలు అతిత్వరలో పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని వెల్లడించింది.

ససేమిరా అంటున్న ఇజ్రాయెల్

గాజా జనాభా 23 లక్షలు కాగా, యుద్ధం ప్రారంభమైన తర్వాత వీరిలో 14 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దాదాపు 6 లక్షల మంది ఐక్యరాజ్యసమితి సహాయక శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈజిప్టు సరిహద్దు నుంచి ఆహారం, నిత్యావసరాలను గాజాకు చేరవేసేందుకు ఇజ్రాయెల్ ఇటీవల అనుమతి ఇచ్చింది. దాంతో కొన్ని వాహనాలు గాజాకు చేరుకున్నాయి. పరిమితంగా అందుబాటులోకి వచ్చిన ఆహారం, నిత్యావసర సామగ్రిని రేషనింగ్ విధానంలో పాలస్తీనియన్లకు సరఫరా చేస్తున్నారు. ఇంధన కొరత మాత్రం తీరడం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్రోల్, డీజిల్‌ను గాజాలోకి అనుమతించే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ సైన్యం తెగేసి చెబుతోంది.

చేతులెత్తేయడమే మిగిలింది

'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' ప్రస్తుతం గాజాలో సహాయక చర్యల్లో నిమగ్నమైంది. క్షతగాత్రులకు వైద్య సేవలు అందిస్తోంది. విద్యుత్ లేక, పెట్రోల్, డీజిల్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇకపై క్షతగాత్రులకు సేవలందించే పరిస్థితి లేదని చెబుతోంది. ఆహార ధాన్యాలు పంపిణీ చేయడానికి కూడా వాహనాలకు ఇంధనం లేదని పేర్కొంటోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాము పూర్తిగా చేతులెత్తేయడం తప్ప చేసేదేమీ లేదని 'యూఎన్ ఏజెన్సీ ఫర్ పాలస్తీనియన్ రెఫ్యూజీస్' అధికార ప్రతినిధి ఆవేదన వ్యక్తం చేశారు. గాజాలోని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో మూడింట రెండొంతులు ఇప్పటికే మూతపడ్డాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.

సిరియాలో 8 మంది జవాన్లు మృతి

ఇజ్రాయెల్–హమాస్ మధ్య మొదలైన యుద్ధం మధ్యప్రాచ్యంలో అగ్గి రాజేస్తోంది. హమాస్‌కు ఆయుధాలు, ఆర్థిక సాయం అందిస్తూ అండగా నిలిచేవారిని వదిలిపెట్టబోమని ఇజ్రాయెల్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. హమాస్‌కు సిరియా ప్రభుత్వం మద్దతు పలుకుతుండడంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్ సైన్యం బుధవారం దక్షిణ సిరియాలోని సైనిక శిబిరాలపై వైమానిక దాడులు ప్రారంభించింది. బాంబుల వర్షం కురిపించింది. ఈ ఘటనలో 8 మంది సిరియా సైనికులు ప్రాణాలు కోల్పోయారు. సిరియా నుంచి తమపై రాకెట్ దాడులు జరుగుతుండడంతో తిప్పికొట్టామని, వైమానిక దాడులు చేసి సిరియా సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

ఒక్కతాటిపైకి మిలిటెంట్ సంస్థలు!

ఇజ్రాయెల్ సైన్యం దూకుడు పెంచిన నేపథ్యంలో లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా ముఖ్య నేత హసన్ నస్రల్లా బుధవారం హమాస్, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ అగ్రనాయకులతో సమావేశమయ్యారు. తాజా పరిణామాల గురించి చర్చించినట్లు సమాచారం. ఇజ్రాయెల్ సైన్యంపై హమాస్, హెజ్బొల్లా, పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ సంస్థలు కలిసి పోరాడే సూచనలు కనిపిస్తున్నాయి. గాజాపై భూతల దాడులకు దిగితే తగిన మీకు గుణపాఠం నేర్పుతామంటూ ఇజ్రాయెల్‌ను హెజ్బొల్లా హెచ్చరించింది. హమాస్‌కు ఇరాన్ సాయం అందిస్తోందని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి డేనియల్ హగారీ చెప్పారు. ఇరాన్‌లోని మిలిటెంట్ సంస్థలు ఇరాక్, యెమెన్, లెబనాన్ భూభాగాల నంచి ఇజ్రాయెల్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని, వాటిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

బందీల విడుదలకు ఖతార్ యత్నాలు

హమాస్ చెర నుంచి బందీలు విడుదలయ్యే విషయంలో మరిన్ని సానుకూల పరిణామాలు చూడొచ్చని ఖతార్ ప్రధానమంత్రి షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్ రెహ్మాన్ అల్–థానీ చెప్పారు. ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇప్పటికే నలుగురు బందీలు విడుదలైన సంగతి తెలిసిందే. మిగిలినవారిని సైతం విడుదల చేసేలా హమాస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని ఖతార్ ప్రధానమంత్రి తెలిపారు. బందీల విడుదలకు చొరవ చూపుతున్న ఖతార్ ప్రభుత్వానికి ఇజ్రాయెల్ జాతీయ భద్రతా మండలి అధినేత టాగీ హనెగ్బీ కృతజ్ఞతలు తెలియజేశారు.

గాజా కన్నీటి పాట..



రొటీన్ జీవితం నుంచి ఉపశమనం కోసం గతంలో వయోలిన్ వాయించిన తాను ఇప్పుడు రక్తమోడుతున్న గాజా కన్నీటి పాటను వినిపిస్తున్నానని జవహర్ అల్-అఖ్రా చెప్పారు. ఈమె సొంతిల్లు సెంట్రల్ గాజాలోని దెయిర్ అల్-బాలాహ్ పట్టణంలో ఉంది. బుధవారం బాంబు మోతల నడుమ ఇంట్లో తీసిందీ ఫొటో.

మధ్యప్రాచ్యం నుంచి అమెరికన్ల తరలింపు!

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ మధ్యప్రాచ్యంలో ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే, అక్కడున్న తమ పౌరులను స్వదేశానికి తరలించాలని యోచిస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం వెల్లడించింది. ఇజ్రాయెల్ నుంచి అమెరికా పౌరుల తరలింపు ఇప్పటికే ప్రారంభమైంది. చాలామంది అమెరికన్లు ఇజ్రాయెల్ వదిలి వెళ్లిపోయారు. మధ్యప్రాచ్య దేశాల్లో పెద్ద సంఖ్యలో అమెరికన్లు ఉన్నారు. యుద్ధం గనుక విస్తరిస్తే వారి భద్రతకు భరోసా ఉండదని అమెరికా ప్రభుత్వం భావిస్తోంది. అందుకే పరిస్థితి అదుపు తప్పకముందే వారిని క్షేమంగా స్వదేశానికి రప్పించాలని నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తాజాగా సౌదీ అరేబియా యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్ తాజా పరిస్థితులపై చర్చించారు. ఘర్షణను నివారించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఇరువురు నేతలు అభిప్రాయాలు పంచుకున్నారు.

రెండు రోజుల్లో 750 మంది మృతి

గాజాపై ఇజ్రాయెల్ సైన్యం దాడుల తీవ్రత పెంచింది. బుధవారం కొన్ని టార్గెట్లపై క్షిపణులు ప్రయోగించింది. హమాస్ స్థావరాలను, సొరంగాలను, ఆయుధాగారాలను, సమాచార వ్యవస్థను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మంగళవారం, బుధవారం జరిగిన దాడుల్లో గాజాలో 750 మందికిపైగా జనం మృతిచెందారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధంలో ఇప్పటిదాకా గాజాలో 5,791 మందికిపైగా మరణించారని, 16,297 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ తాజాగా ప్రకటించింది. గాజాలోని మృతుల్లో 2,300 మంది మైనర్లు ఉన్నారని వెల్లడించింది. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ దాడుల్లో 96 మంది పాలస్తీనియన్లు బలయ్యారు. 1,650 మంది క్షతగాత్రులుగా మారారు.

10 మంది యూదులను చంపేశా!

ఇజ్రాయెల్‌లో 10 మంది యూదులను చంపేశానంటూ హమాస్ మిలిటెంట్ ఒకరు తన తల్లిదండ్రులతో మొబైల్ ఫోన్‌లో చెప్పిన ఆడియో రికార్డు ఒకటి వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ శాఖ దీన్ని విడుదల చేసింది. గాజా సరిహద్దులో ఇజ్రాయెల్ భూభాగంలోని కిబుట్జ్‌లో తానున్నానని, తాను ఒక్కడినే 10 మంది యూదులను మట్టుబెట్టానని సదరు మిలిటెంట్ గాజాలోని ఉన్న తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి గర్వం తొణికిసలాడే స్వరంతో ఆనందంగా చెప్పాడు. దాంతో వారు అతడిని శభాష్ అంటూ అభినందించారు. మిలిటెంట్ ఉపయోగించిన ఫోన్ అతడి చేతిలో చనిపోయిన ఇజ్రాయెల్ పౌరుడిదే కావడం గమనార్హం. అయితే, ఈ ఆడియో రికార్డు నిజమైందో కాదో ఇంకా నిర్ధారణ కాలేదని ఇజ్రాయెల్ రక్షణ శాఖ వెల్లడించింది.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో భారత్



- ప్రాచీన చరిత్ర బదులు క్లాసికల్ హిస్టరీ
- యుద్ధాల్లో హిందూ విజయాలకు చోటు
- కమిటీ సిఫార్సు, విపక్షాల విమర్శలు
- ఇంకా నిర్ణయం తీసుకోలేదన్న కౌన్సిల్

న్యూఢిల్లీ: అన్ని పాఠ్య పుస్తకాల్లోనూ ఇండియా స్థానంలో భారత్ పదాన్ని ప్రవేశపెట్టాలని జాతీయ విద్యా పరిశోధనా, శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) భావిస్తోంది. పాఠశాల పాఠ్య ప్రణాళికలో మార్పుచేర్పుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఈ మేరకు సిఫార్సు చేసింది. పాఠ్య పుస్తకాల్లో 'ప్రాచీన చరిత్ర'కు బదులుగా 'క్లాసికల్ హిస్టరీ'ని ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసినట్లు కమిటీ చైర్‌పర్సన్ సి.ఇసాక్ తెలిపారు. 'ముఖ్యంగా ఇండియా పేరును అన్ని తరగతుల పాఠ్య పుస్తకాల్లోనూ భారత్‌గా మార్చాలని కమిటీ ఏకగ్రీవంగా సిఫార్సు చేసింది. ఎందుకంటే భారత్ అనే పేరు చాలా పురాతనమైన పేరు. విష్ణుపురాణం వంటి 7 వేల ఏళ్ల నాటి పురాతన గ్రంథాల్లోనే భారత్ పేరును ప్రస్తావించా' అని ఆయన వివరించారు. అయితే ప్యానల్ సిఫార్సుల అమలుపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని ఎన్‌సీఈఆర్‌టీ చైర్మన్ దినేశ్ సక్లానీ స్పష్టం చేశారు. అనంతరం ఈ మేరకు సంస్థ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'కొత్త సిలబస్, పాఠ్యపుస్తకాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. కొత్త ప్రతిపాదనలను డొమైన్ నిపుణులు తదితరులకు ఎప్పటికప్పుడు తెలియపరిచి వారి అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరిస్తాం. అందుకే ఈ అంశంపై ఇప్పుడే ఏ విధమైన వ్యాఖ్యలు చేసినా అది తొందరపాటు చర్య అవుతుంది' అని అందులో పేర్కొంది.

'ఇండియా' కూటమికి భయపడే: విపక్షాలు

కమిటీ సిఫార్సులను విపక్షాలు తీవ్రంగా దుయ్యబట్టాయి. 'చివరికి పాఠ్య పుస్తకాల్లో, సిలబస్‌లో కూడా దేశ చరిత్రను బీజేపీ ఎలా వక్రీకరించాలని చూస్తోందో దీనిని బట్టి మరోసారి రుజువైంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు. తమ దృష్టిలో ఇండియా, భారత్ పేర్లు రెండూ ఒక్కటేనని స్పష్టం చేశారు. విపక్ష కూటమికి ఇండియా అని పేరు పెట్టడం ప్రధాని మోదీని విపరీతంగా భయపెడుతోందనేందుకు ఇది ప్రబల నిదర్శనమని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. ఎన్డీఏ అసమర్థ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు మోదీ సర్కార్ ఇలా పేర్ల మార్పిడి పరంపర కొనసాగిస్తోందని డీఎంకే ఆరోపించింది. ఆర్జేడీ తదితర పార్టీలు కమిటీ సిఫార్సులను తప్పుబట్టాయి. ''విపక్షాలు తమ కూటమి పేరున 'ఇండియా' బదులు భారత్‌గా ఇప్పుడు మార్చేస్తే మోదీ సర్కార్ వెంటనే దేశం పేరును 'భారత్'కు బదులు జంబూద్వీపం అనో మరేదైనా పేరో పెట్టేస్తారా ?'' అని ఎంపీ మనోజ్ ఝా ఎద్దేవా చేశారు.

జీ20 శిఖరాగ్రంతో మొదలు

భారత్ పేరు తొలుత ఇటీవల ఢిల్లీలో జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సు ఆహ్వాన పత్రికల్లో ప్రత్యక్షమవడం విదితమే. రాష్ట్రపతిని అప్పటిదాకా 'ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'గా సంబోధిస్తుండగా కొత్తగా దానికి బదు లు 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ఆ ఆహ్వాన పత్రికల్లో మోదీ ప్రభుత్వం పేర్కొంది. ఇది దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ సీటు ముందు ఉంచిన నేమ్‌ప్లేట్‌పై ఇండియా బదులు భారత్ అనే రాసి ఉండటం తెల్సిందే.

కమిటీ ఏం చెప్పిందంటే...

ఎన్‌సీఈఆర్‌టీ ఉన్నత స్థాయి కమిటీ చైర్‌పర్సన్ ఇసాక్ సంఘ్ పరివార్‌కు సన్నిహితుడు. దాని తాలూకు అతివాద సంస్థ అయిన భారతీయ విచార కేంద్రం ఉపాధ్యక్షునిగా ఆయన పని చేశారు. ఆయన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ (ఐసీహెచ్ఆర్) సభ్యుడు కూడా. ఎన్‌సీఈఆర్‌టీకి కమిటీ చేసిన సిఫార్సులను ఆయన సవివరంగా పేర్కొన్నారు. అవేమిటంటే...

- బ్రిటిషర్లు భారత చరిత్రను ప్రాచీన, మధ్య యుగ, ఆధునిక అంటూ మూడు దశలుగా విభజించారు. వీలైనంత వరకూ భారత్ ఘనతలను, సాధించిన ప్రగతిని, శాస్త్రీయ విజయాలను మరుగునపడేశారు. వాటిని తక్కువ చేసి చూపించారు. అందుకే పాఠశాలల్లో మధ్య యుగ, ఆధునిక భారత చరిత్రతో పాటు క్లాసికల్ పీరియడ్ గురించి ఇకమీదట బోధించాలి.
- ప్రస్తుత పాఠ్య పుస్తకాల్లో హిందూ వైఫల్యాలను మాత్రమే ప్రముఖంగా పేర్కొన్నారు. కానీ మొగలులు తదితర సుల్తాన్లపై హిందూ రాజులు సాధించిన విజయాలను మాత్రం ప్రస్తావించలేదు.
- అందుకే మన చరిత్రలో పలు యుద్ధాల్లో హిందూ రాజులు సాధించిన విజయాలకు పాఠ్య పుస్తకాల్లో మరింతగా చోటు కల్పించాలి.
- అన్ని పాఠ్యపుస్తకాల్లోనూ ఇండియన్ నాలెడ్జ్ సిస్టం (ఎన్‌కేఎస్)ను కొత్తగా ప్రవేశపెట్టాలి.
- కమిటీలో ఐసీహెచ్ఆర్ చైర్‌పర్సన్ రఘువేంద్ర తన్వర్, జేఎన్‌యూ ప్రొఫెసర్ వందనా మిశ్రా, వసంత్ షిండే, మమతా యాదవ్ తదితరులు సభ్యులుగా ఉన్నారు.

జమిలి ఎన్నికలు... కోవింద్‌తో లా కమిషన్ భేటీ

పార్టీల అభిప్రాయాలు కోరుతూ లేఖలు

న్యూఢిల్లీ: 'ఒక దేశం–ఒకేసారి ఎన్నికలు' అంశంపై ఏర్పాటైన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని ఉన్నత స్థాయి కమిటీతో కేంద్ర లా కమిషన్ బుధవారం భేటీ అయింది. లోక్‌సభకు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిపేందుకు రాజ్యాంగానికి చేయాల్సిన సవరణలు తదితరాలతో కూడిన రోడ్ మ్యాప్‌ను కమిటీ ముందు ఉంచింది. లోక్‌సభ, అసెంబ్లీల ఎన్నికలను ఒకేసారి జరిపే సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా లా కమిషన్‌ను కేంద్ర న్యాయ శాఖ ఇప్పటికే పురమాయించింది. వాటితో పాటు మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికలను ఒకేసారి జరిపే సాధ్యాసాధ్యాల పరిశీలన బాధ్యతను కోవింద్ కమిటీకి అప్పగించింది. ఈ అంశంపై లా కమిషన్ రూపొందిస్తున్న నివేదిక ఇంకా తుది రూపు సంతరించుకోవాల్సి ఉందని సమాచారం. ఒక దేశం–ఒకేసారి ఎన్నికలు అంశంపై అభిప్రాయాలు, సూచనలు 3 నెలల్లో చెప్పాలంటూ రాజకీయ పార్టీలకు కోవింద్ కమిటీ తాజాగా లేఖలు రాసింది. ఆరు జాతీయ పార్టీలు, 33 రాష్ట్ర పార్టీలు, ఏడు నమోదైన గుర్తింపు లేని పార్టీలకు లేఖలు వెళ్లాయి. దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీల పదవీకాలాలను పొడిగించడం, తగ్గించడం వంటి చర్యల ద్వారా 2029లో వాటికి సైతం లోక్‌సభతో పాటే ఎన్నికలు జరిపేందుకు అవసరమైన విధాన రూపకల్పనలో లా కమిషన్ ప్రస్తుతం తలమునకలైంది.

ఎరువులపై రూ.22,303 కోట్ల సబ్సిడీ

న్యూఢిల్లీ: రబీ సీజన్‌లో పాస్ఫరస్, పొటాషియం (పీ అండ్ కే) సంబంధిత ఎరువులపై రూ.22,303 కోట్ల సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. 50 కేజీల డీఏపీ బస్తా ధరను రూ.1,350గానే కొనసాగించాలని నిర్ణయించింది. 2023–24 రబీ సీజన్(2023 అక్టోబర్ ఒకటో తేదీ నుంచి 2024 మార్చి 31 దాకా)లో పోషకాల ఆధారిత సబ్సిడీకి ఎరువులు, రసాయనాల శాఖ చేసిన ప్రతిపాదనలకు ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం ఆమోదముద్ర వేసింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర సమాచార, ప్రసార మంత్రి అనురాగ్ ఠాకూర్ తర్వాత మీడియాకు వెల్లడించారు. రైతులకు అందుబాటు ధరల్లో చాలినన్ని ఎరువులను అందుబాటులో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన చెప్పారు. 'నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియంలు పాత ధరకే లభిస్తాయి. అంటే బస్తా నత్రజని పాత రూ.1,470 ధరకే, ఎస్ఎస్‌పీ(సింగిల్ సూపర్ ఫాస్ఫేట్) బస్తా దాదాపు రూ.500కు దొరుకుతాయి. పొటాష్(ఎంఓపీ) బస్తా ధర రూ.1,655కు తగ్గనుంది' అని మంత్రి వివరించారు. గత ఖరీఫ్ సీజన్‌కు రూ.38,000 కోట్ల ఎరువుల సబ్సిడీని కేంద్రం అందజేయడం తెలిసిందే. మొత్తం వార్షిక ఎరువుల సబ్సిడీ రూ.2.55 లక్షల కోట్లకు పెరిగిందని ఠాకూర్ చెప్పారు.

భారత అమెరికన్లకు అత్యున్నత పురస్కారాలు

బైడెన్ చేతుల మీదుగా అందుకున్న గాడ్గిల్, సురేశ్

వాషింగ్టన్: భారతీయ అమెరికన్ శాస్త్రవేత్తలు అశోక్ గాడ్గిల్, సుబ్రా సురేశ్ అమెరికా అత్యున్నత శాస్త్ర సాంకేతిక రంగ అవార్డులు అందుకున్నారు. గాడ్గిల్‌కు వైట్ హౌస్ నేషనల్ మెడల్ ఫర్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్, సురేశ్‌కు నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్ అవార్డులు దక్కాయి. అధ్యక్షుడు జో బైడెన్ వారికి ఈ ప్రతిష్ఠాత్మక అవార్డులతో అందజేశారు. మానవ జీవితాన్ని సుఖవంతం చేసే పలు అమూల్య పరికరాలను కనిపెట్టిన ఘనత గాడ్గిల్‌ది అంటూ కొనియాడారు. ఇక మెటీరియల్ సైన్స్, ఇతర రంగాల్లో దాని వాడకాన్ని సురేశ్ కొత్త పుంతలు తొక్కించారన్నారు. ఈ అవార్డులను అగ్ర శ్రేణి అమెరికా ఇన్నొవేటర్లకు అందిస్తుంటారు.

కింది స్థాయి నుంచి...

ప్రతిష్ఠాత్మక అవార్డులు అందుకున్న శాస్త్రవేత్తలిద్దరిదీ కష్టించి కింది స్థాయి నుంచి ఎదిగిన నేపథ్యమే. గాడ్గిల్ 1950లో ముంబైలో జన్మించారు. అక్కడ, ఐఐటీ కాన్పూర్‌లో ఫిజిక్స్‌లో డిగ్రీలు పొందారు. యూసీ బర్కిలీ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేశారు. 1980లో లారెన్స్ బర్కిలీ ల్యాబ్‌లో చేరారు. ఈ ఏడాదే రిటైరయ్యారు. అక్కడే సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ గౌరవ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్నారు. చౌకైన, సురక్షిత తాగునీటి సదుపాయాలు, తక్కువ ఇంధనంతో సమర్థంగా పని చేసే గ్యాస్ స్టౌలు, మెరుగైన విద్యుద్దీపాల అభివృద్ధిలో ఆయన పరిశోధనలు ఎంతగానో దోహదపడ్డాయి. ముంబైకే చెందిన సురేశ్ నేషనల్ సైన్స్ ఫౌండేషన్ సారథిగా వ్యవహరించారు. ఈ ఘనత సాధించిన తొలి ఆసియన్ అమెరికన్‌గా నిలిచారు. 1956లో పుట్టిన ఆయన ఐఐటీ మద్రాస్ నుంచి బీటెక్ పూర్తి చేశారు. మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి రెండేళ్లలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 1983లో బ్రౌన్ వర్సిటీలో ఇంజనీరింగ్ విభాగంలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రొఫెసర్‌గా రికార్డులకెక్కారు.

ఇస్రో చైర్మన్ ఆత్మకథ

తిరువనంతపురం: ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ ఆత్మకథ రాశారు. 'నిలవు కుడిచ సింహగల్ (వెన్నెల గ్రోలిన సింహాలు)' పేరిట మలయాళంలో రాసిన ఈ ఆత్మకథ త్వరలో రానుంది. యువతరానికి తన జీవితం స్ఫూర్తిగా నిలవాలనే ఈ ఆత్మకథ రాసినట్లు ఆయన వెల్లడించారు. అత్యంత నిరుపేద గ్రామీణ కుటుంబంలో పుట్టిన ఆయన ఇస్రో చైర్మన్ స్థాయికి ఎదిగిన తీరు, ఆ క్రమంలో ఎదురైన కష్టాలను ఆయన ఇందులో హృద్యంగా వివరించారు. చంద్రయాన్ మిషన్ విజయం తనను ఆత్మకథ రచనకు పురిగొల్పిందని చెప్పారాయన. ఇంజనీరింగ్ కాలేజీకి పాత డొక్కు సైకిల్ మీద వెళ్లిన వైనం తదితరాలను పుస్తకంలో పొందుపరిచారు.

సునాక్ పాలనకు ఏడాది

లండన్: భారతీయ మూలాలున్న రిషీ సునాక్ బ్రిటన్ ప్రధాన మంత్రిగా పగ్గాలు చేపట్టి బుధవారంతో ఏడాది పూర్తి చేసుకున్నారు. అయితే వార్షికోత్సవ సంబరాల వంటివాటికి దూరంగా రోజంతా ఆయన రోజువారీ అధికారిక విధుల్లోనే గడపడం విశేషం. 43 ఏళ్ల సునాక్ సరిగ్గా ఏడాది కింద ఎన్నో సవాళ్ల నడుమ ప్రధాని కావడం తెలిసిందే. ఆ పదవి చేపట్టిన తొలి భారత మూలాలున్న వ్యక్తిగా ఆయన చరిత్ర సృష్టించారు. 'ఏడాదిలో ఎంతో సాధించాం. కానీ సాధించాల్సింది ఇంకా ఎంతో ఉంది' అంటూ సోషల్ మీడియాలో ఆయన వీడియో పోస్ట్ చేశారు. అధికార కన్సర్వేటివ్ పార్టీ చైర్మన్ గ్రెగ్ హ్యాండ్స్ సైతం రిషి పాలనను ఈ సందర్భంగా ప్రశంసించారు.

యాత్రకు శ్రీకారం

సాక్షి, చెన్నై: పవరింగ్ యువర్ సేఫ్ డ్రైవ్ నినాదంతో బ్రేక్ ఇండియా నేతృత్వంలో ఆటో గ్యారేజీ, రిటైలర్ అవగాహన, మొబైల్ శిక్షణ, మెకానిక్‌లకు ఇంటి వద్దకే వెళ్లి తర్ఫీదు ఇవ్వడమే లక్ష్యంగా కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు బుధవారం యాత్రకు శ్రీకారం చుట్టారు. 90 నగరాలు 13 రాష్ట్రాల గుండా 17వేల కి.మీ దూరం ఈ యాత్ర సాగనుంది. దీన్ని బ్రేక్స్ ఇండియా ఉపాధ్యక్షుడు సుజిత్ నాయక్ జెండా ఊపి ప్రారంభించారు.



న్యూస్‌రీల్

2,222 గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- నవంబర్ 1 నుంచి దరఖాస్తుల స్వీకరణ

కొరుక్కుపేట: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్ టీచర్లు, జిల్లా రిసోర్స్ సెంటర్ టీచర్ ట్రైనీల పోస్టుల భర్తీకీ గ్రీన్ సిగ్నల్ లభించింది. నవంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. ఈ మేరకు బుధవారం టీచర్ సెలక్షన్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేస్తూ ప్రకటన విడుదల చేసింది. ఇందులో గ్రాడ్యుయేట్ టీచర్స్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ టీచర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు అర్హులైన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు అని , దరఖాస్తు చేసే టప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు అర్హత రుసుము పత్రాలను తప్పనిసరిగా పంపించాలని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్ టీచర్లు, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ టీచర్ ట్రైనర్లు కోసం ప్రస్తుతం 2222 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి సంబంధించిన పోటీ పరీక్ష 2024 జనవరి 7వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు . ఖాళీలలో పాఠశాల విద్యలో 2,171, అత్యంత వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖలో 23, ఆది ద్రావిడ సంక్షేమ శాఖలో 16, వికలాంగుల సంక్షేమ శాఖలో 12 ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ పోస్టుల వివరాలను శాఖల వారీగా, సబ్జెక్టుల వారీగా, రిజర్వేషన్ల వారీగా ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు వెబ్‌సైట్‌లో ప్రచురించినట్లు వెల్లడించారు.

రూ. 800 కోట్లతో ఆలయాల మరమ్మతు

- మంత్రి శేఖర్ బాబు వెల్లడి



సామూహిక వివాహాల్లో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రులు

కొరుక్కుపేట: ఉభయదారులు అందించే రూ.800 కోట్లు నిధులతో ఆలయాల్లో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖమంత్రి పీకే శేఖర్ బాబు తెలిపారు. రూ. 53.90 లక్షలతో కోయంబేడు, కురంగీశ్వరర్ , వైకుంఠ వాస పెరుమాల్ ఆలయ నిర్మాణ పనులు, రూ. 85.40 లక్షలతో ఐదు అంచెల రాజగోపురం, రూ. 49 లక్షలతో అన్నదాన కూడం నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సబ్ కాంట్రాక్టుల ద్వారా ఇప్పటి వరకు రూ.800 కోట్లతో పనులు జరిగాయని పేర్కొంటూ ఆలయాలకు చెందిన ఆస్తుల రికవరీలో ఇప్పటి వరకు రూ. 5,472 కోట్ల విలువైన 5,820 ఎకరాల భూమి రికవరీ చేశామని తెలిపారు. మైలాపూర్‌లోని కపాలీశ్వర్ టెంపుల్ ఫండ్ ద్వారా రూ.29 కోట్లతో ఏర్పాటు చేయనున్న నూతన సాంస్కృతిక కేంద్రానికి సంబంధించిన ఆరోపణలు అవాస్తవమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా చెన్నై ఈస్ట్ డిస్ట్రిక్ట్ హార్బర్ వెస్ట్ రీజయన్ డీఎంకే తరపున కరుణానిధి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని 20 జంటలకు వివాహాలు జరిపించారు. ఇందులో మంత్రులు పీకే శేఖర్ బాబు, మంత్రి వేలు, మేయర్ ప్రియా, ఏరియా కార్యదర్శులు ఎస్. మురళి, ఎమ్మెల్యే జోసెప్ శామ్యూల్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గుంతలో బోల్తా పడిన ఆటో

- ఇద్దరు మృతి

అన్నానగర్: తడాగం సమీపంలో బుధవారం గుంతలో ఆటో బోల్తా పడి ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. కోయంబత్తూరు తడాగం సమీపంలోని వీరపాండి గ్రామ పరిధిలో వంజియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయ ఉత్సవాలకు ఐదుగురు మంగళవారం ఉదయం వెళ్లి బుధవారం తెల్లవారుజామున ఆటోలో వచ్చారు. ఈక్రమంలో ఆటో రోడ్డు పక్కన ఉన్న గుంతలో బోల్తా పడింది. ఆటోలోని ఐదుగురు శిధిలాలలో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలంలోనే వేలండిపాళయం ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఏలుమలై (42), కేబుల్ ఆపరేటర్ కరుప్పుస్వామి (40) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో ఆటోలోని శక్తివేల్ (38), యువరాజ్ (34), దినేష్ (34) అనే ముగ్గురు వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కోయంబత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వారికి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. తడాగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20 వాహనాల అద్దాలు ధ్వంసం

తిరువొత్తియూరు: అరూర్ సమీపంలో ఇంటి ముందు పార్క్ చేసిన 20కి పైగా వాహనాలను ధ్వంసం చేసిన దుండగులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. వివరాలు.. ధర్మపురి జిల్లా అరూర్ నగర్‌లోని తిల్‌లైనగర్, నపట్నా పెట్టి, మేల్ పాట్టాపెట్టి అరూర్ సమీపంలోని ఇళ్ల ముందు పార్క్ చేసిన కార్లపై ఇష్టారాజ్యంగా గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈక్రమంలో మురుగన్, గణేశన్, మోహన్, సిలంబరసన్, శివకుమార్, మణికృష్ణన్ తదితరులకు చెందిన ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్గో వాహనాలు, కార్లు ధ్వంసమయ్యాయి. సమాచారం అందుకున్న అరూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఉద్యోగులపై వరాల జల్లు

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై మరోసారి రాష్ట్ర ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. తాజాగా కరువు భత్యాన్ని మరోసారి పెంచింది. ఈ ఏడాదిలోనే రెండోసారి డీఏను నాలుగు శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బుధవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను సీఎం స్టాలిన్ జారీ చేశారు.

- కరువు భత్యం మరో 4 శాతం పెంపు
- 42 నుంచి 46 శాతంగా అమలు చేయాలని నిర్ణయం
- ఒకే ఏడాదిలో రెండు సార్లు కానుక
- సీఎం స్టాలిన్ కీలక నిర్ణయం
- ప్రభుత్వంపై మరో రూ.2,546 కోట్ల అదనపు భారం



జీపులను జెండా ఊపి ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్



తాళాలను అందజేస్తూ..

సాక్షి, చెన్నై : డీఎంకే ప్రభుత్వం మరోసారి ఉద్యోగులకు లబ్ధి చేకూర్చింది. వివరాలు.. అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతోంది.. ఈ కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన, ఇవ్వని వాగ్దానాలెన్నో తాము దిగ్విజయవంతంగా అమలు చేశామని సీఎం స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు నెలకు రూ. 1000 నగదు పంపిణీ, బడుల్ల అల్పాహారం, గృహిణులకు నెలకు రూ. 1000 నగదు అందజేత పథకాలు తమ ప్రభుత్వంలో మైలురాయిగా మారాయని వెల్లడించారు. అన్ని రకాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగుల కీలక పాత్ర పోషిస్తుండడంతో వారిపై సీఎం స్టాలిన్ ప్రత్యేక అభిమానం చూపిస్తున్నారు. ఈ ఏడాది మేలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు డీఏను నాలుగు శాతం పెంచారు. దీంతో అప్పట్లో 38 శాతంగా ఉన్న డీఏ 42 శాతానికి చేరింది. ప్రస్తుతం మరో నాలుగు శాతం అదనంగాపెంచడం విశేషం. ఈ పెంపునకు సంబంధించిన ఉత్తర్వులను సీఎం స్టాలిన్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులు..

ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలనును ప్రజల్లోకి తీసుకెళ్లే మహత్తర బాధ్యతల్లో అంకితమైన ప్రభుత్వ అధికారులు ఉపాధ్యాయుల సంక్షేమం దిశగా ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ వివరించారు. కరోనా పరిస్థితుల నేపథ్యంలో అధికారంలోకి రాగానే ఎదురైన ఆర్థిక సంక్షోభం, అప్పుల భారాన్ని గుర్తు చేస్తూ, ఉపాధ్యాయులు, ఉద్యోగుల డిమాండ్లను దశల వారీగా తమ ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు డీఏను పెంచుతున్నామని ప్రకటించారు. ఇది వరకు జారీ చేసిన ఉత్తర్వులతో డీఏ 42 శాతానికి చేరినట్టు గుర్తు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు శాతం పెంచుతున్నామని ప్రకటించారు. ఇది ఈ ఏడాది జూలై నుంచి అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం 4 శాతం డీఏను పెంచడం ద్వారా 16 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లుకు ప్రయోజనం చేకూర్చినట్టుగా పేర్కొన్నారు. ఈ పెంపు కారణంగా ప్రభుత్వానికి ఏడాదికి 2,546.16 కోట్ల అదనపు భారం పడనున్నట్లు తెలిపారు. ఆర్థికభారం పెరిగినా డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ఇంజినీర్లకు జీపులు

ముందుగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో జలవనరుల శాఖ డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు రూ.4.70 కోట్లతో కొనుగోలు చేసిన 41 జీపులను సీఎం స్టాలిన్ పంపిణీ చేశారు. ఈ వాహనాలకు జెండా ఊపారు. వ్యవసాయం, తాగునీటి వనరులను పరిరక్షణలో సబ్ డివిజన్లలో పనిచేసే ఇంజినీర్లకు ఆయా ప్రాంతాలకు వెళ్లి పర్యవేక్షణ, పరిశీలనకు ఉపయోగకరంగా ఉండే విధంగా ఈ వాహనాలను కొనుగోలు చేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వివరించింది. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి దురై మురుగన్, సీఎస్ శివదాస్ మీన, నీటి పారుదల శాఖ కార్యదర్శి సందీప్ సక్సేనా, డివిజన్ చీఫ్ ఇంజినీర్ కె. పొన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విధానపరమైన అంశాల్లో కోర్టుల జోక్యం తగదు

- శునకాల దిగుమతి కేసులో హైకోర్టులో కేంద్రం వాదనలు



సాక్షి, చెన్నై : విదేశాల నుంచి శునకాల దిగుమతికి చెక్ పెట్టే విధంగా కేంద్ర జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా హైకోర్టు నిర్ణయం తీసుకోవడాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. సెంట్రల్ గవర్నమెంట్ తీసుకునే విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయ స్థానాల జోక్యం తగదని అదనపు సొలిసిటర్ జనరల్ ఏఆర్ఎల్ సుందరేష్ వాదనలు వినిపించారు. విదేశాల నుంచి ఖరీదైన శునకాల దిగుమతికి చెక్ పెట్టే విధంగా కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులపై ఇటీవల న్యాయమూర్తి అనితా సుమంత్ బెంచ్ స్టే విధించింది. విదేశీ శునకాల కారణంగా స్వదేశీ శునకాలకు ఏర్పడే నష్టం, కష్టం, సమస్యలకు కేంద్రం తగిన పరిష్కారం చూపకపోవడంతో ఆ నిర్ణయంపై న్యాయమూర్తి స్టే విధించారు. దీనిని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన అప్పీల్ పిటిషన్ బుధవారం హైకోర్టు సీజే ఎస్వీ గంగా పూర్వాల బెంచ్‌లో విచారణకు వచ్చింది. కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ సుందరేష్ హాజరై వాదనలు వినిపించారు. కేంద్ర ప్రభుత్వం సిద్ధాంతపరంగా తీసుకునే నిర్ణయాలపై కోర్టులు స్టే విధించడం సబబు కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు ఆటంకం కలిగించే విధంగా సింగిల్ బెంచ్ న్యాయమూర్తి స్టే విధించి తప్పు చేశారని, దాన్ని తక్షణం ఎత్తివేయాలని కోరారు. వాదనల అనంతరం తదుపరి విచారణను నవంబర్ 8వ తేదీకి సీజే బెంచ్ వాయిదా వేసింది.

వారాంతంలో 1000 వైద్య శిబిరాలు



బీసెంట్ నగర్‌లో వాకింగ్ ట్రాక్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

సాక్షి, చెన్నై : వర్షాల సీజన్ నేపథ్యంలో ఇక ప్రతివారం చివర్లో రాష్ట్ర వ్యాప్తంగా 1000 వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై బీసెంట్ నగర్‌లో వాకింగ్ కోసం కేటాయించిన మార్గాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఎం. సుబ్రమణియన్ మీడియాతో మాట్లాడుతూ, వర్షాల సీజన్ నేపథ్యంలో వచ్చే జ్వరాలను కట్టడి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రానున్న 10 వారాల పాటు వారాంతంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అన్ని రకాల పరీక్షలూ ఈ శిబిరాల్లో నిర్వహించి రోగులకు మందులను పంపిణీ చేస్తామన్నారు. ప్రజా ఆరోగ్య సంరక్షణలో భాగంగా చెన్నైతో పాటు 38 జిల్లాల్లో వాకింగ్ కోసం ప్రత్యేక మార్గం ఏర్పాటు పనులను వేగవంతం చేస్తున్నామని, చెన్నైలో బీసెంట్ నగర్ బీచ్ మార్గాన్ని తాజాగా పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి గగన్ దీప్‌సింగ్ బేడీ, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి డెల్టాలో భారీ వర్షాలు

- క్రమంగా విస్తరిస్తున్న ఈశాన్య రుతుపవనాలు
- నైరుతిలో సాధారణ వర్షపాతం కంటే 39 శాతం తక్కువగా వానలు



సాక్షి, చెన్నై: ఈశాన్య రుతు పవనాలు రాష్ట్రంలో క్రమంగా విస్తరిస్తున్నట్లు చెన్నై వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈనెల 29వ తేదీ నుంచి డెల్టా జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసింది. వివరాలు.. ఈ ఏడాది నైరుతి రుతు పవనాల ప్రభావం రాష్ట్రంలో మరీ తక్కువగా ఉన్న విషయం తెలిసిందే. ఇక సాధారణ వర్షపాతం కన్నా 39 శాతం వర్షం తక్కువగా పడ్డట్లు వాతావరణ కేంద్రం బుధవారం ప్రకటించింది. చెన్నైలో 18 సెంటీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా, ఐదు సెంటీ మీటర్లు వర్షం మాత్రమే పడిందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో నైరుతి కారణంగా అత్యధిక వర్షం కన్యాకుమారిలో పడింది. ఇక్కడ సగటున 19 సెంటీ మీటర్ల వర్షం పడాల్సి ఉండగా.. ఏకంగా 49 సెంటీ మీటర్ల వర్షం పడడం విశేషం. ఒక్క కన్యాకుమారి మినహా తక్కిన అన్ని జిల్లాలో సాధారణం కంటే తక్కువగానే వర్షపాతం నమోదవడం గమనార్హం.

బలపడుతున్న ఈశాన్యం

అదే సమయంలో నైరుతి రుతుపవనాల సీజన్ ముగిసి ప్రస్తుతం ఈశాన్య రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. ఈ పవనాలు క్రమంగా విస్తరిస్తున్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో నెలకొన్న తుపాన్‌లు తీరం దాటిన నేపథ్యంలో ప్రస్తుతం తమిళనాడు వ్యాప్తంగా ఈ పవనాలు విస్తరిస్తున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. ప్రధానంగా డెల్టాలోని తిరువారూర్, నాగపట్నం, కడలూరు, తంజావూరు, తిరుచ్చి, అరియలూరు, పుదుకోట్టై, పెరంబలూరు జిల్లాలతోపాటు శివగంగై, విల్లుపురం, కళ్లకురిచ్చి తదితర 16 జిల్లాల్లో ఈనెల 29వ తేదీ నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రకటనతో ఆ జిల్లాల అధికార యంత్రాంగం మరింత అప్రమత్తం అయ్యింది. ఈ మేరకు ముందు జాగ్రత్త చర్యలను ఆయా జిల్లాల కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

చిత్తశుద్ధి ఉంటే సంతకం పెట్టాలి

- గవర్నర్‌కు పొన్ముడి సూచన

సాక్షి, చెన్నై: స్వాతంత్య్ర సమరయోధులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే శంకరయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసే ముసాయిదాపై గవర్నర్ ఆర్‌ఎన్ రవి తప్పసరిగా సంతకం పెట్టాలని రాష్ట్ర ఉన్నత విద్యామంత్రి పొన్ముడి సూచించారు. వివరాలు.. రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్య్ర సమరయోధులను విస్మరిస్తున్నట్టుగా గవర్నర్ ఆర్‌ఎన్ రవి చేసిన వ్యాఖ్యలు చర్చకుదారి తీసిన విషయం తెలిసిందే. గవర్నర్ వ్యాఖ్యలపై ఉన్నత విద్యా మంత్రి పొన్ముడి బుధవారం స్పందించారు. మీడియాతో పొన్ముడి మాట్లాడుతూ, స్వాతంత్య్ర సరమయోధులకు పెద్ద పీట వేస్తూ, వారిని గౌరవిస్తూ వస్తున్న ఏకైక పార్టీ డీఎంకే అని వ్యాఖ్యలు చేశారు. సమరయోధుల త్యాగాలకు గుర్తింపుగా స్మారక మందిరాలు, విగ్రహాల ఏర్పాటుతో పాటు వారి కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక పథకాలను వర్తింప చేస్తోందని వివరించారు. అయితే గవర్నర్ ఆర్‌ఎన్ రవికి హఠాత్తుగా తమిళనాడులోని స్వాతంత్య్ర సమరయోధులు గుర్తుకు రావడం, వారి మీద ప్రేమ ఒలక బోసే రీతిలో వ్యాఖ్యలు చేస్తూ ప్రభుత్వాన్ని నిందించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తమిళనాడుకు చెందిన స్వాతంత్య్ర సమర యోధులపై నిజంగా చిత్తశుద్ధి, ప్రేమ, అభిమానం, గౌరవం ఉంటే శంకరయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడానికి మార్గాన్ని సుగమం చేయాలని కోరారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, సామాజిక న్యాయం, ఆర్థిక బలోపేతం దిశగా పోరాడుతూ 100వ జన్మదినం జరుపుకుంటున్న సీపీఎం సీనియర్ నేత శంకరయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడానికి కామరాజర్ వర్సిటీ నిర్ణయించిందన్నారు. ఆ వర్సిటీ సిండికేట్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ముసాయిదాను రాజ్ భవన్‌కు పంపించారని గుర్తు చేశారు. నవంబర్ 2వ తేదీ ఆ వర్సిటీ స్నాతకోత్సవం జరగనుందని, ఇంత వరకు గవర్నర్ ఆ ముసాయిదాపై సంతకం పెట్టకపోవడం శోచనీయమని విమర్శించారు. ఇకనైనా స్వాతంత్య్ర సమరయోధులు, పోరాటాలు చేసిన వారిపై చిత్తశుద్ధి ఉంటే, తక్షణం శంకరయ్యకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడానికి పంపించిన ముసాయిదాపై గవర్నర్ ఆర్‌ఎన్ రవి సంతకం పెట్టాలని ప్రత్యేకంగా తాను విజ్ఞప్తి చేసుకుంటున్నానని మంత్రి పొన్ముడి పేర్కొన్నారు. ఇలా ఉండగా గవర్నర్ వ్యాఖ్యలపై సీఎం స్టాలిన్ విమర్శలు గుప్పిస్తూ ప్రకటన విడుదల చేశారు. మహాత్మాగాంధీ త్యాగాన్ని గుర్తు చేస్తూ, గాడ్సే లాంటి వారి కిరాతకత్వంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ.. హఠాత్తు కుబేరులకు స్వాతంత్య్ర సమరయోధులు గుర్తుకు రావడం హాస్యాస్పదంగా ఉందని గవర్నర్‌పై విరుచుకుపడ్డారు. స్వాతంత్య్ర సమరయోధులకు గుర్తింపు, గౌరవాన్ని కల్పించడంలో ఏ మాత్రం తాము తగ్గమని పని గట్టుకుని విమర్శలు చేయడం మానుకుంటే మంచిదని హితవు పలికారు

రజనీకాంత్ ఇంట నవరాత్రి వేడుకలు

- హాజరైన సినీ, రాజకీయ ప్రముఖులు



రజనీకాంత్ ఇంట్లో నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

తమిళసినిమా: సూపర్ స్టార్ రజనీకాంత్ ఇంట్లో మంగళవారం నవరాత్రి వేడుకలు ఘనంగా సాగాయి. పండుగ చివరి రోజున రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక పోయస్ గార్డెన్‌లోని తమ ఇంటిలో నిర్వహించిన ఈ వేడుకల్లో పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొనడం విశేషం. ముఖ్యంగా తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సుందరరాజన్, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్, మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, ఆయన కుటుంబ సభ్యులు, మాజీ ఆరోగ్యశాఖ కార్యదర్శి రాధాకృష్ణన్, సీనియర్ నటి లత, నటి మీనా, నటుడు విజయ్ తల్లి శోభ చంద్రశేఖర్ మొదలగు పలువురు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కాగా నటుడు రజనీకాంత్ తన 170వ చిత్ర షూటింగ్‌లో పాల్గొంటున్న కారణంగా ఈ వేడుకలకు హాజరుకాలేదు. ఆయన కూతుర్లు ఐశ్వర్య, సౌందర్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లతారజనీకాంత్ అతిథులందరికీ కానుకలు అందించారు.

లోక్‌సభ ఎన్నికలపై కసరత్తు

- ఓటర్ల జాబితాపై ఎస్ఈసీ సత్యప్రద సాహూ సమీక్ష
- గుర్తింపు పొందిన పార్టీల నాయకులతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈసీ సత్యప్రద సాహూ

సాక్షి, చెన్నై: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రద సాహూ దృష్టి సారించారు. ఓటర్ల జాబితా రూపకల్పన, మార్పులు చేర్పులపై ఇందులో చర్చించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభిప్రాయాలను ఎస్ఈసీకి వివరించారు. వివరాలు.. 2024 లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలోని 39 స్థానాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఎన్నికల ప్రధాన అధికారి సాహ్రూ దృష్టి పెట్టారు. రాష్ట్రంలో అన్ని పనులు ముగించి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం సచివాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో బీజేపీ , కాంగ్రెస్, సీపీఎం , సీపీఐ తదితర ఆరు జాతీయ పార్టీలు, డీఎంకే, అన్నాడీఎంకే తదితర నాలుగు రాష్ట్ర పార్టీల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా ఓటర్ల జాబితా రుపకల్పనపై చర్చించారు.

అభిప్రాయాల సేకరణ

అన్నాడీఎంకే తరపున హాజరైన సీనియర్ నేత జయకుమార్ తన ప్రసంగంలో ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టాలని, పాక్షపాక్షం లేకుండా ఓటరు జాబితాను అందరికీ సమానంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎంకే తరపున హాజరైన సీనియర్‌నేత ఆర్ఎస్ భారతీ స్పందిస్తూ, ఎన్నికల విధులకు హాజరయ్యే మహిళా అధికారులు, సిబ్బంది కోసం ఈ టాయ్‌లెట్లను ఏర్పాటు చేయాలని, ఎన్నికల సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలను సక్రమంగా కల్పించడంలో ఈ సారైనా దృష్టి పెట్టాలని కోరారు. బీజేపీ తరపున హాజరైన కరాటే త్యాగరాజన్ స్పందిస్తూ బీజేపీ తరపున బూత్ ఏజెంట్ల జాబితాను ఇప్పటికే అందజేశామని, ఇంత వరకు వెబ్‌సైట్‌లో పొందు పరచలేదని అసహనం వ్యక్తం చేశారు. మాదిరి ఓటరు జాబితా విడుదలకు బీజేపీ మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఆమ్‌ఆద్మీ తరపున హాజరైన ప్రతినిధి మాట్లాడుతూ, చేతి వేలిరేఖలు, ఆధార్‌కార్డు ఆధారంగా ఎక్కడి నుంచైనా బయె మెట్రిక్‌విధానం ద్వారా ఓటింగ్‌కు పరిశీలించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలలో ఓటరు శిబిరాలు ఏర్పాటు చేసిన 18 ఏళ్లు నిండుతున్న వారి పేర్లను నమోదు చేయాలని కోరారు. సీపీఎం ప్రతినిధులు స్పందిస్తూ, తమిళనాడులో 10కి పైగా పార్టీలు ఉన్నాయని, వారిని కూడా సమావేశానికి పిలిచి ఉండాలని, వారి అభిప్రాయాలను కూడా స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ తరపున హాజరైన నవాజ్ మాట్లాడుతూ, మరణించిన వారి పేర్లు ఇంకా ఓటర్ల జాబితాలో ఉన్నాయని, వాటిని తొలగించాలని, గుర్తింపు పొందిన పార్టీలకు ఓటరు జాబితాలను ఆయా ప్రాంతాలలో రెండేసి జాబితాలుగా అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం మేరకు శుక్రవారం మాదిరి ఓటరు జాబితాను విడుదల చేయానికి ఎన్నికల యంత్రాంగం సిద్ధమైంది. ఓటర్ హెల్ప్‌లైన్లు, మొబైల్‌యాప్‌ల సేవలను విస్తృతం చేయడంతో పాటు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు తుది అవకాశం కల్పించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా నవంబరు 4, 5 తేదీల్లో, నవంబర్ 18,19 తేదీలో ప్రత్యేక శిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌లలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎరుపు వర్ణంలో సముద్రం

- పుదుచ్చేరి తీరంలో వింత పరిస్థితి

సాక్షి,చెన్నై : పుదుచ్చేరి సముద్ర తీరంలో నీరు రంగు మారింది. ఎరుపు వర్ణంలో సముద్రుడు కనిపించడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ పరిస్థితి నెలకొనడానికి దారితీసిన పరిస్థితులను అంచనా వేయాలని సీఎం రంగస్వామి అధికారులను ఆదేశించారు. వివరాలు.. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి బీచ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక్కడకు నిత్యం సందర్శకులు భారీ సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ తీరంలోనే పుదుచ్చేరి ప్రభుత్వ సచివాలయం కూడా ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం, బుధవారం ఉదయం ఓ అర్ధగంట పాటు సచివాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు సముద్రం రంగు మారడం చర్చకు దారి తీసింది. తొలుత ఉత్కంఠ రేపినా, ఏదేని రసాయనాలు కలిసి ఉండవచ్చునే సమాచారంతో టెన్షన్ వీడింది. అయితే కొన్నిగంటల పాటు సముద్రం , అలల తాకిడి ఎరుపు వర్ణంలో ఉండడంతో చూసేందుకు జనం ఎగబడ్డారు. అయితే సముద్రంలోని కొన్ని రకాల పదార్థాలు కలవడం, వాటికి రసాయనాలు తోడు కావడంతో ఎరుపు వర్ణం లో సముద్రం కనిపించి ఉండే అవకాశం ఉందని కొందరు పరిశోధకులు పేర్కొంటున్నారు. అయితే, తరచూ ఇక్కడ సముద్రం రంగు మారుతుండడంపై అధ్యయనం చేయాలని సీఎం రంగస్వామి ఆదేశించారు. ఈమేరకు పర్యావరణ అధికారులు దృష్టి సారించారు.

క్లుప్తంగా

సమాజసేవకు ముందుకు రావాలి



క్లబ్‌ను ప్రారంభిస్తున్న ఆవడి పోలీసు కమిషనర్ శంకర్

తిరువళ్లూరు: సమాజసేవకు యువతి యువకులు ముందుకు రావాలని ఆవడి పోలీసు కమిషనర్ శంకర్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా ఆవడిలోని ట్యాంక్ ఫ్యాక్టరీ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ బాయ్స్ అండ్ గాల్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించే కార్యక్రమం బుధవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ శంకర్ హాజరై క్లబ్‌ను ప్రారంభించి యువతీ యువకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ శంకర్ మాట్లాడుతూ సమాజసేవకు యువతి యువకులు ముందుకు రావాలన్నారు. సమాజంలో కొన్ని సంఘటనలు పోలీసుల దృష్టికి రాకపోవచ్చు. కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి బయపడి ఇంటికే పరిమితం కావొచ్చు. ఇలాంటి వాటిని గుర్తించి స్థానిక యువకులు పోలీసుల దృష్టికి తేవాలని సూచించారు. పోలీసులను ఆశ్రయించే వారికి నిష్పక్షపాతంగా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ విజయకుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సందడిగా కేక్ మిక్సింగ్



కేక్ మిక్సింగ్ చేస్తున్న నిర్వాహకులు

కొరుక్కుపేట: రానున్న క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నైలోని సవేరాలో కేక్ మిక్సింగ్ కార్యక్రమం సందడిగా సాగింది. సవేరా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ నీనారెడ్డితో పాటు చెఫ్ సిబ్బంది 30 లీటర్ల పానియాలతో పాటు 200 కిలోల డ్రైఫ్రూట్స్, నారింజి గింజలు, వైన్, రమ్ వంటి వాటితో కేక్ మిక్సింగ్ సాగింది. ఏటా ఈ కేక్ మిక్సింగ్ చేయడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.


విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి



అల్పాహారాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

వేలూరు: విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందజేయకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని సేవూరు ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారాన్ని తనిఖీ చేశారు. రుచికరమైన ఆహారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా వంట చేసే ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచుతున్నారా అనే విషయాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు రుచికరమైన ఆహారంతో పాటు సమయానికి ఇవ్వాలని.. వంట చేసే ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు తరచూ పాఠశాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. అనంతరం కాట్పాడి నియోజకవర్గం పరిధిలోని పొన్నై ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆయన వెంట కాట్పాడి యూనియన్ చైర్మన్ వేల్ మురుగన్, తహసీల్దార్ జగదీశ్వరన్ ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పళ్లిపట్టు: వైరల్ జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా పాఠశాల విద్యార్థులకు జ్వర పరీక్షలు చేశారు. పళ్లిపట్టు ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల హెచ్ఎం ధనంజయుడు సమక్షంలో అత్తిమాంజేరిపేట ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు చేశారు. పాఠశాల రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రోజూ వంద మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో జ్వరం బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జ్వరం పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్లు, పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉంటే ఉపాధ్యాయుడు, హెచ్ఎం దృష్టికి తీసుకురావాలని పాఠశాల హెచ్ఎం తెలిపారు. ఏహెచ్ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూండి రిజర్వాయర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో



పూండి సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్

తిరువళ్లూరు: చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే సత్యమూర్తిసాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో రూపంలో కొద్ది రోజులుగా నీరు భారీగా వచ్చిన నేపథ్యంలో బుధవారం ఇన్‌ఫ్లో కనీస స్థాయికి చేరింది. చెన్నై ప్రజలకు తాగునీటిని అందించే తిరువళ్లూరు జిల్లా పూండిలోని సత్యమూర్తి సాగర్ రిజర్వాయర్ ప్రధానమైంది. ఈ రిజర్వాయర్‌కు ఆంధ్రా నుంచి వచ్చే కృష్ణాజలాలతో పాటు వర్షపు నీరే ప్రధాన ఆధారం. ఈ నీటిని రిజర్వాయర్‌లో నిల్వ ఉంచి పుళల్, చెమరంబాక్కం, చోళవరం తదితర రిజర్వాయర్‌లకు నీటిని విడుదల చేసి అక్కడ శుద్ధీకరణ చేసిన తరువాత చెన్నై ప్రజల తాగునీటి అవసరాల కోసం వినియోగిస్తున్నారు. కాగా రెండు రాష్ట్రాల మధ్య జల ఒప్పందంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తమిళనాడుకు ఏటా 12 టీఎంసీల నీటిని రెండు విడతల్లో విడుదల చేయాల్సి ఉంది. జనవరి నుంచి ఏప్రిల్ వరకు నాలుగు టీఎంసీలు, జూలై నుంచి అక్టోబర్ వరకు 8 టీఎంసీల నీటిని విడుదల చేస్తున్నారు. గత జనవరిలో రిజర్వాయర్‌లో ఆశించిన మేరకు నీరు నిల్వ ఉండడంతో కృష్ణానీటిని విడుదల చేయలేదు. అయితే వేసవి ప్రారంభం కాగానే నీటి మట్టం తగ్గడంతో కండలేరు నుంచి నీటిని విడుదల చేయాలని తమిళనాడు ప్రభుత్వం విజ్ఞప్తి చేయడంతో మే 1 నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో పూండి రిజర్వాయర్‌లో ఆశించిన స్థాయిలో నీరు చేరింది. కాగా ఇటీవల పూండీ సమీప ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా రిజర్వాయర్‌కు నీటి రాక పెరిగి పూర్తి స్థాయిలో నిండిపోయింది. మిగులు జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో తగ్గిన నేపథ్యంలో దిగువకు నీటి విడుదలను నిలిపివేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 31.44 అడుగుల మేరకు నీరు నిల్వ ఉంది. సుమారు 2.092 టీఎంసీల నీరు నిల్వ ఉందని రిజర్వాయర్ నుంచి పుళల్‌కు 300 ఘణపరిమానం, చెమరంబాక్కంకు 100 ఘణపరిమానం నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. చెన్నై తాగునీటి అవసరాల కోసం బేబీ కెనాల్ ద్వారా 40 ఘణపరిమానం నీటిని పంపింగ్ చేస్తున్నట్లు అధికారులు వివరించారు. నెల రోజుల క్రితం ఇన్‌ఫ్లో 2500 నుంచి 3500 క్యూసెక్కులు ఉండగా క్రమేనా తగ్గి ప్రస్తుతం కేవలం వంద క్యూసెక్కుల నీరు మాత్రమే వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఏడు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

అన్నానగర్: కృష్ణగిరి మీదుగా కర్ణాటకకు చెందిన వ్యాన్‌లో అక్రమంగా తరలించేందుకు యత్నిస్తున్న ఏడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశారు. కృష్ణగిరి ఫుడ్ స్మగ్లింగ్ విభాగం ఇన్‌స్పెక్టర్ కృష్ణవేణి, పోలీసులు కృష్ణగిరిలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై సేలం బైపాస్‌లో బుధవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహించారు. అటుగా వస్తున్న కార్గో వ్యాన్‌ను పోలీసులు ఆపి సోదాలు చేశారు. వ్యాన్‌లో 50 కిలోల 141 బస్తాలు, 40 కిలోల 3 బస్తాలు ఉన్నాయి. దీనిని పోలీసులు తనిఖీ చేయగా ఏడు టన్నుల రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వ్యాన్ డ్రైవర్‌ను పోలీసులు విచారించగా కాంచీపురం జిల్లా మేడవాక్కం సమీపంలోని వడక్‌పట్టు ప్రాంతానికి చెందిన రాజేష్ (34) అని, తిరుపత్తూరు జిల్లా అయ్యనూర్ ప్రాంతం నుంచి కర్ణాటక రాష్ట్రానికి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తేలింది. దీంతో రాజేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.


గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన



చికిత్స పొందిన రోగులతో వైద్యులు

కొరుక్కుపేట: మారిన జీవన శైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాల వల్ల హృదయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నట్లు స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ ప్రోగ్రామ్ డాక్టర్ సెంగోట్టు వేలు తెలిపారు. బుధవారం చెన్నైలో జరిగిన సమావేశంలో అపోలో ఆసుపత్రి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునీతారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. హార్ట్ బ్లాక్‌లతో బాధపడుతూ తమ ఆసుపత్రిలో చేరిన 75 ఏళ్ల పైబడిన ఇద్దరు వృద్ధులు, 54 ఏళ్ల పైబడిన ఒక వైద్యుడికి అరుదైన పద్ధతిలో గుండెలోని బ్లాక్‌లకు స్టంట్‌లను ఏర్పాటు చేసి విజయవంతంగా శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. కాంప్లెక్స్ పెర్క్యుటేనియస్ కరోనరీ ఇంటర్వెన్షన్ (క్లాంప్లెక్స్ పీసీఐ) అనేది ఆధునిక కరోనరీ అర్టరీ వ్యాధిలో చేసే స్టెంట్ ప్రక్రియలు అని తెలిపారు. చికిత్స పొందిన ముగ్గురు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. వైద్యులను సునీతా రెడ్డి అభినందించారు.

మహిళలు సివిల్స్ వైపు అడుగులు వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సీఎస్ శ్రీపతి

కొరుక్కుపేట: మహిళలు ఐఏఎస్ చేసేందుకు ముందుకు రావాలని తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కేవీస్ శ్రీపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు చెన్నై శివారు ప్రాంతం అయిన పోలివాక్కంలో ఉన్న విశ్వసేన ఐఏఎస్ అకాడమీలో విద్యా కమిటీ అధ్యక్షుడు సీపీ మూవేందన్ నేతృత్వంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి శ్రీపతి ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఐఏఎస్ పూర్తి చేయాలన్నది అనేక మంది తమిళ యువతుల కల అన్నారు. అయితే చాలా మందిలో అది పగటి కలగానే మిగిలిపోతుందన్నారు. చెన్నై వంటి ప్రధాన నగరాల్లో ఐఏఎస్ శిక్షణా కేంద్రాలు ఉన్నాయని అయితే గ్రామీణ ప్రాంతాల యువతీ యువకులను దృష్టిలో ఉంచుకుని చిన్మయ అకాడమీ సివిల్ సర్వీస్, విశ్వసేన ఎడ్యుకేషనల్ గ్రూప్ సంయుక్తంగా ఐఏఎస్ అకాడమీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అకాడెమీ ఆర్గనైజర్ రామదేశికన్ మాట్లాడుతూ ప్రవేశ పరీక్షలో అధిక మార్కులు సాధించే విద్యార్థులకు ఫీజులో 80 శాతం మేరకు రాయితీ ఇస్తామని పేర్కొన్నారు.

రూ.1850 కోట్ల పెట్టుబడికి వీబీజే నిర్ణయం

సాక్షి, చెన్నై : తమిళనాడుతో పాటు యూఎస్‌లో రూ. 1850 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఉమ్మిడి బంగారు జ్యువెలర్స్(వీబీజే) నిర్ణయించింది. మేనేజింగ్ పార్టనర్ అమరేంద్రన్ ఉమ్మిడి మాట్లాడుతూ.. ఈనెల 19వ తేదీ అమెరికాలోని డల్లాస్ నగరంలో వీబీజే షోరూమ్ ఏర్పాటుతో తమ బంగారు ఆభరణాలను ప్రవాస భారతీయుల ముంగిటకు తీసుకెళ్లామన్నారు. దక్షిణ భారత దేశంలో 123 ఏళ్ల చరిత్ర కలిగిన తమ జ్యువలరీస్‌ను విస్తరించేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఇందు కోసం రూ. 1850 కోట్లను పెట్టుబడిగా పెట్టనున్నామని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో అమెరికాలో 3, తమిళనాడులో చెన్నై, మదురై, తిరుచ్చి, తిరుప్పూర్, తిరునల్వేలితో సహా 8 చోట్ల స్టోర్లను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. తద్వార ఉద్యోగ అవకాశాలను మెరుగు పరుస్తామన్నారు.

వేలూరు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ



ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరిస్తున్న డీఐజీ ముత్తుస్వామి

వేలూరు: వేలూరు ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఉదయం ఎస్పీ మణివన్నన్ అధ్యక్షతన డీఐజీ ముత్తుస్వామి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదులను అందజేశారు. అందులో తిరువలం సమీపంలోని అమ్ముండి గ్రామానికి చెందిన తిలగవది ఇచ్చిన ఫిర్యాదులో.. తాను కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నానని తనకు ముగ్గురు పిల్లలున్నట్లు వివరించారు. తన భర్త అనారోగ్యం కారణంగా గత సంవత్సరం మృతి చెందారని తన పిల్లలు ఇద్దరూ తిరువలంలో ఆర్కాడు గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ శిక్షణ పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ పరిచయంతో తన వద్ద రూ. 6.75 లక్షలు అప్పుగా తీసుకున్నారని, అయితే గత జూన్‌లో రూ.లక్ష మాత్రం చెల్లించి మిగిలిన డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. అదేవిధంగా వేలూరు సమీపంలోని ఒక గ్రామానికి చెందిన వృద్ధులు ఇచ్చిన ఫిర్యాదులో తన మనవరాలుకు ఐదేళ్ల వయసుండగా.. ఈ ఏడాది జూలై నెలలో తమ బంధువుల ఇంటికి పంపామని వివరించారు. అప్పటి నుంచి తమ సమీప బంధువు చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను స్వీకరించిన డీఐజీ ఆయా పోలీస్ స్టేషన్‌లకు పంపి వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని ఆదేశించారు.

విస్తృతంగా పెట్టుబడి అవకాశాల అన్వేషణ

సాక్షి, చెన్నై: పెట్టుబడిదారులకు మెరుగైన సేవలతో పాటు విస్తృతంగా పెట్టుబడి ల్యాండ్ స్కేప్‌లో అవకాశాలను అన్వేషించేందుకు చర్యలు చేపట్టామని బజాజ్ ఫిన్ సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ సీఈఓ గణేష్ మోహన్ తెలిపారు. బజాజ్ ఫిన్ సర్వ్ బ్యాంకింగ్, పీఎస్‌యూ ఫండ్ ప్రారంభోత్సవం గురించి బుధవారం ఆయన స్థానికంగా వివరించారు. తమ ప్రయత్నంలో భాగంగా బుధవారం నుంచి నవంబర్ 6వ తేదీ వరకు చేపట్టిన ఎన్ఎఫ్ఓలను విశదీకరించారు. పీఎస్‌యూ డెట్ ఇండెక్స్ గురించిగుర్తు చేస్తూ, పెట్టుబడి దారులకు ఆదాయ ఉత్పత్తికి ఇది ఒక మార్గంగా పేర్కొన్నారు. పెట్టుబడి పెట్టడానికి అవకాశం, పోర్టు ఫోలియోలు , క్రెడిట్ నాణ్యతలు కలిగి ఉండే విధంగా ప్రత్యేకచర్యలు తీసుకున్నామన్నారు. పెట్టుబడి ఎంపికలో సాంప్రదాయ బ్యాంకింగ్‌తో పాటు ఆకర్షణీయమైన ప్రతిపాదనను కనుగునేందుకు వీలు కల్పించామన్నారు. ఆ సంస్థ సీఐఓ నిమేష్ చందన్, సీనియర్ మేనేజర్ సిద్ధార్థ్ చౌదరి మాట్లాడుతూ, కొత్త ఫండ్ ఆఫర్ ప్రస్తుతం ప్రారంభమైందని, ఇది నవంబర్ 6వ తేదీతో ముగియనున్నప్పటికీ, 15వ తేదీలోపు సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవడం జరుగుతుందన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తిరువళ్లూరు: పొన్నేరి రైల్వేస్టేషన్ వద్ద స్పృహ తప్పి పడివున్న వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. తిరువళ్లూరు జిల్లా పొన్నేరి రైల్వేస్టేసన్ వద్ద ఈ నెల 13వ తేదీ గుర్తు తెలియని వృద్ధుడు (70) స్పృహ తప్పి పడివున్నట్లు వీఏఓ రాజశేఖర్‌కు స్థానికులు సమాచారం అందించారు. వృద్ధుడిని 108లో పొన్నేరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. వీఏఓ ఫిర్యాదు మేరకు పొన్నేరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోలీవుడ్ టాక్స్

వేల్‌రాజ్ దర్శకత్వంలో శశికుమార్



దర్శకుడు వేల్‌రాజ్, నిర్మాత సతీశ్, నటుడు శశికుమార్

తమిళసినిమా: నటుడు శశికుమార్ ఇంతకు ముందు కథనాయకుడిగా నటించిన అయోత్తి చిత్రం మంచి విజయాన్ని సాధించడంతో పాటు విమర్శకుల ప్రశంసలను సైతం పొందింది. దీంతో శశికుమార్ కథానాయకుడిగా మళ్లీ బిజీ అయ్యారు. పలు చిత్రాల్లో నటిస్తున్న ఈయన్ను తాజాగా మరో కొత్త చిత్రం వరించింది. మెర్లిన్, అసురగురు, సింగపెన్నూ, జీఎస్‌టీ వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాలను నిర్మించిన జేఎస్‌బీ ఫిలిం స్టూడియోస్ పతాకంపై జేఎస్‌బీ సతీశ్ నిర్మిస్తున్న తాజా చిత్రంలో శశికుమార్ కథానాయకుడిగా నటించనున్నారు. దీనికి ప్రముఖ ఛాయాగ్రాహకుడు వేల్‌రాజ్ దర్శకత్వం వహించనున్నారు. ఈయన ఇంతకు ముందు ధనుష్ హీరోగా నటించిన వీఐపీ, తంగమగన్ వంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన విషయం తెలిసిందే. శశికుమార్ చిత్రం త్వరలో సెట్‌పైకి వెళ్లనుందని నిర్మాత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలను అతి త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలిపారు.

ఛాలెంజింగ్ పాత్రలే కావాలి



తమిళసినిమా: సాధారణంగా వర్ధమాన నటీమణులు గ్లామరస్ పాత్రలను కోరుకుంటారు. అలాంటి పాత్రలతోనే దర్శక నిర్మాతల దృష్టిలో పడవచ్చునని, ప్రేక్షకుల ఆదరణను పొందవచ్చు అనేది వారి అలోచనగా ఉంటుంది. అలాంటిది నటి అనుకీర్తీవాస్ మాత్రం ఛాలెంజింగ్ పాత్రలను కోరుకుంటున్నారు. ఈమె గురించి చెప్పాలంటే కళాశాల రోజుల్లోనే మోడలింగ్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చారు. అందాల పోటీల్లో పాల్గొని కిరీటాన్నీ గెలుచుకున్నారు. తర్వాత సినిమా వాళ్ల దృష్టిలో పడ్డారు. ఇంకేముంది విజయ్‌సేతుపతి కథానాయకుడిగా నటించిన డీఎస్‌పీ చిత్రం ద్వారా కథానాయకిగా తెరంగేట్రం చేశారు. అలా తొలి చిత్రంతోనే తమిళ ప్రేక్షకుల మనసును దోచుకున్న ఈ బ్యూటీకి ఆ వెనువెంటనే టాలీవుడ్ నుంచి పిలుపు వచ్చింది. రవితేజ సరసన టైగర్ నాగేశ్వరరావు చిత్రంలో హీరోయిన్‌గా నటించే అవకాశం వరించింది. ఇటీవల విడుదలైన ఈ చిత్రం మంచి ప్రేక్షకాదరణతో ప్రదర్శింపబడుతోంది. దీని గురించి నటి అనుకీర్తీవాస్ మాట్లాడుతూ తన తొలి చిత్రం డీఎస్‌పీలో కంటే మంచి పాత్రను తెలుగు చిత్రం టైగర్ నాగేశ్వరావులో నటించినట్లు చెప్పారు. ఈ చిత్రంలో తన పాత్రకు ప్రశంసలు రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కాగా ఇంకా ఛాలెంజింగ్‌తో కూడిన పాత్రల్లో నటించాలని కోరుకుంటున్నట్లు ఈ బ్యూటీ పేర్కొన్నారు. ఆదిలోనే తమిళం, తెలుగు భాషల్లో నటించే అవకాశాలను అందుకుంటున్న ఈ భామ అందంతో పాటు అభినయంతోనూ సత్తా చాటుకోవడం విశేషం.

వైభవ్, అతుల్యరవి జంటగా కొత్త చిత్రం



నూతన చిత్ర యూనిట్

తమిళసినిమా: నటుడు వైభవ్, నటి అతుల్యరవి జంటగా నటిస్తున్న నూతన చిత్రం విజయదశమి సందర్భంగా బుధవారం చెన్నైలో పూజాకార్యక్రమాలతో ప్రారంభమైంది. డా.మనోజ్ బెనో నేతృత్వంలో బీటీజీ యూనివర్సల్ పతాకంపై బాజీ బాలచంద్రన్ నిర్మిస్తున్న తొలి చిత్రం ఇది. ఈ చిత్రం ద్వారా విక్రమ్ రాజేశ్వర్, అరుణ్‌కేశవ్ ద్వయం దర్శకులుగా పరిచయం అవుతున్నారు. వీరిలో విక్రమ్ రాజేశ్వర్ 80కి పైగా యాడ్ ఫిలింస్‌కు గతంలో దర్శకత్వం వహించారు. అంతేకాకుండా ఈయన సీనియర్ దర్శకుడు కె. రాజేశ్వర్ వారసుడు కూడా. కాగా ఈ చిత్రం వివరాలను దర్శకులు తెలుపుతూ ఇంకా పేరు నిర్ణయించని ఈ చిత్ర షూటింగ్‌ను బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇది పూర్తిగా వినోదాత్మకంగా, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుందన్నారు. ఇందులో నటుడు ఆనంద్‌రాజ్, నాన్ కడవుల్ రాజేంద్రన్, జాన్ విజయ్, రెడిన్ కింగ్స్లే, సునిల్‌రెడ్డి, ఇళవరసు, పీఎల్.తేనప్పన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్లు చెప్పారు. దీనికి డీ.ఇమాన్ సంగీతాన్ని, టిజోటోనీ, సురేశ్ ఏ.ప్రసాద్ ఛాయాగ్రహణను అందిస్తున్నారని చెప్పారు. కాగా ఈ చిత్ర ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు అందించారు.

28న జపాన్ చిత్ర ఆడియో వేడుక



జపాన్ చిత్రంలో కార్తీ

తమిళసినిమా: పరుత్తివీరన్ చిత్రంతో నటుడిగా సినీ పయనాన్ని ప్రారంభించిన కార్తీ కథల ఎంపికలో ప్రత్యేక దృష్టి సారిస్తూ విజయ బాటలో పయనిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల విరుమాన్, పొన్నియిన్ సెల్వన్, సర్దార్ చిత్రాలతో వరుసగా విజయాలు అందుకున్న ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం జపాన్. ఇది అతడికి 25వ చిత్రం కావడం విశేషం. కాగా నటుడిగా కార్తీ 20 వసంతాలను పూర్తి చేసుకున్నారు. ఈ చిత్రాన్ని రాజు మురుగన్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్స్ పతాకంపై ఎస్ఆర్.ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్.ప్రభు నిర్మించారు. నటి అను ఇమ్మాన్యుయేల్ నాయకిగా నటించిన ఇందులో దర్శకుడు కేఎస్.రవికుమార్, విజయ్ మిల్టన్, వాగై చంద్రశేఖర్, టాలీవుడ్ నటుడు సునిల్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. రవివర్మన్ ఛాయాగ్రహణం, జీవీ.ప్రకాశ్‌కుమార్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. కాగా జపాన్ చిత్రాన్ని దీపావళి సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా చిత్ర ఆడియో ఆవిష్కరణను ఈనెల 28న భారీ ఎత్తున నిర్వహించతలపెట్టినట్లు నిర్మాతల్లో ఒకరైన ఎస్ఆర్.ప్రభు మీడియాకు వెల్లడించారు. కార్తీ నటించిన 25వ చిత్రం కావడంతో ఈ వేడుకను ప్రత్యేకంగా అభిమానుల సమక్షంలో స్థానిక నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్తీ ఇప్పటి వరకూ నటించిన 24 చిత్రాల్లో 19 చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయన్నారు. అందులో 6 చిత్రాలు తమ సంస్థలో నిర్మించడం విశేషం అన్నారు. కాగా కార్తీ 25వ చిత్రం జపాన్ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు ఆయన్ని గౌరవించే విధంగా ఈ వేడుక ఉంటుందన్నారు. ఇందులో కార్తీ నటించిన చిత్రాలకు సంబంధించిన సన్నివేశాలను ప్రదర్శించనున్నట్లు చెప్పారు ఆ వేడుకలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

అన్నపూర్ణిగా నయన్



అన్నపూర్ణి చిత్రంలో నయనతార

తమిళసినిమా: తమిళసినిమాలో లేడీ సూపర్‌స్టార్‌గా రాణిస్తున్న నటి నయనతార. ఇంతకు ముందు వరకూ దక్షిణాదికే పరిమితం అయిన ఈ సంచలన నటి జవాన్ చిత్రంలో నటించిన తరువాత పాన్ ఇండియా నటిగా మారారు. కాగా చేతిలో పలు చిత్రాలతో బిజీగా ఉన్న ఈమె తాజాగా నటిస్తున్న చిత్రాల్లో తన 75వ చిత్రం కూడా ఉంది. ఈ చిత్రాన్ని నీలేశ్ కృష్ణ దర్శకత్వంలో జీ స్టూడియోస్, ట్రైడెంట్ ఆర్ట్స్, నాడ్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో నటుడు జయ్ కథా నాయకుడిగా నటిస్తున్నారు. నటుడు సత్యరాజ్, దర్శకుడు కేఎస్.రవికుమార్, రెడిన్ కింగ్స్లే, అచ్చుత్‌కుమార్, కుమారి సచ్చు, రేణుక, కార్తీక్‌కుమార్, సురేశ్ చక్రవర్తి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం గురించి చాలా కాలంగా ప్రచారం జరుగుతున్నా, అధికారికంగా మంగళవారం యూనిట్ వర్గాలు మీడియాకు వెల్లడించిన ప్రకటనలో వెల్లడించారు. అందులో చిత్ర టైటిల్‌ను కూడా ఖరారు చేశారు. దీనికి అన్నపూర్ణి అనే టైటిల్‌ను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీనికి ది గాడెస్ ఆఫ్ ఫుడ్ అనే టాగ్‌ను పెట్టారు. ఇది లేడీ ఓరియంటెడ్ కథా చిత్రంగా ఉంటుందని సమాచారం. తిరుచ్చి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ఎస్.తమన్ సంగీతాన్ని, సత్యన్ సూర్యన్ ఛాయాగ్రహణం అందిస్తున్నారు. అన్నపూర్ణి పూర్తిగా కుటుంబ కథా చిత్రంగా ఉంటుందని నిర్మాతలు పేర్కొన్నారు. అన్ని వర్గాల వారికి నచ్చే విధంగా ఉండే ఈ చిత్రాన్ని తమిళం, తెలుగు, మలయాళం, కన్నడం భాషల్లో రూపొందిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన టీజర్‌ను విడుదల చేశారు. దీనికి ఇప్పుడు మంచి స్పందన వస్తోంది. దీంతో అన్నపూర్ణి చిత్రంపై భారీ అంచనాలు ఏర్పడుతున్నాయి.

క్లుప్తంగా

రెండు బైకులు ఢీ.. ఇద్దరు దుర్మరణం

అన్నానగర్: ఆడుదురైలో బుధవారం ఉదయం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు యువకులు మృతి చెందారు. తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని అమ్మంగుడి మాడకోవిల్ వీధికి చెందిన అర్పుదరాజ్. ఇతని కుమారుడు డార్విన్ (19) బుధవారం ఉదయం అమ్మంగుడి నుంచి నందివనం వైపు బైకుపై వస్తున్నాడు. అదే విధంగా తిరునరైయూర్ చెట్టితేరుకు చెందిన స్వామినాథన్ కుమారుడు కమలకన్నన్ (30) ఆడుదురై సమీపంలోని అమ్మంగుడి వైపు బైకులో వెళుతున్నాడు. అమ్మంగుడి ప్రధాన రహదారిపై రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన డార్విన్, కమలకన్నన్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న తిరునీలకుడి పోలీసులు ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కుంభకోణం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు తిరునీలకుడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుకు విద్యార్థి మృతి

అన్నానగర్: పాముకాటుకు విద్యార్థి మృతి చెందిన ఘటన బుధవారం కులశేఖరంలో చోటుచేసుకుంది. కన్యాకుమారి, కులశేఖరం, మనలోడైకు చెందిన మణికంఠన్ కేరళలో రబ్బర్ మిల్కింగ్ వ్యాపారం చేస్తున్నాడు. ఇతని భార్య నాగేశ్వరి. వీరికి నలుగురు కుమారులు. వారిలో ఇద్దరు కవలలు. వీరిలో ఒక కుమారుడు అభినేష్ (14), మానలోడై ప్రభుత్వ గిరిజన పాఠశాల హాస్టల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవు కావడంతో అభినేష్ తన ఇంటికి వెళ్లాడు. మంగళవారం పొన్మనై సమీపంలోని తన అమ్మమ్మ ఇంటికి తన తల్లితో కలిసి వెళ్లాడు. అనంతరం బుధవారం తెల్లవారుజామున తన తల్లితో కలిసి ఇంటికి తిరిగి వస్తుండగా అభినేష్ పాము కాటుకు గురయ్యాడు. వెంటనే కులశేఖరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అభినేష్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై కులశేఖరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రహరీగోడ కూలి..

తిరువళ్లూరు: స్నేహితుడి ఇంటి వద్ద కొళాయి ఏర్పాటు కోసం తవ్వకాలు చేస్తున్న సమయంలో ప్రహరీగోడ కూలడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరువళ్లూరు జిల్లా ఊత్తుకోట తాలుకా మోవూరు గ్రామానికి చెందిన పెరుమాల్ కుమారుడు ప్రతాప్ (28). అదే గ్రామానికి చెందిన స్నేహితుడు కొత్త ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇటీవలే గృహ ప్రవేశం చేసినట్లు తెలిసింది. కొత్త ఇంటికి తాగునీటి కోసం కొళాయి ఏర్పాటు చేయాలని నిర్ణయించాడు. ఇందులో భాగంగానే ప్రతాప్ కొళాయి కోసం మంగళవారం ఉదయం తవ్వకాలు చేపట్టినట్టు తెలిసింది. తవ్వకాలు చేస్తున్న సమయంలో పక్కింటికి చెందిన ప్రహరీగోడ కూలి ప్రతాప్‌పై పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌ను స్థానికులు తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెనాలూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సురుటుపల్లిలో పొన్నేరి న్యాయమూర్తి


న్యాయమూర్తులకు ప్రసాదాల అందజేత

నాగలాపురం: మండలంలోని ప్రసిద్ధ సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం తమిళనాడు రాష్ట్రం పొన్నేరి సివిల్ న్యాయమూర్తి అయ్యప్ప, ఊత్తుకోట న్యాయమూర్తి సెంతామిగు సెల్వం దర్శించారు. వారికి ఆలయ చైర్మెన్ ఏవీఎం మునిచంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ రామచంద్రారెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, చైర్మన్ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న ట్యాంకర్

- ముగ్గురు దుర్మరణం

అన్నానగర్: బైక్‌ను ట్యాంకర్ లారీ ఢీకొనడంతో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ఈ ఘటన పెరంబలూరులో మంగళవారం రాత్రి జరిగింది. తిరుచ్చి జిల్లా తర్తియూర్ తాలూకా కోటత్తూరుకు చెందిన సంజీవి కుమారుడు వినోద్ (19), అతని స్నేహితులు రామ్ (20), ఆనంద్ (22). వినోద్, రామ్ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. మంగళవారం రాత్రి ముగ్గురు ఒకే బైకులో పెరంబలూరు వెళ్లారు. పెరంబలూరు జిల్లా ఆలందూరు తాలూకా నగసలేం సమీపంలో పెరంబలూరు–తురైయూర్ రాష్ట్ర రహదారిపై వస్తుండగా ట్యాంకర్ లారీ బైకును ఢీకొట్టింది. వినోద్, రామ్, ఆనంద్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పాడలూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పెరంబలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాడలూరు పోలీసులు కేసు నమోదు చేసి తిరుచ్చి జిల్లా ముసిరి తాలూకా అందరపట్టికి చెందిన లారీ డ్రైవర్ రాజా (37)ని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

దిండుగల్‌కు దేవర్ బంగారు కవచం

- భారీ భద్రత మధ్య కౌముదికి తరలింపు


దేవర్‌కు బంగారు కవచం అందజేస్తున్న దివంగత సీఎం జయలలిత(ఫైల్)

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్‌కు దేవర్ బంగారు కవచం బుధవారం అప్పగించారు. బ్యాంక్ లాకర్ నుంచి ఈ కవచాన్ని బయటకు తీసి అందజేశారు. డీఎస్పీల నేతృత్వంలోని భద్రతా వలయంలో ఈ కవచాన్ని కౌముదికి తరలించారు. వివరాలు.. దక్షిణాది జిల్లాలో అత్యధిక జనాభా కల్గిన ముక్కుళత్తూరు సామాజిక వర్గ ప్రజల ఆరాధ్యుడిగా, స్వాతంత్య్ర సమరయోధుడిగా, రాజకీయ వేత్తగా పసుం పొన్ ముత్తు రామలింగ దేవర్ సేవల గురించి తెలిసిందే. ఆయన జయంతి, వర్ధంతి ఒకే రోజు కావడంతో గురు పూజోత్సవంగా వేడుకలను ఆ సామాజిక వర్గం భారీ స్థాయిలో జరుపుకుంటూ వస్తోంది.

రామనాథపురం జిల్లా కౌముదిలోని ఆయన స్మారక ప్రదేశంలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు వేడుకలు మిన్నంటుతాయి. దేవర్ విగ్రహానికి దివంగత సీఎం జయలలిత అప్పట్లో బంగారు కవచం సిద్ధం చేసి ఇచ్చారు. ఇది అన్నాడీఎంకే నేతృత్వంలో మదురైలోని బ్యాంక్ లాకర్లో భద్రత పరచడం, వేడుకల సమయంలో నిర్వాహకులకు అప్పగించడం జరుగుతూ వస్తోంది. ప్రస్తుతం అన్నాడీఎంకేలో నెలకొన్న విభేదాల కారణంగా ఆ కవచం బాధ్యత తనదే అంటూ ఆ పార్టీ కోశాధికారి హోదాలో మాజీ సీఎం పన్నీరు సెల్వం తీవ్ర ప్రయత్నాలు చేశారు. కోర్టును కూడా ఆశ్రయించారు. చివరకు అన్నాడీఎంకే పళని స్వామి గుప్పెట్లోకి చేరడంతో పన్నీరుకు షాక్ తప్పలేదు. ప్రధాన కార్యదర్శి హోదాలో పళనిస్వామి నియమించిన అన్నాడీఎంకే కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్‌కు ఆ కవచం అప్పగించే విధంగా మదురై ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు బుధవారం బ్యాంక్ లాకర్ నుంచి బంగారు కవచాన్ని బయటకు తీశారు. తర్వాత దిండుగల్ శ్రీనివాసన్‌కు అధికారులు అప్పగించారు. దీనిని దేవర్‌స్మారక ప్రదేశం ఇన్‌చార్జ్ గాంధీ మీనాల్‌కు దిండుగల్ శ్రీనివాసన్ అందజేశారు. దీంతో మదురై నుంచి రామనాథపురం జిల్లా కౌముదికి ఈ బంగారు కవచం గట్టి భద్రత నిమిత్తం తరలించారు. ఇద్దరు డీఎస్పీ నేతృత్వంలో పదుల సంఖ్యలో పోలీసు భద్రత నడుమ ప్రత్యేక వాహనంలో కౌముదికి తీసుకెళ్లారు. ఇక్కడ నిర్వహించనున్న ఉత్సవాల్లో ఈబంగారు కవచాన్ని దేవర్‌కు సమర్పించనున్నారు.

నిధుల కేటాయింపులో తమిళనాడుకు ప్రాధాన్యమివ్వాలి

- కేంద్రమంత్రికి ఎంపీ దయానిధి మారన్ లేఖ


కేంద్రమంత్రి అనురాగ్ ఠాగూర్, ఎంపీ దయానిధి మారన్

కొరుక్కుపేట: సెంట్రల్ చెన్నై ఎంపీ దయానిధి మారన్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి అనురాగ్ ఠాగూర్‌కు లేఖ రాశారు. ఇందులో 'ఆసియా క్రీడలు తొలిసారిగా 1951లో చైనాలో జరిగాయి . ప్రస్తుతం భారతీయ క్రీడాకారులు క్రీడా పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. చైనాలో జరిగిన 19వ ఆసియా క్రీడల్లో భారత్ రికార్డు స్థాయిలో 107 పతకాలు సాధించింది. తమిళనాడు నుంచి 20 మంది పతకాలు సాధించారు, వ్యవసాయ రంగంలో భారతదేశం గొప్ప ప్రగతిని సాధిస్తోంది . క్రీడలను ప్రోత్సహించేందుకు కేంద్ర క్రీడామంత్రి అనురాగ్ ఠాగూర్ క్రీడాకారులను చైతన్యవంతం చేయడానికి , క్రీడామైదానాలను పెంచడానికి చోరవ తీసుకోవాలి. బీజేపి పాలిత రాష్ట్రాలైన గుజరాత్, ఉత్తరప్రదేశ్,అరుణాచల్ ప్రదేశ్‌కు అత్యధిక నిధులు అందుతున్నాయి. కానీ తమిళనాడుకు కేవలం రూ.33 కోట్లు మాత్రమే కేటాయించారు. తమిళనాడు క్రీడా రంగంలో రాణించేందుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ , క్రీడల మంత్రి ఉదయనిధి స్టాలిన్ చొరవతో ప్రతీ జిల్లాకు క్రీడామైదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు తగిన నిధులను కేంద్రం అందించాల్సి ఉంది. తమిళనాడు ప్రభుత్వం అంతర్జాతీయ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తుందని అన్ని దేశాలు మెచ్చుకున్నాయి. 2024 లోచెన్నైలో ఆసియా బీచ్ గేమ్స్ నిర్వహించేందుకు తమిళనాడు ప్రభుత్వానికి ఇప్పటికే అనుమతి వచ్చింది . దీనిని పరిగణణలోకి తీసుకుని క్రీడాకారులు ఎన్నో విజయాలు సాధించేందుకు నిధులు కేటాయించాలి' అని పేర్కొన్నారు.

తుపాకీతో తిరుగుతున్న ముగ్గురికి దేహశుద్ధి

తిరువొత్తియూరు: అరియలూరు జిల్లా జయంకొండాం సమీపంలోని పూవాయి కులం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున తుపాకీతో తిరుగుతున్న యువకులను పట్టుకుని దేహశుద్ధి చేశారు. స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జయం కొండాం ఎస్ఐ మురుగన్, పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేశారు. విచారణలో వారు ఆండిమటం రోడ్డులోని మహిమైపురం సునాలీల కాలనీకి చెందిన శివ (20), రామన్న (37), పుగేంది (25) అని తెలిసింది. వారు లైసెన్స్ లేని నాటు తుపాకీతో రాత్రి సమయంలో తిరుగుతూ ఉండడంతో గ్రామ ప్రజలు వారిని పట్టుకున్నట్లు తెలిసింది. దీంతో పోలీసులు ముగ్గురిని జయం కొండాం ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు కార్మికులు మృత్యువాత

వేలూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు పట్టణంలోని టోని రోడ్డుకు చెందిన సలీమ్(22), కౌసిక్(25) ప్రముఖ ఆయిల్ కంపెనీ పబ్లిసిటీ బ్యానర్‌లు కట్టేందుకు టెండర్ తీసుకుని రోడ్డుకు ఇరువైపులా బ్యానర్ కట్టేవారు. రెండు రోజులుగా వేలూరు, ఆర్కాడు, రాణిపేట వంటి ప్రాంతాల్లోని ఆయిల్ కంపెనీల వద్ద పాత బ్యానర్‌లను తీసి వేసి కొత్త బ్యానర్‌లు కడుతున్నారు. ఊసూరుకు చెందిన శరవణన్ ఆయిల్, నిత్యవసర వస్తువుల దుకాణం కులతమేడు ప్రాంతంలో నడుతుపుతున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో సలీమ్, కౌసిక్ ఇద్దరూ కలిసి దుకాణం ముందు బ్యానర్ కట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో దుకాణం పైన ఉన్న విద్యుత్ లైన్‌లో బ్యానర్ కమ్మీ రాసుకుంది. దీంతో విద్యుత్ సరఫరా అయ్యి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న అరియూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి విచారణ చేస్తున్నారు.

రాజరాజ చోళన్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న కలెక్టర్ దీపక్ జాకబ్

కొరుక్కుపేట: తమిళ వాస్తు శిల్పం, శిల్పకళను ప్రపంచానికి తెలియజేసిన మహనీయులు రాజరాజ చోళన్ అని తంజావురు కలెక్టర్ దీపక్ జాకబ్ కొనియాడారు. రాజరాజ చోళన్ శతాబ్ది ఉత్సావాలు బుధవారంతో ముగిశాయి. ఈ వేడుకల్లో కలెక్టర్ దీపక్ జాకబ్ పాల్గొని రాజరాజ చోళన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సంగీతంతో సంగీత నీరాజనాలు పలికారు. అలాగే పెరువడయార్‌కు 40 రకాల వస్తువులతో అంకితం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ ప్రసిద్ధి చెందిన తంజావూరు ఆలయాన్ని నిర్మించిన రాజ రాజ చోళన్ తమిళ శిల్పకళను ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు . ఈ మహనీయుడి జయంతిని, వర్ధంతిని ప్రభుత్వం ఏగా పండుగగా నిర్వహిస్తోందని తెలిపారు. ఈ ఏడాది ఎంతో విశేషంగా తంజావూరు సదరన్ కల్చరల్ సెంటర్ తరపున సంగీతం నృత్యప్రదర్శలతో పాటు సదస్సులతో రాజ రాజ చోళుని కీర్తిని కొనియాడారని అన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మంత్రులు శేఖర్ బాబు, అన్బిల్ మహేష్ , పొన్ నంబాల్ అడిగలర్ హాజరై మామన్నన్ రాజరాజన్ అవార్డును మదురై సెంథామిల్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ దక్షిణామూర్తి, వైద్యులు సెల్వరాజ్ , రిటైర్డ్ అసోసియేట డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పలనియప్పన్‌లకు అందజేశారు. ఇందులో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సెల్వం పాల్గొన్నారు .

పట్టపగలే దారణ హత్య

అన్నానగర్: పట్టపగలే ఇంట్లోకి చొరబడి వ్యక్తిని కత్తితో నరికి హత్య చేసిన ఘటన బుధవారం మదురైలో జరిగింది. భార్య ఎదుటే ఈ దారుణానికి పాల్పడిని ఇద్దరి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. మదురైలోని అరపాళం క్రాస్ రోడ్డులోని మోతీలాల్ వీధికి చెందిన పొంగుడి (65) ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేసి పదవీ విరమణ చేశాడు. ఇతని భార్య పాండియమ్మాళ్. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరికి వివాహమై కుమారుడు ఊటీలో ఆర్మీలో ఉండగా, కుమార్తె అన్నానగర్ ప్రాంతంలో నివసిస్తోంది. పొంగుడి, అతని భార్య మాత్రమే వారి సొంత ఇంటిలో నివసిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున పొంగుడి తన ఇంటిలో టీవీ చూస్తున్నాడు. హఠాత్తుగా ఇద్దరు యువకులు ఇంటిలోకి ప్రవేశించి కొడవళ్లు, కత్తులతో పొంగుడిని నరికి చంపారు. ఇంటిలో వంట చేస్తున్న పాండియమ్మాళ్ వచ్చి చూసి కేకలు వేసింది. వెంటనే వారిద్దరూ పరారయ్యారు. పొంగుడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కరిమేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పొంగుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం మదురై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హంతకులు ఎవరు? హత్యకు కారణం ఏమి టి? అని పోలీసులు విచారణ చేస్తున్నారు.

పొగాకు పదార్థాలు స్వాధీనం

- ముగ్గురి అరెస్టు

అన్నానగర్: కడలూరు జిల్లా బన్రూట్టిలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు పోలీసులకు బుధవారం ఉదయం రహస్య సమాచారం అందింది. బన్రూట్టినబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కస్టమర్‌లా వెళ్లి పట్టణంలోని ఒక షాపులో పొగాకు ఉత్పత్తులను అడిగాడు. దుకాణ యజమాని శంకర్ పొగాకు ఉత్పత్తులను అతనికి ఇచ్చాడు. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న శంకర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని విచారించారు. దుకాణం వెనుక ఉన్న తన ఇంటిలో ఆరు పొగాకు బస్తాలను దాచి ఉంచినట్లు గుర్తించారు. అలాగే ఒరయూర్ ప్రాంతానికి చెందిన ప్రభాకర్ (35), ఆనత్తూరు ప్రాంతానికి చెందిన సిద్దిక్ అలీ (33) పొగాకు ఉత్పత్తులను అక్రమంగా తరలించి శంకర్ ద్వారా ఇతర దుకాణాలకు విక్రయించినట్లు గుర్తించారు. శంకర్‌తో పాటు ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. రూ.5 లక్షల విలువైన పొగాకు ఉత్పత్తులు, కారు, రెండు బైకులను స్వాధీనం చేసుకున్నారు.

చెన్నైలో 57 కిలోల గంజాయి స్వాధీనం

తిరువొత్తియూరు: చెన్నై వ్యాప్తంగా వారం రోజుల్లో పోలీసులు 57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 11 మందిని అరెస్టు చేశారు. చెన్నైలో గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాల కట్టడికి పోలీసు కమిషనర్ సందీప్‌రాయ్ రాథోర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో పోలీసులు వారం రోజులుగా తనిఖీ చేసి 57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 మంది నిందితులను అరెస్టు చేశారు.

వృద్ధుడిని బెదిరించి నగదు అపహరణ

తిరువొత్తియూరు: పశ్చిమ బెంగాల్ రాజ్‌ఘాట్ ప్రాంతానికి చెందిన తులాల్ దత్త (62) అనారోగ్యంతో వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు కోల్‌కత్తా నుంచి విమానంలో మంగళవారం చెన్నైకి వచ్చారు. అక్కడి నుంచి వేలూరు వెళ్లడానికి కోయంబేడు బస్‌స్టేషన్‌కు ఆటోలో బయలుదేరారు. ఆటో డ్రైవర్ తన ముగ్గురు స్నేహితులతో కలిసి తులాల్ దత్త, ఆయన అల్లుడు రాజీవ్‌దేవ్‌లను బెదిరించి వారి వద్దనున్న రూ.4,500 లాక్కుని పారిపోయారు. దీని గురించి రాజీవ్‌దేవ్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఫ్లవర్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి నిఘా కెమెరాల ద్వారా పరిశీలించారు. చెన్నై చూలై కేబీపార్క్ ప్రాంతానికి చెందిన పెరియస్వామి (40), బులియన్ తోపు నగర్‌కు చెందిన విఘ్నేష్ (33)గా గుర్తించారు. ఇద్దరిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

తాళం చెవి చోరీ చేసి..

తిరువొత్తియూరు: చెన్నై కొత్త చాకలిపేటలో ఇంటి తాళం చోరీ చేసి తలుపులు తెరిచి 11 సవర్ల నగలు చోరీ చేసిన మహిళను పోలీసులు అరెస్టు చేశారు. కొత్త చాకలిపేట పోచమ్మాళ్ వీధికి చెందిన భూమాదేవి (46) ఈ నెల 20వ తేదీ ఇంటికి తాళం వేసి పిల్లలను పాఠశాల నుంచి తీసుకురావడానికి వెళ్లింది. తిరిగి వచ్చి చూడగా బీరువాలో ఉన్న వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. 10.5 సవర్ల నగలు చోరీ అయినట్లు గుర్తించింది. కొత్త చాకలిపేట క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. అందులో భూమాదేవి ఇంటి సమీపంలో నివాసముంటున్న తమిళ్ సెల్వి కోడలు తండయార్‌పేట సునామీ క్వార్టర్స్ ప్రాంతానికి చెందిన సుబ్బులక్ష్మి (28) తాళం చోరీ చేసి భూమాదేవి ఇంటిలో 10.5 సవర్ల నగలు చోరీ చేసినట్లు తెలిసింది. పోలీసులు ఆమెను అరెస్టు చేసి ఆమె వద్ద నుంచి 10.5 సవర్ల నగలను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

శాస్త్రోక్తంగా ఏకాదశి ఉత్సవం


తిరుచ్చిపై ఊరేగింపు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశి ఉత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను అర్చకులు పూర్తి చేశారు. ఏకాదశి గడియల్లో అర్చన పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీదేవి,భూదేవి సమేతంగా స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చారు. తదుపరి తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

అవయవదానం.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


మృదేహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ (ఇన్‌సెట్‌లో రైతు)

అన్నానగర్: కురింజిపాడులో అవయవాలు దానం చేసిన రైతుకు ప్రభుత్వ లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. కలెక్టర్ అరుణ తాంబరాజ్ భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కడలూరు జిల్లా కురింజిపాడు సమీపంలోని బేతనాయక కుప్పం పంచాయతీ గంజమనాథాన్‌పేట గ్రామానికి చెందిన కృష్ణకుమార్ (34) రైతు. ఈ నెల 17న ప్రమాదం జరగడంతో కడలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇంతలో కృష్ణకుమార్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం కృష్ణకుమార్ అవయవాలను దానం చేస్తామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో సంబంధిత ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అతని అవయవాలను దానం చేశారు. రెండు కిడ్నీలు, కాలేయం, ప్యాంక్రియాస్‌ను సేకరించి నలుగురికి అమర్చారు. తమిళనాడు ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ఆదేశించడంతో జిల్లా కలెక్టర్ అరుణ తాంబరాజ్ బుధవారం కృష్ణకుమార్ ఇంటికి వెళ్లి ప్రభుత్వం తరపున పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా జిల్లా ఎస్పీ రాజారాం, సంక్షేమ శాఖ జాయింట్ డైరక్టర్ సరోసెలిన్ పాల్, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఇతర ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు వందన సమర్పణ చేశారు.

బైక్ చోరీ.. ముగ్గురి అరెస్ట్

తిరువొత్తియూరు: చెన్నై మాధవరంలో బైక్‌ను చోరీ చేసిన ఇద్దరు బాలురతో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై మాధవరం రౌండ్‌టానా ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున పోలీసులు వాహన తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా బైక్‌లో వచ్చిన ముగ్గురిని పోలీసులు విచారణ కోసం ఆగమన్నారు. వారు పోలీసులను చూసిన వెంటనే బైక్‌ను కిందపడవేసి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంటాడి పట్టుకున్నారు. విచారణలో వారు ఆ బైకును కొడుంగయూరు ప్రాంతంలో చోరీ చేసినట్లు తెలిసింది. మాధవరం పోలీసులు కొడుంగయూరు పోలీసులకు సమాచారం అందించారు. కొడుంగయూరు క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సెంథిల్‌కుమార్ ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. విచారణలో నిందితులు చెన్నై వ్యాసర్‌పాడి శర్మనగర్ ప్రాంతానికి చెందిన ఈశ్వరన్ అలియాస్ ఈశా (19), ఎరుకంజేరి గాంధీనగర్‌కు చెందిన బాలుడు(16), వ్యాసర్‌పాడికి చెందిన బాలుడి (14) గుర్తించారు. ముగ్గురు ఎరుకంజేరి రాజీవ్‌గాంధీ మూడో వీధికి చెందిన పాయ్యామొలి (69) ఇంటి వద్ద నిలిపిన బైక్‌ను చోరీ చేసినట్లు తెలిసింది. దీంతో బైకును స్వాధీనం చేసుకుని ఈశ్వర్‌ను అరెస్టు చేశారు. అతన్ని కోర్టులో హాజరుపరిచి జైలులో పెట్టారు. బాలురులను జువైనల్‌కు తరలించారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం


ఆలయ గోపురంపై పుణ్యజలాలు వదులుతున్న వేదపండితులు, హాజరైన భక్తులు

పళ్లిపట్టు: విజయరాఘవస్వామి ఆలయ మహాకుంభాభిషేకం వేడుకలు బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. పళ్లిపట్టు సమీపంలోని వెలిగరం గ్రామంలో పురాతన శ్రీదేవి, భూదేవి సమేత విజయరాఘవస్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో భక్తులు స్వామిని దర్శించుకోవడం సైతం కష్టంగా మారింది. దీంతో గ్రామీణులు, భక్తుల విరాళాలతో ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టి ఆలయ గోపురం, మండపాలు, ప్రహరీగోడ, ధ్వజస్తంభం అందంగా తీర్చిదిద్దారు. దీంతో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు మహాకుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. ఆలయం పరిసర ప్రాంతాలు విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి హోమపూజలు చేశారు. బుధవారం ఉదయం 4వ కాల యాగపూజలు అనంతరం మహా పూర్ణాహుతి పూజలు చేపట్టి అశేష భక్తజనం నడుమ ఆలయ శిఖర కలశాలను పవిత్ర పుణ్యతీర్థాలతో అభిషేకించారు. భక్తులపై తీర్థ జలాలు వెదజల్లారు. మూల వీరాట్‌కు అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. డీఎంకే రాష్ట్ర జనరల్‌బాడీ సభ్యుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరసింహన్, మాజీ యూనియన్ చైర్మన్ వెంకటరాజు, కేజీకండ్రిగ సుబ్బురామ్, ఆలయ ధర్మకర్త, సర్పంచ్ ఉమాపతి పాల్గొన్నారు.

శ్రీమద్భాగవతంతో ఆధ్యాత్మిక జ్ఞానం

- శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి
- ముగిసిన భాగవత సప్తాహ మహోత్సవం


శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డితో భాగవత భక్త సమాజ బృందం

సత్యవేడు: భగవంతుడు మన మనస్సులోకి ప్రవేశించేందుకు అవసరమైన ఆధ్యాత్మిక మార్గాలను తెరిచి, మనశ్శాంతిని, ఆనందాన్ని అందించి, చివరకు ముక్తి వైపు నడిపించే శక్తి శ్రీమద్భాగవతానికి ఉందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు. శ్రీసిటీ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాగవత సప్తాహ మహోత్సవం బుధవారంతో దిగ్విజయంగా ముగిసింది. ఆలయ వార్షిక ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీసిటీ సౌజన్యంతో, భాగవత భక్తి సమాజ సభ్యులు ఈనెల 19న భాగవత సప్తాహ మహోత్సవం ప్రారంభించారు. 25 మంది సభ్యుల బృందం వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్రం 6.30 వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో 12 స్కంధాలతో కూడిన భాగవత శ్లోకాలను పఠించారు. అధ్యాత్మిక జ్ఞాన సముపార్జన చేసే క్రమంలో భాగవత వైశిష్ట్యాన్ని వివరిస్తూ రాష్ట్ర మంతటా ప్రతి నెలా భక్తులు కోరిన చోట వైఎస్సార్ జిల్లా పులివెందుల ప్రాంతానికి చెందిన భాగవత భక్త సమాజ బృందం సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 366 సప్తాహాలు పూర్తి చేయగా శ్రీసిటీలో 367వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ భాగవత భక్త సమాజ బృందానికి కృతజ్ఞతలు తెలుపుతూ శ్రీసిటీలో శ్రీమద్భాగవత సప్తాహం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. భాగవత సప్తాహం మన సమాజానికి అత్యంత ప్రయోజనకరమైన యజ్ఞం వంటిదన్నారు. భాగవత భక్త సమాజ సభ్యులను శ్రీసిటీ ప్రతినిధులు మధురెడ్డి, శాస్త్రి తదితరులు శాలువాలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జగనన్న ఆరోగ్య సురక్ష

18వ రోజు

నిర్వహించిన మొత్తం శిబిరాలు **11,378**

నమోదైన ఓపీలు **48,26,942**

నిర్వహించిన వైద్య పరీక్షలు **6,28,93,574**

మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రెఫరల్ **75,521**


విశాఖ జిల్లా పెదగంట్యాడ పరిధి నెల్లిముక్కు పీహెచ్‌సీలో జగనన్న సురక్ష శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది


శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా డీసీపల్లిలో పరీక్షలు చేయించుకుని మందులు తీసుకుంటున్న ప్రజలు


పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం మిట్టమీదపల్లెలోని శిబిరానికి తరలివచ్చిన గ్రామస్తులు


కర్నూలు జిల్లా సోగనూరు గ్రామంలో మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది


విజయనగరం జిల్లా లోచర్ల శిబిరంలో మందులు తీసుకుంటున్న ప్రజలు


శ్రీకాకుళం జిల్లా తెలగవలసలో శిబిరానికి తరలివచ్చిన గ్రామస్తులు


ఏలూరు జిల్లా గంగవరం గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పేదోళ్లకు వరం.. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం

మంత్రి విడదల రజిని


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి రజిని

చిలకలూరిపేట: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదోళ్ల ఆరోగ్యానికి అత్యంత రక్షణ కల్పిస్తున్నామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనా విధానం నుంచి పుట్టిన అద్భుత పథకమని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట సుగాలికాలనీలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంత్రి బుధవారం పరిశీలించారు. శిబిరానికి హాజరైన పేద రోగులను ఆత్మీయంగా పరామర్శించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 60 లక్షల కుటుంబాలకు వైద్య సేవలు అందజేయటమే లక్ష్యం కాగా, ఇప్పటి వరకు కోటి34లక్షల కుటుంబాలకు వైద్య సేవలు అందాయన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 9,535 వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. 71,173 మందికి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యం అందించినట్లు చెప్పారు. చంద్రబాబు హయాంలో ఆరోగ్యరంగం కుదేలైందని విమర్శించారు. గతంలో 1,059 ఉన్న ఆరోగ్య శ్రీ వైద్య సేవలను జగనన్న ప్రభుత్వం 3,257కు పెంచిందని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని పాల్గొన్నారు.

మన్యంలో మొబైల్ సేవల విస్తరణకు చర్యలు

సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి వెల్లడి


సమీక్షలో పాల్గొన్న సీఎస్ జవహర్ రెడ్డి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ మొబైల్ సేవల విస్తరణకు చర్యలు చేపట్టామని, గిరిజన ప్రాంతాల్లో సమాచార వ్యవస్థ మరింత పురోభివృద్ధి సాధించినట్లు సీఎస్ కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ప్రధాని మోదీ నిర్వహించిన పీఎం ప్రగతి సమీక్ష వర్చువల్ సమావేశంలో జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో టెలికం సర్వీసుల విస్తరణకు చేపడుతోన్న చర్యల గురించి ప్రధానికి వివరించారు. సీఎస్ మాట్లాడుతూ..టవర్ల ఏర్పాటు చేసేందుకు ఇప్పటివరకు గుర్తించిన అన్ని ప్రాంతాల్లోనూ స్థలాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కలెక్టర్ మల్లికార్జున, అదనపు డీజీపీ ఆర్‌కే మీనా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల బోట్లకు ట్రాకింగ్ వ్యవస్థ

సముద్రంలో చేపల వేటకు వెళ్లే అన్ని రకాల బోట్లకు ట్రాకింగ్ సిస్టమ్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎస్ తెలిపారు. విశాఖలోని తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రంలో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. సీఎస్‌తో పాటు తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ పాల్గొన్నారు. సముద్ర తీర భద్రత, సరిహద్దులు దాటకుండా మత్స్యకారుల్ని సుశిక్షితుల్ని చేయడం, వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి విశాఖలో నిర్వహించనున్న మిలాన్–2024ను విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

బొగ్గుకు బకాయిలేం లేవు!

గడువుకు మించకుండా కోల్ కంపెనీలకు సకాలంలోనే చెల్లింపులు

- సెప్టెంబర్‌లోనే ఎంసీఎల్‌కు జెన్‌కో రూ. 554.57 కోట్లు చెల్లింపు
- సింగరేణి కాలరీస్‌కు పెండింగ్ బకాయిలు ఏమీ లేవు
- అయినా వాస్తవాలు దాచి ‘ఈనాడు’ తప్పుడు కథనం
- దేశంలో బొగ్గు ఉత్పత్తి తగ్గినా.. ప్రణాళికా బద్ధంగా ముందుకెళుతున్న జెన్‌కో
- ఎఫ్‌ఎస్‌ఏ లక్ష్యంలో 95.67 శాతం మేర బొగ్గు సేకరణ
- టీడీపీ హయాంలో 81.02 శాతం మించని ఎఫ్‌ఎస్‌ఏ లక్ష్యం
- చంద్రబాబు నిర్వాకంతోనే ఏపీ జెన్‌కోకు భారీ నష్టాలు


బొగ్గు రాదు.. బకాయిలే కారణం!

- రూ.1,200 కోట్ల బకాయిలు
- రోజుకు 30 ఎంయూల ఉత్పత్తి నష్టం
- ఆ మేరకు అధిక ధరకు కొనుగోలు
- భారం ప్రజలపైనే వేస్తున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: అవే పైత్యపు కథనాలు.. నిస్సిగ్గుగా పచ్చి అబద్ధాలు.. విలువలు లేకుండా అడ్డగోలుగా అచ్చేస్తున్న అవాస్తవాల పరంపరలో మరో నీతిమాలిన వార్తను రామోజీరావు ‘బొగ్గు రాదు.. బకాయిలే కారణం’ శీర్షికతో ఈనాడులో వండి వార్చారు. కళ్లముందు నిజాలు కనిపిస్తున్నా.. టీడీపీ హయాంలో బొగ్గు సేకరణ ఇప్పటి కన్నా తక్కువే ఉన్నా ఆ నిజాన్ని దాచి ప్రజలను మభ్యపెట్టేందుకు ఆ కథనంలో విశ్వప్రయత్నం చేశారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేసిన కంపెనీలకు ఇంధన సరఫరా ఒప్పందాల (ఫ్యూయల్ సప్లయి అగ్రిమెంట్స్–ఎఫ్‌ఎస్‌ఏ) ప్రకారం సకాలంలో బకాయిలు చెల్లిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ విద్యుదుత్పాదక సంస్థ (ఏపీజెన్‌కో) మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు స్పష్టం చేశారు. ఈనాడు కథనంలో వాస్తవం లేదని ఆయన తెలిపారు. ఈ మేరకు ‘సాక్షి’కి ఏపీజెన్‌కో ఎండీ వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి.

‘ఎఫ్‌ఎస్‌ఏ’ ప్రకారం సకాలంలో చెల్లింపులు

మహానది కోల్ ఫీల్డ్స్ (ఎంసీఎల్)కు ఏపీజెన్‌కో సెప్టెంబర్‌లో రూ. 554.57 కోట్ల బకాయిలు చెల్లించింది. గడువులోగా చెల్లించాల్సిన బకాయిలు ఏమీలేవు. సింగరేణి కాలరీస్ కంపెనీస్ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు చెల్లింపులకు ‘బిల్ ఆఫ్ ఎక్స్ఛేంజ్’ విధానం వల్ల ఆ సంస్థకు పెండింగ్ బకాయిలు లేవు. ఎస్‌సీసీఎల్, ఎంసీఎల్ నుంచి ఎఫ్‌ఎస్‌ఏ ప్రకారం ఏపీజెన్‌కో బొగ్గు సేకరిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం నిర్దిష్ట గడువులో బకాయిలు చెల్లిస్తోంది. ఇక ఈ ఏడాది దేశవ్యాప్తంగా పెరిగిన విద్యుత్ డిమాండ్ మేరకు బొగ్గు సరఫరా కానందున అన్ని రాష్ట్రాలు బొగ్గు కొరతను ఎదుర్కొంటున్నాయి. పైగా నైరుతీ రుతుపవనాల సీజన్‌లో బొగ్గు తవ్వకాలకు అంతరాయం కలిగింది. ఈ పరిస్థితిని ముందే అంచనా వేసిన ఏపీజెన్‌కో వారం వారం జరిగే కేంద్ర ఉపసంఘం సమీక్షల్లో, ఇంటర్ మినిస్టీరియల్ కమిటీ (ఐఎంసీ) సమావేశాల్లో బొగ్గు సరఫరా పెంచాలని పదేపదే విజ్ఞప్తి చేస్తూ వస్తోంది. ప్లాంట్లలో బొగ్గు నిల్వలు పెంచుకోవడానికి, పెరిగిన ఏపీ గ్రిడ్ డిమాండ్ మేరకు విద్యుదుత్పత్తి పెంచేందుకు ఏపీ జెన్‌కో ప్రణాళికాబద్ధంగా అన్ని ప్రయత్నాలు సాగిస్తోంది. ఇందులో భాగంగానే అదనపు బొగ్గు సేకరణ కోసం కోల్ కంపెనీలతో నిత్యం సంప్రదింపులు జరుపుతోంది. ప్రస్తుత బొగ్గు కొరత పరిస్థితుల్లో సైతం ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో (ఏప్రిల్–సెప్టెంబర్) ఎఫ్‌ఎస్‌ఏ లక్ష్యంలో 95.67 శాతం మేరకు బొగ్గును ఏపీ జెన్‌కో సేకరించగలగడం విశేషం. టీడీపీ అధికారంలో ఉన్న 2018 ఇదే కాలంలో ఒప్పందంలోని 81.02 శాతం బొగ్గు మాత్రమే సేకరించడం గమనార్హం.

పెరిగిన విద్యుత్ ఉత్పత్తికి తగ్గట్టు ప్రణాళిక

ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తి పెరిగినందున ఏపీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు వినియోగం కూడా పెరిగింది. మరోవైపు ఏపీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలు 75 శాతం పవర్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్‌ఎఫ్)తో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడమే లక్ష్యంగా విద్యుత్ ఉత్పత్తి పెంచేందుకు, థర్మల్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు పెంచుకునేందుకు, బొగ్గు నిర్వహణ యూనిట్‌ను ఏపీ జెన్‌కో పటిష్టం చేస్తోంది. ఇందుకు అనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకుని లక్ష్యాల సాధన దిశగా ముందుకెళుతోంది.

జెన్‌కోను దెబ్బతీసింది చంద్రబాబే

చంద్రబాబు హయాంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలను బలవంతంగా మూసివేయడం వల్ల ఏపీ జెన్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. నాసిరకం బొగ్గును అధిక ధరకు గత టీడీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. కాగ్ సైతం ఈ విషయాన్ని బయటపెట్టింది. డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీటీపీఎస్), రాయలసీమ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఆర్టీపీపీ) 2011–12లో 22.235 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. కానీ 2015–16 నాటికి విద్యుదుత్పత్తి 19.359 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. దీనివల్ల విద్యుదుత్పత్తి ధర యూనిట్‌కు రూ. 2.94 నుంచి రూ. 4.34కు పెరిగింది. బలవంతంగా మూసివేయడం వల్ల ఆ రెండు విద్యుత్ కేంద్రాలకు రూ. 675.69 కోట్లు నష్టం వాటిల్లింది. మహానది కోల్ లిమిటెడ్ (ఎంసీఎల్) బొగ్గు సరఫరా చేయడం లేదనే సాకు చూపి 2014 జూలైలో 26.61 లక్షల మిలియన్ టన్నుల బొగ్గును, 2015–16లో ఎలాంటి అవగాహనా ఒప్పందం కుదుర్చుకోకుండానే 63.5 లక్షల టన్నుల బొగ్గును సింగరేణి నుంచి ప్రీమియం ధరకు టీడీపీ ప్రభుత్వం కొనుగోలు చేసింది. 2014 నుంచి 2016 వరకూ కోల్ ఎనాలిసిస్ నివేదికలు, కోల్ ఇన్వాయిస్‌లను సమీక్షిస్తే జెన్‌కో కొనుగోలు చేసిన బొగ్గు నాణ్యతలో భారీ వ్యత్యాసాలు ఉన్నట్లు తేలింది. నాణ్యతలేని రూ. 3,179.32 కోట్ల విలువైన 86.02 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును అధిక ధరను కొనుగోలు చేయడం వల్ల జెన్‌కోకు రూ. 918.61 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కాగ్ తేల్చింది. అప్పట్లో విదేశీ బొగ్గునూ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరకు కొనుగోలు చేశారు. ప్రభుత్వ సంస్థలను ముందు పెట్టి తెరవెనుక కోల్‌మాఫియా చక్రం తిప్పింది. రూ. 500 కోట్లకు పైగా ప్రజాధనం వృథా అయ్యింది.

జాతీయం/అంతర్జాతీయం





కాంగ్రెస్‌కు ఎస్పీ గండం!

మధ్యప్రదేశ్‌లో కుదరని పొత్తు

పలుచోట్ల సొంతంగా బరిలోకి ఎస్పీ

కాంగ్రెస్ అవకాశాలకు గండి కొట్టే చాన్స్



మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మరో తలనొప్పి ఎదురైంది. విపక్ష ఇండియా కూటమిలోని తన భాగస్వామి సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకం బెడిసికొట్టింది. ఈ పరిణామంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆగ్రహంతో ఉన్నారు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసే విషయమై చర్చలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్టు ప్రకటించారు. ఇది మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ అవకాశాలను దెబ్బతీయడమేగాక కీలకమైన 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల సయోధ్యపైనా ప్రతికూల ప్రభావం చూపగలదంటున్నారు.

మధ్యప్రదేశ్‌లో సమాజ్‌వాదీ చిన్న పార్టీయే. కానీ రాష్ట్రంలో పలుచోట్ల అది ఉనికిలో ఉంది. పైగా పలు అసెంబ్లీ స్థానాల పరిధిలో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉంది. ఆ పార్టీతో పొత్తు బెడిసికొట్టిన నేపథ్యంలో ఆయా చోట్ల కాంగ్రెస్‌కు ఇబ్బందికరమేనని చెబుతున్నారు. ఈ పరిణామంతో తమకొచ్చిన ఇబ్బందంటూ ఏమీ లేదని పీసీసీ చీఫ్ కమల్‌నాథ్, ఇతర రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేతలు పైకి చెబుతున్నా వాస్తవం మరోలా ఉందన్న అభిప్రాయమే వినిపిస్తోంది.

ఇలా మొదలైంది...

అక్టోబర్ 15వ తేదీన కాంగ్రెస్ 144 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేయడంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్, ఎస్పీ జగడానికి బీజం పడింది. తమకు దక్కుతాయని ఆశించిన స్థానాలు సైతం వాటిలో ఉండటంపై సమాజ్‌వాదీ పార్టీ కన్నెర్రజేసింది. కనీసం ఆరు స్థానాలకు తమకు కేటాయిస్తామని గతంలో తొలుత చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఆ మాట తప్పి అన్ని చోట్లా అభ్యర్థులను ప్రకటించుకుందని అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఆ వెంటనే సమాజ్‌వాదీ పార్టీ సైతం తొమ్మిది మంది అభ్యర్థులతో జాబితా విడుదల చేసింది. వాటిలో ఐదు కాంగ్రెస్ స్థానాలున్నాయి! అనంతరం దాదాపుగా అన్ని స్థానాలకూ కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించగా ఎస్పీ మరో 24 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దించింది. అన్నింటా కలిపి మొత్తమ్మీద 20 చోట్ల కాంగ్రెస్, ఎస్పీ అభ్యర్థులు తలపడుతున్నారు. ఎస్పీ మరింత మంది అభ్యర్థులను ప్రకటిస్తే ఈ సంఖ్య ఇంకాస్త పెరిగేలా ఉంది. టికెట్ల కోసం ఆశావహుల నుంచి ఉన్న విపరీతమైన ఒత్తిడి వల్లే ఎస్పీ పార్టీ కోరిన నియోజకవర్గాల్లో సీట్లు కేటాయించకలేకపోయినట్లు కాంగ్రెస్ వాదిస్తోంది. అప్పటికీ తమ అభ్యర్థుల్లో కొందరిని ఎస్పీ టికెట్‌పై పోటీ చేసేలా ఒప్పించేందుకు విఫలయత్నం చేసినట్టు నేతలు చెబుతున్నారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

మధ్యప్రదేశ్‌లో ఉత్తరప్రదేశ్ సరిహద్దుల్లోని బుందేల్‌ఖండ్, వింధ్య ప్రాంతాల్లో ఎస్పీకి గట్టి మద్దతే ఉంది.

- 2018 ఎన్నికల్లో ఎస్పీ 52 చోట్ల పోటీ చేసింది. నెగ్గింది ఒక్క బిజావర్ స్థానంలోనే.
- మొత్తమ్మీద కేవలం 1.3 శాతం ఓట్లు సాధించింది.
- కానీ ఆ ఎన్నికల్లో ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఎస్పీ గనక బరిలో ఉండకపోతే ఆ చోట్ల బీజేపీ ఓటమి చవిచూసి కాంగ్రెసే నెగ్గేది!

కాంగ్రెస్‌పై ప్రభావమెంత?

- ఈ పరిణామం ఆయా చోట్ల బీజేపీ విజయాన్ని మరింత తేలిక చేసేలా కన్పిస్తోంది.
- పృథ్వీపూర్ స్థానంలో కాంగ్రెస్ తర్వాత ఎస్పీ రెండో స్థానంలో నిలిచింది. అక్కడ భారీగా ఓట్లు రాబట్టింది.
- 2018లో బీజేపీ, కాంగ్రెస్ నువ్వా నేనా అన్నట్లుగా తలపడ్డాయి. బీజేపీకి 109, కాంగ్రెస్‌కు 114 స్థానాల్లో గెలుపొందాయి. సమాజ్‌వాదీ పార్టీ తదితరుల మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- జబేరా వంటి పలు అసెంబ్లీ స్థానాల్లో గత ఎన్నికల్లో బీజేపీ అతి తక్కువ మెజారిటీలతో బయటపడింది.
- ఈసారి సైతం బీజేపీ, కాంగ్రెస్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. అందుకే సమాజ్‌వాదీ పార్టీ చీల్చే ఓట్లు కాంగ్రెస్‌కు భారీ నష్టం కలగజేయవచ్చని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.
- కాంగ్రెస్‌తో పొత్తు బెడిసికొట్టిన నేపథ్యంలో ఈసారి అలాంటి అన్నిచోట్లా బరిలో దిగి తీరతామని ఎస్పీ ఇప్పటికే ప్రకటించింది.
- ఆ పార్టీకి రాష్ట్రంలో ఉన్న దాదాపు 2 శాతం ఓటు బ్యాంకును కాంగ్రెస్ పరిగణనలోకి తీసుకుని ఉండాల్సిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నాలుగో జాబితా విడుదల

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌లో ప్రతిపక్ష బీజేపీ తమ అభ్యర్థుల నాలుగో జాబితాను బుధవారం విడుదల చేసింది. నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఇవన్నీ జనరల్ స్థానాలే. బేల్తారా స్థానంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రజనీష్ సింగ్‌కు టికెట్ నిరాకరించింది. ఇక్కడ 40 ఏళ్ల సుశాంత్ శుక్లాకు అవకాశం కల్పించింది. మరో మూడు సీట్లో కొత్త అభ్యర్థులనే బరిలోకి దింపుతోంది. రాష్ట్రంలో 90 శాసనసభ స్థానాలుండగా, తాజా జాబితాతో బీజేపీ మొత్తం స్థానాలకు అభ్యర్థులను ప్రకటించినట్లయ్యింది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ 33 మంది ఓబీసీలకు, 30 మంది ఎస్టీలకు, 10 మంది ఎస్సీలకు టికెట్లు కేటాయించింది.

మధ్యప్రదేశ్‌లో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల మార్పు

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థుల ఖరారు ప్రక్రియ కత్తిమీద సాములా మారింది. టికెట్లు రాని అభ్యర్థులు నిరసన గళం వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను కాంగ్రెస్ అధిష్టానం బుధవారం మార్చేసింది. సుమౌలీ, పిపారియా, బాద్‌నగర్, జవోరా స్థానాల్లో కొత్త అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. సుమౌలీ నియోజకవర్గంలో కుల్దీప్ సికార్వార్ స్థానంలో అజబ్ కుషావహా, పిపారియాలో వీరేంద్ర స్థానంలో గురు ఖరే, బాద్‌నగర్‌లో రాజేంద్ర సోలంకీ బదులు మురళీ మోర్వాల్, జవోరాలో హిమ్మత్ బదులు వీరేంద్ర సోలంకీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించింది.

కూటమి.. కూలుతోంది

నర్సింగ్‌పూర్(మధ్యప్రదేశ్): విపక్ష ‘ఇండియా’ కూటమిలో భాగస్వాములైన సమాజ్‌వాదీ పార్టీ, జేడీ(యూ)లు.. కాంగ్రెస్ అభ్యర్థులున్న స్థానాల్లో పోటీగా అభ్యర్థుల్ని దింపడాన్ని బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివ్‌రాజ్ సింగ్ చౌహాన్ ఎద్దేవా చేశారు. ‘ ఇండియా కూటమి పార్టీలు విభేదాలతో పోటాపోటీగా అవే స్థానాల్లో తమ తమ అభ్యర్థుల్ని దింపుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులను చోట్ల ఎస్పీ, జేడీ(యూ) తమ అభ్యర్థులను ప్రకటించడం చూస్తుంటే ఈ కూటమి పటిష్టవంతంకాకమునుపే కూలుతోందని స్పష్టమవుతోంది’ అని అన్నారు. ‘వరదొస్తే ప్రాణులన్నీ చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకుంటాయి. మోదీ పాపులారిటీ వరద ధాటికి విపక్ష పార్టీలన్నీ చెట్టెక్కి కూర్చున్నాయి. కొమ్మలపై బుద్ధిగా కూర్చోకుండా అఖిలేశ్, వఖిలేశ్ అంటూ తమలో తామే తిట్టుకుంటున్నాయి’ అని అన్నారు.

మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉత్త డొల్ల

కుల గణనపై బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడడం లేదు	రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో ప్రియాంకా గాంధీ



జైపూర్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఉత్త డొల్ల అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా విమర్శించారు. మోదీ పాలనలో సామాన్య ప్రజల సమస్యలను పరిష్కరించే నాథుడే లేకుండాపోయాడని అన్నారు. కేవలం కొద్దిమంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ఆమె బుధవారం రాజస్తాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కుల గణనపై బీజేపీ నాయకులు ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టడానికి బీజేపీ మతాలు, కులాల గురించి మాట్లాడుతోందని ఆక్షేపించారు. అధికారం కాపాడుకోవడానికి ప్రజలను అణచివేసే చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి సొంత లాభం కోసం పాకులాడే నాయకులను ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలని ఓటర్లకు ప్రియాంకా గాంధీ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచార సభలో రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ మాట్లాడారు. రాష్ట్రంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే రెండు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 1.05 కోట్ల కుటుంబాలకు రూ.500కు వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని చెప్పారు. అలాగే అర్హులైన మహిళలకు సంవత్సరానికి రూ.10,000 చొప్పున గౌరవ భృతి ఇస్తామని వెల్లడించారు. ఇంటి పెద్ద అయిన మహిళలకు ఈ గౌరవ భృతి అందుతుందని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు ‘ఉచితాలు’ కావు

కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే

రాయ్‌పూర్: పేద ప్రజల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలను బీజేపీ నాయకులు ‘ఉచితాలు’ అంటూ అభివర్ణిస్తూ ఉండడాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాతే తప్పుపట్టారు. పేదల సంక్షేమ పథకాలు నిజంగా ఉచితాలే అయితే వాటిని తాము కచ్చితంగా అమలు చేస్తామని తేల్చిచెప్పారు. సుప్రియా శ్రీనాతే బుధవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు చక్కగా అమలు చేసిందని చెప్పారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో, ఇప్పటిదాకా చేసిన అభివృద్ధిని చూపించి ఓట్లు అడుగుతామని అన్నారు. రిపోర్టు కార్డును ప్రజల ముందు పెట్టబోతున్నామని తెలిపారు. నిరుపేదల బాగు కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఉచితాలు ఎలా అవుతాయని ప్రశ్నించారు. గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలు, కార్మికులు, రైతుల సంక్షేమం కోసం అమలు చేసిన పథకాలేవీ ఉచితాలు కావని తేల్చిచెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో భూపేష్ బఘేల్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల గత ఐదేళ్లలో 40 లక్షల మంది పేదరికం నుంచి బయటపడ్డారని సుప్రియా శ్రీనాతే హర్షం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబం.. రాజకీయ విరోధం

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో బంధుత్వ రాజకీయం



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ఒకే కుటుంబంలోని వారు వేర్వేరు పార్టీల తరఫున పోటీ చేస్తున్నారు. ఇలా అధికారం కోసం బద్ధ వైరులుగా మారిన వారిలో అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల నేతలున్నారు. నవంబర్ 17వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో తోబుట్టువులు, మామ- మేనల్లుడు, బావమరుదులు, అల్లుళ్లు, అత్తలు, మామలు..ఇలా రాజకీయ ప్రత్యర్థులుగా రంగంలోకి దిగారు. నర్మదాపురం స్థానంలో బీజేపీ అభ్యర్థి, అసెంబ్లీ స్పీకర్ సీతాశరణ్ శర్మపై స్వయానా ఆయన సోదరుడు గిరిజాశంకర్ శర్మ కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అయిన గిరిజా శంకర్ సొంత పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరో ఉదాహరణ..సాగర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్‌కు చెందిన నిధి సునీల్ జైన్, తన బావ, సిట్టింగ్ బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర జైన్‌పై పోటీకి దిగారు. శైలేంద్ర జైన్ చిన్న తమ్ముడు సునీల్ జైన్ భార్యే నిధి జైన్. దియోరి నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే సునీల్ జైన్. అదేవిధంగా, రేవా జిల్లా డియోతలాబ్‌లో కాంగ్రెస్ పార్టీ పద్మేష్ గౌతమ్‌ను పోటీకి నిలిపింది. ఈయన మామ, బీజేపీకి చెందిన ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ గిరీశ్ గౌతమ్ ఇక్కడ పోటీ చేస్తున్నారు. హర్దా జిల్లా తిమార్నిలో సిట్టింగ్ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి సంజయ్ షాపై ఆయన మేనల్లుడు అభిజీత్ షా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్నారు. వీరిద్దరూ ముఖాముఖి తలపడటం ఇది రెండోసారి. గ్వాలియర్ జిల్లా దాబ్రాలో బీజేపీకి చెందిన మాజీ మంత్రి ఇమార్తి దేవిపై ఆమె బంధువు సిట్టింగ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేశ్ రాజేతో తలపడుతున్నారు. ఇమార్తి దేవి మేనకోడలు రాజే కుటుంబంలో కోడలిగా ఉన్నారు. కుటుంబసభ్యులు ఎన్నికల్లో పరస్పరం తలపడటంపై సీనియర్ జర్నలిస్ట్, వ్యాఖ్యాత ఆనంద్ పాండే మాట్లాడుతూ..‘ఇది సైద్ధాంతిక సంఘర్షణ కానే కాదు. కేవలం అధికారం, పదవుల కోసం జరిగే పోరాటం’అని పేర్కొన్నారు.


● అనుష్ఠ కాలియా

శిక్షణ పూర్తి చేసుకున్న ఐపీఎస్ ట్రైనీల్లో 32 మంది మహిళలు

- ఈసారి పరేడ్ కమాండర్‌గా ఎంపికైన టాపర్ అనుష్ఠ కాలియా
- యూట్యూబ్ పాఠాలతో 172 ర్యాంక్ కొట్టిన సిమ్రన్ భరద్వాజ్
- న్యాయవాదిగా సఫాయీ కార్మికుల కోసం పోరాడిన ఇషాసింగ్
- ఐఎఎస్ నుంచి ఐపీఎస్‌గా సఫలీకృతురాలైన బి. చైతన్యరెడ్డి


● సిమ్రన్ భరద్వాజ్

ఎవరికి వారే.. మహిళా‘మణులే’!

హైదరాబాద్ శివార్లలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ పోలీసు అకాడెమీలో (ఎస్‌వీపీ ఎన్‌పీఏ) శిక్షణ పూర్తి చేసుకున్న 155 మంది ఐపీఎస్ ట్రైనీల్లో 32 మంది మహిళలు ఉన్నారు. అన్ని విభాగాల్లోనూ తన సత్తా చాటి ఓవరాల్ టాపర్‌గా నిలిచిన అనుష్ఠ కాలియా శుక్రవారం జరిగే పాసింగ్ ఔట్ పరేడ్‌కు (పీఓపీ) నేతృత్వం వహించనున్నారు. ఇలా ఓ మహిళ ట్రైనీ పీఓపీకి నేతృత్వం వహించడం 75 ఏళ్ళ అకాడెమీ చరిత్రలో ఇది మూడోసారి. ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారులుగా బయటకు రానున్న మహిళామణుల్లో ఉన్న ప్రత్యేకతల గురించి...

గంటకు 16 కిమీ పరిగెత్తే సత్తా సాధించి...

ఢిల్లీకి చెందిన అనుష్ఠ కాలియా ఢిల్లీ యూనివర్శిటీలోని క్లస్టర్ ఇన్నోవేషన్ సెంటర్ నుంచి డేటా సైన్స్‌లో బీటెక్ పూర్తి చేశారు. అక్కడే బ్లింకిట్ అనే స్టార్టప్ సంస్థలో డేటా సైంటిస్ట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షలపై ఉన్న ఆసక్తితో ఆరునెలలకే ఈ ఉద్యోగం వదిలారు. కోవిడ్ ప్రభావంతో కోచింగ్ సెంటర్లకు బదులు ఆన్‌లైన్ క్లాసులకు పరిమితం అయ్యారు. లాక్‌డౌన్ కారణంగా ఇతరుల్ని కలవడం తగ్గిపోవడంతో దాన్ని పాజిటివ్‌గా వాడుకుని చదువుకే పరిమితం అయ్యారు. మొదటి ప్రయత్నంలోనే 143వ ర్యాంకు సాధించారు. స్కూలు, కాలేజీ రోజుల్లో బ్యాడ్మింటన్, కరాటే పోటీల్లో పాల్గొన్నారు. అయినప్పటికీ ఎన్‌పీఏలో అడుగు పెట్టే సమయానికి గంటకు కిలోమీటరు దూరం కూడా పరిగెత్తలేని స్థితిలో ఉన్నారు. ఇక్కడి శిక్షణ కారణంగా ప్రస్తుతం గంటకు 16 కిమీ పరిగెత్తే సామర్థ్యాన్ని సాధించారు. ఈ బ్యాచ్‌లో ఓవరాల్ టాపర్‌గా, ఔట్‌డోర్ టాపర్‌గానే కాకుండా పరేడ్ కమాండర్‌గా నిలిచే అవకాశంతోపాటు స్వార్డ్ ఆఫ్ ఆనర్ సొంతం చేసుకున్నారు.

ప్రజాసేవలో సాంకేతికతని వినియోగించాలన్నదే తన లక్ష్యమని చెప్తున్నారు. ఎన్‌పీఏ శిక్షణలో ఎన్నో అంశాలు నేర్చుకున్నానని, గ్రేహౌండ్స్ ఆధ్వర్యంలో జరిగిన నెల రోజుల జంగిల్ ట్రైనింగ్ మాత్రం కఠినంగా అనిపించిందని చెప్పారు.


● ఇషా సింగ్


● బి. చైతన్యరెడ్డి

లాయర్‌గానే సఫాయీ కార్మికుల కోసం...

ముంబైకి చెందిన ఇషా సింగ్ తండ్రి యోగేష్ ప్రతాప్ (వైపీ) సింగ్ ఐపీఎస్ అధికారి అయినప్పటికీ వీఆర్ఎస్ తీసుకుని న్యాయవాదిగా మారారు. తల్లి అభాసింగ్ సైతం న్యాయవాది. వైపీ సింగ్ మహారాష్ట్రలో కలకలం సృష్టించిన ఆదర్శ్ హౌసింగ్ సొసైటీ స్కామ్‌లో బాధితుల తరఫున న్యాయపోరాటం చేస్తున్నారు. 2018లో బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్శిటీ నుంచి ఇషా పట్టా పొందారు. 26వ ఏటనే పీపుల్స్ లాయర్‌గా పేరు తెచ్చుకున్నారు. అక్కడి గోవాండీలో ఉన్న మౌర్య హౌసింగ్ సొసైటీలో 2019 డిసెంబర్ 3న జరిగి ఉదంతం ఇషా దృష్టికి వచ్చింది. అక్కడ సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి ప్రయత్నించిన ముగ్గురు సఫాయీ కార్మికులు చనిపోయారు. చనిపోయిన వారి భార్యలకు న్యాయం చేయడం కోసం అసిస్టెన్స్ ఫర్ సఫాయీ కరమ్‌చారీ (ఆస్క్) స్థాపించారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా నిధులు సమీకరించి అందించారు. ఇలా మరణించిన వారికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని 1993 నుంచి మహారాష్ట్ర లో నిబంధనలు ఉన్నా అమలు కాలేదు. దీనిపై ముంబై హైకోర్టులో 2021లో రిట్ దాఖలు చేసి వారి తరఫున పోరాడి వారికి పరిహారం ఇప్పించారు. ఈ కేసుపై అప్పటి జడ్జ్ ఉజ్వల్ భూయాన్ 1993 నుంచి ఇలా చనిపోయిన వారి జాబితా తయారీకి ఆదేశాలు జారీ చేశారు. తండ్రి చూపిన మార్గంలో ఐపీఎస్ కావాలని భావించిన ఇషా రూ.20 లక్షల ప్యాకేజీతో వచ్చిన ఉద్యోగం వదులుకుని రెండో ప్రయత్నంలో 191వ ర్యాంక్ సాధించింది.

యూట్యూబ్ చూసి యూపీఎస్సీ పరీక్షలు క్రాక్ చేసి...

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సమీపంలో ఉన్న మావు పట్టణానికి చెందిన సిమ్రన్ భరద్వాజ్ ఢిల్లీ యూనివర్శిటీ నుంచి జర్నలిజంలో డిగ్రీ పూర్తి చేశారు. తండ్రి ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా పని చేస్తుండటంతో సాధారణంగానే యూనీఫామ్ సర్వీసెస్‌పై మక్కువ ఏర్పడింది. తాను నివసించేది చిన్న పట్టణం కావడంతో పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి అవసరమైన కోచింగ్ సెంటర్ల వంటి సదుపాయాలు లేవు. దీనికితోడు 2021 జూన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే సివిల్స్ పరీక్ష రాయాల్సి ఉంది. కరోనా ప్రభావంతో కోచింగ్ సెంటర్లు అన్నీ మూతపడ్డాయి. దీంతో యూట్యూబ్ ఛానల్స్‌లో క్లాసులు వింటూ రోజుకు 8 నుంచి 10 గంటల పాటు సివిల్స్‌కు ప్రిపేర్ అయింది. మిగిలిన సమయం కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ (సీడీఎస్) పరీక్షకు వెచ్చించింది. కోవిడ్ కారణంగా వాయిదా పడిన ఈ రెండు పరీక్షలు 2021 అక్టోబర్‌లో జరిగాయి. మొదటి ప్రయత్నాల్లోనే సీడీఎస్‌లో ఆరో ర్యాంక్, సివిల్స్‌లో 172వ ర్యాంక్ సాధించింది. 23 ఏళ్ళ వయస్సులోనే ఐపీఎస్‌కు ఎంపికైంది. ఎలాంటి ఇతర యాక్టివిటీస్ లేని కోవిడ్ టైమ్ తనకు కలిసి వచ్చిందని సిమ్రన్ చెప్తున్నారు.

ఐఏఎస్ అనుకున్నా ఐపీఎస్‌గా...

వరంగల్‌కు చెందిన బి. చైతన్య రెడ్డి అక్కడి ఎన్ఐటీ నుంచి బీటెక్ పూర్తి చేశారు. తండ్రి గ్రూప్–1 ఆఫీసర్‌గా ఉండటంతో సివిల్ సర్వీసెస్‌పై మక్కువ ఏర్పడింది. సివిల్ సర్వెంట్స్‌గా ఉంటేనే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం దక్కుతుందని అని తండ్రి చెప్పిన మాటలు ఆమెలో స్ఫూర్తి నింపాయి. ఇరిగేషన్ శాఖలో ఏఈగా పని చేస్తూనే ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో సివిల్స్ వైపు మొగ్గారు. మెయిన్స్‌లో మూడుసార్లు అపజయం ఎదురైనా కుటుంబం ఇచ్చిన ప్రోత్సాహంతో ముందుకు వెళ్ళారు. సివిల్స్‌తోపాటు కేంద్ర సాయుధ బలగాల్లో ఎంపికకు సంబంధించిన పరీక్షల్నీ రాశారు. దీంతో ఐఏఎస్ నుంచి దృష్టి ఐపీఎస్ వైపు మళ్ళింది. 2022 లో 161వ ర్యాంక్ సాధించి తెలంగాణ క్యాడర్‌కు ఎంపికయ్యారు.

– శ్రీరంగం కామేష్, సాక్షి సిటీబ్యూరో, హైదరాబాద్ ; ఫొటోలు: ఎస్.ఎస్.ఠాకూర్

పర్యావరణం

వాటర్ ఉమన్

● నదిలో నీళ్లు కాదు కన్నీళ్లు చూసింది



నదుల గొప్పతనం గురించి చెప్పమంటే మాటల్లో ఎన్ని అయినా చెబుతాం. అలాంటి పుణ్య నదులు నిర్లక్ష్యం బారిన పడి జీవం కోల్పోయే పరిస్థితిలో ఉంటే మాత్రం పట్టించుకోము. ఈ ధోరణికి భిన్నమైన మహిళ శిర్ప పథక్. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శిర్పకు నదులు అంటే ఇష్టం. వాటికి సంబంధించిన పురాణ కథలు అంటే ఇష్టం. ఆ ఇష్టంతోనే రకరకాల సమస్యలు ఎదుర్కొంటున్న పుణ్యనది గోమతి సంరక్షణ కోసం వెయ్యిన్నొక్క కిలోమీటర్ల పాదయాత్ర చేసింది...

సన్నని ప్రవాహమై బయలుదేరే గోమతి ప్రయాణంలో బలపడుతుంది. ‘ప్రయాణం గొప్పతనం బలం’ అని ఆ నది మౌనంగానే చెబుతుంది. అందుకేనేమో ‘గోమతి నదిని రక్షించుకుందాం’ నినాదానికి బలం ఇవ్వడానికి పాదయాత్ర చేసింది శిర్ప పథక్.

పారిశ్రామిక వ్యర్థాలు, నివాసాలలో నుంచి వచ్చే మురుగు నీరు... మొదలైన వాటి వల్ల గోమతి అనేక ప్రాంతాలలో కలుషితం అవుతుంది. మురుగునీటి శుద్ధి కర్మాగారాల వల్ల కూడా పెద్దగా ప్రయోజనం జరగడం లేదు.

‘గంగానదితో పోల్చితే గోమతి ప్రమాదకర పరిస్థితిని ఎదుర్కొంటోంది’ అని నివేదికలు తెలియజేస్తున్నాయి.

‘ఎవరో వస్తారని... ఏదో చేస్తారని ఎదురు చూడకుండా మన నదిని మనమే రక్షించుకుందాం’ అంటుంది శిర్ప.

పంచతత్వ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలైన శిర్ప పథక్ ‘వాటర్ ఉమన్’గా పేరు తెచ్చుకుంది. ‘గోమతి నదిని రక్షించుకుందాం’ నినాదంతో పదిహేను జిల్లాలలో ఊళ్లు, పల్లెలు, పట్టణాల గుండా సాగిన పాదయాత్రలో ఆ పుణ్య నది ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్ల గురించి ప్రజలకు తెలియజేసింది.

‘పరిస్థితి ఇది. మనం చేయాల్సింది ఇది’ అంటూ స్పష్టంగా చెప్పింది.

ప్రతిరోజు 30 నుంచి 35 కిలోమీటర్‌ల వరకు పాదయాత్ర చేసింది.

‘నది ఒడ్డున మొక్కలు నాటుదాం’ అని ప్రజలతో ప్రమాణం చేయించింది.

శిర్ప వెంట ప్రజలు వచ్చేవాళ్లు. పర్యావరణ సంబంధిత విషయాలను చర్చిస్తూ ఆమె పాదయాత్ర ముందుకు సాగేది. ‘ఆక్రమణలను అడ్డుకుందాం. పుణ్యనదిని కాపాడుకుందాం’ అనే నినాదంతో ఎక్కడికక్కడ స్థానిక ప్రజలు, అధికారులతో మాట్లాడేది. ఈ పాదయాత్రలో పాల్గొన్న వందలాది మంది ప్రజలు మొక్కలు నాటడాన్ని ఒక ఉద్యమంలా చేసుకున్నారు.

‘నా పాదయాత్రలో భాగంగా నది చుట్టు పక్కల ప్రాంతాలలో నివసించే ఎంతోమందితో మాట్లాడాను. నది పరిస్థితి తెలిసినప్పటికీ ఏంచేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. అలాంటి వారికి మార్గనిర్దేశం చేశాను’ అంటుంది శిర్ప.

శిర్ప విషయానికి వస్తే... నదుల సంరక్షణ గురించి పల్లెలు, పట్టణాల గుండా యాత్ర చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలో నర్మద నది సంరక్షణ కోసం 3600 కిలోమీటర్ల యాత్ర చేసింది.

‘నదులకు ఏమైతే మనకేమిటి? మనం హాయిగానే ఉన్నాం కదా అనే భావన నుంచి బయటికి రావాలి. నదుల మనుగడలోనే మనుషుల మనుగడ ఉంది. ప్రకృతి వనరులే మన శక్తులు. నదులకు ముప్పు వాటిల్లితే మన కుటుంబ పెద్దలకు ముప్పు వాటిల్లినట్లుగా భావించి తక్షణ చర్యలపై దృష్టి పెట్టాలి. మనిషికి రక్తం ఎంత అవసరమో నది ఆరోగ్యానికి కలుషితం కాని నీరు అంతే అవసరం’ అంటోంది శిర్ప.


● పాదయాత్రలో ప్రజలతో...

ఉత్తర్‌ప్రదేశ్‌లోని బుదౌన్ జిల్లాకు చెందిన శిర్ప ఉన్నత చదువులు చదివింది. ‘ఏదో ఒక ఉద్యోగం చేయడం కంటే నదుల పరిరక్షణకు నా వంతుగా ఏదైనా చేస్తాను’ అంటూ ప్రయాణం మొదలు పెట్టింది. ఆ ప్రయాణం వృథా పోలేదని ఎన్నో ఊళ్లలో వచ్చిన మార్పు తెలియజేస్తుంది.

నదిలో నీళ్ల మాత్రమే కాదు ఆ నది కార్చే కన్నీళ్లు కూడా ఉంటాయి. నీళ్ల అందరికీ కనిపిస్తాయి. కన్నీళ్లు కొందరికి మాత్రమే కనిపిస్తాయి. ఆ కొందరు అందరిలో అవగాహన రావడం కోసం ప్రయత్నిస్తారు. అలాంటి ఒక వ్యక్తి... వాటర్ ఉమన్ శిర్ప పథక్.

‘నా వల్ల ఏమవుతుంది అనే మాట బలహీనమైది. నా వల్ల కూడా అవుతుంది అనేది బలమైనది. బలమైన మాటే మన బాట అయినప్పుడు మార్పు సులభం అవుతుంది’ అంటుంది శిర్ప పథక్.

టిప్స్






- ఆకుకూరలు వాడిపోయినట్టుగా కనిపించినప్పుడు... వాటిని చల్లటినీటిలో వేయాలి. దీనిలో టేబుల్ స్పూను నిమ్మరసం వేసి కలిపి ఐదునిమిషాలు పక్కన పెట్టుకోవాలి. తరువాత నీటి నుంచి తీసేయాలి. ఇలా చేస్తే ఆకుకూరలు తిరిగి తాజాగా కనిపిస్తాయి.
- యాపిల్ ముక్కలు కట్ చేసిన వెంటనే ఆ ముక్కలపైన కాసింత నిమ్మరసం పిండితే రంగు మారకుండా ఎక్కువ సమయం తాజాగా ఉంటాయి.
- ఇరవై తమలపాకులని తీసుకుని శుభ్రంగా కడిగి పేస్టుచేయాలి. ఈ పేస్టులో టీస్పూను నెయ్యి వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడు నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. గంట తరువాత నీటితో కడిగేయాలి. ఇలా వారానికి ఒకసారి ఈ మాస్క్ వేసుకోవడం వల్ల తమలపాకులోని పోషకాలు అంది జుట్టు మరింత బలంగా దట్టంగా పెరుగుతుంది. జుట్టురాలే సమస్య కూడా తగ్గుముఖం పడుతుంది.

చైతన్యం

బతకడానికి ఇల్లు కావాలి



అద్దెకు ఎన్నో ఇళ్లు, ఫ్లాట్లు ఉంటాయి కదా అనిపించవచ్చు. కాని వీల్‌చైర్‌లో మాత్రమే జీవనం గడిపేవారికి ఆ ఇళ్లేవీ పనికి రావు. బెంగళూరులో ఐటి ఇండస్ట్రీలో పని చేస్తున్న మృణ్మయి తను నివసించడానికి బెంగళూరులో తగిన ఫ్లాటే దొరకడం లేదని ‘ఎక్స్’లో చేసిన పోస్ట్ విశేషంగా చాలామంది దృష్టిని ఆకర్షించింది. లిఫ్ట్‌లో అడుగు పెట్టడం దగ్గరి నుంచి బాత్‌రూమ్‌ల వరకూ ప్రతిదీ వీల్‌చైర్‌కు వీల్లేనివేనని ఆమె తెలిపింది. ఆమె మాత్రమే కాదు సాధారణ వ్యక్తులకు జబ్బు చేస్తే వీల్‌చైర్‌లో ఆస్పత్రికి వెళ్లిరావడం కూడా దుర్లభమే. మన నిర్మాణ పద్ధతుల్లో మానవీయత రాదా?

‘అందరికీ అందుబాటు’ (యాక్సెసిబిలిటీ టు ఆల్) అనే మాట వినడానికి చాలా చిన్నదిగా అనిపించవచ్చు. కాని అది ఆచరణ యోగ్యం కావడం ఇంచుమించు అసాధ్యంగా ఉంది మన దేశంలో. ‘మా ఇంటికి రండి’ అని ఆహ్వానిస్తే అందరూ ఆ ఆహ్వానాన్ని మన్నించగలరా? మన ఇల్లు దివ్యాంగుల రాకపోకలకు అనువుగా ఉందా? నివసించే ఫ్లాట్స్‌లో సులభంగా వీల్‌చైర్‌తో ప్రవేశించడం సాధ్యమవుతుందా? కట్టుకున్న ఇళ్ల మెయిన్‌గేట్‌నైనా వీల్‌చైర్ దాటగలదా? అందరూ మెట్లు వాడగలరని, మెట్లు ఉంటే సరిపోతుందని ఇప్పటికీ భావిస్తున్నామంటే యాక్సెసిబిలిటీ టు ఆల్ హక్కును నిరాకరిస్తున్నట్టే. ర్యాంప్‌లు కట్టి దివ్యాంగుల రాకపోకలను అన్ని ప్రయివేటు, పబ్లిక్ ప్లేసుల్లో సులభం చేసినప్పుడే మెరుగైన సమాజాన్ని ఏర్పాటుచేసుకున్నట్టు.

ఇల్లు కావాలి

బెంగళూరులో అమేజాన్‌లో పనిచేస్తున్న మృణ్మయి ‘నాకు ఇల్లు కావాలి. కాని అలాంటి ఇల్లు దొరకడం లేదు’ అని ‘ఎక్స్’ (ట్విటర్)లో తాజాగా పెట్టిన పోస్టు దివ్యాంగుల ఘోషను మరోసారి బయటపెట్టింది. ‘నేను ఇన్నాళ్లు ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఉన్నాను. అందులో ర్యాంప్‌లు ఉన్నాయి. నా మోటర్డ్ వీల్‌చైర్‌తో కిందకు రావడం మళ్లీ ఫ్లాట్‌లోకి వెళ్లడం సులభంగా ఉంటుంది. ఫ్లాట్‌లో కూడా ఎలాంటి ఇబ్బందీ లేదు. కాని ఇప్పుడు మా ఫ్లాట్ ఓనర్ ఏవో కారణాల రీత్యా ఖాళీ చేయమన్నాడు. అప్పటి నుంచి తగిన ఫ్లాట్ కోసం ఎంతో వెతుకుతున్నాను. కాని వీల్‌చైర్‌తో రాకపోకలు సాగించేలా ఒక్క ఫ్లాట్ కూడా లేదని తెలపడానికి చింతిస్తున్నాను’ అని ఆమె రాసుకొచ్చింది.


● రెస్టారెంట్‌లోకి వెళ్లలేక ఆగిన మృణ్మయి

అన్ని చోట్లా మెట్లే

చాలా ఫ్లాట్లలో లిఫ్ట్ దగ్గర మెట్లు ఉండటం ఒక సమస్యగా మృణ్మయి చెప్పింది. అంటే ఒకటో రెండో మెట్లు ఎక్కి లిఫ్ట్ ఎక్కాలి. కొన్ని లిఫ్టులు చాలా చిన్నవిగా ఉంటాయి. వీల్‌చైర్‌తో ప్రవేశించి లోపల దానిని తిప్పుకుని డోర్ వైపుకు ముఖం పెట్టడం కష్టం. ‘అపార్ట్‌మెంట్స్‌లో చాలా ఫ్లాట్లకు గడప అడ్డంగా ఉంటుంది. వీల్‌చైర్‌తో దాటలేము. దాటినా అన్ని ఫ్లాట్లలో బాత్‌రూమ్‌లు ఒక మెట్టు ఎత్తులో ఎందుకు కడతారో అర్థం కాదు. నేను వీల్‌చైర్‌తోటే బాత్‌రూమ్‌లోకి వెళ్లి స్నానం చేయాలి. కాని సింకో, టాయిలెట్ సీటో అడ్డంగా ఉంటుంది. అదీగాక బాత్‌రూమ్ ద్వారాలు మరీ సన్నగా పెడతారు. నా వీల్‌చైర్‌తో అడుగుపెట్టాలంటే అవి కనీసం 25 అంగుళాల వెడల్పు ఉండాలి. అలా ఉండవు’ అంటుంది మృణ్మయి. ‘మరో సమస్య ఏమిటంటే... ఇలా వీల్‌చైర్‌కు అనువుగా ఉన్న ఫ్లాట్‌లకు రెంట్ ఎక్కువ అడుగుతున్నారు. 25 వేల రూపాయల ఫ్లాట్ 40 వేలు చెబుతున్నారు’ అందామె.

యాక్సిడెంట్ వల్ల

మృణ్మయి అందరిలా హుషారుగా తిరిగే అమ్మాయి. కాని 2011లో జరిగిన కారు ప్రమాదం వల్ల ఆమెకు స్పైనల్ కార్డు ఇంజూరీ జరిగింది. సర్జరీ చేసినా రెండు భుజాల కింద ప్రాంతమంతా అధీనాన్ని కోల్పోయింది. అయినా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా మోటర్డ్ వీల్‌చైర్ ద్వారా ఆమె మామూలు జీవనం గడపడానికి ప్రయత్నిస్తోంది. ‘వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తాను. ఆఫీస్ పని కోసం డిక్టేషన్ సాఫ్ట్‌వేర్ వాడతాను. వేళ్ల మీద అధీనం ఉంది కాబట్టి టచ్ స్క్రీన్ ఉపయోగిస్తాను. కాని నాకూ తిరగాలని ఉంటుంది. బయటికొస్తే రెస్టరెంట్‌కు కూడా పోలేను. ప్రతి రెస్టరెంట్‌కూ మెట్లు ఎక్కి వెళ్లాలి. ఎక్కడా ర్యాంప్‌లు ఉండవు. కాళ్లు చేతులు సక్రమంగా ఉన్నవారికే ప్రవేశం అన్నట్టుగా మన నిర్మాణాలు ఉంటాయి. సినిమా హాళ్లు చెప్పే పనే లేదు. టాక్సీ సర్వీసులు కూడా వీల్‌చైర్ ఫ్రెండ్లీ కావు. అందుకే మాలో చాలామంది యాక్సెసిబిలిటీ యాక్టివిస్టులుగా మారి సమాజంలో చైతన్యం కలిగించడానికి ప్రయత్నిస్తుంటాం’ అని తెలిపింది మృణ్మయి.

‘ఎక్స్’లో మృణ్మయి పెట్టిన పోస్ట్‌కు చాలామంది స్పందించారు. నిజంగా మీ ఇబ్బంది మీరు చెప్తుంటే తెలుస్తోంది అని చాలామంది చెప్పారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఆఫీసులు, పార్కులు, హాస్పిటళ్లు, విద్యా సంస్థలు.. ఇలా ప్రతిదీ దివ్యాంగుల రాకపోకలకు అనువుగా మారడం, మార్చడం తప్పనిసరి. వాటిని వాడేది ఒకరిద్దరైనా ఆ ఒకరిద్దరి హక్కును నిరాకరించే అధికారం మనకు లేదు.

బిజినెస్

విదేశాలకు మన అత్తరు

యురోపియన్, అమెరికన్ పెర్‌ఫ్యూమ్స్ మన దేశీయ అత్తర్ల తయారీపైన తీవ్ర ప్రభావం చూపాయి. మనదైన కళారూపం కనుమరుగవుతోందని గమనించిన క్రతి, వరుణ్ టాండన్ లు అనే అన్నాచెల్లెళ్లు మన దేశీయ సాంస్కృతిక పరిమళ ద్రవ్యాల తయారీని సంరక్షించాలని పూనుకున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జి20 సమ్మిట్‌లో వీరి బ్రాండ్ అఫీషియల్ కానుకల జాబితాలో చేరింది.


● అన్నాచెల్లెళ్లు క్రతి, వరుణ్ టాండన్

ఉత్తర్‌ప్రదేశ్‌లోని కనౌజ్ నగరంలో చాలా కుటుంబాలు అత్తరు తయారీ కళను తరాలుగా కొనసాగిస్తున్నాయి. అయితే, ఈ సంప్రదాయ పద్ధతుల అత్తరు వాడకాలు విదేశీ బ్రాండ్ పర్‌ఫ్యూమ్‌లతో తగ్గిపోయాయి. కనౌజ్‌లో ఉంటున్న క్రతి, వరుణ్ టాండన్‌లు మనసుల్లో ఈ నిజం ఎప్పుడూ భారంగా కదలాడుతుండేది.

తమ ఆలోచనలను కార్యరూపంలో పెట్టడానికి, చేస్తున్న కృషిని ఈ సోదర ద్వయం ఇలా మన ముందుంచుతున్నారు.

“మా చిన్ననాటి నుంచీ ఈ కళను చూస్తూ పెరిగాం. ఈ ప్రత్యేకమైన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడం, ప్రోత్సహించడం పట్ల మా ఆలోచనలు, చర్చలు మా ఇంట్లో ఎప్పుడూ ఉండేవి. కోవిడ్ మహమ్మారి మన దేశీయ పరిమళ ద్రవ్యాలపైన కోలుకోలేనంత దెబ్బ వేసింది. దీంతో మా ఆలోచనలను అమల్లో పెట్టాలని రెండేళ్ల క్రితం ‘బూంద్’ పేరుతో పరిమళ ద్రవ్యాల కంపెనీ ప్రారంభించాం. మనదైన సాంస్కృతిక కళపై చిన్న డాక్యుమెంటరీ రూపొందించి, ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేశాం. దీంతో ఆర్డర్ల సంఖ్య పెరుగుతూ వచ్చింది’ అని వివరిస్తుంది క్రతి.



● అత్తరు తయారీ

కుటుంబ సభ్యులు కూడా...

కనౌజ్ పరిమళ ద్రవ్యాల కళాకారులు అత్తర్లను తయారుచేయడానికి ‘డెగ్–భాష్కా’ పద్ధతిని ఉపయోగిస్తారు. సంప్రదాయ ప్రక్రియలో సుగంధద్రవ్యాల ముడిపదార్థాలను ఉపయోగించి, మట్టి పాత్రలలో తయారుచేస్తారు. మార్కెట్‌లోని ఇతర బ్రాండ్స్ ధరలతో పోల్చితే తక్కువ, సువాసనల ఉపయోగాలు ఎక్కువ. పెరుగుతున్న డిమాండ్‌ను బట్టి ధరలలో మార్పు ఉంటుంది. యుఎస్, యూరోప్, ఆస్ట్రేలియా, సింగపూర్ దేశాలకు 20 వేల కంటే ఎక్కువ ఆర్డర్లు పంపించాం. ఈకామర్స్ ప్లాట్‌ఫార్మ్‌లలో విక్రయించడమే కాకుండా, ముంబై, జైపూర్‌లలో రిటైల్ స్పేస్‌లోకి కూడా ప్రవేశించాం. మా నాన్న రచనలు చేస్తుంటారు. తన అందమైన కవిత్వాన్ని ఈ అత్తరు పరిమళాలతో జోడిస్తాడు. దీంతో సువాసనలకు మరింత ఆకర్షణ తోడైంది. ఇప్పుడు మా బ్రాండ్‌కి 12 మంది కళాకారులతో పాటు మా కుటుంబసభ్యులు కూడా కొత్త పరిమళాలను తయారుచేసేందుకు కృషి చేస్తున్నారు’ అని వివరిస్తున్నారు ఈ సోదర సోదరీ ద్వయం.

చేస్తున్న ఉద్యోగాలు వదిలి...

జర్మనీలోని కార్పొరేట్ కంపెనీలో పని చేసే క్రతి అక్కడి నుండి స్వదేశానికి చేరుకుంది. ముంబైలో చిత్రనిర్మాణ రంగంలో ఉన్న వరుణ్ కూడా స్వస్థలానికి చేరుకున్నాడు. ‘మేం మొదట ఈ బ్రాండ్‌ను ఏర్పాటు చేయాలనుకోలేదు. అత్తరు తయారీ కళాకారులకు జీవనోపాధి కల్పించాలనుకున్నాం. వీరు ఆదాయ వనరుల కోసం అన్వేషిస్తే ఏదైనా పని దొరుకుతుంది. కానీ, మనదైన కళ కనుమరుగవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని బ్రాండ్ తీసుకొచ్చాం. ఒకే రోజులో 100 ఆర్డర్లు వచ్చాయి. ఏడాదిలో యాభై శాతం వృద్ధి వచ్చింది. ఆ తర్వాత నెలవారీ ఆర్డర్లు వెయ్యికి మించిపోయాయి. సెలబ్రిటీలు విక్కీ కౌశల్, కత్రినా కైఫ్‌లతో సహా బాలీవుడ్ వివాహాలలో మా అత్తరు పరిమళాలు వెదజల్లింది. ముఖ్యంగా ఢిల్లీలో నిర్వహించిన జి 20 సమ్మిట్‌లో 2023కి అధికారిక కానుకల భాగస్వామ్యంలో బూంద్ బ్రాండ్ ఒకటిగా ఎంపికయ్యింది. జి20 సమ్మిట్‌లో పాల్గొనడం, మా చిన్న వ్యాపారానికి గొప్ప ముందడుగుగా పనిచేసింది’అని వివరిస్తారు వరుణ్.


● క్రతి, వరుణ్‌ల తండ్రి

ఒక ఆలోచనను అమలులో పెట్టడంతో వారి కుటుంబాన్నే కాదు మరికొన్ని కుటుంబాలకు ఆదాయ వనరుగా మారింది. మన దేశీయ వారసత్వ కళ ముందు తరాలకు మరింత పరిమళాలతో పరిచయం అవుతోంది.

సాక్షి
స్పోర్ట్స్
గురువారం
26-10-2023



ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కూ హార్దిక్ పాండ్యా దూరం

స్వదేశంలో జరుగుతున్న వన్డే వరల్డ్‌కప్ క్రికెట్ టోర్నీలో భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మరో మ్యాచ్‌కు దూరం కానున్నాడు. ఈనెల 19న బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా చీలమండ గాయానికి గురైన పాండ్యా 22న న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బరిలోకి దిగలేక పోయాడు. ఈనెల 29న లక్నోలో ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్‌కూ హార్దిక్ దూరమయ్యాడు. నేడు బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో పాండ్యా ఫిట్‌నెస్ పరీక్షలో పాల్గొంటాడు. ఈ పరీక్ష ఫలితాల ఆధారంగా పాండ్యా జాతీయ జట్టుకు మళ్లీ ఎప్పుడు అందుబాటులోకి వస్తాడో తెలుస్తుంది.

టాప్ ర్యాంక్‌కు చేరువలో శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ నంబర్‌వన్ స్థానాన్ని అందుకునే దిశగా సాగుతున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో గిల్ 823 రేటింగ్ పాయింట్లతో రెండో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ (829 పాయింట్లు), గిల్ మధ్య వ్యత్యాసం కేవలం ఆరు పాయింట్లే ఉంది. తదుపరి మ్యాచ్‌ల్లో బాబర్ విఫలమై, గిల్ సఫలమైతే టాప్ ర్యాంక్‌ను అందుకుంటాడు.



భారత మహిళల క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా అమోల్ మజుందార్



న్యూఢిల్లీ: దేశవాళీ దిగ్గజం, ముంబై జట్టు మాజీ కెప్టెన్ అమోల్ మజుందార్‌ను భారత మహిళల క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా నియమించారు. కొన్ని నెలల క్రితం సులక్షణ నాయక్, అశోక్ మల్హోత్రా, జతిన్ పరంజపేలతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ ఈ పదవి కోసం పలువురిని ఇంటర్వ్యూ చేసింది. తుదకు 48 ఏళ్ల అమోల్ మజుందార్‌కు ఈ బాధ్యతలు అప్పగించింది. అమోల్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 171 మ్యాచ్‌లు ఆడి 11,167 పరుగులు సాధించాడు. ఇందులో 30 సెంచరీలు, 60 అర్ధ సెంచరీలు ఉన్నాయి. రంజీ జట్టు టైటిల్ నెగ్గిన ముంబై జట్టులో కీలక సభ్యుడిగా వ్యవహరించిన అమోల్ తదనంతరం దేశవాళీ క్రికెట్‌లో అస్సాం, ఆంధ్ర జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించి 2014లో ఆటకు వీడ్కోలు పలికి కోచింగ్‌వైపు వచ్చాడు. ఐపీఎల్ జట్టు రాజస్తాన్ రాయల్స్‌కు మూడు సీజన్‌లపాటు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించాడు.

ఆంధ్ర జట్టు పరాజయం

రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు మూడో పరాజయం చవిచూసింది. సౌరాష్ట్ర జట్టుతో బుధవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో ఆంధ్ర ఏడు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ముందుగా ఆంధ్ర జట్టు 20 ఓవర్లలో 9 వికెట్లకు 152 పరుగులు చేసింది. షేక్ రషీద్ (39 బంతుల్లో 62; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ చేశాడు. కోన శ్రీకర్ భరత్ (16 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), అశ్విన్ హెబ్బర్ (24 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లు జైదేవ్ ఉనాద్కట్ (2/35), చిరాగ్ జానీ (2/35), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/14) ఆంధ్ర జట్టును కట్టడి చేశారు. అనంతరం సౌరాష్ట్ర జట్టు 17.4 ఓవర్లలో 3 వికెట్లకు 156 పరుగులు చేసి గెలిచింది. హార్విక్ దేశాయ్ (51 బంతుల్లో 81; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు), తరుణ్ (23 బంతుల్లో 45; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. గ్రూప్ 'సి'లో ఆంధ్ర జట్టు 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. రైల్వేస్‌తో జరిగే చివరి మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు గెలిచినా క్వార్టర్ ఫైనల్ చేరుకునే అవకాశం లేదు.


రషీద్

మ్యాక్స్‌వెల్ విధ్వంసం

ప్రపంచకప్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ ● 40 బంతుల్లోనే శతకం పూర్తి ● వార్నర్ ఖాతాలో రెండో సెంచరీ
చెలరేగిన స్మిత్, లబుషేన్ ● 309 పరుగులతో నెదర్లాండ్స్‌పై ఆస్ట్రేలియా బ్రహ్మాండ విజయం



న్యూఢిల్లీ: ప్రత్యర్థులు బహు పరాక్! వన్డే ప్రపంచకప్‌లో ఐదుసార్లు చాంపియన్ ఆస్ట్రేలియా ఫామ్‌లోకి వచ్చేసింది. క్రికెట్ కూన నెదర్లాండ్స్‌ను హడలెత్తించింది. ఏకంగా 309 పరుగుల తేడాతో అఖండ విజయం సాధించింది. ప్రపంచకప్ చరిత్రలో పరుగుల పరంగా ఇదే అతి పెద్ద విజయం కాగా... వన్డే ఫార్మాట్ చరిత్రలో రెండో అతి పెద్ద విజయంగా నమోదైంది. తన ఫామ్ కొనసాగిస్తూ డేవిడ్ వార్నర్ (93 బంతుల్లో 104; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) వరుసగా రెండో సెంచరీ చేయగా... స్టీవ్ స్మిత్ (68 బంతుల్లో 71; 9 ఫోర్లు, 1 సిక్స్), లబుషేన్ (47 బంతుల్లో 62; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించారు. చివర్లో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' గ్లెన్ మ్యాక్స్‌వెల్ (44 బంతుల్లో 106; 9 ఫోర్లు, 8 సిక్సర్లు) నెదర్లాండ్స్ బౌలర్ల భరతం పట్టి... వీర విధ్వంసం సృష్టించి... ప్రపంచకప్ చరిత్రలోనే వేగవంతమైన సెంచరీని సాధించాడు. 40 బంతుల్లో మ్యాక్స్‌వెల్ 100 పరుగులు పూర్తి చేసి ఇదే టోర్నీలో శ్రీలంకపై దక్షిణాఫ్రికా బ్యాటర్ మార్క్‌రమ్ (49 బంతుల్లో) సాధించిన రికార్డును బద్దలు కొట్టాడు.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 399 పరుగుల భారీస్కోరు చేసింది. అనంతరం 400 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన నెదర్లాండ్స్ 21 ఓవర్లలో 90 పరుగులకే కుప్పకూలింది. ఆడమ్ జంపా (3-0-8-4) మూడు ఓవర్లతోనే స్పిన్ ఉచ్చు బిగించాడు.

దంచుడు వార్నర్‌తో మొదలైతే...

నాలుగో ఓవర్లోనే ఫామ్‌లో ఉన్న మిచెల్ మార్ష్ (9) అవుటయ్యాడు. ఈ మ్యాచ్‌లో డచ్ శిబిరానికి కలిగిన ఆనందం ఇదొక్కటే! తర్వాతంతా అలసిపోవడమే! ఎందుకంటే అప్పటికే క్రీజులో ఉన్న వార్నర్‌గానీ, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన స్మిత్, లబుషేన్‌లు గానీ నెదర్లాండ్స్‌పై కనీస దయ చూపలేదు. బంతిని వదల్లేదు. ఫీల్డర్లను విడిచిపెట్టలేదు. బంతిని, బౌలర్లు, ఫీల్డర్లను కలిపి బలిపీఠం ఎక్కించినట్లుగా వీరబాదుడు బాదేశారు. స్మిత్ 53 బంతుల్లో, వార్నర్ 40 బంతుల్లో అర్ధసెంచరీలు చేశారు. రెండో వికెట్‌కు


వార్నర్

132 పరుగుల భాగస్వామ్యం తర్వాత స్మిత్ వెనుదిరిగాడు. తర్వాత లబుషేన్ (42 బంతుల్లో) ఫిఫ్టీ కొడితే... వార్నర్ (91 బంతుల్లో) సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరు 84 పరుగులు జోడించారు.

39వ ఓవర్లో వచ్చి... 40 బంతుల్లో శతక్కొట్టి...

ఓ సెంచరీ, ఇద్దరి ఫిఫ్టీలతోనే ఆసీస్ కథ ముగియలేదు. 39వ ఓవర్లో వచ్చిన మ్యాక్స్‌వెల్ వరల్డ్‌కప్‌లో తన బ్యాట్‌తో కొత్త రాత (రికార్డు) రాశాడు. 48 ఓవర్లలో ఆసీస్ స్కోరు 361/6. మ్యాక్సీ (75 పరుగులతో) సెంచరీకి దూరంగానే ఉన్నాడు. కానీ లీడే వేసిన 49 ఓవర్లో 4, 4, 6, 6, నోబ్ 6, 1, 0లతో ఏకంగా 28 పరుగులు పిండుకోవడంతో 40 బంతుల్లోనే ఎవరి ఊహకందని విధంగా శతకం పూర్తయ్యింది.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: మార్ష్ (సి) ఆకెర్మన్ (బి) వాన్ బీక్ 9; వార్నర్ (సి) ఆర్యన్ (బి) వాన్ బీక్ 104; స్మిత్ (సి) మెర్వ్ (బి) ఆర్యన్ 71; లబుషేన్ (సి) ఆర్యన్ (బి) లీడే 62; ఇంగ్లిస్ (సి) సైబ్రాండ్ (బి) లీడే 14; మ్యాక్స్‌వెల్ (సి) సైబ్రాండ్ (బి) వాన్ బీక్ 106; గ్రీన్ (రనౌట్) 8; కమిన్స్ (నాటౌట్) 12; స్టార్క్ (సి) అకెర్మన్ (బి) వాన్ బీక్ 0; జంపా (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 399. వికెట్ల పతనం:** 1-28, 2-160, 3-244, 4-266, 5-267, 6-290, 7-393, 8-393. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 7-0-59-1, అకెర్మన్ 3-0-19-0, వాన్ బీక్ 10-0-74-4, మికెరెన్ 10-0-64-0, విక్రమ్‌జీత్ 4-0-27-0, వాన్‌డెర్ మెర్వ్ 5-0-41-0, బస్ డి లీడే 10-0-115-2.

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (రనౌట్) 25; మ్యాక్స్ ఓ డౌడ్ (బి) స్టార్క్ 6; అకెర్మన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) హాజల్‌వుడ్ 10; సైబ్రాండ్ (సి) వార్నర్ (బి) మార్ష్ 11; లీడే (ఎల్బీడబ్ల్యూ) (బి) కమిన్స్ 4; ఎడ్వర్డ్స్ (నాటౌట్) 12; తేజ (సి) ఇంగ్లిస్ (బి) మార్ష్ 14; వాన్ బీక్ (సి) ఇంగ్లిస్ (బి) జంపా 0; వాన్‌డెర్ మెర్వ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; ఆర్యన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 1; మికెరెన్ (స్టంప్డ్) ఇంగ్లిస్ (బి) జంపా 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (21 ఓవర్లలో ఆలౌట్) 90. వికెట్ల పతనం:** 1-28, 2-37, 3-47, 4-53, 5-62, 6-84, 7-86, 8-86, 9-90, 10-90. **బౌలింగ్:** స్టార్క్ 4-0-22-1, హాజల్‌వుడ్ 6-0-27-1, కమిన్స్ 4-0-14-1, మార్ష్ 4-0-19-2, జంపా 3-0-8-4.

ప్రపంచకప్‌లో నేడు



ఇంగ్లండ్ X శ్రీలంక
వేదిక: బెంగళూరు

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	5	3	2	6	1.193
పాకిస్తాన్	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253
నెదర్లాండ్స్	5	1	4	2	-1.902

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

115 వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా నెదర్లాండ్స్ ప్లేయర్ లీడే గుర్తింపు పొందాడు. ఈ మ్యాచ్‌లో లీడే 10 ఓవర్లలో 115 పరుగులు ఇచ్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లు మిక్ లూయిస్ (0/113; 2006లో దక్షిణాఫ్రికాపై), ఆడమ్ జంపా (0/113; 2023లో దక్షిణాఫ్రికాపై) పేరిట ఉన్న రికార్డును లీడే అధిగమించాడు.

6 ప్రపంచకప్‌లో ఆరో సెంచరీతో వార్నర్ ఈ టోర్నీలో అత్యధిక శతకాలు సాధించిన క్రికెటర్ల జాబితాలో సచిన్ టెండూల్కర్ సరసన చేరాడు. రోహిత్ శర్మ (7) అగ్రస్థానంలో ఉన్నాడు.

పతకాల పంట

- జావెలిన్ త్రోలో సుమిత్, సుందర్ ప్రపంచ రికార్డులు
- ఆసియా పారా క్రీడల్లో భారత జోరు


సుమిత్

హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో భారత క్రీడాకారులు పతకాల పంట పండిస్తున్నారు. పోటీల మూడో రోజు బుధవారం భారత్ ఖాతాలో 30 పతకాలు చేరాయి. ఇందులో ఆరు స్వర్ణ పతకాలు ఉన్నాయి. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్64 కేటగిరీలో సుమిత్ అంటిల్ కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి పసిడి పతకం గెలిచాడు. సుమిత్ జావెలిన్‌ను 73.29 మీటర్ల దూరం విసిరి 70.83 మీటర్లతో తన పేరిటే ఉన్న పాత ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. జావెలిన్ త్రో ఎఫ్46 కేటగిరీలో భారత్‌కే చెందిన సుందర్ సింగ్ గుర్జర్ కూడా కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణ పతకం గెలిచాడు. సుందర్ జావెలిన్‌ను 68.60 మీటర్ల దూరం విసిరి 67.79 మీటర్లతో శ్రీలంక అథ్లెట్ దినేశ్ ముదియన్‌సెలగె పేరిట ఉన్న ప్రపంచ రికార్డును తిరగ రాశాడు. పురుషుల టి11 1500 మీటర్ల విభాగంలో అంకుర్ ధామా, మహిళల టి11 1500 మీటర్ల విభాగంలో రక్షిత రాజు... పురుషుల ఎఫ్37/38 జావెలిన్ త్రో ఈవెంట్‌లో హనే... మహిళల టి47 లాంగ్‌జంప్ ఈవెంట్‌లో నిమిషా బంగారు పతకాలు గెలిచారు.

కాంస్య పతకాలు నెగ్గిన గురు నాయుడు, ప్రియదర్శిని




పనాజీ: జాతీయ క్రీడల్లో భాగంగా బుధవారం వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు ఒక్కో కాంస్య పతకం లభించింది. పురుషుల 55 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్. గురు నాయుడు ఓవరాల్‌గా 230 కేజీలు బరువెత్తి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. మహిళల 45 కేజీల విభాగంలో తెలంగాణ అమ్మాయి ప్రియదర్శిని మొత్తం 161 కేజీల బరువెత్తి మూడో స్థానంతో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సినిమా

వాస్తవ ఘటనల ఆధారంగా...


● గోపీచంద్ మలినేని, రవితేజ, వై. రవిశంకర్, నవీన్ ఎర్నేని

'డాన్ శీను, బలుపు, క్రాక్' చిత్రాల తర్వాత హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా ఓ పవర్‌ఫుల్ కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. కాగా ఈ సినిమాలోని కీలక పాత్రల్లో దర్శక-నటుడు సెల్వరాఘవన్, ఇందూజ రవిచంద్రన్ నటించనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: జీకే విష్ణు.

లీలమ్మో...

వైష్ణవ్ తేజ్, శ్రీలీల జంటగా నటించిన చిత్రం 'ఆదికేశవ'. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం నవంబరు 10న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ చిత్రంలోని 'లీలమ్మో.. లీలమ్మో' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో వైష్ణవ్ తేజ్ మాట్లాడుతూ– ''ప్రతిరోజూ సెట్ కళకళలాడుతుండేది. శ్రీలీల, సుదర్శన్‌గారు సెట్‌కి వస్తే ఎక్కువ కళకళలాడేది. ఈ సినిమా షూటింగ్ సరదాగా సాగింది'' అన్నారు. ''ఈ సినిమా ఫస్టాఫ్ వినోదం, సెకండాఫ్ యాక్షన్‌తో ఉంటుంది'' అన్నారు శ్రీకాంత్. ఎన్ రెడ్డి. ''నా పేరుతో ఉన్న తొలి పాట 'లీలమ్మో' నాకు ప్రత్యేకం. పర్‌ఫెక్ట్ మాస్ సాంగ్. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ బాగా కుదిరింది'' అన్నారు శ్రీలీల. సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ స్వరపరచిన 'లీలమ్మో..' పాటకు కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, నకాష్ అజీజ్, ఇంద్రావతి చౌహాన్ పాడారు.


● శ్రీలీల, వైష్ణవ్ తేజ్

ఆనందం ఉప్పొంగుతోంది

– రజనీకాంత్

రజనీకాంత్ పట్ట లేనంత ఆనందంలో ఉన్నారు. అందుకే ''నా హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది'' అని ట్వీట్ చేశారాయన. ఈ ఆనందానికి కారణం అమితాబ్ బచ్చన్‌తో 33 ఏళ్ల తర్వాత రజనీ స్క్రీన్ షేర్ చేసుకోవడమే. గతంలో ఈ ఇద్దరూ కలిసి 'అంథా కానూన్ (1983), గిరఫ్తార్ (1985), హమ్' (1991) చిత్రాల్లో నటించారు. ఇన్నేళ్ల తర్వాత వీరి కాంబినేషన్ మళ్లీ కుదిరింది. రజనీకాంత్ హీరోగా 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలోనే అమితాబ్ నటిస్తున్నారు. ఈ సందర్భంగా అమితాబ్‌తో తాను ఉన్న ఫొటోను షేర్ చేసి, ''లైకా ప్రొడక్షన్స్‌లో నేను చేస్తున్న నా 170వ సినిమాలో నా గురువు, గొప్ప నటుడు శ్రీ అమితాబ్ బచ్చన్‌తో మళ్లీ కలిసి నటిస్తున్నాను. నా హృదయం ఉప్పొంగుతోంది'' అని ట్వీట్ చేశారు రజనీకాంత్.


● అమితాబ్ బచ్చన్, రజనీకాంత్

కొత్త ప్రయాణం


● రాధిక

కథానాయికగా, ఆ తర్వాత క్యారెక్టర్ నటిగా, నిర్మాతగా చిత్రసీమలో రాధిక ఎన్నో విజయాలు చూశారు. ఇటు బుల్లితెరపైనా నటిగా, నిర్మాతగా ఆమె కెరీర్ హిట్. భారతీరాజా దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'కిళక్కే పోగుమ్ రైల్' (1978) ద్వారా కథానాయికగా పరిచయం అయ్యారు రాధిక. ఆ తర్వాత తమిళ్, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో నటించారు. ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా బిజీగా ఉన్న రాధిక ఫ్రెంచ్‌లో తొలి చిత్రం అంగీకరించారు. ''నా సినిమా కెరీర్‌లో కొత్త ప్రయాణం ఆరంభించాను. ఫ్రెంచ్ సినిమాలో నటించడం నాకో కొత్త అనుభూతి. ఈ కొత్త ప్రయాణానికి ప్రోత్సహించిన శరత్‌కుమార్ (రాధిక భర్త), రేయాన్ (కుమార్తె)లకు ధన్యవాదాలు'' అని పేర్కొన్నారు రాధిక. ఈ చిత్రానికి లారెన్స్ వాలిన్ దర్శకుడు.

ఊహకందని సహస్ర

'సుడిగాలి' సుధీర్, డాలీషా జంటగా అరుణ్ విక్కీరాల దర్శకత్వంలో రూపొందిన థ్రిల్లింగ్ ఫిల్మ్ 'కాలింగ్ సహస్ర'. వెంకటేశ్వర్లు కాటూరి, విజేష్ తయాల్, చిరంజీవి పమిడి నిర్మించారు. ''ఈ సినిమాలో సరికొత్త సుధీర్‌ను చూస్తారని నమ్మకంగా చెప్పగలం. ప్రేక్షకులు ఊహించని మలుపులతో సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా మా సినిమా ఆకట్టుకుంటుంది. సినిమా షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ కూడా పూర్తయ్యాయి. నవంబరులో సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నాం'' అని నిర్మాతల్లో ఒకరైన వెంకటేశ్వర్లు కాటూరి వెల్లడించారు. శివబాలాజీ మనోహరన్, రవితేజ నన్నిమాల కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: మార్క్ కె. రాబిన్, కెమెరా: సన్నీ .డి.


● సుడిగాలి సుధీర్

అన్నపూరణి


● నయనతార

అన్నపూరణి (తెలుగులో అన్నపూర్ణ)గా మారారు నయనతార. ఆమె కెరీర్‌లో రూపొందుతున్న 75వ చిత్రానికి 'అన్నపూరణి' టైటిల్‌ను ఖరారు చేసి, టీజర్‌ను విడుదల చేశారు మేకర్స్. 'ది గాడెస్ ఆఫ్ ఫుడ్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంలో బ్రాహ్మణ యువతి అన్నపూరణి పాత్రలో నటిస్తున్నారు నయనతార. అన్నపూరణి పుస్తకం చదువుతూ, ఆ పుస్తకం పేజీల మధ్యలో నాన్ వెజ్ వంటకాల రెసిపీలను చూస్తుండటం, ఆమె అభిరుచులు కుటుంబ సభ్యులకు తెలియకపోవడం వంటి అంశాలు టీజర్‌లో కనిపిస్తాయి. నీలేష్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్.

నన్ను తీసేశారా అని భయపడ్డాను

– చరణ్‌రాజ్



'పలాస' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'నరకాసుర'. అపర్ణా జనార్దన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లుగా సెబాస్టియన్ నోవా అకోస్టా జూనియర్ దర్శకత్వంలో డా. అజ్జా శ్రీనివాస్ నిర్మించారు. ఈ చిత్రం నవంబరు 3న తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో ఓ కీ రోల్ చేసిన చరణ్‌రాజ్ బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ– ''ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చాను. ఎనిమిదేళ్లు కష్టపడ్డాను. ఆకలి బాధలు అనుభవించాను. ఫలితంగా సినీ ఇండస్ట్రీలో సుదీర్ఘమైన 40 ఏళ్ల కెరీర్ లభించింది. వివిధ భాషల్లో ఐదు వందలకు పైగా సినిమాల్లో విభిన్నమైన పాత్రలు చేశాను. అయితే 'ప్రతిఘటన, జెంటిల్‌మేన్' సినిమాలు నన్నొక నటుడిగా తెలుగు ప్రేక్షకులు గుర్తుపెట్టుకునేలా చేశాయి. ఇక దర్శకుడు సెబాస్టియన్ నాకు 'నరకాసుర' కథ చెప్పినప్పుడు నా పాత్రకు బాగా ఎగ్జయిట్ అయ్యాను. కానీ రెండు నెలలు గడిచినా సెబాస్టియన్‌గారి నుంచి ఫోన్ రాలేదు. మేం చేస్తే కనెక్ట్ కాలేదు. దీంతో 'నరకాసుర'లోంచి నన్ను తీసేశారా అనే భయం కలిగింది. కథా రచనలో భాగంగా జబల్‌పూర్ వెళ్లానని, అందుకే ఫోన్ కలవలేదని, 'నరకాసుర'లో నాకు చెప్పిన పాత్రను నేనే చేస్తున్నట్లుగా సెబాస్టియన్‌గారు ఆ తర్వాత చెప్పారు. అప్పుడు రిలాక్స్ అయ్యాను. ఈ సినిమాలో నా పాత్ర మంచికి మంచి, చెడుకు చెడు అన్నట్లుగా ఉంటుంది. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయని ఓ ప్రత్యేక పాత్రను ఈ సినిమాలో చేశాను. ప్రస్తుతం శ్రీహరిగారి అబ్బాయి మేఘాంశ్ సినిమాలో ఓ కీలక పాత్ర చేస్తున్నాను'' అని అన్నారు.

కళాశాలలో ప్రేమ


● ప్రణవ్, షాజ్ఞ

ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్, రామ్ పటాస్, తేజా గౌడ్, బాంబే పద్మ, శ్రీ మునిచంద్ర, మండపేట మల్లిక జాగుల ముఖ్యపాత్రల్లో నటించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143'. శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించారు. కొవ్వూరి అరుణ సమర్పణలో భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రం టీజర్‌ని డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ విడుదల చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ''ఓ వాస్తవ ఘటన స్ఫూర్తితో ఇంటర్మీడియట్ టీనేజ్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని రూపొందించాం. యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ రోడ్రీగుజ్, నేపథ్య సంగీతం: క్రమాన్, కెమెరా: నిఖిల్ సురేంద్రన్.

మనిషిలోని వివిధ కోణాలతో..


● అదితీ మైఖేల్, నరేశ్ గౌడ్

'1940లో ఒక గ్రామం, కమలతో నా ప్రయాణం, లజ్జ' వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు నరసింహ నంది. తాజాగా 'ప్రభుత్వ సారాయి దుకాణం' టైటిల్‌తో ఆయన తెరకెక్కించనున్న సినిమా పూజా కార్యక్రమాలు జరిగాయి. అదితీ మైఖేల్, వినయ్, మల్లిక్, నరేశ్ గౌడ్, మహంతి, వీరభద్రం, బాలు నాయక్ తదితరులు ప్రధాన పాత్రల్లో ఈ చిత్రం రూపొందనుంది. ''షేక్‌స్పియర్ కథల్లోని పాత్రల ఆధారంగా తెలంగాణలో ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంగా ఈ సినిమా ఉంటుంది. పగ, ద్వేషం, అసూయ, ప్రేమ.. ఇలా మనిషిలోని వివిధ కోణాలతో ఈ సినిమా కథను తయారు చేశాను. 1980 నాటి పరిస్థితులను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మలచడం జరిగింది'' అని దర్శకుడు నరసింహ నంది అన్నారు. పరిగి స్రవంతి మల్లిక్, నరేశ్ గౌడ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సుక్కు, కెమెరా: మహిరెడ్డి పండుగల.

నిజమైన ప్రేమ

గణేశ్, హేమంత్, ప్రీతీ సుందర్, జాహ్నవీ శర్మ హీరో హీరోయిన్లుగా హర్షా బేజగం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'స్పీడ్ 220'. 'ట్రూ లవ్' అనేది ఉపశీర్షిక. సూర్యనారాయణ, దుర్గారావు, ఆనంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను రిలీజ్ చేసిన నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ చిత్రం ఉంటుందనిపిస్తోంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ మోపూరి, కెమెరా: క్రాంతికుమార్.


● గణేశ్, ప్రీతి

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
523	160
64,049	19,122

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	12,873	▽	267
డోజోన్స్	33,098	▽	43
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,414	△	25
డాక్స్	14,892	△	12
షాంఘై	2,974	△	12
నికాయ్	31,270	△	208

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారట్)	62,334
బంగారం (22 క్యారట్)	57,140
వెండి (కేజీ)	77,500

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.33	84.00
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	99.57	102.92
€	యూరో	ఎస్‌బీఐ	86.64	89.73
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.66	56.37
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.99	54.28
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.87	61.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.26	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.78	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.22

భారత్‌లోకి దేవూ రీఎంట్రీ...

ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంపై దృష్టి



న్యూఢిల్లీ: దక్షిణ కొరియా దిగ్గజం పోస్కో దేవూ తాజాగా భారత మార్కెట్లోకి రీఎంట్రీ ఇచ్చింది. ఈసారి కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, ఎలక్ట్రిక్ వాహనాల విభాగంపై దృష్టి పెట్టింది. కెల్వాన్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లయెన్సెస్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. లిథియం హైబ్రిడ్ ఇన్వర్టర్లు, ఎల్‌ఈడీ టీవీలను విక్రయించే కెల్వాన్ .. కొత్తగా దేవూ బ్రాండ్ కింద ఇంధన, విద్యుత్ రంగానికి సంబంధించిన ఉత్పత్తులతో పాటు కన్జూమర్ ఎలక్ట్రానిక్స్‌ను కూడా ప్రవేశపెట్టనుంది. ఇందు కోసం విక్రయాల పరిమాణాన్ని బట్టి తాము సొంతంగా తయారీ ప్లాంటు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, మొత్తం మీద మార్కెటింగ్, పరిశోధన.. అభివృద్ధి కార్యకలాపాలు మొదలైన వాటిపై వచ్చే మూడేళ్లలో రూ. 300 కోట్ల మేర ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉందని కెల్వాన్ ఎండీ హెచ్‌ఎస్ భాటియా తెలిపారు. భారత మార్కెట్లో వేగవంతమైన వృద్ధికి అవకాశాలు ఉన్నాయని, కెల్వాన్ ఎలక్ట్రానిక్స్‌తో 10 ఏళ్ల పాటు బ్రాండ్ లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకున్నామని దేవూ ఇండియా ఆపరేషన్స్ డైరెక్టర్ చాన్ రియు తెలిపారు. తొలి దశలో కార్లు, ద్విచక్ర వాహనాలకు బ్యాటరీలను అందించడంతో పాటు సోలార్ బ్యాటరీలు, ఇన్వర్టర్లను కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ఎల్‌ఈడీ టీవీలు, ఆడియో స్పీకర్లు, ఎయిర్ ప్యూరిఫయర్లు, కూలర్లు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు మొదలైన గృహోపకరణాలను కూడా అందించే యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ–బైక్‌లు, ఈ–సైకిల్స్‌నూ ఆవిష్కరించే ప్రణాళికలు ఉన్నట్లు చాన్ రియు వివరించారు.

సియెలోతో ఎంట్రీ..

1995లో దేవూ తొలిసారిగా సియెలో కారుతో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. అటుపైన నెక్సియా, మ్యాటిజ్ కార్లను ప్రవేశపెట్టింది. 2001లో దేవూకి సంబంధించిన చాలా మటుకు అసెట్స్‌ను జనరల్ మోటర్స్ కొనుగోలు చేసింది. అంతిమంగా 2003–04 నుంచి భారత్‌లో కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. రాబోయే రోజుల్లో భారత్‌లో ఎలక్ట్రిక్ టూ–వీలర్లకు గణనీయంగా డిమాండ్ పెరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో, తిరిగి ఇన్నాళ్లకు మళ్లీ దేశీ మార్కెట్లోకి రావడంపై దేవూ కసరత్తు చేస్తోంది.

టెక్ మహీంద్రా లాభం డౌన్

సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 505 కోట్లు



న్యూఢిల్లీ: సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 61 శాతం క్షీణించి రూ. 505 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 1,299 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 12,864 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 13,130 కోట్ల టర్నోవర్ సాధించింది. ఎన్నో ఆటుపోట్లను చవిచూసిన తన కెరీర్‌లోకెల్లా గత కొన్ని త్రైమాసికాలు అత్యంత క్లిష్టమైనవంటూ టెక్ మహీంద్రా సీఈవో, ఎండీ సీపీ గుర్నానీ పేర్కొన్నారు.

- త్రైమాసికవారీగా 78% వృద్ధితో రూ. 5,300 కోట్లు(64 కోట్ల డాలర్లు) విలువైన డీల్స్ కుదుర్చుకుంది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో రూ. 2,980 కోట్ల విలువైన ఆర్డర్లు పొందింది.
- మొత్తం సిబ్బంది సంఖ్య 8 శాతంపైగా క్షీణించి 1,50,604కు పరిమితమైంది. గతేడాది క్యూ2లో ఈ సంఖ్య 1,63,912గా నమోదైంది.
- ఉద్యోగ వలసల(అట్రిషన్) రేటు వార్షిక ప్రాతిపదికన 20% నుంచి 11%కి దిగివచ్చింది.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు 1.4% నష్టంతో రూ. 1,140 వద్ద ముగిసింది.

సెలెవిదా వెల్‌నెస్ పోర్టల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ తాజాగా సెలెవిదా వెల్‌నెస్ డైరెక్ట్ టు కంజ్యూమర్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్ ద్వారా మధుమేహ రోగుల కోసం పలు ఉత్పత్తుల అమ్మకంతోపాటు ఆహార సిఫార్సులు, సమాచారం అందిస్తారు. రెడ్డీస్ ల్యాబొరేటరీస్ 2019 నుంచి సెలెవిదా బ్రాండ్‌లో న్యూట్రాస్యూటికల్స్ తయారీ చేపడుతోంది. దేశవ్యాప్తంగా 18,000 పైచిలుకు పిన్‌కోడ్స్‌కు వీటిని సరఫరా చేస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-10-2023	
విశాఖ	540–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531–00
విజయవాడ	531–00
రిటైల్ ధర (డజను)	72.00
25-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	515–00
వరంగల్	517–00
రిటైల్ ధర	5.75

5 రోజులు.. 15 లక్షల కోట్లు!

- మార్కెట్ల పతనంతో ఇన్వెస్టర్ల సంపద ఆవిరి
- సెన్సెక్స్ మరో 523 పాయింట్లు, నిఫ్టీ 160 పాయింట్లు తగ్గుదల



ముంబై: మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో దేశీయంగా కీలక సూచీల పతనం కొనసాగుతోంది. స్టాక్స్ అధిక వేల్యుయేషన్స్‌తో ట్రేడవుతుండటం కూడా దీనికి తోడు కావడంతో బుధవారం మార్కెట్లు మరింత క్షీణించి, ఇన్వెస్టర్ల సంపద ఇంకాస్త కరిగిపోయింది. మొత్తంమీద అయిదు రోజుల్లో రూ. 14.60 లక్షల కోట్ల మేర ఆవిరైపోయింది. బుధవారం సెన్సెక్స్ మరో 523 పాయింట్లు తగ్గి 64,049 పాయింట్ల వద్ద, నిఫ్టీ 160 పాయింట్లు క్షీణించి 19,122 పాయింట్ల వద్ద క్లోజయ్యాయి. గత అయిదు సెషన్లలో సెన్సెక్స్ 2,379 పాయింట్లు, నిఫ్టీ 690 పాయింట్లు పతనమయ్యాయి. బీఎస్‌ఈలోని లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 309,22,136 కోట్లకు తగ్గింది. 'అంతర్జాతీయంగా సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో మార్కెట్లు వరుసగా అయిదో సెషన్లోనూ క్షీణించాయి. బ్యాంకింగ్, ఐటీ స్టాక్స్ దీనికి సారథ్యం వహించాయి. దేశీ స్టాక్స్ అధిక వేల్యుయేషన్స్‌లో ట్రేడవుతుండటం, అంతర్జాతీయంగా సంక్షోభం నెలకొనడం తదితర పరిణామాల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో తమ పెట్టుబడులను తగ్గించుకుంటున్నారు' అని కోటక్ సెక్యూరిటీస్ రీసెర్చ్ విభాగం (రిటైల్) హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. లాభాల స్వీకరణ కోసం ఎదురుచూస్తున్న ఇన్వెస్టర్లకు తగిన పరిస్థితులు ఏర్పడటంతో మార్కెట్లో అమ్మకాలు వెల్లువెత్తుతున్నట్లు ఈక్విట్రీ సహ వ్యవస్థాపకుడు పవన్ భరాదియా వివరించారు.

ఇన్ఫీ 3 శాతం డౌన్..

సెన్సెక్స్‌లో ఇన్ఫీ షేర్లు అత్యధికంగా 2.76 శాతం మేర క్షీణించాయి. భారతీ ఎయిర్‌టెల్, ఎన్‌టీపీసీ, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ మొదలైనవి కూడా నష్టపోయాయి. టాటా స్టీల్, ఎస్‌బీఐ మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. టెక్ సూచీ 1.39 శాతం, టెలికం 1.29 శాతం, యుటిలిటీస్ 1.25 శాతం మేర క్షీణించగా మెటల్స్ సూచీ మాత్రమే లాభపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 4,237 కోట్లు విక్రయించగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 3,569 కోట్ల మేర కొనుగోళ్లు జరిపారు. అటు అంతర్జాతీయంగా చూస్తే ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై, హాంకాంగ్ లాభపడగా, సియోల్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు నెగటివ్‌లో ట్రేడయ్యాయి.

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ చేతికి మలేసియా సంస్థ వాటా

11% వాటా కొనుగోలుకు రూ. 831 కోట్ల డీల్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ సంస్థ జీఎంఆర్ గ్రూప్.. హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో వాటాను 74 శాతానికి పెంచుకోనుంది. మలేసియా ఎయిర్‌పోర్ట్స్ హోల్డింగ్ బెర్హాద్ (ఎంఏహెచ్‌బీ) నుంచి 11 శాతం వాటాను కొనుగోలు చేయనుంది. ఇందుకు జీఎంఆర్ 10 కోట్ల డాలర్లు (సుమారు రూ. 831 కోట్లు) వెచ్చించనుంది. జీఎంఆర్ నేతృత్వంలో ఏర్పాటైన కన్సార్షియం.. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్(జీహెచ్ఐఏఎల్) ఈ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్)కు జీహెచ్ఐఏఎల్ అనుబంధ సంస్థకాగా.. ఎంఏహెచ్‌బీతో వాటా కొనుగోలుకి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. కీలక ఆస్తులను కన్సాలిడేట్ చేయడంలో భాగంగా తాజా వాటా కొనుగోలుకి తెరతీసినట్లు జీఎంఆర్ గ్రూప్ తెలియజేసింది. ప్రస్తుతం జీహెచ్ఐఏఎల్‌లో జీఏఎల్‌కు 63 శాతం వాటా ఉంది. తెలంగాణ ప్రభుత్వానికి 13 శాతం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు 13 శాతం చొప్పున వాటా ఉంది.

యాక్సిస్ బ్యాంక్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 5,864 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 10 శాతం బలపడి రూ. 5,864 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 5,330 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 24,094 కోట్ల నుంచి రూ. 31,660 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 19 శాతం వృద్ధితో రూ. 12,315 కోట్లకు చేరింది.ప్రపంచ భౌగోళిక, రాజకీయ ఆటుపోట్ల మధ్య భారత్ వృద్ధి బాటలోనే సాగుతున్నట్లు యాక్సిస్ బ్యాంక్ ఎండీ, సీఈవో అమితాబ్ చౌదరీ పేర్కొన్నారు.

ఎన్‌పీఏలు డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో యాక్సిస్ బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్లు 0.15% మెరుగై 4.11 శాతాన్ని తాకాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.96% నుంచి రూ. 1.73 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు సైతం 0.41 % నుంచి 0.36 శాతానికి వెనకడుగు వేశాయి.

ఫలితాల నేపథ్యంలో ఈ షేరు బీఎస్‌ఈలో 1% నీరసించి రూ. 955 వద్ద ముగిసింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఏఎఫ్ఎంఎస్‌లో 650 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్).. షార్ట్ సర్వీస్ కమిషన్ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన వైద్య అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 650 (పురుషులు–585, మహిళలు–65).
- » **అర్హత:** ఎంబీబీఎస్, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 31.12.2023 నాటికి ఎంబీబీఎస్ అభ్యర్థులు 30 ఏళ్లు, పీజీ మెడికల్ అభ్యర్థులు 35 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ,ఫిజికల్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.11.2023
- » **ఇంటర్వ్యూ తేది:** 21.11.2023 నుంచి
- » **ఇంటర్వ్యూ వేదిక:** ఆర్మీ హాస్పిటల్(ఆర్–ఆర్), ఢిల్లీ కంటోన్మెంట్.
- » **వెబ్‌సైట్:** www.amcsscentry.gov.in

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్‌లో 436 అసిస్టెంట్ సెక్యూరిటీ పోస్టులు

ఏఏఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ లిమిటెడ్(ఏఏఐసీఎల్ఏఎస్).. దేశవ్యాప్తంగా ఏఏఐసీఎల్ఏఎస్ కేంద్రాల్లో మూడేళ్ల కాలవ్యవధికి ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన అసిస్టెంట్ సెక్యూరిటీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 436
- » **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా గుర్తింపు పొందిన బోర్డు/ యూనివర్సిటీ/సంస్థ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లిష్, హిందీ లేదా స్థానిక భాషలో మాట్లాడే సామర్థ్యం కలిగి ఉండాలి. **వయసు:** 01.10.2023 నాటికి 27 ఏళ్లు మించకూడదు.
- » **పోస్టింగ్ స్థలం:** చెన్నై, కోల్‌కతా, గోవా, కోజికోడ్, వారణాసి, శ్రీనగర్, వడోదర, తిరుపతి, వైజాగ్, మదురై,తిరుచ్చి,రాయ్‌పూర్,రాంచీ,భువనేశ్వర్, పోర్ట్ బ్లెయిర్, అగర్తల, గ్వాలియర్, అమృత్‌సర్, లేహ్, డెహ్రాడూన్, పుణె, ఇండోర్, సూరత్.
- » **వేతనం:** నెలకు రూ.21,500 నుంచి 22,500
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2023
- » **వెబ్‌సైట్:** www.aaiclas.aero

ఐవోసీఎల్‌లో 1720 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) రిఫైనరీ డివిజన్..వివిధ విభాగాల్లో 1720 అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **ఖాళీలున్న రిఫైనరీలు:** గువాహటి, బరౌని, గుజరాత్, హల్దియా, మధుర, పానిపట్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్ కాంప్లెక్స్, డిగ్బోయి, బొంగైగావ్, పారాదీప్.
- » **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌లు–869, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు–851. **విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్.
- » **పోస్టులు:** అటెండెంట్ ఆపరేటర్, ఫిట్టర్, మెకానికల్, సెక్రటేరియల్ అసిస్టెంట్, అకౌంటెంట్, డేటాఎంట్రీ ఆపరేటర్.
- » **అర్హత:** ఖాళీలను అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, సంబంధిత ట్రేడ్/విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఏ, బీకాం, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**31.10.2023 నాటికి 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** రాత పరీక్ష, వైద్య పరీక్షలు, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.11.2023
- » **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ తేదీలు:** 27.11.2023 నుంచి 02.11.2023 వరకు.
- » **రాతపరీక్ష తేది:** 03.12.2023.
- » **రాతపరీక్ష ఫలితాల వెల్లడితేది:** 08.12.2023.
- » **ధ్రువపత్రాల పరిశీలన తేదీలు:** 13.12.2023 నుంచి 21.12.2023 వరకు
- » **వెబ్‌సైట్:** www.iocl.com

సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023-24

కేంద్ర ప్రభుత్వం.. కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ఉద్దేశించిన 'సెంట్రల్ సెక్టార్ స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిద్వారా దేశ వ్యాప్తంగా ప్రతి ఏటా మొత్తం 82,000 మంది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తారు. వీటిలో 50 శాతం మహిళలకు కేటాయించారు.

- » **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్/12వ తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఏఐసీటీఈ/మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/యూనివర్సిటీ/గుర్తింపు పొందిన కళాశాలల్లో డిగ్రీ లేదా పీజీ కోర్సులు చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం నాలుగున్నర లక్షలకు మించకూడదు. డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్ కోర్సులు చేస్తున్న విద్యార్థులు అర్హులు.
- » **స్కాలర్‌షిప్:** ఒక్కో విద్యార్థికి ఐదేళ్ల వరకు ఉపకార వేతనం అందిస్తారు. డిగ్రీ స్థాయిలో మూడేళ్ల పాటు ఏటా రూ.12,000, పీజీ స్థాయిలతో రెండేళ్ల పాటు ఏటా రూ.20,000 చెల్లిస్తారు. బీఈ/బీటెక్ కోర్సుల్లో చేరినవారికి మొదటి మూడేళ్లు ఏటా రూ.12,000, చివరి ఏడాది, రూ.20,000 చెల్లిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
- » **వెబ్‌సైట్:** www.scholarships.gov.in

నేరాల గుట్టు విప్పేలా!

- » ఫోరెన్సిక్ సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులు
- » ఏఐఎఫ్ఎస్ఈటీతో పేరున్న ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం
- » కోర్సులు పూర్తి చేసుకుంటే ఉద్యోగావకాశాలు
- » ఏఐఎఫ్ఎస్ఈటీ-2024 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

నేరాలు, ఘోరాల గుట్టు విప్పే నైపుణ్యాలను అందించే ప్రోగ్రామ్స్.. ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులు! ఫోరెన్సిక్ సైన్స్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సులను దేశంలోని పలు యూనివర్సిటీలు అందిస్తున్నాయి. వీటిల్లో చేరేందుకు మార్గం.. ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎఫ్ఎస్ఈటీ)!! ప్రస్తుతం ఏఐఎఫ్ఎస్ఈటీ-2024 దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో.. ఏఐఎఫ్ఎస్ఈటీతో ప్రయోజనాలు, పరీక్ష విధానం, కోర్సులు-కెరీర్ అవకాశాలపై ప్రత్యేక కథనం..



ఏఐఎఫ్ఎస్ఈటీ-2024

ఆల్ ఇండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ టెస్ట్ స్కోర్ ఆధారంగా దేశ వ్యాప్తంగా 49 యూనివర్సిటీలు/ఇన్‌స్టిట్యూట్స్‌లో ఫోరెన్సిక్ సైన్స్‌లో బీఎస్సీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. పలు నివేదికలు, గణాంకాల ప్రకారం–ప్రస్తుతం ఫోరెన్సిక్ నిపుణుల డిమాండ్, సప్లయ్‌లో ఎంతో వ్యత్యాసం ఉంది. కాబట్టి ఫోరెన్సిక్ సైన్స్ కోర్సులను పూర్తి చేసుకుంటే.. మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

అర్హతలు

- **బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్:** ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లతో ఇంటర్మీడియెట్‌లో 45 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. 2024లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్:** బీఎస్సీ లేదా బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్)లో ఉత్తీర్ణత సాధించాలి. ఈ కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తుకు అర్హులే.

జాతీయ స్థాయి పరీక్ష

ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏఐఎఫ్ఎస్ఈటీ పరీక్షను జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. మొత్తం వంద ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, బయాలజీ, కెమిస్ట్రీల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు ఫోరెన్సిక్ సైన్స్ నిర్వచనం, నేరాలు, పోలీస్ వ్యవస్థ, నేర ఘటనాస్థలి, జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్ విభాగాల నుంచి కూడా ప్రశ్నలు ఉంటాయి.

బీఎస్సీ ఎంట్రన్స్‌లోని బయాలజీ, మ్యాథమెటిక్స్‌ల్లో అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న ఏదో ఒక విభాగాన్ని ఎంచుకునే వెసులుబాటు ఉంది.

ఇంటర్ స్థాయిలో ప్రశ్నలు

- ఏఐఎఫ్ఎస్ఈటీలో అడిగే ప్రశ్నలు ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ గ్రూప్ సబ్జెక్ట్‌ల సిలబస్ అంశాల నుంచే ఉంటాయి. విద్యార్థులు తమ గ్రూప్ సబ్జెక్ట్‌లపై పట్టు సాధిస్తే పరీక్షలో మెరుగైన స్కోర్ సొంతం చేసుకోవచ్చు.
- **బోటనీ:** లివింగ్ అండ్ నాన్ లివింగ్; జెనటిక్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటెన్స్, ఆరిజన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ లైఫ్, హ్యూమన్ డిజార్డర్స్, యానిమల్ ఫిజియాలజీ; సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్, ప్లాంట్ ఫిజియాలజీ, రీప్రొడక్షన్ ఇన్ ప్లాంట్స్, ఎకాలజీ అండ్ ఎకో సిస్టమ్స్.
- **ఫిజిక్స్:** యూనిట్స్ అండ్ మెజర్‌మెంట్స్, మెకానిక్స్, హీట్ ట్రాన్స్‌ఫర్, లైట్ అండ్ సౌండ్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజమ్, మోడ్రన్ ఫిజిక్స్.
- **మ్యాథమెటిక్స్:** రిలేషన్స్ అండ్ ఫంక్షన్స్, ట్రిగ్నోమెట్రిక్ ఫంక్షన్స్, మ్యాట్రిసెస్ అండ్ డిటర్మినెంట్స్, ఇంటిగ్రల్స్, 3–డి జామెట్రీ, లీనియర్ ప్రోగ్రామింగ్, సెట్స్, మ్యాథమెటిక్ ఇండక్షన్, కాంప్లెక్స్ నంబర్ అండ్ క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, లీనియర్ ఇన్–ఈక్వాలిటీస్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్, సీక్వెన్సెస్ అండ్ సిరీస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **కెమిస్ట్రీ:** అటామిక్ స్ట్రక్చర్, కెమికల్ బాండింగ్, స్టేట్స్ ఆఫ్ మేటర్, మిక్చర్స్ సొల్యూషన్స్ అండ్ సొల్యుబిలిటీ, పిరియాడిక్ టేబుల్, వాటర్ అండ్ ఆర్గానిక్ కాంపౌండ్ ఇన్ ఎన్విరాన్‌మెంట్.

ఎమ్మెస్సీకి ఇలా

ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రన్స్ కూడా వంద మార్కులకు 100ప్రశ్నలతో నిర్వహిస్తారు.ఇందులో అడిగే ప్రశ్నల క్లిష్టత స్థాయి డిగ్రీ అకడమిక్స్ స్థాయిలో ఉంటుంది. ఎమ్మెస్సీ ఎంట్రన్స్ అభ్యర్థులు బీఎస్సీ స్థాయిలోని అకడమిక్ పుస్తకాలను చదవాలి.

ఉన్నత విద్య

బీఎస్సీ ఫోరెన్సిక్ సైన్స్ పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్య అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. పలు సెంట్రల్ యూనివర్సిటీలు, ఇతర డీమ్డ్ యూనివర్సిటీలు ఎమ్మెస్సీ ఫోరెన్సిక్ సైన్స్ స్పెషలైజేషన్‌ను అందిస్తున్నాయి. ఈ కోర్సులో భాగంగా క్రిమినాలజీ, ఫోరెన్సిక్ ఆంత్రోపాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫోరెన్సిక్ టాక్సికాలజీ తదితర సబ్జెక్ట్‌లను కరిక్యులంలో భాగంగా బోధిస్తారు. ఫలితంగా నేర పరిశోధన, నిఘాకు సంబంధించి మరిన్ని నైపుణ్యాలు సొంతమవుతాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** అక్టోబర్ 28, 2023
- **ఏఐఎఫ్ఎస్ఈటీ–2024 పరీక్ష తేది:** అక్టోబర్ 29, 2023
- **ఏఐఎఫ్ఎస్ఈటీ–2024 ఫలితాల వెల్లడి:** అక్టోబర్ 31, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://aifset.com

ఉద్యోగ అవకాశాలు

- ఫోరెన్సిక్ సైన్స్ పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వ, ప్రైవేటు రెండు రంగాల్లోనూ కొలువులు లభిస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీలు, ఫింగర్ ప్రింట్ బ్యూరోలు, ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సీబీఐ, ఐబీ వంటి ప్రభుత్వ శాఖల్లో కొలువులు సాధించొచ్చు. ప్రైవేట్ రంగంలో ఫార్మాస్యూటికల్ సంస్థలు, ఆస్పత్రులు, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీలు ప్రధాన ఉపాధి వేదికలుగా నిలుస్తున్నాయి.

పలు జాబ్ ప్రొఫైల్స్

- **క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేటర్:** నేరం జరిగిన ప్రాంతంలో ఆధారాల సేకరణ, నేరం జరిగిన తీరును అంచనా వేయడం, ఆధారాలను ల్యాబొరేటరీలో శాస్త్రీయంగా విశ్లేషించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్:** నేరస్తులు లేదా నిందితుల మానసిక పరిస్థితిని విశ్లేషించడం, తద్వారా విచారణ పరంగా వారికున్న మానసిక సన్నద్ధతకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారు. దీని ఆధారంగా సదరు విచారణ చేపట్టే విషయంలో నిర్దిష్ట చర్యలు తీసుకుంటారు.
- **ఫోరెన్సిక్ టాక్సికాలజిస్ట్:** అనుమానాస్పద హత్యలు జరిగినప్పుడు ముఖ్యంగా ఎలాంటి భౌతిక దాడుల ఉనికి లేని సందర్భాల్లో హతులు ఏదైనా విష ప్రయోగంతో చనిపోయారా? లేదంటే ఇతర డ్రగ్స్ వినియోగం కారణంగా మరణించారా? వంటి విషయాలను పరిశీలిస్తారు.
- **ఫోరెన్సిక్ స్పీచ్ ఎక్స్‌పర్ట్స్:** ఏదైనా నేరం జరిగినప్పుడు.. సదరు ఘటనా స్థలంలో లభించిన పత్రాలు, సీసీటీవీ ఫుటేజ్‌లు, ఆడియో టేప్‌లను పరిశీలించడం.. సంబంధిత వ్యక్తులను గుర్తించడం వంటి విధులు నిర్ధారిస్తారు. దీని ద్వారా అసలు, నకిలీలను గుర్తించి.. వాటికి సంబంధించి నివేదికలు రూపొందించడం ప్రధాన విధులుగా ఉంటాయి.
- **పాథాలజిస్ట్:** అనుమానాస్పద మృతుల విషయంలో పోస్ట్‌మార్టం ఆధారంగా సహజ మరణమా? లేదా హత్యకు గురయ్యారా లేదా ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటనా? అనే విషయాలను గుర్తించడం పాథాలజిస్ట్‌ల ముఖ్య విధులుగా ఉంటున్నాయి.
- **ఫోరెన్సిక్ ఆడిటింగ్:** ఇటీవల కాలంలో ఆర్థిక నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో కీలకంగా నిలుస్తున్న మరో జాబ్ ప్రొఫైల్.. ఫోరెన్సిక్ ఆడిటింగ్. ఆర్థిక అవకతవకలకు పాల్పడిన సంస్థలకు సంబంధించిన పత్రాలను విశ్లేషించడం, అవకతవకలు జరిగిన విభాగాలను లేదా వ్యక్తులను గుర్తించడం వంటి విధులు వీరు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ఆకర్షణీయ వేతనాలు

నేర నిర్ధారణ, నిందితుల గుర్తింపులో ఎంతో కీలకంగా నిలుస్తున్న ఫోరెన్సిక్ నిపుణులకు వేతనాలు కూడా భారీగానే లభిస్తున్నాయి. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో ఈ రంగంలో అడుగుపెట్టిన వారికి నైపుణ్యాలను బట్టి నెలకు రూ.50 వేల వరకు వేతనం లభిస్తోంది. పీజీ, పీహెచ్‌డీ పట్టాలతో ఫోరెన్సిక్ లేబొరేటరీల్లో పని చేసే వారికి రూ.లక్ష వరకు వేతనం అందుతోంది.

ఏపీవాసులను క్షేమంగా తీసుకొస్తున్నాం

ఏపీఎన్‌ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి వెల్లడి

సాక్షి, అమరావతి: ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న ఏపీవాసులను సురక్షితంగా స్వస్థలాలకు చేరుస్తున్నట్లు ఏపీఎన్‌ఆర్టీఎస్ అధ్యక్షుడు వెంకట్ మేడపాటి తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను క్షేమంగా తీసుకురావడానికి కేంద్ర విదేశాంగ శాఖ 'ఆపరేషన్ అజయ్' కార్యక్రమం చేపట్టిందన్నారు. దీని ద్వారా ఇజ్రాయెల్‌లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను కూడా తీసుకువస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆరు ప్రత్యేక విమానాల్లో 60 మంది స్వదేశానికి చేరుకున్నారని పేర్కొన్నారు. ప్రయాణ ఖర్చులు భరించలేని వారిని.. సొంత ఖర్చులతో స్వగ్రామాలకు చేర్చాలని సీఎం వైఎస్ జగన్ ఢిల్లీలోని ఏపీ రెసిడెంట్ భవన్ అధికారులకు ఆదేశాలిచ్చారని వివరించారు. ఇందులో భాగంగా ప్రత్యేక విమానాల ద్వారా ఢిల్లీ చేరుకున్న వారిని సొంత ఖర్చులతో రాష్ట్రానికి చేరుస్తున్నామని తెలిపారు. ఇజ్రాయెల్‌లో ఏపీకి చెందినవారు సుమారు 450 మంది ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. కొందరు అక్కడే ఉండి పనిచేసుకోవడానికి మొగ్గు చూపుతుండగా.. మరికొందరు రాష్ట్రానికి వచ్చేందుకు ఆసక్తి వ్యక్తం చేశారని వివరించారు. విదేశాంగ శాఖతో సమన్వయం చేసుకుంటూ వారిని సురక్షితంగా రాష్ట్రానికి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి ఏపీకి రావాలనుకునేవారు హెల్ప్‌లైన్ నంబర్లు +91 8500027678 (వాట్సాప్), 0863–2340678లను సంప్రదించాలని సూచించారు.

బ్రేకులు జామ్.. నిలిచిన రైలు

కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ రైలుకు సమస్య

పోచారం: బ్రేకులు జామ్ కావడంతో కాకినాడ పోర్టు–సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు తెలంగాణలోని యంనంపేట్‌లో రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం నిలిచిపోయింది. రైల్వే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని బ్రేకులను సరిచేశారు. సుమారు పావుగంట సేపు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. చివరకు స్వల్ప వ్యవధిలోనే సమస్యను పరిష్కరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బీచ్‌కు పోదాం.. పదా.. పదా..

- సముద్ర నీటిలో సూక్ష్మ పోషకాలు, మినరల్స్ పుష్కలం
- చర్మ వ్యాధులకు ఉప్పు నీటితో ఉపశమనం
- బీచ్‌ల సందర్శనతో మానసిక ఆనందం
- తీరాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి..

జలకాలాటలలో గలగల పాటలలో ఏమి హాయిలే అలా.. అనుకుంటూ బీచ్‌లో అలలపై తేలియాడుతుంటే భలే ఉంటుంది కదూ! సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాల్లో ఆ అంబుధి చెంత నిలబడి.. భానుడి వర్ణాలను చూస్తుంటే కళ్లు తిప్పుకోలేం కదూ! కడలి అందాలకు, మనలోని భావోద్వేగానికి తరతరాల అనుబంధం అది. సముద్రానికి, భారతీయ సంప్రదాయాలకు కూడా అవినాభావ సంబంధం ఉంది.

సముద్ర స్నానం వల్ల మానసిక ఆనందంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఎన్నో ఉన్నాయని పలు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న అపార వనరుల్లో సుదీర్ఘ సముద్ర తీరం ఒకటి. ఇక్కడి మన బీచ్‌లు ఎంతో ప్రఖ్యాతి పొందాయి. రుషికొండ బీచ్ ప్రపంచ గుర్తింపు సాధిస్తూ బ్లూఫ్లాగ్‌ను కూడా సొంతం చేసుకుంది.

– శ్రీపాద బాలసుబ్రహ్మణ్యం, ఏపీ సెంట్రల్ డెస్క్



జోరుగా.. హుషారుగా..

అద్భుతమైన, 975 కిలోమీటర్ల పొడవైన తీర ప్రాంతం ఆంధ్రప్రదేశ్ సొంతం. ఇక్కడ ఎన్నో అందమైన బీచ్‌లు ఉన్నాయి. వీకెండ్ వచ్చిందంటే చాలు జనాలతో ఆ బీచ్‌లు పోటెత్తుతున్నాయి. సూర్యలంక, మైపాడు, పేరుపాలెం, మంగినపూడి తదితర బీచ్‌లకు ఆదివారాల్లో 50 వేల మందికి పైగా వచ్చి సెలవు రోజును ఎంజాయ్ చేస్తున్నారు. విశాఖ, కాకినాడ లాంటి నగరాల బీచ్‌లకు పర్యాటకుల సందడి చెప్పనక్కర్లేదు. రోజు రోజుకు పెరుగుతున్న బీచ్ పర్యాటకంతో స్థానిక ప్రజలు ఉపాధి పొందుతున్నారు. దీనికి తగ్గట్లే ప్రభుత్వం కూడా బీచ్‌ల అభివృద్ధికి నిధులు కేటాయిస్తోంది. రిసార్ట్స్ నిర్మిస్తూ.. రోడ్లు వేస్తూ ఈ పర్యాటకాన్ని ప్రోత్సహిస్తోంది.

ఆరోగ్య రహస్యాలు ఎన్నో..

- ✓ సముద్రం నీటిలో సూక్ష్మపోషకాలు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఆ నీరులో ఉండే మెగ్నీషియం, సోడియం, కాల్షియం, క్లోరైడ్, సల్ఫేట్ వంటి సూక్ష్మధాతువులు చర్మానికి సహజ సౌందర్యాన్ని ఇస్తాయి. సోరియాసిస్, ఎగ్జిమా వంటి చర్మవ్యాధులతో బాధ పడేవారికి ఈ ఉప్పునీరు ఎంతో ఉపశమనం కలిగిస్తుంది. సముద్రనీటిలో ఉండే మెగ్నీషియం మన శరీరంలోని కార్టిసోల్ స్థాయిలను తగ్గిస్తుంది. అలాగే నాడీవ్యవస్థను కంట్రోల్ చేసి మనలోని మానసిక ఒత్తిడిని నియంత్రిస్తుంది.
- ✓ ఉప్పునీటి స్నానం శరీరంలోని యాంటీఆక్సిడెంట్స్ ప్రక్రియ సక్రమంగా ఉండేలా నియంత్రిస్తుంది. గుండె జబ్బులు, క్యాన్సర్‌ల ముప్పును తగ్గించేందుకు సహకరిస్తుంది. సీ వాటర్‌లో మెగ్నీషియం ఎక్కువగా ఉండటం వల్ల మజిల్స్ రిలాక్స్ అయ్యి.. మంచి నిద్ర పడుతుంది.
- ✓ ట్రేస్‌ఎలిమెంట్స్, సూక్ష్మజీవులతో పాటు యాంటీ బ్యాక్టీరియల్‌గా ఉండేవి సముద్రంలో చాలా ఉంటాయి. వీటిని చర్మం గ్రహించడం ద్వారా సహజ యాంటీబయాటిక్స్‌లా ఉపయోగపడతాయి.
- ✓ సముద్రంలోని ఉప్పునీరు సైనస్ ఇబ్బందులను తొలగిస్తుంది. సహజ సెలైన్ సొల్యూషన్‌గా పనిచేసి సైనస్‌లో పేరుకున్న మ్యూకస్‌ను క్లియర్ చేస్తుంది.
- ✓ రెగ్యులర్‌గా సముద్ర స్నానం చేస్తూ ఈత కొట్టడం వల్ల సహజంగా బరువు తగ్గుతారని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

బ్లూఫ్లాగ్ కోసం..

పరిశుభ్రమైన బీచ్‌లకు బ్లూఫ్లాగ్ సర్టిఫికెట్ లభిస్తుంది. ఈ గుర్తింపును ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) అనే అంతర్జాతీయ సంస్థ ఇస్తుంది. 77 దేశాల్లో ఈ సంస్థ కార్యక్రమాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించేలా బ్లూఫ్లాగ్ గుర్తింపు రావాలంటే.. ఆబీచ్ పరిసరాలు పరిశుభ్రంగా, పర్యావరణ హితంగా ఉండాలి. 33 అంశాల్లో బీచ్‌ను అభివృద్ధి చేస్తే దానికి బ్లూఫ్లాగ్ వస్తుంది. మొత్తం 50 దేశాల్లో 4,831 బీచ్‌లకు ఈ సర్టిఫికెట్ లభించింది. మన దేశంలో 12 బీచ్‌లకు ఆ సర్టిఫికేషన్ లభించగా.. మన రాష్ట్రంలో రుషికొండ (విశాఖ) బీచ్ ఈ ఘనత సాధించింది. మరిన్ని బీచ్‌లకు కూడా బ్లూఫ్లాగ్ సాధించాలని రాష్ట్ర పర్యాటక శాఖ కృతనిశ్చయంతో ఉంది.

మైపాడు బీచ్‌కు తరచూ వెళ్తాం



నేను ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాను. చిన్నప్పటి నుంచి బీచ్‌లకు వెళ్లడం, అక్కడ స్నానం చేయడం అంటే ఎంతో ఇష్టం. సెలవు రోజుల్లో నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్‌కు ఫ్యామిలీతో పాటు వెళ్తుంటాను. మా పిల్లలు బీచ్‌లో స్నానాన్ని ఎంతో ఎంజాయ్ చేస్తారు. తగిన జాగ్రత్తలతో వారితో పాటు నేను కూడా ఇక్కడ స్నానం చేస్తాను. పని ఒత్తిడితో ఇక్కడికి వస్తే చాలా రిలాక్సింగ్ అనిపిస్తుంది. సముద్ర స్నానం చేస్తే మంచిదని మా పెద్దలు కూడా చెబుతుండేవారు. **– కేఎస్‌వీ కుమార్, తిరుపతి**

మూడ్ మారుతుంది

- ✓ మానసిక ఆరోగ్యానికి బీచ్‌ల సందర్శనం ఎంతో ఉపయోగపడుతుందని స్విమ్ ఇంగ్లాండ్ సంస్థ అధ్యయనం చెబుతోంది. సముద్రంలో ఈత కొట్టడం వల్ల ఫీల్ గుడ్ మాలిక్యూల్స్ పిలిచే బీటా ఎండార్ఫిన్స్ శరీరంలో పెరుగుతాయని, రెగ్యులర్‌గా ఈతకొట్టే వాళ్లు అతి తక్కువ సార్లు మానసిక వైద్యుల్ని సంప్రదిస్తున్నారని ఆ సంస్థ నివేదికలు పేర్కొంటున్నాయి. హైడ్రోథెరపీగా కూడా బీచ్‌బాత్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు.
- ✓ సముద్రంపై నుంచి వచ్చే గాలి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. బీచ్ వద్దకు వెళితే హ్యాపీ హార్మోన్‌గా పిలిచే సెరిటోనిన్ మన శరీరంలో పెరిగి, మనం రిలాక్స్ అవుతామని, సముద్ర హోరు, ఆ అనంత జలరాశి దృశ్యం మన మూడ్‌ను మారుస్తుందని ఆ అధ్యయనాలు పేర్కొన్నాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ✓ మద్యం సేవించి సముద్రంలో స్నానం చేయకూడదు
- ✓ తీవ్రమైన గాయాలు ఉన్నపుడు బీచ్‌లో స్నానం చేయకుండా ఉంటేనే మంచిది.
- ✓ ఈతలో నైపుణ్యం ఉంటే తప్ప తీరం నుంచి దూరంగా లోపలికి వెళ్లకూడదు.
- ✓ సముద్రంలో పెద్ద రాళ్లు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. అలల తాకిడికి తల రాళ్లకు కొట్టుకునే ప్రమాదం ఉంటుంది. అలాంటి ప్రాంతాల్లో తలకిందులుగా డైవ్ చేయడం కూడా ప్రమాదం.
- ✓ అలలు ఎక్కువగా ఉన్నపుడు జాగ్రత్త వహించాలి. బలమైన అలల మధ్య ఇరుకైన ప్రవాహాన్ని రిప్ కరెంట్ అంటారు. ఇవి మనిషిని ఒక్కసారిగా లోతైన ప్రవాహంలోకి లాగేస్తాయి.
- ✓ ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో సముద్రంలో ఉండటం ప్రమాదం. వెంటనే సురక్షిత ప్రదేశానికి వెళ్లిపోవాలి.



ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమైన బీచ్‌లు

- ➤ రామకృష్ణ బీచ్, రుషికొండ, భీమిలి (విశాఖ)
- ➤ మంగినపూడి (కృష్ణా జిల్లా)
- ➤ పేరుపాలెం (పశ్చిమ గోదావరి)
- ➤ అంతర్వేది (అంబేడ్కర్ కోనసీమ జిల్లా)
- ➤ కాకినాడ (కాకినాడ జిల్లా)
- ➤ మైపాడు (నెల్లూరు జిల్లా)
- ➤ సూర్యలంక, రామాపురం (బాపట్ల జిల్లా)
- ➤ కళింగపట్నం, భావనపాడు (శ్రీకాకుళం జిల్లా)

నేటి నుంచి 'సర్వే' సన్నాహక పరీక్షలు

- పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 3, 6, 9 తరగతులు చదువుతున్న ఏడు లక్షల మంది విద్యార్థుల్లో ఆరు లక్షల (85.7 శాతం) మంది తొలి సారిగా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్టేట్ అసెస్‌మెంట్ సర్వే పరీక్షకు హాజరవుతున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 3న రాష్ట్రంలోని 27,406 పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్ష రాస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో జాతీయ స్థాయి అసెస్‌మెంట్ సర్వే పరీక్షకు హాజరు కావడం ఇదే మొదటి సారిగా ఆయన వివరించారు. పరీక్షను సమర్థంగా పూర్తి చేసేలా విద్యార్థులను జిల్లా కలెక్టర్లు, డీఈవోలు ఉత్తేజ పరచాలని కోరారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో ఆందోళనను తగ్గించి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు వారికి ప్రేరణ తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు పరీక్షలకు మరింత సన్నద్ధమయ్యేలా పాఠశాలల్లో గురువారం నుంచి నవంబర్ 2వ తేదీ వరకు మాక్ టెస్టులు నిర్వహించాలని ప్రవీణ్ ప్రకాశ్ సూచించారు.

ప్రభుత్వ బడుల్లో స్పానిష్, జర్మన్ భాషలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఐబీ సిలబస్ ప్రవేశ పెట్టేందుకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసే ప్రక్రియ వేగవంతమైందని ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడించారు. సిలబస్‌లో మార్పులతో పేద విద్యార్థులకు మరింత ప్రయోజనం కలిగే కార్యక్రమాలు చేపట్టే అవకాశాలు పరిశీలిస్తున్నామన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో రూపొందించిన 'డిజిటల్ టీచర్' సహాయంతో ప్రభుత్వ బడుల్లో జర్మన్, స్పానిష్ భాషలు నేర్పించే విషయమై ఆయా దేశాల ఎంబసీ ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. 10, 12 తరగతుల విద్యార్థులకు ఐబీ–ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై ఐబీ అధికారులతో చర్చించినట్టు పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే వ్యాపార అంశాలపై అవగాహన కల్పించే విషయమై ప్రముఖ పారిశ్రామికవేత్త, హాట్ మెయిల్ వ్యవస్థాపకుడు సబీర్ భాటియాతో చర్చించామని, సబీర్ భాటియా రూపొందించిన ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రామ్‌ను 9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని కోరినట్టు తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు కావాల్సిన ఆలోచనా విధానం, నైపుణ్యాలు అలవడతాయన్నారు.

నేటి నుంచి పాఠశాలల్లో 'ఖాదీ మహోత్సవ్'

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం చేపట్టిన 'ఖాదీ మహోత్సవ్'ను విజయవంతం చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల్లోను ఖాదీ మహోత్సవ్ అంశంగా క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. క్విజ్ పోటీల్లో ఈ నెల 31 వరకు ఎవరైనా పాల్గొనవచ్చని, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు గురువారం పాఠశాల స్థాయిలోను, 27న మండల స్థాయిలోను, 28న జిల్లా స్థాయిలోను నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో మొదటి మూడు స్థానాలను భాషలు, కేటగిరీ వారీగా వివరాలను సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయానికి ఈనెల 29వ తేదీలోపు పంపాలని ఆర్జేడీలు, డీఈవోలు, సమగ్ర శిక్ష ఏపీసీలకు ఆదేశాలు జారీ చేశారు.

ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలకు పదును

ప్రభుత్వ స్కూళ్లలోని 44 వేల మంది ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
ఇప్పటికే ఐఐఎం అహ్మదాబాద్‌లో నిపుణులతో తర్ఫీదు

- ఇప్పటికే ఐఐఎం అహ్మదాబాద్‌లో నిపుణులతో తర్ఫీదు
- వీరు తమతమ పాఠశాలల్లో పనిచేస్తున్న మరో 1.88 లక్షల మందికి శిక్షణనిస్తారు
- మాస్టర్ ట్రైనర్లుగా 250మందికి..
- దేశంలో ఈ తరహా చర్యలు చేపట్టిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- విద్యార్థులను గ్లోబల్ సిటిజెన్స్‌గా తీర్చిదిద్ది వారిలో విద్యా సామర్థ్యాలు, నాయకత్వ లక్షణాల వృద్ధే లక్ష్యం

సాక్షి, అమరావతి: నాడు–నేడు ద్వారా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ మౌలిక సదుపాయాలన్నింటినీ మెరుగుపరుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు ఉపాధ్యాయుల్లో నైపుణ్యాలకూ పదును పెడుతోంది. ఇందుకోసం.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉత్తమ బోధన, విద్యా సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అదే సమయంలో వారిని గ్లోబల్ సిటిజెన్స్‌గా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో నూతన విద్యా బోధనను ప్రవేశపెట్టి, అందుకు అనుగుణంగా సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శిక్షణనిస్తోంది. తొలివిడతలో ప్రభుత్వ హైస్కూల్స్, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలు, కేజీబీవీ, మున్సిపల్, మండల పరిషత్ తదితర ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని 44 వేల మంది ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే శిక్షణను పూర్తిచేసింది.

నాయకత్వ లక్షణాల పెంపునకు ప్రత్యేక మాడ్యూల్..

మరోవైపు.. టోఫెల్ శిక్షణ, 1000 ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ బోధన వంటి పలు విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం.. ఈ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం, విద్యార్థుల మనస్తత్వానికి అనుగుణంగా స్పందించి, వారిని సరైన మార్గంలోకి నడిపించే విధానాలపై ప్రధానోపాధ్యాయులకు కూడా తర్ఫీదు ఇచ్చింది. సత్త్వ, కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సహకారంతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ ట్రైనింగ్ (సీమ్యాట్) ఆధ్వర్యంలో ఇచ్చిన 'స్కూల్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్' శిక్షణలో స్వీయ అవగాహన, సెల్ఫ్ మేనేజ్‌మెంట్, అహింసాత్మక సంభాషణ, ప్రభావం చూపించడం ఎలా, జట్టు నిర్వహణ, పరిశీలన, అభిప్రాయ సేకరణ వంటి అంశాలతో ప్రత్యేక మాడ్యూల్‌ను రూపొందించారు. వీటితోపాటు విద్యాశాఖ విషయ నిపుణుల ద్వారా కూడా సరి కొత్త అంశాలను పొందుపరిచారు.

ఐదు విడతల్లో 250 మందికి మాస్టర్ ట్రైనర్లుగా..

ఇక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ద్విభాషా పాఠ్య పుస్తకాలు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, హైస్కూళ్లలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లను ఇప్పటికే ప్రభుత్వం అందించిన విషయం తెలిసిందే. అలాగే, ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ సైతం ఇచ్చింది. ఈ నేపథ్యంలో.. ఈ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలంటే ఉపాధ్యాయులకు సైతం 21వ శతాబ్ద నాయకత్వ లక్షణాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం భావించి వారికీ శిక్షణనిచ్చింది. ఇందులో భాగంగా గతేడాది అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో ఐదు విడతలుగా 250 మంది ప్రధానోపాధ్యాయులకు మాస్టర్ ట్రైనర్లుగా నైపుణ్య శిక్షణనిచ్చింది. ఈ ఏడాది జూలై నుంచి 26 జిల్లాలకు చెందిన 44 వేల మంది ప్రధానోపాధ్యాయులకు బాపట్ల, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, తిరుపతి, అనంతపురంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేసి రెసిడెన్షియల్ తరహాలో శిక్షణను పూర్తిచేసింది. ఈ శిక్షణ పూర్తిచేసుకున్న ప్రధానోపాధ్యాయులు తమతమ పాఠశాలల్లో పనిచేస్తున్న 1.88 లక్షల మంది ఉపాధ్యాయులకు శిక్షణనివ్వనున్నారు. వారి ద్వారా విద్యార్థులకు తర్ఫీదునివ్వాలని నిర్ణయించారు. దేశంలో ఇన్నివేల మంది ఉపాధ్యాయులకు ఏకకాలంలో నైపుణ్య శిక్షణనిచ్చిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవడం విశేషం.



ఇటీవల ముగిసిన లీడర్‌షిప్ శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు

ఆసియా పారా క్రీడల్లో 'రవి' ప్రభంజనం

షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్ • ఎక్స్ (ట్విట్టర్)లో ప్రధాని మోదీ అభినందనలు

కె.కోటపాడు (అనకాపల్లి జిల్లా): అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలానికి చెందిన తెలుగోడు చైనాలో జరుగుతున్న ఆసియా పారా క్రీడల్లో తన సత్తా చాటాడు. సిల్వర్ మెడల్ సొంతం చేసుకుని అందరి ప్రశంసలు పొందాడు. అనకాపల్లి జిల్లా, కె.కోటపాడు మండలం వారాడ శివారు చిరికివానిపాలెం గ్రామానికి చెందిన రొంగలి రవి ఆసియా పారా క్రీడల షాట్‌పుట్ విభాగంలో రజత పతకం సాధించాడు. చైనాలోని హాంగ్జౌలో ఆసియా పారా క్రీడా పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. మంగళవారం జరిగిన పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో పాల్గొన్న రవి 9.92 మీటర్ల దూరం విసిరి సిల్వర్ మెడల్ గెలుచుకున్నాడు. ఈ పోటీల కోసం ఏడాదిన్నరగా బెంగళూరులోని సాయి అకాడమీలో శిక్షణ పొందినట్టు రవి 'సాక్షి'కి తెలిపాడు. పతకం సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నాడు. ఈ పోటీలో ఇరాక్ దేశానికి చెందిన క్రీడాకారునికి గోల్డ్ మెడల్ దక్కిందని తెలిపాడు.



రొంగలి రవి

ప్రధాని అభినందన

రవిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్(ట్విట్టర్) ద్వారా అభినందించారు. అతడిని స్ఫూర్తిగా తీసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కేంద్ర క్రీడా శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ కూడా రవికి అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు.

స్వగ్రామంలో ఆనందం

దేశం మెచ్చేలా రవి సిల్వర్ మెడల్ సాధించడంతో సొంత గ్రామం చిరికివానిపాలెంలో సందడి చోటుచేసుకుంది. అందరిలా ఎత్తుగా లేనన్న భావన మనసులోకి రానివ్వకుండా చిన్నప్పటి నుంచి డ్వార్ఫ్(దివ్యాంగుల క్రీడలు) క్రీడల్లో ఉత్తమ ప్రతిభను చాటేందుకు నిరంతరం శ్రమించేవాడని గ్రామస్తులు తెలిపారు. తల్లిదండ్రులు రొంగలి దేముడుబాబు, మంగ వ్యవసాయం చేసుకుంటూనే కుమారుడు క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సాహించారు. రవి చైనా నుంచి ఈనెల 28న దేశానికి రానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

6 వాషింగ్ మెషిన్లలో రూ.1.30 కోట్లు అక్రమ తరలింపు

- విశాఖ ఎన్ఏడీ జంక్షన్‌లో పోలీసుల తనిఖీల్లో బట్టబయలు
- పోలీసుల అదుపులో ముగ్గురు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): ఎటువంటి ఆధారాలు లేకుండా గుట్టుచప్పుడు కాకుండా రూ.1.30 కోట్లు నగదును విజయవాడకు తరలిస్తుండగా విశాఖ ఎయిర్‌పోర్టు పోలీసులు పట్టుకున్నారు. వెస్ట్ జోన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపిన వివరాల మేరకు..మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు ఎన్ఏడీ జంక్షన్‌లో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు బొలేరో వాహనాన్ని ఆపారు. డ్రైవర్‌ను పలు వివరాలను అడగ్గా అతడు పొంతన లేని సమాచారమివ్వడంతో అనుమానం వచ్చి వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 30 సెల్‌ఫోన్లు లభ్యమయ్యాయి. వాషింగ్ మిషన్ల పార్సిళ్లను తెరిచి చూడగా 6 టాప్ లోడెడ్ వాషింగ్ మిషన్లలో డబ్బు కట్టలు కనిపించాయి. సొమ్ముకు సంబంధించిన డాక్యుమెంట్లు ఏమీ లేకపోవడంతో వాహనంతో పాటు నగదును స్టేషన్‌కు తరలించారు. వాహనం డైమండ్ పార్క్ సోనోవిజన్ నుంచి విజయవాడకు వెళ్తున్నట్లు విచారణలో గుర్తించారు. ఈ వ్యాన్‌తో పాటు ఎస్కార్ట్‌గా బైక్‌పై యువకుడు వెళుతున్నాడు. వ్యాన్ డ్రైవర్, అసిస్టెంట్, బైక్‌పై వచ్చిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు తరలించే సెల్‌ఫోన్లు, వాషింగ్ మిషన్లు, రూ.1.30 కోట్ల నగదును కోర్టుకు సమర్పించారు. కోర్టుకు సరైన పత్రాలు అందజేస్తే డబ్బు రిలీజ్ చేస్తుందని ఏసీపీ చెప్పారు. ఆదాయపు పన్ను శాఖ, జీఎస్టీ వంటి విభాగాల అధికారులకు పోలీసులు సమాచారమిచ్చి...కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆ నగదు' మాదే

నగదు తరలింపుపై సోనోవిజన్ వివరణ

సాక్షి, అమరావతి: విశాఖ నుంచి వాషింగ్ మెషీన్లలో తరలించిన నగదు తమదేనని, ఈ నగదు తరలింపులో ఎలాంటి అక్రమాలు లేవని సోనోవిజన్ యాజమాన్యం బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపింది. గత 53 ఏళ్ల నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఎంతో నమ్మకంతో వ్యాపారం చేస్తున్నామని, జీఎస్టీ, ఇన్‌కంటాక్స్ వంటి పన్నులను సకాలంలో చెల్లిస్తున్నామని వెల్లడించింది. గతేడాది రూ.1,800 కోట్ల వ్యాపారం చేశామని, రూ.11 కోట్లు ఆదాయ పన్ను చెల్లించామని పేర్కొంది. ఇందుకు ఆదాయ పన్ను శాఖ నుంచి రెండుసార్లు అవార్డు కూడా అందుకున్నట్టు గుర్తు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా తమ బ్రాంచ్‌ల్లో జరిగిన అమ్మకాలకు సంబంధించిన మొత్తాన్ని స్థానిక బ్యాంకుల్లోనే జమ చేస్తామని వెల్లడించింది. విశాఖలో తమ వ్యాపార లావాదేవీలకు సంబంధించి అక్కడే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ప్రత్యేక ఖాతా ఉందని తెలిపింది. అయితే తమ లావాదేవీలకు సంబంధించి రూ.36.8 లక్షలు చార్జీలు వేయడంతో బ్యాంకుపై అంబుడ్స్‌మెన్‌లో కేసు నమోదు చేశామని పేర్కొంది. దీంతో తమ బ్యాంకింగ్ లావాదేవీలను ఐసీఐసీఐ బ్యాంకుకు మార్చినట్టు వెల్లడించింది. కాగా హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాలో రూ.70 కోట్లు ఆధారంగా ఐసీఐసీఐ బ్యాంకు రూ.11 కోట్లు ఓవర్ డ్రాఫ్ట్ ఇచ్చిందని.. మిగిలిన రూ.59 కోట్లకు డాక్యుమెంటేషన్ ఇంకా పూర్తి కాలేదని తెలిపింది. ఓడీ డాక్యుమెంటేషన్ అయ్యే వరకు పండుగ సీజన్‌లో అమ్మకాల సందర్భంగా వచ్చిన నగదు అధికంగా ఉండటంతో.. ఆ నగదును విశాఖ బ్రాంచ్‌లో డిపాజిట్ చేస్తే పెద్ద ఎత్తున చార్జీలు పడతాయని బ్యాంకు వాళ్లు చెప్పారని సోనోవిజన్ యాజమాన్యం వివరించింది. దీంతో రూ.1.30 కోట్లను విజయవాడలో తమ ఖాతాలో జమ చేసేందుకు పంపినట్టు వెల్లడించింది. భద్రతా సమస్యల కారణంగా నగదును వాషింగ్ మిషన్‌లో పెట్టి తరలించామని వివరించింది. ఈ మొత్తానికి సంబంధించి పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొంది. ఇందులో బ్లాక్ మనీ, హవాలా వంటివి చోటు చేసుకోలేదని స్పష్టం చేసింది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai - 600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943